# అన్నమాచార్య సంకీర్తన సుధ



ఆచార్య ఎస్. గంగప్ప

# అన్నమాచార్య సంకీర్తనసుధ

ఆచార్య ఎస్. గంగప్ప

శశీ ప్రచురణలు

'సుధర్మ'

సి-73, శ్రీనివాసనగర్ కాలనీ

గుంటూరు.

# అన్నమాచార్య సంకీర్తనసుధ

[A CRITICAL ANALYSIS OF ANNAMACHARYA'S SANKIRTHANAS]


రచయిత :

ఆచార్య ఎస్. గంగప్ప, ఎం.ఏ., పిహెచ్.డి.,
తెలుగు ప్రాచ్యభాషా విభాగం
నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్ - 522 510, గుంటూరు జిల్లా.



© ప్రొఫెసర్ ఎస్. గంగప్ప



ప్రథమ ముద్రణ : జూలై 1995

ప్రతులు : 1000

వెల : రూ. 80/-

ప్రతులకు :

శ్రీమతి ఎస్. పార్వతమ్మ
శశి ప్రచురణలు
'సుధర్మ'
సి—73, శ్రీనివాసనగర్ కాలనీ,
గుంటూరు-522006
ఫోన్ నెం. : 231805

ముద్రణ : శ్రీలక్ష్మి గణపతి ప్రింటర్స్, 5/1 బ్రాడీపేట, గుంటూరు

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | భూమిక | vii |
| | కృతజ్ఞతలు | xi |
| | PREFACE | xii |
| | అంకితం | xv |
| 1.0 | తాళ్ళపాక అన్నమాచార్యులు | |
| 1.1 | పరిచయం | 1 |
| 1.2 | పదకవిత్వం | 4 |
| 1.3 | పదం - అన్నమాచార్యులు | 5 |
| 1.4 | తాళ్ళపాక అన్నమాచార్యులు (1408-1503) | 18 |
| | సూచికలు | 15 |
| 2.0 | శృంగారం, మధుర భక్తి | 17 |
| | పదకవిత - ఆవిర్భావ వికాసాలు | 17 |
| 2.1 | శృంగారం | 24 |
| 2.2 | మధురభక్తి | 41 |
| | సూచికలు | 55 |
| 3.0 | ఆధ్యాత్మికత, భక్తి, నీతి, వైరాగ్యాలు | 57 |
| 3.1 | ఆధ్యాత్మికత | 57 |
| 3.2 | భక్తి | 61 |
| 3.3 | నీతి | 73 |
| 3.4 | వైరాగ్యం | 77 |
| | సూచికలు | 84 |
| 4.0 | కవితాకామనీయకం | 86 |
| 4.1 | భావుకత | 86 |
| 4.1.1 | చమత్కారం | 92 |

| | | |
|---|---|---|
| 4.1.2 | వ్యంగ్యం | 9 |
| 4.2 | అపురూపభావాలు, ప్రయోగాలు | 9 |
| 4.2.1 | 'అపురూపం' శబ్దార్థం | 9 |
| 4.2.2 | అపురూప భావాలు, ప్రయోగాలు | 9 |
| 4.2.3 | అపురూప భావాలు | 10 |
| 4.2.4 | అపురూప ప్రయోగాలు | 10 |
| 4.3 | వర్ణనా వైదగ్ధ్యం | 10 |
| 4.3.1 | వర్ణనలు | 10 |
| 4.3.2 | శబ్దభావచిత్రాలు | 12 |
| 4.4 | అలంకారాలు | 12 |
| 4.4.1 | శబ్దాలంకారాలు | 12 |
| 4.4.2 | అర్థాలంకారాలు | 12 |
| 4.5 | జానపద ధోరణులు | 13 |
| 4.6 | హాస్యం | 15 |
| 4.7 | శైలి | 15 |
| 4.7.1 | శైలీ రీతులు | 15 |
| 4.7.2 | పలుకుబళ్ళు | 16 |
| 4.7.3 | సామెతలు | 16 |
| 5.0 | భాషా వైలక్షణ్యం | 16 |
| 5.1 | ప్రజలభాష | 16 |
| 5.2 | భాషా విలక్షణత | 16 |
| 5.2.1 | తరచు ప్రయోగించే పదాలు, పదబంధాలు | 16 |
| 5.3 | క్రియాపదాలు | 16 |
| 5.4 | సంధి | 16 |
| 5.5 | సమాసాలు | 17 |

5.5.1 తెలుగులో చక్కటి సమాసాలు 171

5.5.2 వైరి సమాసాలు 171

5.5.3 విలక్ష సమాసాలు 171

5.5.4 వింత సమాసాలు 171

5.6 విభక్తులు 172

5.7 వింత ప్రయోగాలు 172

5.7.1 ధ్వనుల మార్పు 172

5.7.2 వింత పదాలు 175

5.7.3 వింతపదబంధాలు 175

5.7.4 వింత క్రియాపదాలు 175

5.7.5 వింతవచనం 175

5.7.6 వింతవాక్యాలు 176

5.7.7 అన్యదేశ్యాలు 176

5.7.7.1 అరబ్బీ, హిందీ, ఉర్దూ పదాలు 176

5.7.7.2 కన్నడపదాలు 176

5.7.7.3 తమిళపదాలు 176

5.8 రాయలసీమ మాండలికాలు 177

5.8.1 పదాలు 177

5.8.2 పదబంధాలు 182

5.8.3 క్రియలు 184

5.8.4 వాక్యాలు 186

5.9 'కూరాకు' పదవివరణకు సమాధానం 187

6.0 సంగీతాభినయాలు 190

6.1 సంగీతం 190

6.1.2 సంకీర్తనలలోని సంగీత ప్రశంస 190

6.1.3 అన్నమాచార్యుల రాగాలు 19
6.1.4 తాళప్రసక్తి 19
6.2 అభినయం 19
6.2.1 అన్నమాచార్య సంకీర్తనల్లో అభినయ ప్రసక్తి 19
7.0 అన్నమాచార్య సంకీర్తనలు - ఆనాటి స్థితిగతులు 20
7.1 రాజకీయాలు 20
7.2 మత పరిస్థితులు 20
7.3 సామాజిక స్థితిగతులు 20
7.3.1 పండుగలు, వినోదాలు 20
7.3.2 ఆటలు 20
7.3.3 ఆభరణాలు 20
7.3.4 పెండ్లి 70
7.3.5 దోమతెర, మంచం 20
7.3.6 ఆహార పదార్థాలు 20
7.3.7 మరికొన్ని విశేషాలు 20
7.3.8 స్త్రీ స్వభావ చిత్రణ 21
ఉపయుక్తగ్రంథాలు 22

# భూమిక

తెలుగు సాహిత్యంలో పదసాహిత్యానికి అత్యంతప్రాధాన్యముంది. అందునా పదకవితకు ఆద్యుడు, అనవద్యుడూ అయిన తాళ్ళపాక అన్నమాచార్యుని పదసాహిత్యానికి అంతకంటే ప్రాముఖ్యమున్న సంగతి విద్వల్లోకానికి తెలిసిందే. ఆ మహావాగ్గేయకారుని పదసాహిత్య సమాలోచన ఎంద రెన్నిరీతులచేసినా ఇంకా ఏదో మిగిలే ఉంటుంది. అయినా ఇంతవరకు అన్నమాచార్య పదసాహిత్య పరిశోధన ఏదో ఒక దిశలో ఒకానొక దృక్పథంతో, తాము మెచ్చిన, తమకు నచ్చిన ఏదేని ఒక అంశాన్ని గ్రహించి కొనసాగించారేగాని, అన్నమాచార్య పద సాహిత్య స్వరూప నిరూపణం సమగ్రంగా చేయలేదన్న విషయం సాహిత్య లోకానికి సుపరిచితమే. అలాంటి లోటును పూరించే ప్రయత్నంలో భాగమే నాయీ "అన్నమాచార్య సంకీర్తనసుధ" అనే పరిశోధనాత్మక విమర్శక గ్రంథం. ఇదైనా అన్నమాచార్య సంకీర్తన సాహిత్యంలోని సమస్తాంశాల విశ్లేషణతో సమగ్రతను, సంపూర్ణతను సాధించిందని నేను భావించడం లేదు. అయితే ఆ దిశలోనాచేసిన కృషి అన్నమాచార్యుని గూర్చిన అన్ని అంశాలకు సంబంధించిన స్వల్పమైన అవగాహనకు ఉపకరిస్తుందన్న విశ్వాసం నాకుంది. ఆదృక్పథంతో పరిశోధించి పరిశీలించిన ఇదిభావి పరిశోధకులకు చక్కటిబాటలు వేయగలదని నమ్ముతున్నాను. తెలుగుపదసాహిత్య పరిశోధనక్షేత్రంలో నాచేసిన ప్రయాణం సుదూరమైందే. ఇంతకుముందే అనేక గ్రంథాలు పదసాహిత్య సంబంధి రచించి ప్రకటించడం జరిగింది. 1992లో ప్రకటించిన-నావదేళ్ళ పరిశోధనా ఫలితమైన- "అన్నమాచార్య, ప్రముఖవాగ్గేయకారులు-తులనాత్మక అధ్యయనం" అనే గ్రంథం అన్నమాచార్యుల సంకీర్తన సాహిత్య సమస్తాంశాలను వివరించదు. ఇది 1993 సం. నికి తెలుగువిశ్వవిద్యాలయం సాహితీపురస్కారానికి నోచుకొన్న అంశం తెలిసిందే. ఇందులో అన్నమాచార్యుల శృంగారం, భక్తి, మధురభక్తి, ఆధ్యాత్మికత, నీతి వైరాగ్యాలు, సంగీతాభినయాల్ని మాత్రమే వివరిస్తూ, తదితరవాగ్గేయకారులతో అన్నమాచార్యుని పోల్చడం జరిగింది. అందుకోసమే ప్రస్తుత ప్రయత్నం,

అన్నమాచార్య సంకీర్తన సాహిత్య విశేషాలను వివరిస్తూ పైగ్రంథంలోని ఇందాక పేర్కొన్న అంశాల్ని సైతం క్లుప్తంగా పేర్కొని 'అన్నమాచార్య సంకీర్తన సుధకు సంపూర్ణత, సమగ్రతలను చేకూర్చడం జరిగింది.

పదకవితా పితామహుడని ప్రసిద్ధి పొందిన అన్నమాచార్యుడే పదకవితలకు ఆద్యుడైనా, ప్రప్రథమంగా క్షేత్రయ్యపదాలు నన్నాకర్షించాయి. "క్షేత్రయ్య పదసాహిత్యం" గ్రంథం రచించడం 1972-73 సం.నికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందడం 1994లో ప్రకటించడం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆర్థికసాహాయ్యంతో 'సారంగపాణి పదసాహిత్యం' 1980లో ప్రకటించాను. పదసాహిత్యానికి చక్కటి యుగవిభజనను చేకూర్చి గ్రంథం రచించి 'తెలుగులో పదకవిత' అనే గ్రంథానికి 1980-81 సం.నికి ఆం.ప్ర. సాహిత్య అకాడమీ అవార్డు నందుకొని 1983లో ప్రకటించాను. తెలుగువాగ్గేయకారులు 1980లోను, పదకవితాపితామహుడు (నాటకం) 1986లోను వచ్చాయి. అనేక వ్యాసాలు వివిధ సందర్భాల్లో ప్రకటించడం జరిగింది. 1982లో ప్రారంభించిన పరిశోధన ఫలవంతమై ఒక దశాబ్ది తరువాత 'అన్నమాచార్య, ప్రముఖ వాగ్గేయకారులు-తులనాత్మక అధ్యయనం' అనే గ్రంథం 1992లో ప్రకటించడం జరిగింది.

నా పరిశోధనా పరిశ్రమలో భాగంగా ఇటీవలే 'పదసాహిత్యపరిమళం' 1994 అనే పదసాహిత్య సంబంధి వ్యాసాల సంపుటిని ప్రకటించాను. అయితే ఇంతకుముందే వచ్చిన ప్రసంగసాహితి 1978, సాహిత్యసమాలోచన 199, సాహిత్యానుశీలన 1993, జాతీయప్రసంగ సాహితి 1995 అనే గ్రంథాల్లో పదసాహిత్య వ్యాసాలకి తగిన ప్రతిపత్తి లేకపోలేదు. ప్రస్తుతం పదసాహిత్య పరిశోధనలో మరో ఫలం "అన్నమాచార్య సంకీర్తనసుధ" అనే గ్రంథం.

ఇందులో సప్తస్వరాల్లా, సప్తవర్ణాల్లా ఏడు ప్రకరణాలున్నాయి. మొదటి ప్రకరణం అన్నమాచార్యుల జీవిత విశేషాలను వివరిస్తుంది. అంతేకా పదమంటే, పదకవిత్వమంటే వాగ్గేయకారుడంటే, ఏమిటో ప్రారంభంలో తెలుపడ

జరిగింది. ఇది తరువాత ప్రకరణాలకు పునాది. రెండో ప్రకరణంలో ఆనాటి భక్తిమార్గ స్థితిగతుల్ని క్లుప్తంగా చిత్రించి, అన్నమాచార్యుని సంకీర్తనల్లో ప్రముఖాంశమేగాక అనువుపట్టైన శృంగారం, మధురభక్తి అనే అంశాలను సోదాహరణంగా నిరూపించడం గమనించగలం. మూడో ప్రకరణం ఆనాటి సమాజానికే గాక భావితరాల జన సముదాయానికి అన్నమాచార్యులు వైతాళికుడై ప్రబోధించిన ఆధ్యాత్మికత, భక్తి, నీతి, వైరాగ్యాలు అనే అంశాలకు అద్దంపడుతుంది. అన్నమాచార్య సంకీర్తనలకు హృదయస్థానమైన పదకవితాకామనీయకాన్ని వివిధరీతుల వివరిస్తుంది నాల్గో ప్రకరణం. అన్నమాచార్యుని ప్రతిభపాటవాల్ని విశదీకరించే భావుకత, చమత్కారం, వ్యంగ్యం, వర్ణనావైదగ్ధ్యం, శబ్దభావచిత్రాలు, శబ్దార్థాలంకారాలు, జానపదధోరణులు, హాస్యం, శైలి, పలుకుబడ్లు, సామెతలు, అపురూప భావ ప్రయోగాలకు సంబంధించిన విస్తృతచర్చ ఇందులో ఉంది. ఇది దాదాపు ఈ గ్రంథంలో మూడోవంతు ఆక్రమించింది. ఐదో ప్రకరణం అన్నమాచార్య సంకీర్తనల్లో వాడిన భాషాపై లక్షణాల్ని వివరిస్తుంది. ఇందులో అన్నమాచార్యుల నాటి ప్రజలభాషతోపాటు ఆయన సంకీర్తనల్లోని పదాలు, పదబంధాలు, క్రియాపదాలు, సంధి, సమాసాలు, విభక్తులు, ధ్వనులమార్పు, అన్యదేశ్యాలు, రాయలసీమ మాండలికాలు అనే అంశాలు ప్రాధాన్యం వహించి అన్నమాచార్య భాషావిశేషాలు విదితమవుతాయి. ఆరో ప్రకరణంలో సంగీతాభినయాల గూర్చిన వివరణ ఉంది. చివరి ప్రకరణంలో అన్నమాచార్యుల కాలంనాటి పరిస్థితులు-ప్రత్యేకించి ఆనాటి సామాజిక స్థితిగతుల్ని అన్నమాచార్యుల సంకీర్తనలనుంచి ఉదాహరించి వివరించాను. ఇందులో చివరిగా ఆనాటి సమాజంలో స్త్రీకున్న ప్రతిపత్తిని సుస్పష్టం చేయడం జరిగింది.

ఇలాగా సప్త ప్రకరణాల్లో పరివ్యాప్తమైన ఈ గ్రంథం అన్నమాచార్యుల గురించి అనేక నూతనాంశాలను ఒకేచోట దర్శింప వీలవుతుంది. ఎన్నో నూతనాంశాలను నేనిందులో వివరించగలిగానని చెప్పడానికి సంతోషిస్తున్నాను. ఇది భావి పరిశోధకులకు మార్గదర్శకం కాగలదని భావిస్తున్నాను. ఈ గ్రంథం నా తదితర గ్రంథాల్లాగే జిజ్ఞాసువులైన విద్యార్థులకు, పరిశోధకులకు, సహృదయ పాఠకలోకానికి ఉపకరించగలదని విశ్వసిస్తున్నాను.

కరెన్సీ నోట్లైనా సులభంగా లభ్యమవుతున్నాయిగానీ, వాటికి గూడా ము
మైన కాగితం బంగారమైపోయింది. బంగారంమీదైనా ఈనాడు ఆసక్తి చూప
తగ్గుతూందిగానీ, కాగితం లేకుండా ఆధునిక నాగరికజీవితం అంత సులభ
కొనసాగడం కష్టమని వేరుగా చెప్పనవసరం లేదు. ఉద్యమం లేవగానే ప
అవసరం. విజ్ఞానానికి పత్రికలు, గ్రంథాలు అత్యవసరం. అలాంటివాటికన్నీ
కాగితం విలువ ఎంతటిదో మనకు తెలుసు. రచనచేయడం ఒక ఎత్తు. అ
సమకూర్చుకొని గ్రంథం ముద్రించడం మరో ఎత్తు. దాన్ని-సరే-విక్రయి
కోవడం చివరిమెట్టు. ఈ అవస్థలన్నిటికీ ఓర్చి సాహిత్యసేవచేయాలన్న తప
అధ్యయనం, పరిశోధన ఫలితాలను ప్రకటించాలన్న ఆసక్తి కారణంగా ఒకా
కాగితం లభ్యంకాలేదంటే నిరాశానిస్పృహలు నిండుకొన్నా, ఈక్లిష్టసమయం
అత్యంత కష్టమైనా కాగితం సంపాదించి ఈ గ్రంథరచన పూర్తిచేయగలుగ
న్నందుకు సంతోషిస్తున్నాను. సహృదయ పాఠకలోక మీక్లిష్టపరిస్థి
గ్రహిస్తుందని ఆశిస్తున్నాను.

సుధర్మ ఆచార్య ఎస్. గంగ

1-7-1995

# కృతజ్ఞతలు

'అన్నమాచార్య, ప్రముఖవాగ్గేయకారులు-తులనాత్మక అధ్యయనం' అనే స్వా వ్యక్తిగత పరిశోధనకు 1983-85 సం.లకు సీనియర్ రీసర్చి ఫెలోషిప్పు ప్రదానం చేసి సహాయసహకారాలందించిన కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలశాఖ (Department of Cultural Affairs, Govt. of India, New Delhi,) (ప్రస్తుతం మానవవనరుల శాఖలో భాగం) వారికి నా కృతజ్ఞతలు తెలుపడం నా విధి. [illegible] ఆ పరిశోధనలోని ముఖ్య అంశమే నాయీ ప్రస్తుతగ్రంథం 'అన్నమాచార్య సంకీర్తనసుధ'.

ఇతర గ్రంథాలకు లాగానే నాయీ గ్రంథానికి సైతం ముద్రణార్థం ఆర్థిక సాహాయ్యం గావించిన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వాహకమండలికి నా కృతజ్ఞతలు.

అవిశ్రాంతంగా నేను కొనసాగిస్తున్న నాయీ సాహిత్య పరిశోధనా యజ్ఞంలో భాగస్వామిని-సోమిదేవి-నాసహధర్మచారిణి పార్వతమ్మకు కృతజ్ఞతలు చెబితే హాస్యాస్పదంగా ఉండవచ్చుగానీ, నా జీవితసర్వస్వమైన పార్వతమ్మకు సదా కృతజ్ఞతాబద్ధుణ్ణి.

అర్థించిందే తడవుగా నాయీ పరిశోధనాత్మక గ్రంథాన్ని అంకితం పుచ్చుకోవానికి అంగీకరించిన సాహిత్యాభిమానులేగాదు, కళాసాహిత్యపోషకులు, శ్రీరాజ్యలక్ష్మి ఫౌండేషన్ అధినేతలు, మాన్యమహోదయులు శ్రీ పి.వి. రమణయ్య రాజా గారికి నా కృతజ్ఞతాభివందనాలు.

నాయీ పరిశోధన సమయంలో అన్నివిధాలా సహకరిస్తున్న మా అల్లుడు డా॥ గుమ్మాసాంబశివరావుకు, మా అబ్బాయి డా॥ మురళీమోహన్‌కు, సీనియర్ రీసర్చి ఫెలో కుమారి బి. శారదాసుందరికి నా అభినందనలు.

ముచ్చటగా ముద్రించియిచ్చిన శ్రీలక్ష్మీగణపతి ప్రింటర్స్ అధినేత, మిత్రుడు శ్రీ బి.వి.ఎస్. శాస్త్రికి, వారి సిబ్బందికి నా అభినందనలు.

సుధర్మ

1-7-1995

ఆచార్య ఎస్. గంగప్ప

# PREFACE

I am happy to bring out this present work on "Annamacharya Sankirthana Sudha" - A Critical Analysis of Annamacharya's sankirthanas-atleast now if not earlier because Tallapaka Annamacharya is the greatest and the foremost Vaggeyakara in Telugu and my earlier works are, as you are aware, on Kshetrayya, Sarangapani etc. who are later Vaggeyakaras. This work, I must say, is the bi-product of my earlier study and research "A Comparative study of Annamacharya with Famous Saint- singers" taken up in 1982 for which project a Senior fellowship was awarded to me by the Department of Cultural affairs, Government of India, New Delhi (Presently merged with the Department of Human Resource Development) published in 1992 which won to me the Telugu University Award for the year 1993. Another bi-product of my research is the book "PADASAHITYA PARIMALAM" Published in December 1994.

Tallapaka Annamacharya, a famous Vaggeyakara, who lived in the 15th century and composed 32,000 Sankirthanas, both Sringara and Adhyatma, in his life time with Sri Venkateswara Mudra depicting Alaukika Sringara of the Divine Couple of Sri Venkateswara and his consort AlameluManga and Bhakti, MadhuraBhakti, Nithi and Vairagya, hailed from Tallapaka Village, Cuddapah District of Andhra Pradesh. The doctrine of Visishta Adwaitha founded by Sri Ramanuja Acharya of 12th Century was propogated by him who lived in Tirumala, the abode of Sri Venkateswara, in the service of the Almighty.

An attempt has been made in this work to explore so many significant facts hither to untouched in a work like this to bring all that is about Annamacharya's Sankirthanas in a rather comprehensive manner. I hope and feel proud that I am successful in all these to achieve in this work of mine. But yet I cannot say that it is in its completeness. This, ofcourse, I feel, paves way for further research and study for the future researchers to come.

This work is devided into seven chapters. First chapter deals with the brief life of Annamacharya and also to some extent about Pada and Vaggeyakara. We find Sringara and Madhura Bhakti of Annamacharya are described with illustrations from the Sankirthanas of Annamacharya in the second chapter. In the third chapter, how Annamacharya propogated Adhyatmikatha, Bhakti, Nithi and Vairagya in his Sankirthanas for the benefit of public has been attempted. The fourth chapter, which is an important in this work deals with the Poetic Imagination, sweetness of lyrics and subtlety of Poetry of Annamacharya with a number of illustrations. In the fifth chapter, an attempt has been made to explore and explain the peculiarities of the language employed in his Sankirthanas. The sixth chapter deals with the music and dance which Annamacharya presented in his Sankirthanas. In the last and the seventh chapter, the circumstances, especially sociological aspects prevailed during his life time have been analysed and the place of women in that society as Annamacharya depicted different types of Nayika being himself with devotion to Paramatma, Sri Venkateswara, is also dealt with a number of illustrations. Thus this work, I

hope, will serve almost a comprehensive work on Annai charya's Sankirthanas.

My thanks are due to the then Department of Cult Affairs, Government of India, New Delhi for the award Senior Felloship and presently the authorities of Tirun Tirupathi Devasthanams, Tirupathi for helping me v Financial Assistance for getting this book Published under tl scheme "Aid to Publish Religious Books."

It is my duty to express my gratitude and sincere tha to Sri P.V. Ramanaih Raja, The Managing Trustee of Sri F Lakshmi Foundation, Madras and a great patron of F Arts and literature who readily accepted to my work tc dedicated to him as a symbol of honour.

Lastly, if not the least, I am very much greatful to wife Smt. S. Parvathamma who has been a continuous sup and a guide with untiring help in all my efforts of acade pursuits.

Sudharma (Prof. S. Gangappa

1-7-1995

# అంకితం

మహనీయ గుణాలెన్ని ఉన్న
మానవునిలో మానవతమిన్న!

కోటానుకోట్లకు పడగలెత్తి నా
కోట్లకొలది వ్యాపారాధినేతలైనా

నిగర్వ వినమ్ర మనస్కగాత్రులు
నిరుపమాన సహజకవచకుండలులు!
వ్యాపారంలో నీతినిజాయితీలు
మిక్కిలి ప్రసిద్ధితెచ్చిన విజయధ్వజాలు!

లలితకళల పోషణ లాలిత్యం
సాహిత్య సముపాసన సరసత్వం

నిండిపండిన హృదయాలు
సురుచిర శోభామయాలు!

పై మాటల ప్రత్యక్షర సాక్ష్యం శ్రీ పి.వి. రమణయ్యరాజా!
అదే వారి జీవితాశయలక్ష్యం : అక్కర్లేదు వేరేబాజా !

అన్నిటా శ్రీ మహాలక్ష్మి అర్ధాంగులు
మనసునమనసై మసలుకొను ఇల్లాలు!

శ్రీ రాజాలక్ష్మి ఫౌండేషన్ దంపతులిద్దరి పేర
స్థాపించి నిర్వహిస్తూ తమకోరిక తీరేర

కళాసాహిత్య వైద్య విద్యా
వైజ్ఞానిక వివిధరంగాలలో
ప్రతిభాపాటవ శేముషీ వైభవ
నిపుణులు, నిష్ణాతులెందరికో

వేలలో నగదురూపులో బహూకరించి
ఏటేటా విడుపు విశ్రాంతి లేక సత్కరించి

కళా సాహిత్యాల పోషణ
సాంస్కృతికరంగ పరిరక్షణ

చేయడం మీ హృదయౌదార్యానికి తార్కాణం !
సంపదలున్నందుకు దాతృత్వగుణ నిరూపణం !

ఏటిని మించి మీలో ఉంచితనం మానవత
అందుకే అభినందించక మానదు మిమ్మీజనత !

మీరంటే నాకత్యంత గౌరవం
ఆగౌరవానికిదే చిరుపురస్కారం

శ్రీ రమణయ్యరాజాగారూ! అందుకోండి సాహిత్యాఖండం
నా పరిశోధన సత్కృతి 'అన్నమాచార్య సంకీర్తనసుధా' ఖాం

మనమైత్రి కలకాలమిలా
శోభ తరక్కుండా వెలిగేలా !


—ఆచార్య ఎస్. గంగప్ప

కృతి స్వీకర్త దంపతులు



శ్రీ పి.వి. రమణయ్య రాజా  శ్రీమతి మహాలక్ష్మి గారలు

కృతికర్త దంపతులు



ఆచార్య ఎస్. గంగప్ప శ్రీమతి పార్వతమ్మ గారలు

# 1.0 తాళ్ళపాక అన్నమాచార్యులు

## 1.1 పరిచయం :

అదివో అల్లదివో హరివాసము
పదివేల శేషుల పడగల మయము ॥పల్లవి॥

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్య నివాస మఖిల మునులకు
అదె చూడు డదె మ్రొక్కు డానందమయము ॥అదివో॥

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహు బ్రహ్మమయము ॥అదివో॥

కైవల్య పదము వేంకటనగ మదివో
శ్రీ వేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపద రూపమదివో
పావనములకెల్ల పావనమయము ॥అదివో॥

(అధ్యా. సం. 1-23)

భావములోనా బాహ్యమునందును
గోవింద గోవిందయని కొలువవో మనసా ॥పల్లవి॥

హరియవతారములే యఖిల దేవతలు
హరిలోనివే బ్రహ్మాండంబులు
హరినామములే అన్ని మంత్రములు
హరి హరి హరి యనవో మనసా ॥భావ॥

విష్ణుని మహిమలే విహిత కర్మములు
విష్ణుని పొగడే వేదములు
విష్ణువొక్కడే విశ్వాంతరాత్ముడు
విష్ణు విష్ణువని వెదకవో మనసా ॥౩
అచ్యుతుడతడే ఆదియునంత్యము
అచ్యుతుడే యసురాంతకుడు
అచ్యుతుడు శ్రీ వేంకటాద్రి మీదనిదె
అచ్యుత అచ్యుత శరణనవో మనసా ॥౬

(అధ్యా. సం. 3-561)

క. పావనములు హరిభక్తి వి
భావనములు సర్వమంత్ర పరమరహస్యో
ద్భావనములు గాయకనిక
రావనములు తాళ్ళపాక యన్నయపదముల్.

క. రంజనములు దుర్గుణగణ
భంజనములు విమల కమల భవజనక గుణా
సంజనములు సుజ్ఞాన భ
నాంజనములు తాళ్ళపాక యన్నయ పదముల్.

క. వేదంబులు పౌరాణిక
వాదంబులు వరకవిత్వ వాణీవీణా
నాదంబులు కృత సుజనా
హ్లాదంబులు తాళ్ళపాక యన్నయ పదముల్

క. లక్షణములు వదకవితా
రక్షణములు వివిధ కుకవిరాజీ మదసం
మోక్షణములు వేంకటపతి
వీక్షణములు తాళ్ళపాక విభు సత్కవితల్.

మ. శ్రుతులై, శాస్త్రములై, పురాణ కథలై, సుజ్ఞానసారంబులై
యతిలోకాగమ వీథులై, వివిధ మంత్రార్థంబులై, నీతులై
కృతులై వేంకటశైలవల్లభ రతిక్రీడా రహస్యంబులై
నుతులై తాళుల పాక యన్నయ వచో నూత్నక్రియల్ చెన్నగున్.

[సంకీర్తన లక్షణము-పద్యాలు-3,4,6,7,12]

తాళ్ళపాక అన్నమాచార్యులు కారణజన్ముడు. ఆయన జననం తెలుగులో పదకవితావిర్భావ వికాసాలకు కారణమైందని వేరుగా చెప్పనవసరం లేదు. పద కవితా పితామహుడనీ, సంకీర్తనాచార్యుడనీ ప్రసిద్ధిగాంచిన మహా వాగ్గేయకారుడు. వేలకొలది పదాలు రచించి శ్రీ వేంకటేశ్వరుని ఆరాధించి, భక్తిప్రపత్తులకు ప్రాపైన మహనీయుడు. అన్నమాచార్యుడు పదకవిగా నిరూపించుకొనే సమయానికి తెలుగు సాహితీ రంగంలో పద్యకవితకు పట్టాభిషేకం జరుగుతూంది. పద్య కవి పరమపూజనీయుడు, పద్యం కవితకు పరమావధి. భారతానువాదంతో ప్రారంభమైన తెలుగుకవిత కావ్యానువాదరీతికి పరిణమిస్తూంది. పురాణేతిహాస కవిత కావ్య కవితగా రూపుదిద్దుకొంటూంది. అప్పటికే శ్రీనాథుడు కనకాభిషేకానికి నోచుకొన్నాడు. పద్యం రాజాస్థానాలలో పండితుల పరిషత్తులలో ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చింది. 'మందారమకరందాలను' తెలుగు ప్రజలకందిస్తూ న్నాడు పోతన భాగవత భక్తి పరిపూరితంగా. అయితే పద్యం పండితులలోకానికి మాత్రమే పరిమితమైపోయింది. సామాన్యజన సముదాయానికి భక్తి నీతి వైరాగ్య బోధనకుపకరించే- అంటే పద్యకవితలా-చెప్పగలిగే ప్రక్రియ లోపించిన మాట వాస్తవం. జానపద కవితారీతులు లేకపోలేదు. కానీ వాటికి ప్రాధాన్యం పండిత లోకంలో లేదు. కారణం-

"ముదివిటులు విధవలంజలు
పదకవితలు మారుబాసబాపన వారల్
చదువని పండితవర్యులు
కదనాస్థిర వీరవరులు కడిదీ పురమునన్"—

(చాటుపద్య మణిమంజరి-1- పు. 130)

అని పదకవితల్ని పండితులు ఈసడించి త్రోసిపుచ్చారు. అలా
కాలంలో పదకవితకు సైతం పట్టం కట్టడానికి పూనుకొని సఫలీకృతుడైన ప్రజ
అన్నమాచార్యులు. పదకుసుమాలతో శ్రీ వేంకటేశ్వర సమారాధనం చేసి ధ
డయ్యాడు. శ్రీ వేంకటేశ్వరునిపై శృంగార, అధ్యాత్మ సంకీర్తనలనేకం
పాడి ప్రసిద్ధిపొందుతూన్న అన్నమాచార్యుల్ని రావించి తనపై సైతం శృం
సంకీర్తనలు పాడుమని అర్థించిన సాళువ నరసింగ రాయల కోరికను తిరస్క
చాడు. భగవన్నామ సంకీర్తనమే తన ధ్యేయమని, నరుని స్మరించననీ చె
ఘనుడీ అన్నమాచార్యులు. పండితులకు మాత్రమే పరిమితమైన పద్యకవి
వదలి, పామర ప్రజానీకం కోసం పాటుపడాలన్న కోరికతోనే ఆనాటి- అంతక
ముందటి-జానపద గేయ రీతుల ఫణితులను స్వీకరించి - అనిబద్ధమైన వా
నిబద్ధంచేసి-సంకీర్తన సామ్రాజ్యానికి సార్వభౌమత్వాన్ని స్థాపించుకొన్నా
అన్నమాచార్యులు. ఆ మహనీయుని సంకీర్తన సుధామాధుర్యాన్ని గ్రోలేము
పదం, పాట, సంకీర్తన మొదలైన వాటి లక్షణాలను క్లుప్తంగాను, తెలుగ
పదకవితావిర్భావ విధానాన్ని గుర్తించడం అవసరం.

## 1.2 పదకవిత్వం :

పదమంటే పాట. పాడుకోడానికుపకరించేది. పదపద్య కవితల్ల
విశ్వసాహిత్యంలోనే - పదమేముందావిర్భవించింది. మానవుడు అతి ప్రా
కాలంలోనే మాటనేర్చిన వెంటనే తనలోని ఆవేశకావేశాలను, భావోద్రేకార్ద్రత
భక్తి ప్రేమలను అభివ్యక్తీకరించడంలో పాట ఉపకరించింది. మాట, పాట,
అనేవి క్రమంగా మానవుని వ్యక్తిత్వాన్ని పెంచాయి. అయితే ఆ పా
మౌఖికమే(Oral). తరువాతి కాలంలో పాండిత్య ప్రకర్ష పెరిగాక, పద్య
పండితులకు పరిమితమైంది. ఇది లిఖిత (Written) సాహిత్యం. మౌఖిక
జానపద సాహిత్యం అనాది; అదే పునాది. అనిబద్ధమైన జానపదకవిత
తరువాతికాలంలో నిబద్ధమై పద కవితగా రూపుదిద్దుకొంది. ఇది తెలుగుకు మాత్ర
పరిమితంగాక అన్ని సాహిత్యాలకు వర్తించే లక్షణం.

మనదేశంలో సాహిత్యం మార్గ, దేశి అని ద్వివిధం. ఆయా ప్రాంతా
ఆయా ప్రజలచేత పాడబడుతూ పరివ్యాప్తమైంది దేశి. లక్షణబద్ధ

పండితైక పరమైంది మార్గ. ఈ విభాగం మొదట సంగీతపరంగాను, ఆ వెనుక నృత్య పరంగాను, ఆ తరువాత సాహిత్యపరంగాను నిరూపించబడింది. అంటే సామాన్య ప్రజానీకంలో ప్రచారం పొందిన సంగీత నృత్య సాహిత్యాలు లక్షణ బద్ధం చెయ్యబడ్డాయి. తెలుగులోను ప్రప్రథమంగా పదమే పుట్టింది, అన్నమాచార్యులకు ముందే, అంటే నన్నయకంటే ముందే ఎంతో దేశి కవిత అనబడే జానపద కవిత ఉండి ఉంటుంది. అది లిఖితం కాకపోవడంచేత సేకరించేవాళ్ళులేక ఎంతో కాలగర్భంలో కలిసిపోయింది. తమిళంలో ప్రాచీన కవిత అంతా ఈ పదకవితలే. దేశి అయిన తెలుగు కవిత నాలుగు విధాలనీ, అందులో మధుర కవితా రీతిలో చేరింది పదకవిత అనీ లాక్షణికోక్తి. మధుర కవితలో భాగమే పదాలు, దరువులు, ఏలలు, జోలలు, ధవళంబులు, శోభనాలు, మంగళహారతులు, ఉయ్యాల, జక్కులరేకు, చందమామ పదాలు మొదలైనవని తెలుస్తోంది.

## 1.3 పదం - అన్నమాచార్యులు :

'పదం' అంటే సామాన్యార్థంలో పాట అనే వాడుక. రాగతాళ సహితమై ఉండవచ్చు. లేదా కేవలం స్వరసహితమూ కావచ్చు. ఇది జానపద గేయాల్లో స్పష్టంగా తెలుస్తుంది. కోలాటం, దంపుళ్లు మొదలైన పాటల్లో విధిగా తాళముంటుంది, రాగంతోపాటు. విసర్రాయి, కపిలి (మోట) పాటల్లో రాగమేగాని తాళానికవకాశముండదు. అయితే వెంపింట లయ ఉండి తీరుతుంది.

అన్నమాచార్యులు సంస్కృతంలో 'సంకీర్తన లక్షణ' మనే లక్షణగ్రంథం రచించాడు. ఈనాడది అలభ్యం. కాని అతని మనుమడు చిన తిరుమలాచార్యుడు తెలుగులో పద్యాత్మకంగా అనువదించాడు. భరతాదుల పద్ధతిలోనే పదనిర్వచన మిందులోను చెప్పబడింది.

'పదమగు సుప్తిజన్తము
పదమయవ, మవ యవియును బదమునఁబరఁగున్
తుది. నీ. తెలుంగులన్నియుఁ
బధ కవితామార్గ, సార్వభౌముడు దెలిపెన్.[2]

(సం. ల : 24)

— ఈ పదాలు శృంగార వైరాగ్య పదాలని ద్వివిధం. శృంగార పదాలు గ్రామ్యోక్తులతో కూడి ఉండవచ్చు.

"పదములు శృంగార వధూ
మృదు మధుర మనోజ్ఞ వాక్య మిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగాఁ బొంక మెఱిఁగి పలుకగ జెల్లున్"

(సం. ల. 57)

"పల్లవనారీమ్లేచ్ఛా
ద్యుల్లాస మనోజ్ఞ బంధురోక్తులు చవియై
చెల్లును గ్రామ్యములైనను
హల్లీసక ముఖ్యనాటకాదిక ఫణితిన్."

(సం. ల. 57)

—అయితే శృంగార పదాల్లాగాక, వైరాగ్య పదాలు ఉదాత్తంగా ఉండడం అవసరం.

"వైరాగ్య వృద్ధికర గం
భీర పదశ్రేణి పొసగఁ బెనుపుచు నగ్రా
మ్యారమ్య విష్ణు చరితో
దారములై యున్నఁ జాలుధరణి న్వేలయన్."

(సం. ల. 60)

— వీటినే అధ్యాత్మ పదాలంటారు. ఈ పదాలను సంస్కృతంలోనే గాక ప్రాకృతాది దేశభాషల్లోను చెప్పవచ్చు. వీటికి పద్యాల్లాగా యతిప్రాసలు వర్తిస్తాయని భరతాదుల మతం. ఈ పదాలు వృత్త, నిబంధ, అనిబంధాలని మూడు విధాలు. ఈ నిబంధపదంలో నాలుగు పాదాల చరణమొకటిగానీ, అంతకు మించిగానీ ఉండవచ్చు. ఇలాంటి చరణాల అర్థాన్ని వదలక అన్నిటికీ ఏకవాక్యతతో గుదిగ్రుచ్చినట్లు మరల మరల భాసిల్లునట్టి పల్లవి ఉంటుంది. ఇది పల్లవి, శిఖాపదమని ద్వివిధం. 'పద సమాన మాన పాదయుగ్మముగలది' పల్లవి. అందులో సగం ఏకపాదం గలది శిఖాపదం. ఈ నిబంధ పదంలో పల్లవి ఉంటే

శిఖాపదముండదు. శిఖాపదముంటే పల్లవి ఉండదు. ఇలాంటి పల్లవి లేదా శిఖాపదం ఒక దానితో కూడిన నిబంధపదం చతుర్ధాతుక, త్రిధాతుక, ద్విధాతుక, ఏకధాతుకాలని చతుర్విధం. కానీ ఏకధాతుక పదం అరుదుగా ప్రయుక్తమవుతుంది. వృత్తాలు నాలుగు పాదాలతోను, జాతులు రెండు పాదాలతోను ఉన్నట్లే సంకీర్తనలు కూడా చతుష్పాద, ద్విపాదాకృతితో ఉంటాయి. ఇట్టి కీర్తనలలో దరువు, వాక్యం, అర్ధచంద్రిక, ఏల, గొబ్బిళ్ళు, చందమామ పదాలు అనేవి రెండు పాదాలతో ఉంటాయి. ఇవిగాక అష్టపదీ, పదమాలిక, శరభపదం అనే పద విశేషాలున్నాయి. ఇంక అనిబంధపదమంటే అనిర్యుక్తపదం తాళ బంధచ్ఛందో విరహితమై చూర్ణాఖ్యతో ఉంటుంది. దీనిని తాళగంధి అని కూడా అంటాడు. ఇదీ అన్నమాచార్యులు సంస్కృతంలో చెప్పిన సంకీర్తన లక్షణం. దీనికి లక్ష్యంగా వేల సంఖ్యలో అతడు సంకీర్తనలు రచించి తరించాడు.

పద రచయితలను పదకారులనీ, పదకర్తలనీ, వాగ్గేయ కారులనీ అంటారు. కీర్తన, సంకీర్తన, పదం అనేవి సంగీత సాహిత్యాల సమ్మేళనం. పదంలోని మాతువు లేక వాక్కు-సాహిత్యాన్ని, ధాతువు లేక గేయాన్ని-సంగీతాన్ని రచన చేయగలవాడు వాగ్గేయకారుడు.

వాఙ్మాతురుచ్యతే గేయం ధాతురిత్య భిధీయతే
వాచం గేయం చకురుతేయః సవాగ్గేయకారః"
(శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరం - ప్రకీర్ణ కాధ్యాయం)

— ఈ వాగ్గేయకార లక్షణాలు కవికంటే విశిష్టంగా ఉన్నాయి :
"శబ్దానుశాసన జ్ఞాన మభిదాన ప్రవీణత
ఛన్దః ప్రభేద వేదిత్వ మలంకారేషుకౌశలమ్."
"రసభావ పరిజ్ఞానం దేశస్థితిషుచాతురీ
అశేష భాషావిజ్ఞానం కలాశాస్త్రేషు కౌశలం"

(శారఙ్గదేవుని సంగీత రత్నాకరం-ప్రకీర్ణకాధ్యాయం)

పైని వివరించిన వాగ్గేయ కార లక్షణ లక్షితుడైన అన్నమాచార్యులు తాను నిర్వచించిన పదలక్షణాన్వితంగా పదరచనచేసి, తదనంతర సర్వవాగ్గేయకారులకు

మార్గదర్శకుడై తెలుగులో పదసాహిత్య స్రష్టగా నిరూపించుకొన్నాడు. అన్నమాచార్యులకు ముందు కృష్ణమాచార్యులు అనిబంధపదాలైన వచనాలు రచించాడు. అవే సింహగిరి వచనాలు. అన్నమాచార్యుల కుమారుడు పెద తిరుమలాచార్యుడు, మనుమడు చిన తిరుమలాచార్యుడు పద రచన చేసిన వాగ్గేయకారులు. ఆ వెనుక క్షేత్రయ్య, సారంగపాణి, రామదాసు, త్యాగరాజు మొదలైన మహా వాగ్గేయకారులు పదసాహిత్య ప్రపంచానికి వైభవం కూర్చినవారు. వారందరిలో చుక్కల్లో చంద్రుడిలా అన్నమాచార్యులు.

## 1.4 తాళ్ళపాక అన్నమాచార్యులు : (1408-1503)

అన్నమాచార్యుల సంకీర్తన సుధా మాధుర్య పానమాత్తులమయ్యే ముందు ఆయన జీవిత విశేషాలను క్లుప్తంగా తెలుసుకోవడం అవసరం.

అన్నమాచార్యుల జన్మ, నివాసస్థానం కడపజిల్లా తాళ్ళపాక గ్రామం. వీరు నందవరీక బ్రాహ్మణులు; ఋగ్వేదులు; ఆశ్వలాయన సూత్రులు; భారద్వాజగోత్రులు; ఇలాంటి వంశంలోని నారాయణసూరికి, అతని ధర్మపత్ని లక్కమాంబకు శ్రీ వేంకటేశ్వరస్వామి "విరుదు గజ్జియల ముప్పిడి కటారంబగు నందకాంశమున వైశాఖ విశాఖా నక్షత్రమున, చక్కని గ్రహములుచ్చమున మూడలర "అన్నమాచార్యుడు జన్మించాడు. ఇతడు 1424లో జన్మించి 1503 లో దివ్యధామం చేసినట్లు వేటూరి ప్రభాకరశాస్త్రి గారు నిర్ణయించారు[3]. ఈ విషయాన్ని బలపరచారు డా॥ వేటూరి ఆనందమూర్తిగారు.[4] కానీ అనేకాధారాలతో గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు అన్నమాచార్య జననం 1408 అని నిరూపించారు. "అన్నమయ్య క్రీస్తు శకం 1424 క్రోధి సం. వైశాఖ శుద్ధ పూర్ణిమనాడు విశాఖా నక్షత్ర మందు జన్మించినట్లు కీ. శే. ప్రభాకరశాస్త్రిగారు పేర్కొనియున్నారు. శాస్త్రిగారే వేంకటేశ్వర వచనములకు పీఠిక వ్రాయుచు (1945 పీఠిక పు. 12, 13) అన్నమయ్య జన్మకాలము క్రీ.శ. 1408 అని వ్రాసి, అన్నమాచార్య జీవిత చరిత్ర పీఠిక (1949 పీఠిక, పు. 2,3) లో దానిని సవరించి క్రీ.శ. 1424 అని వ్రాసినారు. డా॥ వేటూరి ఆనందమూర్తి గారు తాళ్ళపాక కవుల కృతులు- వివిధ సాహితీ ప్రక్రియలు అనే గ్రంథమున (పు. 60-65) దీనినే బలపరచుచు, శ్రీ సాధు

సుబ్రహ్మణ్య శాస్త్రిగారి నిర్ణయమును చాగంటి శేషయ్యగారి నిర్ణయమును త్రోసి పుచ్చిరి."

"1408 విరోధి వైశాఖ శుద్ధ పూర్ణిమ విశాఖా నక్షత్రమున జన్మమనుట సబబు. విరక్తుడగు అన్నమయ్య ఈ విధముగ లెక్కించెననుట (లెక్కించుట) సమంజసము." [5]

అన్నమాచార్యుడు కొండనెక్కే సమయానికి పదహారేండ్ల వాడని చెప్పిన ప్రభాకరశాస్త్రి మాటలను అంగీకరించక, అన్నమాచార్యుని మనుమడు చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో చెప్పినట్లు కొండనెక్కే సరికి ఎనిమిదేండ్లే అని భావించి ఐదో ఏటనే ఉపనయనం జరిగినట్లు విశ్వసించి, దానికి తగిన ఉపపత్తుని గౌతమ ధర్మ సూత్రాలనుంచి ఉదాహరించి ఈ విధంగా స్థాపించారు, రామసుబ్బశర్మగారు. "ఇక దుర్బలాహారులగు నేటివారు గూడ కాలినడకన ఎనిమిదవ యేటనే కొండ నెక్కుచుండుట ప్రత్యక్షమైన విషయమే. అట్లు అన్నమయ్యయు, పుట్టిన దాది యెనిమిదవ యేటనే కొండనెక్కి యుండుట వింతగాదు.

'ఈ లీల నెనిమిది యేడుల పిన్న
బాలుఁడయ్యును నిష్ఠఁబనిఁ బూని యతడు
.....................................
వితతవృత్తంబుల వేంకటపతికి
శతకంబు కుతుకంబు సమకూరఁజేసి
పది రెండు నామముల్ బాగుగాఁదీర్చి

సదమలాచారుడై సనుదెంచి యతడు" (అన్నమాచార్య చరిత్రము పు. 23, 24) అని చిన్నన్న, తాతగారి చరిత్రమును దగ్గర దగ్గర కాలములో విన్న వాడు చెప్పుచుండగా శ్రీ శాస్త్రిగారు కోమల మతులుగాన, అన్నమయ్యను సుకుమారునిగా భావించి ఎనిమిదవ యేట కొండనెక్కించుటకు సందేహించిరి."[6] అని తెలుపడం సమంజసమే. కాబట్టి అన్నమయ్య జననం 1408 అనడమే సముచిత మని నేనూ భావిస్తున్నాను,

ఇది ఇలా ఉండగా కామిశెట్టి శ్రీనివాసులు మరికొన్ని యుక్తులతో ఈ అభిప్రాయాన్ని బలపరచారు. "చిన్నన్న (రచించిన అన్నమాచార్య చరిత్ర)

శాసనం (సదాశివరాయల కాలంలో తాళ్ళపాక తిరువెంగళనాథుడు తిరుమల దేవాలయంలో క్రీ.శ. 1468న వేయించిన శాసనం) అన్నమాచార్యుల జన్మ తిథిని గురించి - మాస నక్షత్ర నామాలనే తెలుపుతున్నవి. ఉపలబ్ధాలైన ఆధారములను బట్టి, రాగి రేకులలోని వాక్యరచనా విధానాన్ని బట్టి, పెద్దలూహించిన భావసరణిని బట్టి నా బుద్ధికందినంత వరకు 'అన్నమాచార్యులు శా.శ. 1330లో వైశాఖ మాసమున విశాఖ నక్షత్రయుక్త దినమున (సర్వధారిసం. నిజ వైశాఖ (వైసి) మాసమున శుక్ల చతుర్దశి బుధవారమున క్రీ.శ. 1408 మేనెల 9వ తేదీన) జన్మించె నను సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి వాక్యాన్నే నేను ప్రమాణంగా స్వీకరిస్తున్నాను."[7] ఇది అంగీకారయోగ్యంగా ఉంది.

అన్నమాచార్యుడు శ్రీ వేంకటేశ్వరునిపై దినానికి ఒక సంకీర్తన చొప్పున రచించి సమర్పిస్తూ అతని జీవిత కాలంలో ముప్పై రెండువేల పదాలను రచించా డన్న సంగతిని అంగీకరిస్తూ పరిశీలిస్తే గూడా అన్నమాచార్యుని జీవిత కాలం **1408-1503** అని స్పష్టమవుతుంది.

బాల్యంలో అన్నమయ్య తలిదండ్రులు, అన్నవదినలు ఇంటిపనులు చెబు తూండగా చేస్తూ ఉండేవాడు. యథారీతిగా ఒకరోజు పసులకోసం కసువు కోసి తెమ్మనగా, వెళ్లి చేతివేలు కోసుకొని బాధపడి విసిగిపోయాడు. అదే సమయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుపతికి వెళ్ళుతూన్న భక్తబృందంతో కలిసి అన్నమయ్య వెళ్ళిపోయాడు. మోకాళ్ళ ముడుపుదాకా చెప్పుల కాళ్ళతోనే నడచి వెళ్ళి అలసిపోయి, భక్తులను వదలి, రాతిబండమీద నిద్రపోయాడు. అలమేలు మంగవచ్చి అతని అలుపు తీర్చి, అనుగ్రహించి వెళ్ళిపోయింది. అమ్మ ఇచ్చిన ప్రసాదం మూలంగా అతడు సరస సాహిత్య సంపన్నుడవుతాడు. వెంటనే అలమేలు మంగాంబపై శతకం ఆశువుగా చెప్పాడు. ఆ తరువాత పదాలు పాడు కొంటూ కొండమీదికి వెళ్ళి కోనేటిలో స్నానంచేసి, శ్రీ వేంకటేశ్వరుని దర్శించి పులకించి పోతాడు. అర్చకులు తీర్థప్రసాదాలు, శఠగోపం ఇచ్చి పంపుతారు. కొండమీద వింతలు విశేషాలు చూసి, పాపనాశనంలో స్నానంచేసి శ్రీ వేంకటేశ్వ రునిపై శతకం చెప్పాడు. స్వామిదర్శనార్థమై వెళ్ళగా తలుపులు మూసి ఉండడం చూసి ఆవేశంతో అంతకుముందే చెప్పిన శతకంలోని పద్యాలు మళ్ళీ చదవగా,

తలుపులు వాటికవే తెరచుకొన్నాయి. అర్చకులు ఆశ్చర్యపోయారు. స్వామివారి ముత్యాల పేరు అన్నమయ్య పాదాలపై వచ్చి పడింది. అచటి వైఖానసార్చకులు అచ్చెరపడి, అతడు సామాన్యుడు కాడనీ, స్వామివారి అవరావతారమనీ కీర్తిస్తారు. ఆ వెనుక స్వామి ఆదేశానుసారం ఘనవిష్ణుయతి అన్నమయ్యను శంఖచక్రాంకితుని చేసి, పంచ సంస్కారాలు గావించి, శరణాగతి ధర్మాన్ని బోధించి శ్రీవైష్ణవమతావలంబిగా చేసి పంపుతాడు.

తాళ్ళపాకలో తల్లిదండ్రులు పుత్రునిగానక మిక్కిలి బాధపడి, ఎలాగో చివరికి తిరుపతిచేరి, వెతికి అన్నమయ్యను ఇంటికి తీసుకొనిపోతారు. అన్నమయ్య యుక్తవయస్కుడు కాగానే తల్లిదండ్రులు- తిరుమలమ్మ, అక్కలమ్మ అనే ఇద్దరు కన్యలతో అన్నమయ్య వివాహం చేస్తారు. శఠగోపమునివద్ద సకల వేదవేదాంత పఠనం పూర్తిచేసుకొంటాడు. శ్రీ వేంకటేశ్వరునిపై భక్తితో పదరచనచేసి ఆడి పాడుకొంటూ ప్రసిద్ధికెక్కుతాడు. అన్నమయ్య బాల్యమిత్రుడు సాళువ నరసింగ రాయలు పెనుగొండలో రాజ్యం చేస్తూ ఉండి, ఇతనిని పిలిపించి శృంగార పదాలు పాడించుకొని మురిసిపోతాడు; ఆనందంతో అన్నమయ్యను ఎంతగానో సత్కరిస్తాడు. చివరికి తనమీద గూడా అలాంటి శృంగారపదాలు చెప్పుమని వేడుకొంటాడు. అన్నమయ్య తిరస్కరిస్తాడు. హరినామస్మరణం చేసే నాలుక నరుని నామం స్మరించలేదని గట్టిగా చెప్పాడు. కుపితుడైన రాజు అన్నమయ్యను శృంఖలాబద్ధుని చేస్తాడు. "ఆకటి వేళల అలపైన వేళల వేరువ హరినామమే దిక్కుమఱి లేదు" (5-100) అనే పదం పాడగానే సంకెళ్ళు ఊడిపోతాయి. వెంటనే అన్నమాచార్యుని మహాభక్తునిగా అతని మహిమను గుర్తిస్తాడు; పాదాక్రాంతుడవుతాడు రాజు. అన్నమాచార్యునకు ఘనసత్కారం చేసి పంపుతాడు. అన్నమాచార్యుడు క్షమించి, శ్రీ వేంకటేశ్వరుని సేవకై జీవితం వినియోగించుమని దీవించి తిరుమలకు వెళ్ళిపోతాడు. అక్కడ నివాసమేర్పరచుకొని దినానికొక్క పదం చొప్పున రచనచేసి, ఆడిపాడి శ్రీవేంకటేశ్వరుని అర్చనలో కాలంగడుపుతుంటాడు. పుల్ల మామిడిని తియ్యమామిడిగా మార్చడం, నిరుపేద వివాహానికి ధనం సమకూర్చడం మొదలైన మహిమలు సైతం ప్రదర్శిస్తాడు. సంసారిగాఉంటూ శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుడై ముప్పై రెండువేల అధ్యాత్మ శృంగార సంకీర్తనలు రచించి తరించాడు. 1503లో దివ్యధామం చేరిపోయాడు.

అన్నమాచార్యుడు ఆనాడు జానపదుల వాడుకలో ఉండిన జానపద
రీతుల్ని అనేకం తనపదాల్లో ఉపయోగించుకొన్నాడు. జాజరులు, చందమా
మ, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాలి, లాల, జోల, శోభన, తందన
ల మొదలైన పదాలు ఎన్నింటినో వాడుకొన్నాడు. ఇలాంటి జాన
అనేకం అన్నమాచార్య సంకీర్తనల్లో ఉన్నాయి. తెలుగుతోపా
సంస్కృత సంకీర్తనల్ని సైతం అన్నమాచార్యుడు రచించాడు. అన్నమాచార్యు
32 వేల సంకీర్తనలేగాక, శృంగారమంజరి, అలమేలుమంగలపై చెప్పిన శతక
ప్రకటితం. మరికొన్ని శతకాలు, ద్విపద రామాయణం, వేంకటాచల మాహాత
(సంస్కృతం), సంకీర్తన లక్షణం (సంస్కృతం) అనేవి లభించలేదు. సంకీ
లక్షణాన్ని చిన తిరుమలాచార్యుడు పద్యాత్మంగా అనువదించిన అం
పూర్వోక్తం.

అన్నమాచార్య భార్యలు తిమ్మక్క, అక్కమ్మలలోతిమ్మక్కవిదుషీవ
కవయిత్రి. ఈమె మంజరీ ద్విపదల్లో 'సుభద్రాకల్యాణ' మనే గేయకావ్యా
రచించి తెలుగులో ప్రప్రథమ కవయిత్రిగా ప్రఖ్యాతి గడించింది.

తిమ్మక్క, అన్నమాచార్యుల మొదటి సంతానం పెద్ద నరసింగన్న. ఇత
వాగ్గేయకారుడన్న ప్రసిద్ధి లేదు. కవికర్ణ రసాయన ప్రబంధకర్త ఇతడే
విమర్శకులంటారు. అక్కలమ్మ అన్నమాచార్యుల మొదటి సంతానం
తిరుమలాచార్యుడు తండ్రికి దీటైన పదకర్త. ఇతని పెద్ద కుమారుడు
తిరుమలాచార్యుడు. తాత తండ్రులలాంటి పదకర్త; ఆధ్యాత్మ శృంగార సం
పులు సంకీర్తన లక్షణముగా రచించినవాడు. పెదతిరుమలాచార్యుని నాలుగోపుత్ర
చిన్నన్నగా ప్రసిద్ధిగాంచిన చిన తిరువేంగళనాథుడు, పదరచన చేయకపోయి
ద్విపదలో అన్నమాచార్య జీవితచరిత్ర, పరమయోగివిలాసం, అష్టమహిషీకల్యా
ఉషాపరిణయం కావ్యాలు రచించాడు. పెదతిరుమలాచార్యుని తక్కిన రెం
మూడో, ఐదో పుత్రులైన అన్నయ్య, పెద తిరువేంగళనాథుడు, కోనేటి తిరువెం
నాథుడు-అనే వాళ్ళకు కవులుగాగాని పదకర్తలుగాగాని పేరు రాలేదు. చినతిరువ
చార్యుని పుత్రుడు తిరువేంగళప్ప రచన అమరుకం ప్రకటితం. కానీ ఇతని ఇ

రచనలైన బాల ప్రబోధిక, సుధానిధి అనేవి ప్రకటించబడలేదు. ఇలాగా తాళ్ళపాక కుటుంబం మూడు నాలుగు తరాలు కవితా కుటుంబం కావడం విశేషం.

అన్నమాచార్యుని చరమదశలో పురందరదాసు దర్శించినట్లు అన్నమాచార్యుల మనుమడు చిన్నన్న రచించిన, 'అన్నమాచార్యుల జీవిత చరిత్రము' అనే ద్విపద కావ్యంలో పేర్కొన్నాడు.

"ఎనయ సంధ్యలకు నీళ్ళియఁజేకొనుచుఁ
దనరు పురందర దాసాహ్వయుండు
పరమభాగవతుడై పరగుచు నంద
వరకులాగ్రణియైన వైష్ణవోత్తముఁడు
నవరించు మురవైరి సంకీర్తనములు
కువలయంబునఁ బేరుకొన్న మాత్రమున
తఁచిన భూతభేతాళ పిశాచ
ములుపాటి పోవనిమ్ముల శుభం బెసఁగ
వినికనియును లోనవెఱఁగంది కొనుచు
చనిఁ తాళ్ళపాకశాసను డన్నమయ్య
పెన్నునిగానె భావించి కీర్తించి
సన్నుతిసేయ నాచార్యవర్యుండు
నతని విట్ఠలునిఁగాననయుంబు దలఁచి
ప్రతిలేని గతుల సంభావించె ......."[8]

ఇందులో తాతగారైన అన్నమాచార్యుని (1408-1503) జీవితచరిత్రను చిన్నన్న (1500-1558) రచించడంవల్ల దీనిని మనం చారిత్రక సత్యంగా భావించడం సముచితం.

కానీ విద్యారత్న ఆర్. ఎస్. పంచముఖిగారు మాత్రం అన్నమయ్య పురందరుల పరస్పర సందర్శనాన్ని శంకించారు. అందుకు వారు చూపిన కారణాలివి. చిత్తశుద్ధిగల మాధ్వుడైన పురందరదాసు, శ్రీ వైష్ణవ మతానుయాయి అయిన అన్నమాచార్యుని విష్ణువుగా భావించి కీర్తించడానికి వీల్లేదు. విద్యానగరంలో వ్యాసరాయల వద్ద ఉపదేశం పొందిన వెనుక పురంధరదాసనే పేరుతో

పదరచన ప్రారంభించారు. 1500 తరువాతగాని వ్యాసరాయలు రావడం జరగ లేదు గనుక, 1500 తరువాత శిష్యుడైన పురందరదాసు తిరుపతిలో అన్నమాచార్యుని దర్శించే అవకాశంలేదు.[9] ఇవి సయుక్తికంగా లేవని డా॥ ఆనంద మూర్తిగారు నిరూపించారు. "వ్యాసరాయలవారు (క్రీ.శ. 1446-1539) పండ్రెండేళ్ళపాటు తిరుపతిలో శ్రీనివాసుని యాలయమున నర్చకత్వము నెరపుచు క్రీ. శ. 1486-1498 నడుమ పలుమారులు విద్యానగరమునకు వెళ్ళి వచ్చుచుండిన వారలే. 1498లో వెళ్ళి అక్కడే స్థిరపడినవారును. అందువలన ఆ పండ్రెండేండ్ల వ్యవధిలోగాని, కాదనుకొన్న పక్షమున క్రీ.శ. 1498లోగాని పురందరదాసు వ్యాస రాయల నుపదేశ గురువుగా భావించి గ్రహించి యుండవచ్చును. అట్టి యెడ చిన్నన్న వ్రాసినట్లు 'పరమభాగవతు'డగు అన్నమయ్యను (అతని అవసానకాల మగు) 1503లోగా నెన్నడేనిదర్శించియుండుటలోనసంభావ్యమేమియును లేదు."[10] దీనికి ఆనందమూర్తిగారు కన్నడంలోని సోమనాథ కవీశ్వరకృత 'వ్యాసయోగి చరిత్రము'ను, దానికి శ్రీ బి వెంకోబరావు రచించిన సమగ్ర పీఠికను ఆధారంగా గ్రహించారు. కానీ దీని ఆధారంగానే 1470 నుంచే వ్యాసరాయలు విద్యానగరంలో ఆధ్యాత్మికాధిపత్యం నెరపినట్లు డా॥ ఎం.వి. కృష్ణారావుగారు వివరించారు. "He (Vyasaraja) was also the guardian Saint of Vijayanagar Empire and according to the Somanatha's description, he spiritually dominated the empire from 1470 A.D. till his death in 1539 A.D."[11] ఇంకా దీనికి తోడు సోమనాథుడు స్వైతం వ్యాసరాయల శిష్యుడని విదితమవుతుంది. "Chronologically, after Jayatheertha, the most outstanding personality among Vaishnava Pontiffs was Vyasaraja whose life has been vividly described by poet Somanatha in his Vyasayogi charitam. Somanatha was himself a desciple of Vyasayogi Whose Matha was the principal university in the city of Vijayanagar."[12]. ఇలాగా వ్యాసరాయ శిష్యుడై ఉండి గురు జీవితచరిత్రను "వ్యాసయోగి చరిత"మన్న పేరుతో రచించిన సోమనాథకవి మాటలను మనం ప్రామాణికంగా గ్రహించడం సముచితం. కాబట్టి 1470 నుంచి 1569 వరకు విజయనగరంలో ఆధ్యాత్మికాధిపత్యం నెరపిన వ్యాసరాయల శిష్యత్వం 1470-1539 మధ్యకాలంలో పొంది ఉంటాడు పురందరదాసు.

అనడం సమంజసమే. అన్నమాచార్యుని మరణం 1503లో కాబట్టి చివరిదశలో సందర్శించి ఉండవచ్చునని చెప్పవచ్చును. కానీ ఒక్క చిక్కున్నది. పురందర దాసు జీవితకాలం 1484-1564 అని పలువురు కర్ణాటక పండితుల అభిప్రాయం.[13] సంపదల్ని పరిత్యజించి ఆలుబిడ్డలతో వెళ్ళి గురూపదేశం పొంది అన్నమాచార్యుని దర్శించటానికి తిరుపతికి వచ్చే సమయానికి పురందరుని వయస్సు పైని పేర్కొన్నట్లు కుదరదు. అంటే 1484న జన్మించిన పురందరుడు 1503 లోపల అన్నమాచార్యుని 20 ఏళ్ళ వయస్సులో దర్శించాడనడం సముచితంకాదు. కాబట్టి స్వగ్రామాన్ని, సంపదల్ని వదలిపెట్టి, పేదరికాన్ని కొనితెచ్చుకొని భగవంతునిపై భక్తి ప్రపత్తులతో పదాలుపాడుతూ వెళ్ళి గురూపదేశం పొంది, ఆ వెనుక శ్రీనివాసు పురందరుడుగా మారి పదరచనచేస్తూ, పాడుతూ, ప్రజలకు భక్తిజ్ఞాన నీతి వైరాగ్యాలను ప్రబోధిస్తూ విజయనగరంలో ఉంటూ, అహోబిలం, కంచి, బేలూరు మొదలైన క్షేత్రదర్శనం చేసుకొంటూ [14]. వెళ్ళి తిరుపతిలో అప్పటికే ప్రసిద్ధుడైన అన్నమాచార్యుని సందర్శించి ఉంటాడనడం సత్యదూరం కాదు. అంటే పూర్వోక్తమైనట్లు అన్నమాచార్యుని చరమదశలో పురందరదాసు సందర్శించి ఉంటాడనడం వల్ల పురందరదాసు వయస్సు అప్పటికి సుమారు 30 సం.లు అయినా ఉండవచ్చు. కాబట్టి మూడు దశకాల వయస్సు అనంతరం దర్శించాడనుకోవడంలో దొసగులేదు. పైపెచ్చు సముచితం కూడా. కాబట్టి సోమనాథకవి రచించిన తన గురు జీవితం 'వ్యాసముని చరితాన్ని సత్యమని విశ్వసించినట్లే, చిన్నన్న తన తాత జీవిత చరిత్ర "అన్నమాచార్య జీవిత చరిత్రము"ను విశ్వసించి అన్నమాచార్య పురందర దాసుల సందర్శనం సంభావ్యమేనని భావించడం ఎంతైనా సమంజసం.[15]

అన్నమాచార్యులు ప్రారంభించిన శృంగార, అధ్యాత్మ సంకీర్తనలు తరువాత వాగ్గేయకారులకు చక్కటి మార్గదర్శకాలయ్యాయి. పదసాహిత్యం మూడుపూవులు ఆరు కాయలుగా అభివృద్ధి చెంది తెలుగుసాహిత్యంలో తన ప్రత్యేకతను నిలుపుకొంది.

సూచికలు :

1. బాలాంత్రపు రజనీకాంతరావు : ఆంధ్రవాగ్గేయకార చరిత్రము : పు.48-55

2. తాళ్ళపాక చిన తిరువేంగళనాధుడు (చిన్నన్న) : అన్నమాచార్యుల జీవిత చరిత్రము పు- 9

2. వేటూరి ప్రభాకరశాస్త్రి : పీఠిక-అన్నమాచార్యుల జీవిత చరిత్రము-పు.2,3

4. వేటూరి ఆనందమూర్తి ; తాళ్ళపాక కవులకృతులు — వివిధసాహితీ ప్రక్రియలు - పు. 60-65

5. గౌరిపెద్ది రామసుబ్బశర్మ (సంపా) : పీఠిక - శృంగారసంకీర్తనములు-12 పు. 6-8

6) గౌరిపెద్ది రామసుబ్బశర్మ (తృతీయ ముద్రణ పరిష్కర్త) : వివేక దీపిక పు 18-20 - తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము.

7) కామిశెట్టి శ్రీనివాసులు : ఉపోద్ఘాతము : డా॥ ముట్నూరి సంగమేశం గారి అన్నమాచార్య సాహితీకౌముది. పు. 7,8.

8. పై ?వ సూచిక లోనిదే : పు. 44, 45.

9. వేటూరి ఆనందమూర్తి : తాళ్ళపాక కవుల పదకవితలు — భాషాప్రయోగ విశేషాలు - అధోజ్ఞాపిక. పు. 44

10. పైదే - పు. 44, 45.

11. M.V. Krishna Rao : Purandara and Haridasa Movement. p. 67

12. పైదే P. 66

13. శ్రీహరహరప్రియ : కన్నడ తెలుగు సాహిత్య వినిమయ - పు. 47

14. పై 11 వ సూచికలోనిదే - పు. 114

15. వివరాలకు నా వ్యాసం : అన్నమాచార్యపురందరదాసుల సమాగమం అన్వేషణ (నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు విభాగం పరిశోధన పత్రిక) 1984. పు. 30-40

# 2. శృంగారం, మధురభక్తి

అన్నమాచార్యుల జీవిత విశేషాలను, పదకవితా విశేషాలను క్లుప్తంగా ప్రథమ ప్రకరణంలో తెలుసుకొన్నాము. ఈ ప్రకరణంలో అన్నమాచార్య సంకీర్తనల్లోని శృంగారం, మధురభక్తి అనే అంశాలను సోదాహరణంగా గ్రహించవలసి ఉంది.

అన్నమాచార్యుల సంకీర్తనలు రెండు విధాలనీ, అవి శృంగార, అధ్యాత్మ సంకీర్తనలనీ మనం గ్రహించాము. ఆధ్యాత్మికతకే ప్రాధాన్యమున్నా, అన్నమాచార్య సంకీర్తనల్లో శృంగార సంకీర్తనల సంఖ్యే ఎక్కువ. కనుకనే అన్నమాచార్య వర్ణిత శృంగారం, మధురభక్తి అనేవాటిని ఆరంభంలోనే తెలుసుకొందాము. అన్నమాచార్యులు వర్ణించిన శృంగారం, మధురభక్తికి ఆధారం శృంగార సంకీర్తనలు; భక్తి, నీతి, వైరాగ్యాదులకు ఆలవాలం అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు. కనుక తరువాతి ప్రకరణంలో వాటినిగూర్చి గ్రహించడం సముచితం.

అన్నమాచార్యుని సంకీర్తనల్లోని వివిధాంశాల వివరణకు ముందు తెలుగులోనేగాక భారతీయ భాషల్లో పదకవితకు, భక్తికి సంబంధమెలాంటిదో, అది ఎలా పుట్టి పెరిగిందో తెలుసుకోవడం అవసరం.

భక్తిభావన భారతీయ తత్త్వం. భక్తితోపాటు పదకవిత ప్రారంభమైంది. నిజానికి వేదసూక్తాలే మొట్టమొదటి పదాలన్న రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారి మాటలు,[1] సామవేదం గానయోగ్యమైందన్న సంగతి సర్వపండిత లోకానికీ సువిదితమే. భరతముని నాట్యశాస్త్రంలోను, శార్ఙ్గదేవుడు సంగీతరత్నాకరంలోను, అభినవగుప్తాచార్యుడు అభినవభారతిలోను సంగీతవిషయాలను వివరించారు. క్రీ॥ శ॥ 12శ॥ వాలంలో లసిన జయదేవుని గీత గోవిందం అష్టపదులలో రచితమైన సంస్కృతంలోని పద-గేయ కావ్యం ఆ వెనుక లీలాశుకుడు శ్రీకృష్ణ కర్ణామృతం శ్లోకాల్లోనే రాసినా అందులోని శ్లోకాలు సంగీతసభల్లో పాడబడుతూనే ఉంటాయి.

తెలుగులో ప్రథమ వాగ్గేయకారుడైన అన్నమాచార్యుడు సంస్కృతంలోను దాదాపు వంద పదాలు మనోహరంగా రచించి ఉండడం గమనించదగ్గ అంశం.

కోవిలకూఁతకుఁగానే గుండె జల్లురని చెలి
పూవక పూచిన యట్టు పులకించె
మావినుండి యంతలోనే మదన భూతముసోఁకె
పోవులైన పుప్పొడినే పోయరే బిడిమి ॥ఇందు॥

కోమలి చందురుఁడనే కొరవిదయ్యముఁ జూచి
దీమస మింతయు మాని దిగులందెను
తేమలైన వెన్నెలల దిమ్ముపట్టి నిలువున
మైమఱచె (గప్పురాన మంత్రించరే ॥ఇందు॥

ఇంతలో శ్రీ వేంకటేశుఁ డిందుకు విచ్చేయఁగాను
చింతఁదీర మేనెల్ల జెమరించెను
వింతలైన రతులలో విరహపు సోఁకు వాసె
కంతు చిగురాకు రక్షగట్టరే యంగనకు ॥ఇందుకు॥

(శృం. సం. 30-76)

ఇందులో కోవెలలు, మన్మథుడు, చంద్రుడు, వెన్నెల మొదలైనవన్నీ విరహాగ్నిని నాయికకు అధికం చేయగా, శైత్యోపచారాలు రక్షలు గట్టడం చేయుమని అంటున్నారు. ఇది ప్రబంధ రీతి.

ఇలాగే పురుష విరహమూ వర్ణితం. ఇదీ ప్రబంధాల వర్ణనకు ఏ విధంగానూ తీసిపోదు. పైగా ఇది కొత్త అట !

"ఏమిసేతు నమ్మలాల యెందుకొను నాయకుఁడు
భూమిలోఁ జెప్పఁ గొత్త యీ పురుష విరహము ॥పల్లవి॥

తొయ్యలి రాకకుఁ బతి తొంగిచూడఁ బోతేను
దయ్యమువలెఁ జంద్రుఁడు తలచూపెను
చయ్యన నందు కతఁడు జడిసి తలవంచితే
నుయ్యివలెనే తోఁచె నూలుకొని మనసు ॥ఏమి॥

మగువ యెలుఁగు విన మతి నాలకించితేను
పగవాని వలెనే పల్కెఁగోవిల

Queen, Mirabai in which images of Krishna symbol are more directly tuurned into a song of the love and persuit of the devine lover by the soul of the singer."[4]

ఇలాగే మహారాష్ట్రలో యాభై మంది మహాభక్తులుండేవారు. వారిలో జ్ఞానదేవ నామదేవులు క్రీ.శ. 13, 14 శ. కాలంలో అభంగు లనబడే భావగీతాలు భక్తి పూరితంగా రచించి ఆలపించారు. భక్త రామదాసు, భక్త తుకారామ్ పేర్కొనదగ్గ మహనీయులు. వీరి అభంగులు సైతం పదాలే. ఇందులోని సంగీతం, సంగీతం ద్వారా భక్తి ప్రచారంలోకి వచ్చాయి. ఇలాగా ఉత్తరభారతంలో భక్తిప్రపూరితమైన పదకవిత విరాజిల్లింది.

సంస్కృతంతోపాటు ఔత్తరాహభాషల్లో పదకవిత ఆలస్యంగానే ఆరంభమైందని చెప్పవచ్చు. అంతకంటే ముందే దాక్షిణాత్యభాషల్లో అంటే ద్రావిడ భాషల్లో ముఖ్యమైన తమిళంలో చాలా ముందుగానే ఈవైష్ణవ భక్తిపూరితమైన పదాలు రచితమైనట్లు తెలుస్తుంది. తమిళం, మళయాళం, కన్నడం, తెలుగు సాహిత్యాల్లో భక్తి, నీతి, వైరాగ్యపూరితమైన పదకవితలు కోకొల్లలుగా వెలిశాయి.

తమిళం ప్రాచీన కాలంనుంచి తనదైన పద్ధతిని, మౌలికతని నిలబెట్టుకొన్న సాహిత్యం. అందుకు ప్రభువులుసైతం సహకరించడం మెచ్చుకోదగ్గ అంశం. "తమిళ ప్రదేశములో పండితులకు, కవులకు తగిన ప్రోత్సాహమిచ్చుటకై, వారివారి రచనలు పరీక్షించి, ఆయా రచనల విలువలను నిర్ణయించు నిమిత్తమై, ఆ దేశ ప్రభువులు ఒక పండిత పరిషత్తు నేర్పఱచిరి. ఆ పరిషత్తును 'సంఘమ్' అని వ్యవహరించుచుండెడివారు. తమిళ వాఙ్మయ చరిత్రనుబట్టి ఈ పరిషత్తు క్రీ. పూ. 500 సం॥ల నుండి, క్రీ.శ. 2వ శ. వరకును అమలులో నున్నట్లు తెలియవచ్చుచున్నది. ఇందువలన, ఆ నడుమగాగల కాలమంతయు 'సంఘకాలము' అని వ్యవహరింపబడుచుండెడిది. అటు పిమ్మట 3వ శ. నుండి 5వ శ. వఱకు గల కాలము 'సంఘోత్తర' కాలమనియు, జైన, బౌద్ధ కాలమనియు చెప్పబడుచున్నది. 6వ శ. నుండి 9వ శ. వఱకుగల కాలము భక్తికాలమనబడుచున్నది."[5]

ఈ భక్తి పదకవిత మొదట దక్షిణ దేశంలోనే ఆరంభమైనా, ఉత్తరదేశానికి వెళ్ళి మళ్ళీ అటునుంచి దక్షిణాదికి తిరిగి వచ్చింది. ఈ విషయాన్నే రాఘవన్

గార్రిలా పేర్కొన్నారు. "The cycle came (from north) full ro
and reached South India again. Through music, dance
dance-drama the influence of Jayadeva spread South-wa
and in Telugu, Kannad, Tamil and Malayalam. Universal s
ries and plays on devotional themes were composed in Sans
and these languages. Kirtana and Bhajana flowed fr
Maharashtra chiefly and from Bengal some extent, so that
a soil already the seed-bed of Bhakti the flow of these fr
waters from other areas, fed to a rich new crop of devotio
music and dance-drama."[6]

తమిళదేశంలో శైవవైష్ణవ మతాలు ప్రాచీనమైనవి. శైవ సమయాచా
ర్యులకు నాయన్మారులనీ, వైష్ణవమతాచార్యులకు ఆళ్వారులనీ పేరు. ఆళ్వా
పన్నిద్దరు ఉండేవారనీ తెలుస్తుంది. మతసంబంధమైన వాదోపవాదాలు జరుగు
ఉండేవి. ఆయా మతసంబంధి ఆచార్యులు రచించిన భక్తిరసగీతాలే తరు
కాలంలో గ్రంథరూపంలో వెలయించబడ్డాయి. శైవగీతాలకు తిరుమురై అ
వైష్ణవ గీతాలకు నాలాయిర ప్రబంధమనీ పేర్లు. నాయన్మారులు అంతక
ఆళ్వారులు భక్త్యుద్రేకంతో ప్రజల భాషలో పాడిన మధురగేయాలే. ప్రాచీన కా
నుంచి ప్రసిద్ధికెక్కాయి. నాయన్మారులలో ప్రసిద్ధుడైన మాణిక్యవాచకరు
కవితాశాఖకు చెందిన అచ్చనగాయల పాటలు, గొబ్బిపాటలు, జోలపాటలు వ
మధురకవితలు వెలయించాడు. ఆళ్వారుల గీతాలన్నీ మధురగీతాలే. ఈ విష్ణు
గీతాలు, నాలుగువేలున్నాయి. ఆళ్వారులలో నమ్మాళ్వారు శ్రేష్ఠుడు. వీరి
మహావిష్ణు భక్తురాలు ఆండాళ్ (గోదాదేవి) పెరియాళ్వారు పుత్రిక, భక్తి
వశ్యంతో ముప్పై పాశురాలు పాడింది. ఆండాళ్ కృష్ణభక్తిని గూర్చి శ్రీఅరవింద
ప్రశంసించారు. "This (Krishna Bhakti) is given still more dir
turn by a Southern poetess (Andal) is the image of herself
the bride of Krishna."[7] తమిళంలోని శైవ వైష్ణవ కవులు అ
భక్తిపూరితాలైన పదాలు రచించడమూ, అవి గానానుకూలంగా ఉండడమూ విశేష
తమిళంలోని దివ్యప్రబంధాలు, తేవారమ్ పదాలుగా దేవాలయాల్లో పరమపవిత్ర

వాద్యాల తోడ్పాటుతో కీర్తించబడేవి. మలయాళం చాలాకాలంవరకు తమిళంతోనే కలిసి ఉండడంవల్ల అందులో అతి ప్రాచీన పదకవిత అని పేర్కొనదగ్గ కవిత లేదేమో కానీ, జానపదకవితకు కొదవలేదు. అయితే 18వ శ.లో ఆటకథ అనబడు కథకళి ఆరంభమైంది. 'కృష్ణనాట్టం' అన్నది 'గీతగోవిందం'ను అనుసరించి వ్రాయబడిందని విజ్ఞుల అభిప్రాయం.

ఇలాగా తమిళంలో పదకవిత సహజమై, భక్తిపూరితమై అనాదినుంచి వ్యాప్తిలోనికి వచ్చిందన్న విషయం స్పష్టం.

కన్నడ సాహిత్యం 9వ శ.లో ప్రారంభమైంది. కానీ అంతకుముందు, సమకాలికంగానూ జానపద కవిత వెల్లి విరిసింది. తమిళంలోలాగే, కన్నడంలోను శైవవైష్ణవ మతావలంబులు ఈ పదకవితల్ని వెలయించారు. వచనకారుల్లో చెప్పుకోదగ్గ ప్రముఖుడు బసవేశ్వరుడు. అంతకంటే ముందు కాశిమయ్య, ఆ తరువాత అక్కమహాదేవి వచన రచనచేసి దేశిసాహిత్యాన్ని పరిపోషించారు. ఇవి పేరుకు వచనాలేగానీ రాగయుక్తంగా పాడుకోదగ్గపాటలే. ఆ తరువాత కృష్ణభక్తిపూరిత పదరచన అంటే దాససాహిత్యాన్ని పేర్కొనవలసి ఉంది. తమిళనాడులోని నాయన్మారులా, ఆళ్వారులా భక్తి కన్నడదేశానికి ప్రాకి అక్కడకూడా ఆయా మతాలు అభివృద్ధి చెందాయి.[8] మతంతోపాటు పదరచన పరాంకోటికెక్కినది దాససాహిత్యంలోనే. క్రీ శ. 13వ శ లో ఉడిపి దగ్గర ద్వైతమత ప్రవక్తలైన మధ్వాచార్యులు అవతరించి శైవమతానికి బసవేశ్వరునిలాగా భాగవతధర్మాన్ని వ్యాప్తిలోనికి తెచ్చారు. ఇతని శిష్యుడు పద్మనాభతీర్థులు. ఇతని శిష్యుడే శ్రీపాదరాయలు. కన్నడంలో 'దేవరనామము' లనబడే కీర్తనలను రచించి పూజాసమయంలో పాడించే పద్ధతిని ప్రారంభించిన ఘనత ఇతనికే దక్కింది. ఈ పదాల్లోని భక్తి శృంగారాదులు శ్రోతల్ని ఆకర్షిస్తూ ఉంటాయి. శ్రీపాదరాయల ముఖ్యశిష్యుడు వ్యాసరాయస్వామి, నూర్ల కొలది మనోహరమైన కీర్తనల్ని రచించి వ్యాసకూటంతో పాటు, దాసకూటాన్ని ఉన్నతస్థితికి తెచ్చిన ముఖ్యుడు. వ్యాసరాయల ప్రియ శిష్యులలో ప్రథమగణ్యుడు పురందరదాసు; వాగ్గేయకార చక్రవర్తి; కర్ణాటక సంగీతానికి తన పదరచనతో చక్కటి బాటలువేసిన కర్ణాటకసంగీతపితామహుడు. తెలుగులో వేలకొలది పదాలు రచించిన అన్నమాచార్యుని సమకాలికుడు,

వ్యాసరాయ ప్రియశిష్యుల్లో మరో ఉత్తమ పదకర్త కనకదాసు. గు వ్యాసరాయలచేతనే ప్రశంసించబడ్డవాడు ఇతడు. ఇంకా గోపాలదాసు, విజయదా జగన్నాథదాసు ప్రభృతులు పదరచనచేసి కన్నడసాహిత్యంలోని దాససాహిత్య ఎంతో పుష్టిని తుష్టిని చేకూర్చిన పదకర్తలు. వారినందరినీ స్మరించటం కర్తవ్యం.

తెలుగుసాహిత్యం క్రీ.శ. 11వ శ.లో వెలిసింది. అయితే అంతఃపూర్వ దేశిసాహిత్య మనబడ్డే జానపద సాహిత్యం విరివిగా ప్రచారంలో ఉండ్డే ఉంటు అది పండిత సాహిత్యమైతే ఇది పామర సాహిత్యం. అందుకే తెలుగు సాహిత్య పండిత సాహిత్యమూ, పామర సాహిత్యమూనని లేదా శిష్టసాహిత్యమూ, శిష్టే సాహిత్యమూనని వింగడించవచ్చు. శిష్టసాహిత్యంకంటే ముందే శిష్టేతరసాహి ఉద్భవించినా, ప్రాచుర్యం పొందినా అది సామాన్య ప్రజలకు మాత్రమే పరి మైంది. రాజాదరణ లభించిన శిష్టసాహిత్యం పండితలోకంలో ప్రబలింది; లిఖిత చాలావరకు నిలచింది. పామరసాహిత్యం మౌఖికం కావడంవల్ల కాలగర్భం ఎంతో కలిసిపోయింది.

తెలుగుసాహిత్యంలోని శిష్టేతర కవితాస్రోతస్విని మూడుపాయలుగా హిస్తూ వచ్చింది. మొదటిది కేవలం జానపదకవిత; దానిపుట్టుక అనాది; లిఖి కాలేదు; కేవలం మౌఖికం మాత్రమే.

రెండోది నన్నయకు పూర్వం శాసనాల్లో అక్కడక్కడా చోటుచేసుకున పాల్కురికి సోమనాథునితో ప్రారంభమైనది ద్విపదకవిత. దీనికి మళ్ళీ జానపదుల వ్యాప్తిలో ఉన్న ఏలలు, జోలలు మొదలైన జానపదరూపాలే ఆధారం. ద్విపద గ్రహించడమేగాదు. పాల్కురికి దీనికి కావ్యభాషా ప్రతిపత్తిని కల్పించాడు; అం పండితులుసైతం గౌరవించేట్టు పాటుపడ్డాడు. ఆనాడు పండితలోకంలో సంస్క కానికేగాని, దేశి అయిన తెలుగుకు ప్రాధాన్యం లేకపోవడంవల్ల దాన్ని ప్రామాణి చేయడంకోసం—

"తెలుఁగు మాటలనంగ వలదు, వేదముల

కొలఁదియ కాఁజూడు డిల నెట్లనినఁ

బాటి తూమునకును బాటి యౌనేని,
బాటింపఁగా సోలయును బాటికాదె," (బసవపురాణము-పు.89) —

అనీ పట్టుపట్టి అంగీకరింపజేసినట్లు స్పష్టంగా తెలిసే విషయం. ఇక్కడ ఈ ద్విపద శైవమత ప్రచారం కోసమే ప్రారంభమైనా, ఆ వెనుక తెలుగులో దీనికి పండితాదరణ లభించింది.

మూకోది వైష్ణవమత ప్రాధాన్యంతో అన్నమాచార్యుని (1408-1503) తో ప్రారంభమైన పదకవిత. ఈ పదకవితకు పూర్వం కృష్ణమాచార్యుడు (1268-1323) సింహగిరి వచనాలు రచించి తరించాడు. ఇవి పేరుకు మాత్రమే వచనాలు. కానీ పద్యంలా పాడుకోడానికి భక్తిప్రపత్తిని ప్రకటించడానికి ఉపకరించేవే. వీటికి అంతగా ప్రచార, ప్రాధాన్యాలు రాలేదు. అయినా అలాంటివే వేంకటేశ్వర వచనాలనే పేరుతో పెదతిరుమలాచార్యుకు తదనంతరకాలంలో లభించడం జరిగింది. అనాది నుంచి పామర ప్రజలను అలరిస్తూ వచ్చిన జానపదగేయరీతుల్ని గ్రహించి, అనేక పదకవితల్ని శిష్టకవితల్లో ఒక భాగంగా వెలయించి - పండిత ప్రశంసకు పాత్రమైన పద్యకవితా పీఠం పక్కనే పదకవితకు సైతం - సరిపీఠం వేసిన ఘనత అన్నమాచార్యునికే దక్కింది. పైపెచ్చు - పూర్వోక్తమైనట్లు - సంస్కృతంలో 'సంకీర్తన లక్షణం' రచించి, పదకవితకు విశిష్టతనీ, గౌరవ ప్రతిపత్తిని కలిగించి, ప్రామాణికతను సంప్రాప్తింపచేశాడు; అంటే దీనికి నిబద్ధతని నిరూపించాడు. ఈ పదాలు శృంగార, ఆధ్యాత్మికపదాలని రెండు విధాలు. యాగంటివారి పదాలు తత్వాలు, వచనాలు వెలిశాయి. అన్నమాచార్యుని పద్ధతిలోనే అతని పుత్రుడు పెద తిరుమలాచార్యుడు, మనుమడు చిన తిరుమలాచార్యుడు పదాలు రచించి, పదకవితకు ప్రాముఖ్యాన్ని తెచ్చారు.

సంకీర్తన, పదమూ అని పిలువబడుతూన్న ఈ పదం క్షేత్రయ్య కాలంనాటికి శృంగార పదమనే ప్రసిద్ధికెక్కింది; దీనికి అభినయం జోడించబడింది. అనాటి నుంచి పదాభినయం ప్రారంభమైంది. రామదాసు కీర్తనలు రచించి భజనపద్ధతిని ప్రవేశపెట్టాడు. సారంగపాణి శృంగారపదాలు, నీతివైరాగ్య సంబంధి అయిన అధ్యాత్మ కీర్తనలు రచించాడు. నాదోపాసనలో ముక్తిపొందిన త్యాగరాజు రచనలు కృతులు. సాహిత్యంకంటే సంగీతమే ఇందు ప్రాధాన్యం వహించింది. పోతులూరి వీరబ్రహ్మం, సిద్దయ్య ప్రభృతులు తత్వాలనబడే పదరచనచేశారు. మునిపల్లె

సుబ్రహ్మణ్యకవి సైతం సంగీతంలో సాహిత్య ప్రాముఖ్యంగల పదరచన చేశాడు. ఇలాగా ఎందరో మహానుభావులు పదకవితలకి పట్టంగట్టి పరిపోషించి వాగ్గేయకారులుగా ప్రసిద్ధికెక్కారు.

కావ్య ప్రయోజనం రసానందదాయకమేననీ, అది తొమ్మిది విధాలనీ, ఆ నవరసాల్లో రసరాజం శృంగారమనీ లాక్షణికుల మతం. సర్వప్రాణికోటికి అనంతానందాపాదీ శృంగారమన్న విషయం విదితమే.

రస నిష్పత్తిని గూర్చి భరతమహర్షి, ధనంజయాదులు వర్ణించిన వైనం గమనించదగ్గది. "విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రస నిష్పత్తిః" అని అతి ప్రాచీనలాక్షణికుడైన భరతముని రససూత్రం. అంటే విభావానుభావ వ్యభిచారి భావాల సంయోగంవల్ల రసనిష్పత్తి జరుగుతుందని అర్థం.

"విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః
ఆనీయమానః స్వాదుత్వం స్థాయిభావో రసస్మృతః"

అని దశరూపక కర్త ధనంజయుని నిర్వచనం. అంటే విభావానుభావ సాత్త్విక వ్యభిచారి భావాలచేత ఆస్వాద్యమానమైన స్థాయి భావమే రసమని అర్థం. స్థాయి అంటే స్థిరంగా ఉండేది. స్థాయి భావం అంటే రసస్ఫూర్తి వరకు సహృదయ హృదయాల్లో నిలిచిఉండేది. కావ్య పఠనం వల్లనైతేనేమి, దృశ్యకావ్య దర్శనం వల్లనైతేనేమి, సహృదయ హృదయాల్లో ఉత్పన్నమయ్యే ఆనందమే రసం.

పూర్వోక్తమైనట్లు నవరసాల్లో రసరాట్టు శృంగార రసం. నాయికా నాయకుల హృదయాల్లో కలిగే సంభోగ సంబంధమైన కామం అంటే అభిలాషను రతి అంటారు. స్త్రీ పురుషుల అన్యోన్యాలంబనంగల ప్రేమాఖ్యమైన చిత్తవృత్తివిశేషం రతి అని రస గంగాధరంలో జగన్నాథపండితరాయల అభిప్రాయం. ఈ రతి అంకుర పల్లవ, కళికా, ప్రసూన, ఫల, భోగావస్థలలో ప్రేమ, మాన, ప్రణయ, స్నేహ, రాగ, అనురాగాలనే పేర్లతో పేర్కొనబడుతుంది. ఈ ఆరవస్థలలో మొదటి అయిదు పూర్వరాగంలోను, ఆరవదైన భోగం సంభోగంలోను కలుగుతాయి. ఈ శృంగార రసం- సంభోగ శృంగారం, విప్రలంభ శృంగారం అని రెండు విధాలు. సంభోగ శృంగారం కేవల సురతరూపంలోనే గాక, దర్శన, స్పర్శన, ఆలింగన, చుంబనాదులైన అనేక విధాలుగా ఉన్నా, వీటన్నిటినీ కలిపి సంభోగ శృంగారంగానే

పరిగణించారు. విప్రలంభమంటే వియోగం. ఇది అభిలాషా(అయోగ లేక పూర్వరాగ) విప్రలంభం, మాన (ఈర్ష్యా) విప్రలంభం, విరహ విప్రలంభం, ప్రవాస విప్రలంభం అని నాల్గు విధాలు. మాన విప్రలంభం- ప్రణయ మానము, ఈర్ష్యా మానమూనవి రెండు విధాలు. ఇలాగా శృంగారమిన్ని విధాలుగా పరివ్యాప్తమై ఉంది.

తెలుగులో వెలసిన పదకవితల్లో శృంగారమే ప్రాముఖ్యం వహించింది. పద కవితల్లోనేకాదు తెలుగు సాహిత్యంలోనే శృంగార ప్రాధాన్యముంది. రాజుల నాశ్రయించిన కవులు ఆ రాజుల అభీష్టానుసారమే శృంగార రసపోషణాత్మకంగా తెలుగులో కవితలల్లిన మాట వాస్తవం. అయితే రాజాశ్రయం కోరని కవులు భక్తిపురస్సరంగానే కావ్యరచన చేసినట్లు స్పష్టం. అయితే అలాంటి కవుల సంఖ్య తక్కువనే చెప్పవలసి ఉంది. శైవమతాధిక్యాన్ని ప్రచారం చేయదలచిన శివకవులు, తదుచితంగా శైవభక్తి పారమ్యంగా రచన చేశారు. పోతన రామభక్తుడై భాగవత భక్తిని సకల హృదయ రంజకంగా రచించి తరించాడు. స్వయం రాజైన శ్రీకృష్ణ దేవరాయలు ఆండాళ్ పెరియాళ్వారు చరిత్రనుతీసుకొని గోదా శ్రీరంగేశుల ప్రణయాన్ని ఆముక్తమాల్యదలో మనోహరంగా వర్ణించాడు. పదకర్తలలో ఒకరిద్దరు తప్ప రాజాశ్రయాన్ని ధిక్కరించిన వారే ఎక్కువ. ప్రప్రథమంగా పెరిక్కదగ్గ కృష్ణమాచార్యులు కేవల భక్తి పూర్వకంగానే సింహగిరి వచనాలు రచించిన భక్తాగ్రేసరుడు అన్నమాచార్యుడు రచించిన అధ్యాత్మ శృంగార సంకీర్తనలలో శృంగార సంకీర్తనలే అధికం. సాళువ నరసింగరాయలను ధిక్కరించిన మహాభక్తుడు. అలాగే రామదాసు; అంతకంటే త్యాగరాజు- క్షేత్రయ్య, సారంగపాణి రాజాశ్రయంలో శృంగార పదరచనచేశారు. కానీ ఇవి సైతం మధురభక్తి ప్రపూరిత పదాలు. కాబట్టి భక్తి ఏటన్నిటా ముఖ్యమైందని తెలుస్తుంది. అయినా శృంగారమే మధురభక్తికి మూలం. తత్సంపూర్ణ స్వరూపాన్ని ఈ పదకవులందరిలోనూ చూడగలం. కేవలభక్తి ప్రతిపాదక పదరచన చేసినారన్న కన్నడ పదకర్తల్లోను, తెలుగులోని రామదాసు, త్యాగరాజుల్లోను శృంగారం లేకపోలేదు. పోతన భాగవత భక్తినే ప్రతిపాదించినా, అందులో శృంగారానికి తావులేకపోలేదు. అయితే అది మానవ పరిధినిదాటి అలౌకికమైన భగవద్భక్తికి కారణమైన దేవతా శృంగార రూపమని స్పష్టమవుతుంది.

కేవలం లౌకికశృంగారాన్నికాక భగవత్పరమైన శృంగారాన్ని తనపదాల్లో వర్ణించి తరించిన తొలితెలుగు వాగ్గేయకారుడు అన్నమాచార్యులు. అన్నమాచార్యులు ఆధ్యాత్మ సంకీర్తనలు గూడా రచించినా, శృంగార సంకీర్తనల సంఖ్యే అధికమని పూర్వోక్తం. అలమేలుమంగా శ్రీవేంకటేశ్వరుల శృంగార వర్ణనా వైదగ్ధ్యం కలవి పదాలు.

"అన్నమయ్య శృంగార సంకీర్తనములు 'వేంకటశైల వల్లభరతి క్రీడా రహస్యముల' వెల్లడించునవి. అవి పదసంజ్ఞదాల్చినవి. ఆధ్యాత్మ సంబంధములగు సంకీర్తనములును పదరచనములే యయినప్పటికిని, శృంగార సంకీర్తనముల యావిర్భూతితోనవి పదసంజ్ఞను కోలుపోయి కేవల సంకీర్తన సంజ్ఞను మాత్రము తాల్చినవి. నాటినుండి పదసంజ్ఞ శృంగారసంకీర్తనముల యందు రూఢమయి పోయినది. భగవద్గుణ సంకీర్తనాత్మకములయిన పదరచనములకు సంకీర్తనములని, శృంగార సంకీర్తనములకు పదములని వ్యవహారము నాటినుండి యేర్పడినది."[9] భోజదేవుడు "శృంగార ఏవఏకోరసః" అని ప్రగాఢంగా నమ్మి నిర్వచించాడు. తదితరమైనవి భోజదేవుని దృష్టిలో రసాలేకావని తలంచవలసి ఉంది. అలాగే "శృంగారఏవ మధురః పరప్రహ్లాదనోరసః"—అని ధ్వన్యాలోక నిర్వచనం. స్వభావసిద్ధంగానే మానవహృదయం రాగమయం. ఈ రాగం స్పష్టమై శృంగారంలో పర్యవసిస్తుంది. ఇది భోజదేవుని అభిమతం. తదితర రసాలు చరమావస్థలో మాత్రమే మనోహరమవుతుండగా శృంగారం ప్రారంభంనుంచి చివరిదాకా మధురమంజులమే. లాక్షణికుల మతం ప్రకారం శృంగారరస స్థాయిభావం రతి. రతికంటె ఇతర స్థాయిభావాలకు శృంగారానికున్నంత చురుకు, శుద్ధి లేవని చెప్పడం అత్యుక్తిగాదు. అందుకే శృంగారానికి శుచి అనీ, ఉజ్జ్వలమనీ పేర్లువచ్చాయి. ఈ శృంగారం సృష్టిరహస్యాన్నే ఇముడ్చుకొంది. అందువల్లనే అనాది నుంచి సర్వసాహిత్యోపాసకులా ఈ శృంగారాన్ని ఆరాధించి తరించారు. అదే రీతిగా అన్నమాచార్యులు శృంగార సంకీర్తనల్లో దివ్యశృంగారాన్ని వివిధరీతుల దర్శించి. వర్ణించి, తరించాడు. క్రమంగా ఆరీతులను పరిశీలిద్దాము.

అన్నమాచార్యుల పదాల్లో శ్రీ వేంకటేశ్వరుడే నాయకుడు. అలమేల్మంగా దేవి నాయిక. శ్రీభూనీళాదులు అలమేల్మంగకు సవతులు. అందుకే అలాంటిసంవర్భాలలో నాయకుడు దక్షిణ నాయకుడు. అన్నమాచార్యుడే శృంగార సహకారిణి అవుతుంటాడు. మరికొన్ని సందర్భాల్లో అన్నమార్యుడే నాయిక. అదే మధురభక్తి.

శృంగారనాయిక విరహమనుభవించడమూ కలదు. అలమేల్మంగా వేంకటేశ్వరుల దివ్యశృంగారంలో నాయిక అయిన అలమేల్మంగ యందు స్వామి రతిచిత్తం కలవాడు. ఆ దివ్యనాయికా నాయకుల రతి స్థిరమైనది; దివ్యమైనది. అది స్థాయిత్వమవుతుంది. భావాన్ని ఉద్దీపింపజేసే ప్రతి పదంలోను పుష్కలంగా ఉంది. నాయకునకు చేయికేకు నాయికకు నాయకుడు ఆలంబనం. ఆయా నాయికల హావభావాది శృంగార విలాసాదులు అనుభవాలు. నాయికస్థాయి రతిసాగరంలో అసూయాదులు, శంకాదులు ఉత్సాహాదులు లీనమై అత్యంత శోభను చేకూరుస్తున్నాయి. ప్రియసందర్శనాదుల మూలాన వివశ అయిన నాయిక సాత్వికస్థితికి లోనవుతుంది. విభావాదుల సంయోగంవల్ల రతిస్థాయి శృంగార రసమయి ప్రతి పదంలోను సహృదయ హృదయ రంజకమై ఒప్పుతూంది.

అన్నమాచార్యులు ఉదాత్తాన్విత భావస్ఫోరకమై నిర్మలప్రేమతో గూడిన శృంగారం వర్ణించాడు. దీన్నే మనం అచ్ఛమైన అమలిన శృంగారం అనటం సముచితం. నాయిక నాయకునితో నన్న మాటలు:

"వద్దు నన్ను (జెనకకుర వాదేటికి
చద్దివేడికి నోలప్పుజంకెనలు మేలు ||పల్లవి||

వొలపి నొల్లముల వొందొనరించుకంటేను
అంవోకలైన వొలయలుక మేలు
కలసీ కలయని మనసు కసగాటుకంటేను
తలపులో నడియాసతమకమే మేలు ||వద్దు||

వచ్చి పెచ్చులకూర్మి పచరించు కంటేను
కొచ్చి వూరకయుండు గుట్టు మేలు
వచ్చియును రాములను వడి బొరలు కంటేను
మచ్చరము మాని మెయి మఱచుటే మేలు ||వద్దు||

తనిపియును దనివోని రతులకంటేను
కను (గొనుచు (జెలగు సంగతులే మేలు
ఘనలేని శ్రీ వేంకటేశ యిన్నిటికంటే
నిను (గలపియున్న నానేరుపే మేలు ||వద్దు||

(శృ. సం. 30-83)

ఇంత్ర నిర్మల ప్రణయం అన్నమాచార్యుని సంకీర్తనల్లో అనంతంగా ఉంది.

**సంభోగ శృంగారం :**

అన్నమాచార్యుల దివ్య సంభోగ శృంగారాన్ని మధుర మంజులంగా, మనో రంజకంగా వర్ణించాడు.

సంభోగ శృంగారమిలా నాయికానాయక పరస్పర దర్శన స్పర్శన, చుంబ నాలింగ నాది రూపంలో ఉంటుంది. అలాంటి శృంగారమిందు చిత్రితం —

"లలిత లావణ్య విలాసముతోడ
నెలఁత ధన్యతగలిగె నేఁటితోడ ॥పల్లవి॥

కుప్పలుగా మైవసలుకొన్న కస్తూరితోడ
తొప్పఁదోఁగేటి చెమటతోడ
అప్పుడటు శశిరేఖలైన చనుఁగవతోడ
దప్పిదేరేటి మోముదమ్మితోడ ॥లలిత॥

కులుకుఁగబరీభరము కుంతలంబులతోడ
తొలఁగఁదోయని ప్రేమతోడ
మొలకనవ్వులు దొలఁకుముద్దుఁ జూపులతోడ
పులకలు పొదవైన పొలుపుతోడ ॥లలిత॥

తిరువేంకటాచలాధిపుని మన్ననతోడ
సరిలేని దివ్యవాసనలతోడ
పరికించరాని అరవిరిభావముతోడ
సిరిదొలఁ(లం)కెడి చిన్ని సిగ్గుతోడ ॥లలిత॥

(శృం. సం. 12-130)

ఈ పదమెంతో ఔచితీసహమై అన్నమాచార్యుని ప్రతిభను ప్రకటిస్తూంది.

**విప్రలంభ శృంగారం :**

మొదటే పేరొకొన్నట్లు నిర్మలప్రణయమే ఉన్నతమూ, పరిశుద్ధమూను, అయినదే విప్రలంభశృంగారం. దీనికొక ప్రత్యేకతా, విశిష్టతా ఉన్నాయి. "న వినా విప్రలంభేన సంభోగః పుష్టిమశ్నుతే" అంటే విప్రలంభ విరహితంగా సంభోగ

శృంగారంపుష్టిని పొందలేదని లాక్షణికమతం. పైపెచ్చు ఈ విప్రలంభ శృంగారం సంయోగ శృంగారం కంటే ఉదాత్తమైంది; ఇందులో ఔచిత్యం అనంతం. అదే రీతిని అన్నమాచార్యుని ఉదాత్తసమన్విత విప్రలంభ శృంగారం చవిచూస్తే దాని విశిష్టత స్పష్టమవుతుంది.

**అభిలాష లేక పూర్వరాగ విప్రలంభం :**

నాయికకు నాయకునిపైగల పూర్వరాగం అన్నమాచార్యులు కరుణరసాత్మకంగా వర్ణించి మనల్నిగూడా అందులో భాగస్వాములుగాచేసి సార్వజనీనం చేయడం ఎంతో రమణీయం.

"మదము దొలఁకెడి యట్టి మంచి వయసున మనకు
తుదలేని వేడుకలు దొరకు జెప్పఁదురా ॥పల్లవి॥

ఉదుటుఁ జనుదోయి నీవురముపైఁ దనివార
నదిమి మోమును మోము నలమియలమి
వదలైన నీవితో వాలుఁగన్నుల జంకె
లొదవ నీ మీద నేనొరగు టెన్నఁడురా ॥మదము॥

కలికి తనమున నాటు కప్పురవుఁ దమ్ములము
కులికి నీ వదనమునఁ గుమ్మరించి
పలచనగు గోళ్ళ నీ పగడవాతెర నొక్కి
చెలువమగు నునుగంటి సేయుటెన్నఁడురా ॥మదము॥

గరగరని కురులతో కస్తూరి వాసనలు
విరితావులతోడ విసరఁగాను
తిరువేంకటాధిపుఁడ నినుఁ గూడి నే
నరమరచి సదమదము లౌట యెన్నఁడురా ॥మదము॥

(శృం. సం. 12-54)

ఇందులోనాయిక కున్న ప్రగాఢానురాగాన్ని ఎంతో తీవ్రంగా ఉన్నట్లు స్పష్టంచేసింది. ఇదే పూర్వరాగం.

## విరహవిప్రలంభ శృంగారం :

సంభోగానంతరం నాయిక అనుభవించే విరహాగ్నికిలోనై పడేబాధ: నాయకుని కలయికకై ఆశించే ప్రగాఢకాంక్షకిది నిదర్శనమవుతుంది. తెలుగు ప్రబంధాలన్నిటా ఇదీ అత్యంతంగా, విపులంగా వర్ణితమైన విషయం మనకు తెలిసిందే.

చెలులు నాయికా విరహాన్ని నాయకునికి వివరించి చెబుతున్నారు. చేరిని ఆదరింపుమని అర్థిస్తున్నారు.

"మాటలేల మనసుకు మనసేసాక్షి
యేటికిఁబెంకు సేసే వింతిఁగానవయ్యా ॥పల్లవి॥

కామిని తాపమునకు గప్పిన పయ్యద సాక్షి
చేమిరి చింతకు చెక్కు చేయే సాక్షి
వాముల వూరుపులకు వాడిన మోవే సాక్షి
యేమరిపాటు విచ్చేసి ఇంతిఁ జూడవయ్యా ॥మాట॥

వడియుఁ గన్నీటికిని వట్రువ గుబ్బలే సాక్షి
తడుపుఁ జెమటలకు తనువే సాక్షి
చిడుముడి యలఁతకు చెదరుఁ గురులే సాక్షి
యెడపేయక విచ్చేసి ఇంతిఁగానవయ్యా ॥మాట॥

నీ కెదురు చూచుటకు నిట్టచూపులే సాక్షి
పైకొన్న యవస్థలకు పానుపులే సాక్షి
చేకొని శ్రీ వేంకటేశ చేరి కూడితి వింతట
యీకడ నిక్కె కరుణ నింతిఁ జూడవయ్యా ॥మాట॥"

(శృం. సం. 30,188)

ఇలాగే చెలులు నాయికా విరహాన్ని గూర్చి భయపడి తమలో తాము సంభాషించుకొని నాయకునకు విన్నవించాలనుకోవడం ఈ కింది పదంలో చూడవచ్చు.

"ఇట్టిదుమీఁద సతిభావ మెట్లానో యేమౌనో
ఛిందుగాఁ జెలువునికి విన్నవించరే ॥పల్లవి॥

కోవిలకూతకుఁగానే గుండె జల్లురని చెలి
పూవక పూచిన యట్టు పులకించె
మావినుండి యంతలోనే మదన భూతముసోఁకె
పోవులైన పుప్పొడినే పోయరే బడిమి ॥ఇందు॥

కోమలి చంద్రుఁడనే కొరవిదయ్యముఁ జూచి
దీమన మింతయు మాని దిగులందెను
తేమలైన వెన్నెలల తిమ్మువట్టి నిలువున
మైమఱచె గప్పురాన మంత్రించరే ॥ఇందు॥

ఇంతలో శ్రీ వేంకటేశుఁ డిందుకు విచ్చేయఁగాను
చింతఁదీర మేనెల్ల జెమరించెను
వింతలైన రతులలో విరహపు సోఁకు వాసె
కంతుచిగురాకు రక్షగట్టరే యంగనకు ॥ఇందుకు॥

(శృం. సం. 30-76)

ఇందులో కోవెలలు, మన్మథుడు, చంద్రుడు, వెన్నెల మొదలైనవన్నీ విరహాగ్నిని నాయికకు అధికం చేయగా, శైత్యోపచారాలు రక్షలు గట్టడం చేయమని అంటున్నారు. ఇది ప్రబంధ రీతి.

ఇలాగే పురుష విరహమూ వర్ణితం. ఇదీ ప్రబంధాల వర్ణనకు ఏ విధంగానూ తీసిపోదు. పైగా ఇది కొత్త ఆట !

"ఏమిసేతు నమ్మలాల యెందుకౌను నాయకుఁడు
భూమిలోఁ జెప్పఁ గొత్త యీ పురుష విరహము ॥పల్లవి॥

తొయ్యలి రాకకుఁ బతి తొంగిచూడఁ బోతేను
దయ్యమువలెఁ జంద్రుఁడు తలచూపెను
చయ్యన నందు కతఁడు జడిసి తలవంచితే
నుయ్యివలెనే తోఁచె నూలుకొని మనసు ॥ఏమి॥

మగువ మెలుఁగు విన మతి నాలకించితేను
పగవాని వలెనే పల్కెఁగోవిల

పెగపై యందు కత(డు వీనులు మూసుకొంటే
మొగులు వలెనే కప్పె ముంచుక విరహము ॥ఏమి॥

నలినాక్షి రూపు మనసున( దల(చ(బోతే
చిలుకుగాలమై తో(చెను మరు(డు
అలసె శ్రీవేంకటే(శుడంతలోన సతిగూడె
నెలకొని కొండవలె నిలిచె సంతోసము ॥ఏమి॥

(శృం. సం. 24.157)

ఇందులో నాయకుని విరహం కొత్త అని చెప్పి, నాయకుడు నాయిక రాక కోసం తొంగి చూడబోతే చంద్రుడు దయ్యంలా, మనసు నూయిగా, కోవిల శత్రువై, మొగులులా విరహం కప్పడం మొదలైనవి వర్ణితం.

## ప్రవాస విప్రలంభ శృంగారం :

నాయకుడు ఏదేని కార్యార్థమై దూరదేశమేగినపుడు నాయిక నాయకునికై అనుభవించే విరహమే ప్రవాస విప్రలంభం. ఈ కింది పదంలో చెలులు నాయిక నుద్బోధిస్తూ అనునయించడం గమినించగలం.

"నీ విభు(డు వచ్చు దా(క నిచ్చలాన నుండే (ద) వే
వేవేలకును రేయి వేగించవేమే ॥పల్లవి

పూయకు కస్తూరి మేన( బొద్దుగూ(కె( జీ(కటంటా
నోయమ్మ చందురు( డుదయించెను (చీని)
చాయల వెన్నెలదా(కి చల్లజంపు యెండలంటా
ఆ యెడ నీవు వే(గ(గ నది చూడలేమే ॥నీవి॥

గందము పుయ్యకువే కలికి నీ కుచములే
చందనపు( గొండలంటా( జల్లిగాలి
అందులో పూవు తావిదా(కి అమ్మ మొనలంటెనంటా
మందమై మేను మరువ(గ మందులు దేలేమే ॥నీవి॥

వద్దేలే కుంకుమలు వసంతపు( జిగురంటా
నద్దితే( గోవిల భూతమని లో(గేవు

నిద్దపు శ్రీవేంకటాద్రి నిలయుఁ డిట్టె కూడె
యిద్దరి మీ వలపులు యింకనెంచ్చ్రమే ॥నీవి॥

(శృం. సం. 13.285)

ఇంకా ఇలాంటి ఉదాహరణ లివ్వవచ్చు.

**ఈర్ష్యా విప్రలంభ శృంగారం :**

ఈ ఈర్ష్యా విప్రలంభం ప్రణయమానమనీ, ఈర్ష్యా మానమనీ రెండువిధాలు. ఈ రెండు రమణీయాలని అలంకారికుల మతం. ఇందులో ప్రణయమానం :

నాయక సంబంధమైన ప్రగాఢ ప్రణయం గలిగి ఉండి ఏదో ఒక కారణం వల్ల బొలయలకతో నున్న నాయకునుద్దేశించి నాయిక అనునయిస్తూన్న మాటలు చిత్రితం—

"మైలవాసి మఱుఁగాయ మాటలేలరా
చాలుఁజాలు బనులెల్లఁ జక్కనాయరా ॥వల్ల వి॥

తొడిఁబడ సవ్వితిని తోడుత నే మొక్కితిని
చిడుముడి సేఁక నేమి చేసేవురా
అదరి నేఁదిట్టితిని అంతలోఁ బంకమిచ్చితి
వడిగాఁ బై పైనాతో వాదులేలరా ॥మైల॥

కోపగించి చూచితివి గొబ్బున నే మెచ్చితిని
మాపుదాఁకా నింత జోలిమాట లేలరా
రేఁపకాడ నెడసితి మాపటంతఁ గూడితివి
యీపాటి వాసికిని యెగ్గులేలరా ॥మైల॥

మోవి గంటి సేసితి నామోవి తేనెలిచ్చితిని
దేవుఁడ శ్రీ వేంకటేశ తెగువేలరా
భావమెల్లఁ గరఁగితి పక్కన మెప్పించితిని
చేవదేరెఁ బనులెల్ల జింత లేలరా ॥మైల॥

(శృం. సం. 28.511)

ఇలాగే ఈర్ష్యామానంగూడా చక్కగా వర్ణితం.

"లంజ కాఁడవౌదువురా ॥పల్లవి॥

లంజకాఁడవౌదువు నీలాగు లెల్లఁ గానవచ్చె
ముంజేతఁ బెట్టిన సొమ్ముల కద్దమేలరా ॥అనుప॥

కొంకక యెవ్వతో కాని కోరి నీ బుజముమీఁద
కంకణాల చేయివేసి కౌఁగిలించఁబోలును
వంకలైన వత్తులెల్ల వడిఁగాన వచ్చెనింక
బొంక నేమిటికిరా నీ బూములెల్లఁ గంటిమి ॥లంజ॥

ఒద్దిక నెవ్వతో గాని వోరి నీవురము మీఁద
నిద్దరించఁ గంటమాల నీలము లొత్తినది
తిద్దిన జాణవుగాన తిరిగి తిరిగి మాతో
బిద్ద నేఁటికిరా నేఁబచ్చి సేయఁజాలను ॥లంజ॥

వేడుకనెవ్వతో తిరువేంకటేశ్వర నిన్ను
కూడిన నీమేనితావి కొల్ల వట్టుకొన్నది,
తోడనె నాకౌఁగిటిలో దొరకొంటివింక నిన్ను
నాడనేమిటికిరా నాయలపెల్లఁదీరెను ॥లంజ॥"

(శృం. సం. 12-84)

నాయకుడు ఇతరత్రా మరోనాయికతో సాగించిన శృంగార వ్యాపారంవల్ల వ్యక్తమవుతూన్న శృంగారచేష్టలనుచూసి కోపంతో నాయిక నాయకుని నిందిస్తూ పొలయలకను ప్రకటిస్తూంది. ఇది ఎంతో రమణీయంగా ఉంది.

అయితే ఇక్కడ 'లంజకాడ' పదప్రయోగం అంత ఔచితీసహంకాదని భావిస్తే సంకీర్తన లక్షణంలోని-

"పదములు శృంగారవధూ
మృదు మధుర మనోజ్ఞ వాక్యమిశ్రములైనన్
విదితార్థ గ్రామ్యోక్తులు
పదిలముగాఁ బొంకమెఱిఁగి పలుకఁగఁజెల్లున్."[10]

అనే పద్యమే సమాధానం.

## శృంగార సహకారిణులు :

శృంగారంలో నాయికా నాయకులకు సహకరించేవారు సఖులు, దూతికలు.

### సఖీహితబోధ :

నాయికకు హితబోధచేస్తూంది కిందపదంలో సఖి ఎంతో చక్కగా-

"ప్రాణనాయకుఁడు వాఁడె ప్రాణేశ్వరివి నీవు
జాణవు నీవిన్నిటాను చలమేఁటికే ॥పల్ల వి॥

వీడనాడివచ్చుఁగాని వెనకవేఁడుకోరాదు
కూడేరు మీకెపోదు కోపమింతేలే
నీడలు వేరై తోఁచు నిలువాక్కచేకాదా ॥ప్రాణ॥

అలుగఁగవచ్చుఁగాని అట్టె కిందుపడరాదు
కలసేరు మీకెపోదు కపటమేలే
పలుకులెన్నైనాఁ దోఁచు బాసవాక్కచేకాదా
పులకలి వేడవంటా బొర్ల నేఁటికే ॥ప్రాణ॥

తప్పులెంచవచ్చుఁగాని తారుకాణించరాదు,
యెప్పుడు మీకెపోదు యెరవేఁటికే
అప్పుఁడిదే శ్రీవేంకటాధిపుఁడు నిన్నుఁగూడె
కుప్పళించి నవ్వేనంటా గోరఁ జించనేటికే ॥ప్రాణ॥
(శృం. సం. 28-41)

### దూతీహితబోధ :

ఇలాగే దూతి నాయిక పంపినదని నాయకునకు హితబోధచేసి తీసుకొనిరావడానికి ప్రయత్నించడం దూతీహితబోధ.

"చెలి మమ్ముఁ జెప్పుమని సిగ్గుతోడఁదానున్నది
తలకొని యూకెతో మంతనమాడవయ్యా ॥పల్ల వి॥

కన్నుల చూపులనే కాంత నీ కారతులెత్తీ
మన్నించి రావయ్యాలోని మల్ల సాలకు

చన్నులనే నిమ్మపండ్లు సారెకుఁగానుకలిచ్చీ
చెన్నుగా నందుకొందువు చేయిచాఁచవయ్యా ॥చెలి॥

పచ్చిచిగురాకు మోవిఁ బిల్లెము నీకుఁబెట్టీ
ఇచ్చ విందారగింతువు ఇయ్యకోవయ్యా
ముచ్చటఁగరకమలముల నిన్నుఁబూజించీ
కొచ్చి కాఁగిటిలోనఁ జేకొనఁగదవయ్యా ॥చెలి॥

మొలకనవ్వులనే ముత్యాలసేసవెట్టీ
లలినాపె మోము చూచి లాలించవయ్యా
అలమేలుమంగ పతివైన శ్రీ వేంకటేశ్వర
కలసితివీకె నిట్టె కరుణించవయ్యా ॥చెలి॥"

(శృం. సం. 28-336)

ఇందులో కవితాత్మకంగా దూతికలు నాయకునకు నాయికని గూర్చి విన్నవించి వేడుకొన్నట్లు అన్నమాచార్యుడు రచించినట్లు స్పష్టం. వాస్తవానికి ఇక్కడ ఈ దూతీ సఖులు అన్నమాచార్యుడే అని కూడా మనం గమనించడం అవసరం. లేకపోతే ఇంత హృదయంగమంగా, ఆత్మీయంగా రచన ఉండడానికి అవకాశంవుండదు. ఇది అన్నమాచార్య రచనాచాతుర్యంలో ఒక భాగమనీ, శృంగార రచనకు మనోజ్ఞరూప నిదర్శనమనీ గుర్తించవచ్చు.

**చతుర్విధ శృంగారనాయికలు :**

"చతుర్విధనాయికలు హస్తిని, చిత్తిని, పద్మిని, శంఖిని అని శృంగారమంజరి అనే శృంగారలక్షణ గ్రంథం పేర్కొంది. ఈనాలుగు జాతుల నాయికల్ని ప్రాచీ నాలంకారికులు పేర్కొలేదు. సంస్కృత సాహిత్యంలో కనిపించని ఈ నాయికా భేదాలను తెలుగు కన్నడ సాహిత్యాల్లోనే చూడగలం.[11] అన్నమాచార్యులు శాస్త్రజ్ఞానం గలవాడు గనుకనే ఈ నాలుగు రీతుల నాయికలను ఒకే పదంలో వర్ణించి మనోజ్ఞం చేయడం గమనించగలం.

అన్నిజాతులుఁ దానెయైవున్నది
కన్నుల కలికి మాయగరచెనోయనఁగ ॥పల్లవి॥

కన్నె శంకిణిజాతిగాఁబోలు పేఁపునను
సన్నపుమదనాంకములు జడిగొన్నవి
పన్నెలుగ వేలరాజు వలపు తలకెక్కించ
పన్నినటువంటి సోపానములో యనఁగా ॥అన్ని॥

తెలివ దలపోయ చిత్తిణిజాతి గాఁబోలు
నెలులు విప్పుచు వీధి నిలుచున్నది
నెలతనము మరుఁడు తనునిండనేసిన యంప
గరులిన్నియనుచు రెక్కలు వెట్టుగతిని ॥అన్ని॥

కాంత హస్తిణిజాతి గాఁబోలు కరమూలము
లంతకంతకు నలుపులై యున్నవి
పంతంపు మరుఁడు తన భండార మిండ్లకును
దొంతిగా నిడిన కస్తురి ముద్రలనఁగా ॥అన్ని॥

ఘనత పద్మిణిజాతి గాఁబోలు నీ లలన
తనువెల్ల పద్మగంధంబైనది
మినుకుగా మరుఁడు తామెర లమ్ములనె మేను
తనలించి వడిఁ బుష్పగర్భైనో యనఁగా ॥అన్ని॥

ఇదియు జగదేక మోహిణి దానె కాఁబోలు
కదలు కనుఁగవకెంపు గతిగున్నది
చెదరి చెలికనుఁగొనలఁ జిందెనో యనఁగా ॥అన్ని॥"

(శృం. సం. 12-123)

చివరి చరణంలోని 'మోహిణి'ని చతుర్విధ నాయికలతో ఐదో నాయకగా గూడ అన్నమాచార్యులు చేర్చారేమోనన్న సందేహం ప్రకటించారు, డా॥ ఆనందమూర్తి గారు.[12] కానీ అన్నమాచార్యులు ఉద్దేశించలేదనిపిస్తుంది, పల్లవిలో అన్ని జాతుల స్వభావం గలిగిన నాయికా చతుర్విధరీతుల్ని తెలిపి చివరికి, ఆ నాయికనే 'జగదేక మోహిణి'గా బోలునని చెప్పాడు. కాబట్టి నాయికా సౌందర్య వర్ణనకే ఈ పదం ప్రయుక్తమంటే తప్పులేదని భావిస్తున్నాను.

శృంగార నాయకుడు శ్రీ వేంకటేశ్వరుడు; నాయిక అలమేల్మంగ. అన్న చార్యుడు వర్ణించినది దివ్య శృంగారం. ఇందులో త్రివిధ నాయికలు స్వీ అన్యా, పరకీయా నాయికలలో స్వీయనాయికకే ప్రాధాన్యం. ఇందుకెన్ని ఉద రణలైనా ఇవ్వవచ్చు. మచ్చుకు ఒక ఉదాహరణ :

**స్వీయా - దివ్యా - శృంగారనాయిక :**

"ఏమిసేతునయ్య నీవు యింతటి నాయకుండవు
మోము చూచి తొలినీకు మోహించిన దానను ॥పల్లవి॥

వలపించవలె నొండె వశముగాకుండితేను
చెలరేగి ప్రియమైనం జెప్పవనిను
పిలువనంపంగవలె బిగిసి రాకుండితేను
కొలువుకు వచ్చి కొంత కొసరగావలెను ॥ఏమి॥

మెప్పించుకోవలె నొండె మించి కరగకుండితే
వుప్పతించ నోర్పుతోడ నుండవలెను
చిప్పిలంబెనగంగ చేతికి లోగాకుండతే
చెప్పి నట్టిపూడిగాలు సేయంగవలెను ॥ఏమి॥

పంచుకొనవలె నొండె నవమానమున నుంచె
కొంచక పంతములిచ్చి కూడవలెను
యెంచంగ శ్రీ వేంకటేశ యేనలమేల్మంగను
పొంచి నన్నేలితివి పొగడంగవలెను ॥ఏమి॥

(శృం. సం. 3-18

ఇలాగా ఎంతో దివ్యాతిదివ్యంగా వర్ణించాడు స్వీయనాయికా శృంగారాన్ని అన్న చార్యుడు.

**పరకీయా శృంగారనాయిక :**

అంతటా స్వీయా శృంగారమే వర్ణితమైనా, పరకీయా శృంగారం వర్ణిత

ఒక ఉదాహరణ :

"కొండలోఁ గోవిల గుయ్యగుండె వగిలె నీ
యండకురాఁగాఁ బ్రాణమంతలో బ్రదికెరా ॥పల్లవి॥

వలచి నిన్ను వెదకి వడి నేరాఁగాను
పులివలె మగఁడుండెఁ బోనియ్యక
తలఁచి నాకంతలోనే తల నొవ్వఁగాను
చిలుకుఁబులక లెత్తి సిగ్గుమాలె వలపు ॥కొండ॥

ఏమరించి యింటివారి నెడసి నే రాఁగాను
గామైన బిడ్డ యేడ్చెఁగదలనీక
తామసించి యుండలేక తల్లడించఁగాను
చీమలు మైవాఁకినట్టు చిమ్మిరేఁగె వలపు ॥కొండ॥

వుండలేక యిప్పుడు నీ వొద్దికి నే రాఁగాను
కొండవలె మరదుండెఁ గోపగించుక
బొండుమల్లె పరపుపైఁ బొరలేటి యిట్టినన్ను
కొండలరాయఁడ నిన్నుఁ గూడించె నా వలపు ॥కొండ॥

(శృం. సం. 12-324)

ఇలా మగనాలుగా పరకీయగా కనిపించినా పవిత్రమైన ప్రణయమూ, నిర్మలాను రాగమూనని నాయిక చెబుతూంది. అంతటి పవిత్రమైన వలపే శ్రీవేంకటేశ్వరుని కలిపినదని వివరిస్తూంది నాయిక. ఇలాంటి పదాలే తరువాత పదకర్తలైన క్షేత్రయ్యాదులకు పరకీయా శృంగార పదరచనకుపకరించాయి.

అయితే అన్నమాచార్యుల పదాల్లో సామాన్య నాయికా శృంగారం కనిపించదు. ఇది విశేషం.

అలంకారికులు పేర్కొన్న అష్టవిధ నాయికలు అన్నమాచార్యుల పదాల్లో దర్శనమిస్తారు.

**అష్టవిధ నాయికలు :**

**వాసకసజ్జిక :**

"ఎప్పుడుగాని రాఁడో యెంతవడవాయ కాలి
చప్పుడాలకించి మతి జల్లు ధనెనమ్మా" (శృం. సం. 12-46)

**అభిసారిక :**

"కామించి నీవరుగ గలయు నాయకుఁడు నేఁ
డేమి భాగ్యముసేసెనే తరుణి" (శృం. సం. 12-142)

**ఖండిత :**

"దాని సాహసము మేలు తరువాత నీవుమేలు
పూసిన యూరడికి నిన్నొడగట్టించినది" (శృం. సం. 16-97)

**కలహాంతరిత :**

"ఎంతవాఁడవైన నిన్ను వింతసేసితి
యింతిని నాయపరాధా లెత్తొరిచేవయ్యా" (శృం. సం. 17-565)

**విరహోత్కంఠిత :**

"విన్నవించవె వోరమతి విభునికి వింతలింకనేలే
వున్నతిఁదన్ను నేనేమైన నంటినా వోరుమకొమ్మనవే"
(శృం. సం. 16-2)

**స్వాధీనపతిక :**

"చెలులాల చూడరే యీ చెలిభాగ్యము
అలమేలుమంగ యీకె కబ్బెను యీభాగ్యము ॥పల్లవి॥
(శృం. సం. 30-274)

**విప్రలబ్ధ :**

"పొద్దిక నెన్నడు పొడుచునో పోయినచెలి రాదాయను
నిద్దుర కంటికిఁదోఁపదు నిమిషం బొకయేఁడు" (శృం.సం.12-138)

ప్రోషితభర్తృక :

"ఇదివో యింతట వరంబీవయ్యా
కదిసి ప్రత్యక్షంబుగావయ్యా చెలికి" (శృం. సం. 13-299)

ఇలాగా వివిధ విధ నాయికలు ఆలంకారిక, లాక్షణికమతానుసారం రచితమై ఉండడం గమనించగలం. ఇంకా ఎన్నోరకాలైన శృంగారాన్ని అన్నమాచార్యులు తన పదాల్లో చిత్రించి ఉండడం గమనించగలం.

ఇలాగా అన్నమాచార్యులు పలువిధాలుగా శృంగార రహస్యాన్ని గుర్తించి ఆలంకారిక, లాక్షణికుల మతాల్ని మననం చేసుకొని తదుచితరీతిని అలమేలుమంగా శ్రీ వేంకటేశ్వరులనే నాయికా నాయకుల దివ్య శృంగార రీతులను, వివిధ విధ నాయికలను పరిపూర్ణంగా వర్ణించి తరించాడు. తానే ఒక్కొక్కసారి నాయికగా, దూతిగా, సఖిగా అయి తన పదాల్లో భగవంతునిపై మరులుగొన్నట్టు చిత్రించు కొన్నారు. తద్వారా భక్తిని, అంతకంటే మధురభక్తిని ఆయాపదాల్లో ప్రకటించి ధన్యుడయ్యాడు. ఈ అంశం ఆయన మధురభక్తిలో దర్శించగలము.

## 2.2 మధురభక్తి :

అన్నమాచార్య మధురభక్తిని గురించి తెలుసుకొనేముందు మధురభక్తిని గూర్చి వివరంగా తెలుసుకోవడం ఎంతైనా అవసరం. దీన్ని గూర్చి వివిధ రీతుల వివిధాలంకారికులు, లాక్షణికులు, విమర్శకులు విశదీకరించిన తీరుతెన్నులను విస్పష్ట రీతిని గుర్తించడం ముఖ్యం.

మధురభక్తి అత్యంతమధురమైంది. భక్తిని రసమని పూర్వలాక్షణికులు కొందరైనా నిర్ణయించారు. అది భగవత్పరమైనప్పుడు ఉత్తమరస పర్యవసాయి అవుతుందని తీర్మానించారు.

భగవంతునిపైగల ప్రేమ- గాఢానురాగమే- భక్తి "భాగవత విష్ణుపురాణము లనే ఆధారముగా చేసుకొని మధుసూదన సరస్వతి తన భక్తి రసాయనమును కొనసాగించినాడు.

**అందులో** 'ఉపాయాః ప్రథమ స్కంధే నారదేనోపవర్ణితాః
సంక్షేపాత్తనహం వక్ష్యేభూమిభేద విభాగతః ॥
ప్రథమం మహతాం సేవాతద్దయా పాత్రతాతతః
శ్రద్ధాఽథ తేషాంధర్మేషు తతో హరిగుణశ్రుతిః ॥

తతోరత్యంకురోత్పత్తిః స్వరూపాధిగతి స్తతః
ప్రేమ వృద్ధిఃపరానందే తస్యాథ స్ఫురణం తతః ॥

భగవద్ధర్మ నిష్ఠాతఃస్వస్మిం స్తద్గుణశాలితా
ప్రేమ్ణోఽథ పరమాకాష్ఠేత్యుదితా భక్తిభూమికా ॥13

'మహా పురుషులసేవ, వారిదయకు పాత్రులగుట, వారొనరించు ధర్మములపై శ్రద్ధ, భగవద్గుణ శ్రవణము, భగవంతునియందు ప్రేమ ఉదయించుట, భగవత్స్వ రూపమును తెలిసికొనుట, భగవత్ప్రాప్తి, భగవద్ధర్మనిష్ఠ, తన యందాగుణములు పెంపొందించుట, భగవంతునిపై ప్రేమ పరాకాష్ఠనందుట అనునవి క్రమ క్రమముగా, ఒక దాని తర్వాత ఒకటి అలవడవలెను. వీటినన్నిటిని శాస్త్రీయోపాయనము లందురు. ఇవయన్నియు భాగవతమున వ్యాసనారద సంవాదములో వివరింపబడినవి.'

"ఇంకను నాలుగు విధముల భక్తిని చెప్పిదానిని గోపికల యందు సమన్వయింపజేసినాడు మధుసూదన సరస్వతి.

"వ్రజదేవీషుచ స్పష్టం దృష్టం రతిచతుష్టయమ్
తచ్చిత్తాలంబనత్వేనస్వచిత్తం తాదృశంభవేత్"

గోపికా స్త్రీలయందు కనపడు భక్తిని భావించినవారికి, వారిచిత్తము వలెనే తన చిత్తము గూడ మారుచున్నదని స్పష్టమగుచున్నది. మరి సాధారణమై తుచ్ఛమైన లౌకిక శృంగారమే కావ్యములయందు విభావాది రూపముగా సమర్పింపబడి, రసానందము చేకూర్చు చున్నదని ఆలంకారికులు చెప్పుచున్నారు. కాని కనపడని రూపముగల స్వామి విషయమున కేవలమానసికముగ సాగించిన ఈ శృంగారము శాశ్వత రసానందము కలిగించుననుటలో సందేహమేలేదు. అందులకే

'పరిపూర్ణ రసాక్షుద్ర రసేభ్యోభగవద్రతిః
ఖద్యోతేభ్య ఇవాదిత్యప్రభేవ బలవత్తరా॥ 15

క్షుద్రములగు కావ్య శృంగాములలో తన్మయులగు వారికి భగద్విషయక శృంగార భక్తి, మిణుగురు బూచులను చూచి అబ్బురపడు వారికి ఆదిత్య ప్రభవలె కన్పట్టగలదు." 16

భక్తిని రసమని నిరూపించిన వారిలో రూపగోస్వామి ప్రథముడు "భరతుని

తన సిద్ధాంతమును ఆధారముగ జేసికొని రాధామాధవుల నాలంబనముగా జేసికొని రాధకుం కృష్ణుని సైంగల శృంగార రూపభక్తి. రసస్వరూపమైనదని యారసజనక ప్రక్రియ నంతటిని సాంగోపాంగముగ నిరూపించుచు రూపగోస్వామి వ్రాసినగ్రన్థమే" ఉజ్జ్వల నీలమణి". "నవరసములకును మూలము మాత్రము భక్తిరసమేయని రూపగోస్వామి అభిప్రాయము."[17]

ఇంతకు ముందే పేర్కొన్నట్లు మధుసూదన సరస్వతి భక్తిరసానికి పట్టం గట్టాడు. "అనుభవమాత్రము వలననే సాక్షాత్సుఖ విరుద్ధములయిన శోక క్రోధ భయాదులకు రసత్వమంగీకృతమై యున్నది. అనుభవసిద్ధమై మిగిలిన రసములకన్న వేయిరెట్లెక్కువగా రస్యమాన మగుచున్న భక్తిరసముగాదనుటెట్లు ? రసకోవిదులు దేవాదివిషయకరతి రసము కాదని యను భావమనియుం జెప్పిరి. ఇతర దేవతా విషయక మగు రతి భావమే; ఏలన వారు క్షీణరేతసు గుటచేం బరమానందము గలుగదు. పర మాత్మ స్వరూప శ్రీకృష్ణరతి పరమానందమునకు గొంపోవును. మఱియు కాంతాది విషయకములగు నేరసములందును భగవద్రతియందువలెం బూర్ణసుఖము లేక యానందము కలుగదు. కాన వానియందుం దగిన రసపుష్టిలేదు. అవి క్షుద్రరసములు. భగవద్రతిపూర్ణ రసము. అది మిడుగురు పురుగులకన్న సూర్యకాంతియెట్లు బల వత్తరమో యట్లె మిగిలిన రసములకన్న శ్రేష్ఠతరము, బలవత్తరము.[18] ఈ భక్తి రసమునకు నాలంబన విభావము భగవంతుడు. తచ్చరిత్రలు విభావములు భగవదాకార చిత్త వృత్తియే స్థాయిభావము: అదియే భగవద్రతి. అనుభావములు తత్కాలమునం బుట్టిన నేత్రాది వికారములు; వ్యభిచారులు నిర్వేదశంకా హర్షాదులు. ఇది పరమా నంద స్వరూపమగు భక్తిరసముగాం బరిణమించును."[19]

"ప్రేమము భక్తియొక్క అపరిణత స్వరూపమని భక్తియోగులు. భక్తిని అయిదు తరగతులుగా విభజించియున్నారు. శాంతి, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావములని వానికి పేరు. ఈ పంచభావములను శ్రీకృష్ణుడు గోకులమునందు ప్రయో గించెను. తన ప్రాకృత లీలా రంగస్థలమగు గోకులమునందు శాంతభావమును, సమవయస్కులగు గోపబాలురయందును, గోవత్సములయందును దాస్యసఖ్య భావ ములను, తనకంటె వయోవృద్ధులగు గోపగోపికా జనమునందును మాతృగోగణము నందును దాస్యవాత్సల్యభావములను, దుర్లభమును, పరమమునునగు మధుర భావమును గోపకన్యా గణమునందును ప్రయోగించినట్లు పురాణములవల్ల నవగత

మగుచున్నది. ఈ మధురభావమే కాంతాసక్తియని కొందరు చెప్పుదురు. పూ ర్తములైన చతుర్విధభావలక్షణములును పంచమ భావమునందు పరిణమించ వారిసిద్ధాంతము."[20]

"A life emotion absolutely guided by love for All. is there fore the highest phase of religious life on the f of it. If emotions rule life, for all other emotions, are re subsidiary to love. Love there-fore is pre eminently the sp of life and a religious life of love All-life is necessarily most exalted of modes of religious life.

Let it be drawn heart and soul to Krishna, the he and soul of all life, and immediately it finds itself in its t element, in its eternal greatness un-alloyed joy...........

"It is superflous to observe after all that has been s that all the varieties of emotion flowing and ebbing in heart of Krishna-worshipper are no better, no worse, t different sides of one eternal glorious love of the One, lov lovable and Loved."

"The Love that the Supreme God born as Krishna evo in the hearts of His Worshippers manifested itself as l Proper in more ways."[21]

ఇట్లే భారతీయేతరులు సైతం దేవతా విషయకమైన శృంగారం భక్తి చెప్పారు. "సంవేదనమగు రస చర్వణ శుద్ధము, అక్లిష్టము, స్ఫుటమునగు ప్రేమయని, ఈ విశ్వప్రేమయే పైశద్యమునందు తీవ్రత్వముతో నభివ్యక్త మానవుల విషయమున శృంగారమని, దేవతా విషయమున భక్తియని పిలువ మన్నదని కోహెన్ (Cohen)పల్కుచున్నాడు."[22]

భగవద్భక్తిని శృంగారముగా మార్చుకొన్నవారికి ఉపాస్య వస్తువు పురుష గాన్లు, తాము స్త్రీలుగాను అనుభవమునకు వచ్చునందురు.

"సఏవ వాసుదేవోఽసౌ సాక్షాత్పురుష ఉచ్యతే
స్త్రీ ప్రాయ మితరత్సర్వం జగద్బ్రహ్మ పురస్సరమ్"
"స్వామిత్వాత్మత్వ శేషిత్వ పుంస్త్వాద్యాః స్వామినోగుణాః
స్వేభ్యో దాసత్వ దేహత్వ శేషత్వ స్త్రీత్వదాయినః"

అనుట వారి మతము."[23]

"కృష్ణ సంబంధమైన భక్తిమార్గములందెల్ల నగ్రగణ్యము-భాగవతభక్తి సంప్రదాయము. భాగవతమునందలి మధుర రసాలంబనములైన గోపికా కృష్ణులాలంబనముగా వెలసినది వల్లభాచార్యుని పుష్టి మార్గము. వల్లభసంప్రదాయమందు గోపికాకృష్ణుల దృష్టిలో నిడుకొని గోపికలకు శ్రీకృష్ణునిమీదగల మధుర రసోజ్జ్వల పరిపుష్టమైన భక్తియందలి పరిస్థితిలోని తుట్టతుది స్థాయియైన మహాభావము నాధారముగా జేసికొని రాధాకృష్ణ పరముగ వెలసినది చైతన్యుని మధురభక్తి సంప్రదాయము."[24]

"పురుషునకు నాయికాత్వము సిద్ధించునాయని సందేహింపరాదు. వైష్ణవ సంప్రదాయము నందు "పుమాన్ విష్ణురితిఖ్యాతః స్త్రీప్రాయ మితరంజగత్" అను వచనము సుప్రసిద్ధము. ఈ వచనము ఈ పద్ధతి సనాతనమని చాటుచున్నది....

"గోపికలు స్త్రీలుగావున వారికి శ్రీకృష్ణునిపైగల ప్రేమ శారీరకమనరాదు. గోవర్ధనోద్ధరణ, శరద్రాత్రిగాన, రాసక్రీడాదులన్నియు మగసిరి మొలవని ఎనిమిదేండ్ల వయసుననే సాగినవి శ్రీకృష్ణునకు. ఆ తరువాతనే మధురాగమన కంస వధాదులు...."[25] భాగవతంలో మరింత మనోహరంగా చెప్పబడింది.[26] ఇలాగా భాగవతభక్తి మధురభక్తి. ఈ భక్తిరసమని మనం విశ్వసించినప్పుడు రసానందానికి కొదవలేదు. అది దైవసంబంధమైనది. అందుకే "రసోవైసః" "రసగ్ హ్యేవాయం లబ్ధ్వా ఆనందీభవతి." ఇది వైదిక వాక్యము. పరమాత్మాను సంధానముచే సమాధి యందు యోగి చిత్తవృత్తి యనుభవించెడిది ఆత్మానుభూతి. అదే పరమానుభూతి. అదే మోక్షసాధనము. అందు బాహ్యేంద్రియ ప్రత్యక్షానుభూతి యుండదు. ఉన్నచో నది యాత్మానుభూతికాదు. బాహ్యేంద్రియ ప్రత్యక్షముల నన్నింటిని మనో న్తర్లీనము చేసి తద్వారా కేవలము మానసిక ప్రత్యక్షముగ తచ్చైతన్యమును ననుభవించుటయే పరమాత్మానుభూతి."[27] దీని నాధారంగా అన్నమాచార్యుని మధురభక్తి తత్వవిశ్లేషణ చేయవలసి ఉంది.

భక్తి మూడుదశలుగా, ఎనిమిది విధాలుగా విస్తరించిందని పెద్దలు. ఎనిమిద దైన తనయందు నాయికాత్వాన్ని ఆరోపించుకొని విషయ సుఖాత్మకముగా సాగిన సమారోపభక్తి. ఇదే అన్నమయ్య, క్షేత్రయ్య, రూపగోస్వామి, మీరాబాయి, ఒ దశలో రామకృష్ణ పరమహంస మొదలైన వారనుసరించినది. [28] దీనినే మధు భక్తి అని అంటారు.

ఇతః పూర్వమే అన్నమాచార్య వర్ణిత శృంగార రీతులను మనం గమనిం నాము. అది అనేక రీతుల కొనసాగినది అది కేవలమైహికమైన భౌతిక శృంగార కాదు. అలౌకిక శృంగారం; భగవద్భక్తిపరమైన శృంగారం. 'రసో వై సః' సిద్ధాం నికి ఇది సముచితంగా కుదురుతుంది.

"గురువుల యొద్ద చదివిన వేదాంతము, ఆళ్వారుల చరిత్రములు, భాగవ విష్ణు పురాణములందును, నారద శాండిల్యాది భక్తిసూత్రముల యందును వివరిం బడిన గోపికాభక్తియు, అన్నమయ్యకు, ఆదర్శములుగా నిలిచి, అతనిచేత శృంగా సంకీర్తనల రాశిని నిర్మింపజేసినవి. ఆళ్వారులయందు కానరాని పామర శృంగారప ఈతనియందు కానవచ్చుటకు భాగవత విష్ణుపురాణములే కారణములుగా తో చున్నవి.

"తననొక నాయికగా భావించుకొని, స్వామిని నాయకునిగా మనసున నిల కొని, పురుషుడై దొడ్డ సంసారియై తాను తనయందు పుంస్త్వమే లేనట్లు, ఆడ దనమే నిండుకొన్నట్లు అంత తన్మయీ భావముతో ఈ కీర్తనలను రచించినాడు కొన్ని పట్టుల పరిశీలించునప్పుడు భౌతిక సుఖములను రెండు చేతుల జుర్రుకొన రసిక స్త్రీలకుకూడ మనసుకందని శృంగార మర్మములను, తెచ్చిపెట్టుకొన్న నాయ కాత్వముగల ఈతడు వర్ణించుట చూడగా ఎంతయోగికైనను ఈ తన్మయీ భావమ కుదరదని యూహింపవలసియున్నది.

"తనకు ముందే సంస్కృతమున జయదేవుడు :

శ్లో॥ యది హరిస్మరణే సరసం మనో
యది విలాస కథాసు కుతూహలమ్।
మధుర కోమల కాంత పదావలీం
శృణు తదా జయదేవ సరస్వతీమ్"[29]

అని ఉపక్రమించిన గీతగోవిందములోని శృంగారముకూడ ఈతని నాకర్షించి యుండవచ్చును. ఈతని శృంగార పరమార్థమును తెలుపునట్టి రెండు మూడు పాటల నుదాహరించుచున్నాను.

### ముఖారి

ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపము మఱి
యిదిగాక వైభవం బిఁక నొకటిగలదా ? ॥పల్లవి॥

అతివ జన్మము సఫలమై పరమయోగి వలె
నితర మోహాపేక్ష లిన్నియును విడిచె
సతి కోరికలు మహాశాంతమై యిదెచూడ
సతత విజ్ఞాన వాసనవోలె నుండె ॥ఇది॥

తరుణి హృదయము కృతార్థతఁ బొంది విభుమీఁది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనో జయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ ॥ఇది॥

శ్రీ వేంకటేశ్వరునిఁ జింతించి పరతత్త్వ
భావంబు నిజముగాఁ బట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు తిరమాయ ॥ఇది॥

(శృం. సం. 12-17

### కన్నడ గౌళ

కామయాగము చేసెఁ గలికి తన
ప్రేమయే దేవతా ప్రీతిగాను ॥పల్లవి॥

బొలుపలర సురత తాంబూల రసపానంబు
నలినాక్షి సోమ పానంబుగాను

కలకలంబుల మంచి గళరవంబుల మోఁత
తలకొన్న వేదమంత్రములుగాను ॥కామ॥

పడఁతి తన విరహ తాపమునఁ బుట్టినయగ్ని
అడరి దరికొన్న హోమాగ్నిఁగాను
ఒడఁబడిక సమరతుల నుదయించిన చెమటఁ
దరియుటే యది యవభృథంబుగాను ॥కామ॥

తనర గుచముల రుచులు దంతా (త) క్షతక్రీడ
ననుపైన పశుబంధనంబుగాను
యెనసి శ్రీతిరువేంకటేశ్వరుని పొందు
ఘనమైన దివ్యభోగంబుగాను ॥కామ॥

(శృం. సం. 12-22

## వరాళి

వెలయు నీ కల్యాణవేదిగా మతిసుండి
కలికి జవ్వనపు యాగము సేసెనతఁడు ॥వల్లవి॥

మలయు నీ నాభి హోమపు గుండమునను
నెలకొన్న విరహాగ్ని నింటాఁ బోసి
పొలయు నీ నిట్టూరుపుల విసరుచును
వొలుకుఁ జెమటల నాహుతి వోసెనతఁడు ॥వెలయు॥

కదిసి నీనెన్నడిమి గగనమునందు
పొదలిన యారనే పొగ నిండఁగా
మదిరాక్షి నీ మంచి మానపుః బసవు
నదనెరిఁగి వేలిచె నతివ నీకతఁడు ॥వెలయు॥

కాటుక కన్నుల నిన్నుఁ గడునలయించి
బూటకముల చిటిపొటి సిగ్గుల
గాఁటపుఁ గరుణ వేంకటగిరి విభుఁడు
కోఁటి హోమము సేసెఁగూడి నిన్నతఁడు ॥వెలయు॥

(శృం. సం. 12-28

"పై మూడు పాటలలోని శృంగార రహస్యమును రసికులూహింపఁగలరు. మొదటిది వేదాంత పరమార్థముగ, రెండవది నాయికాకృతమైన వైదిక హోమ ప్రక్రియగా, మూడవవి నాయకా కృతమైన వైదిక హోమప్రక్రియగా వర్ణింపబడినవి. వేదములలోగూడ ఇష్టే రతి, హోమ ప్రక్రియగా వర్ణింపబడియుండుట సుప్రసిద్ధమే.

"తపము, యోగము, కర్మము అనువానికి ఇంద్రియజయము, యమనియమాది సాధనము, కాలమునాటని దీక్షయు అవసరములైనవి. వీనిలో హృదయ పరిపాకమునకంటె శ్రద్ధ, సాధనము ముఖ్యములు. భక్తియందు శ్రద్ధతోపాటు హృదయపరిపాకము, తన్మయీభావము హెచ్చు. ఆ హృదయ పరిపాకము బలిసినపుడే తన్మయీభావము సిద్ధించును. హృదయము అయస్కాంతమువలె తానను కొను వస్తువును పట్టుకొని విడువకున్నచో హృదయ పరిపాకము సిద్ధించినట్లు. ఈ భక్తి ప్రక్రియలలో కొన్ని కాయికములు, కొన్ని దైశికములు, కొన్ని మానసికములు, కొన్ని పరాశ్రయములు, కొన్ని ఆత్మార్పణ రూపములోను గలవు." 30

ఈ విధంగా అన్నమాచార్యులు నాయికగా, శ్రీవేంకటేశ్వరుడు నాయకుడుగాకల మధురభక్తి పూరితమైన ఆయన శృంగార పదాలన్నీ ఉదాహరణలే. ఇందులో జీవాత్మ పరమాత్మలో సంలీనం పొందడానికి చేసిన ప్రయత్నం స్పష్టమవుతుంది. మనోజ్ఞమైన జీవాత్మ పరమాత్మల కలయిక వర్ణితమైన పదం అత్యంత మనోహరమూనై మధురభక్తికి మకుటాయమానమై ఒప్పుతూంది.

"అదిగాక సౌభాగ్యమదిగాక వలపు
అదిగాక సుఖమింక నందరికిఁ గలదా ॥పల్లవి॥

ప్రాణవల్లభునిఁ బెడఁబాసి మరుబాణముల
ప్రాణబాధల నెగులుపడుపేటి వలపే
ప్రాణేశ్వరుఁడు దన్నుఁ బాయఁజూచిన యపుడు
ప్రాణంబు మేనిలోఁ బాయుంగవలదా ॥అది॥

ఒద్దికై ప్రియునితో నొడగూడి యుండినవు
టిద్దరై విహరించు టిదియేటి వలపే
పొద్దుపోకలకుఁ దమ పొలయలుకకూటముల
బుద్ధిలోఁ బరవశము పొందంగ వలదా ॥అది॥

చిత్తంబులోపలను శ్రీవేంకటేశ్వరుని
హత్తించి నాఁడుదానయి యుండవలదా
కొత్తయిన యిటువంటి కొదలేని సంగతుల
తత్తరము మున్నాడి తగులంగవలదా ॥అది॥

(శృం. సం. 12-230)

ఇలాగా ఎన్ని ఉదాహరణలనైనా ఇవ్వవచ్చును. మరో ఉదాహరణ. ఇందులో అన్నమాచార్యుడు నాయిక అయి చెలిని బోధిస్తున్నట్లు చిత్రితం.

"తారుకాణ నేసుకొంటే తానే నేను
యీ రీతి నవ్వుగానీ ఇంటికి రమ్మనవే ॥పల్లవి॥

చెక్కులివె చెమరించె చిత్తమెల్లాఁ జిగిరించె
కుక్కినట్టు కోరికలు కొనసాగెను
తొక్కినాఁడు నా పాపము తొలుతే సందడిలోన
యెక్కడ వరాకుపేసీ నింటికి రమ్మనవే ॥తారు॥

దప్పిదేరె పెదవుల తమకము దైవారె
కొప్పువీడి చన్నులపై కుప్పలాయను
ముప్పిరిగాఁ గట్టినాఁడు ముంజేతకంకణము
యిప్పుడేలనింపీ సిగ్గులు యింటికి రమ్మనే ॥తారు॥

ఆమూలంటి నన్నుఁగూడె అంగమెల్లాఁ బులకించె
చేయిచేయి సోఁకె యాసచిమ్మిరేఁగెను
చాయలా సన్నలా పేసచల్లె శ్రీవేంకటేశుఁడు
యీ మెడ నన్ను మన్నించీ యింటికి రమ్మనవే ॥తారు॥

(శృం. సం. 25-239)

ఇలాగా నాయిక తానే అయి భగవంతుడైన శ్రీ వేంకటేశ్వరస్వామిని తన ప్రియునిగా భావించి, శృంగార లీలావిలసాదులను భావించి, తన్మూలంగా మధుర భక్తిని ప్రకటించాడు అన్నమాచార్యుడు.

ఇందులో పైకి భౌతికమైన కాయక శృంగారంలాగానే కనిపించినా, అనంత

భక్తి భావనా బలంతో మనం అవలోకించినప్పుడే అది అలౌకిక శృంగారమనీ, భగవత్పరమైన మధురభక్తి అనీ స్పష్టమవుతుంది.

"ఈతని శృంగారములో ప్రబంధములందున్నట్లు కొంత పచ్చిదనము అక్కడక్కడ కనబడుచుండుట నిజమే. అది గీతగోవిందములో లేదా ? గోపికల విషయమున లేదా ? కృష్ణకర్ణామృతమున లేదా ? మరి వీరి శృంగారము మాత్రము మడిగట్టు కొనవలెనా ? శృంగారమన్నప్పుడు కచకుచాది వర్ణనలు, రతిలంపటములు లేక దర్భలు - రుద్రాక్షమాలలు - భస్మత్రిపుండ్రములు - తులసీదామములు-ఊర్ధ్వపుండ్రములు సాక్షాత్కరించునా? నిగనిగలాడు పట్టుచీరలంగడిలో పచ్చారి సరకులు దొరకునా ? ఎటు చూచినా కొన్ని కీర్తనలందుగల పచ్చిదనము మాత్రము మన దృష్టిలో హేయముకావచ్చు.అది తప్పనిసరి. నాయికా రూపము ధరించినఅన్నమయ్య తన ప్రాణేశ్వరుడగు వేంకటేశ్వరునితో విచ్చలవిడి సంచరింపక, మనలను జూచి భయపడి నంగి నంగిగా నటుకొనవలెనా? అన్నమయ్య కున్నంత ఆత్మార్పణ భక్తి నాయికాత్వసిద్ధి మనకున్నచో మనమీ మాట అనలేము. అంత ఆత్మార్పణశక్తి లేకుండుట మనలోని లోపమేకాని అతని లోపముకాదు. ఈతని శృంగార సంకీర్తనల రాశిలో వ్యంగ్య మర్యాదకు పడగలెత్తిన పాటలెన్నియో కలవు. అవి మనము వాడుకొనవచ్చును. పాడుకొనవచ్చును.

" 'నాయకస్య కవేశ్శ్రోతుః సమానోఽనుభవో మనః' అన్నట్లు శృంగారసంకీర్తనకర్తయగు అన్నమయ్యతో పాటు మనకు సమానానుభవము కలిగినచో అప్పుడు ఆపాటలలోని పచ్చిదనము మన కగపడదు. లౌకిక స్త్రీ పురుషులకు సంబంధించిన శృంగారము వారి అంతస్తుకు తగిన ఔచిత్యమును పాటించవలెను. భగవద్విషయమై, భగవదర్పితమై ఆత్మార్పణ సిద్ధితో సాగించిన శృంగారమునందు ఈలౌకిక మర్యాదలను పాటింపవలసిన పనిలేదు. అది ఆ అంతస్తు వారికే స్పష్టముగ అర్థము కాగలదు. " [31]

ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని అన్నమాచార్యుల మధురభక్తిని మనం మరింతగా గమనించి ఆనందించగలం.

అన్నమాచార్యుడే అలమేలుమంగగా మానసికంగా మారిపోయి పతి అయిన శ్రీ వేంకటేశునితో సంభాషిస్తున్నట్లున్నది.

"నీమహిమో నాలోన నిండిన వలపు జాడో
యేమి సేతు నన్నెప్పుడు నెడపకుమయ్యా ॥పల్లవి॥

యెనసి నీ తో నేన యెంత పకి మాటాడినా
తనియదు నా మనసు తమి యెట్టిదో
వినయముతో రెప్పలు వేయక చూచినాను
నినుపుత్తె మమతలు నిచ్చ కొత్తలు ॥నీ మ॥

చలపట్టి నీ తోను సారె సారెఁ పెనగిన
నలయదు నా మేను ఆశ యెట్టిదో
కొలువులో నీ వద్ద గూచుండి యెంత నవ్విన
తలపులో కోరికలు తరగని ధాన్యాలు ॥నీ మ॥

కరఁగి యందాకా నిన్నుఁ గాగిలించుచుండినాను
విడువవు చేతులు వేడుకెట్టిదో
అడరి శ్రీ వేంకటేశ యలమేల్ మంగను నేను
తొడరి యేలితివి రతులు తరితీపులు ॥నీ మ॥

(శృం. సం. 28-155)

ఇలాగే అన్నమాచార్యుడే నాయిక అయి చెలులతో తనకు నాయకుడైన భగవత్సన్నిధానంవల్ల కలిగిన అతిశయితమైన ఆనంద పారవశ్యాన్ని వివరిస్తున్నాడు.

"ఇన్నిటా ఘనుడు దాను యేమి చెప్పేరే
యెన్నుకొనీ నా గుణము లేమి చెప్పేరే ॥పల్లవి॥

చెంత దన చెప్పినట్టు సేసితినంటా నిదె
యేంత నన్ను బుజ్జగించీ నేమి చెప్పేరే
అంతటా దన కిచ్చక మాడితినంటా నిదె
ఇంతలో నన్ను బొగడీనేమి చెప్పేరే ॥ఇన్ని॥

వొట్టి తనపై పాటలు వొనర బాడితివంటా
యిట్టె విడెమిచ్చీని యేమి చెప్పేరే
జట్టిగా జన్నులతోడ సాము సేయించితి నంటా
యెట్టనెదుటనే మెచ్చీ నేమి చెప్పేరే ॥ఇన్ని॥

మనసు మర్మములంటా మంతన మాడితినంటా
యెనసి కౌగలించీ యేమి చెప్పేరే
చెనకి మొక్కితినంటా శ్రీ వేంకటేశ్వరుడు
యినుమడిగా మన్నించె నేమి చెప్పేరే ॥ఇన్ని॥

(శృం. సం. 29-239)

ఇందులో అన్నమాచార్యుని జీవిత రహస్య మున్నదని గౌరిపెద్ది రామసుబ్బ శర్మగారి అభిప్రాయం.[32] ఆయనను కావచ్చును. అన్నమాచార్యుడు తన వ్యక్తి గతాభిప్రాయాల్నే అభివ్యక్తి కరించాడననడంలో దోషం లేదు.

ఇదే రీతిగా తపశ్శృంగారం వర్ణితం. ఇందులో ఆత్మ పరమాత్మల కలయిక ఎంతో మనోరంజకంగా వర్ణితం.

"అవియే పో నేడు మాతోనంటి సేసే తపములు
వివరించుకొని యిద్దె విచ్చేయు మనవే ॥పల్లవి॥

కొండల కొట్టగొనల గోరమైన తపములు
పండు బిలములలోని పచ్చిమేతలు
గుండె దాకే మంత్రాల కుత్తికలో జపములు
దండకారు(ర)ణ్యాన నాడు తా జేసెగా ॥అవియే॥

యేరులలో మునుకలు యెక్కువ ఆచారాలు
ఆ రీతి మోనము తోడి యానందాలు
కోరికోరి చలివేడి కోటికోటి నేమాలు
చేరి యీ రీతి దపాలు సేసినాడుగా ॥అవియే॥

సమ్మతించ జేసిన యాసన భేదబంధాలు
వుమ్మడి యన్యోన్యపు యోగాలు
దొమ్మి శ్రీ వేంకటపతి తొల్లి సేసె నట్లనె
రమ్మని నేడును నారతి జేసెగా ॥అదియే॥

(శృం. సం. 30-190)

ఇంతకంటే మనోజ్ఞమైన ఆత్మపరమాత్మల కలయిక ఉంటుందా? తపశ్శ రాల అభేదాద్యవ సాయిగా వర్ణించి ఇది మహాయోగంగా వర్ణించడంవల్ల అన చార్యుని మధురభక్తి సుస్పష్టమవుతుంది.

ఇలాగే పరమయోగంగా ఆత్మ పరమాత్మల సంయోగంగా అన్నమాచా నాయిక అయి, భగవంతునితో తనకు అతనికి భేదంలేదని చెబుతున్నట్లుగ పదంలో. ఇది అత్యుదాత్త మధురభక్తికి మకుటాయమానమైనదనడంలో సందే లేదు: పైగా ఇది పరమయోగమట !

"ఇదియే . రమయోగ మిద్దరికి విభుఁడా
ఆదన ననిచిన ద్రిష్టాంత మాయనిపుడు ॥పల్లవి॥

వెలి మన మిద్దరము వేరై వుందుము గాని
తలఁపు లోపలను యిద్దర మొకటే
వొలసి యుద్ధములోన నొకరూపే రెండై
తెలిసినట్లనే హో ద్రిష్టాంతమిపుడు ॥ఇది॥

పేరులిద్దరికి నిట్టె భేదమైతోఁ చీగాని
తారుకాణ గుణము లిద్దరి కొకటే
కోరిన మాటొకటే కొండశలలో రెండవు
తేరి చూడనిది యేవో ద్రిష్టాంతమిపుడు ॥ఇది॥

శ్రీవేంకటేశ నీనా చేఁతవే వేరులుగాని
కేవలమిద్దరికి కాఁగిలి వొకటే
పూవు గుత్తి వొకటే పూఁవలు వేరైనట్లు
దేవ యిన్నిటికి నిదె ద్రిష్టాంత మిపుడు ॥ఇది॥

(శృం. సం. 30-2

ఇట్లు ఇతఃపూర్వమే అనేక రీతుల వివరించినట్లు ఆళ్వారుల, గోపికల ర్పణవలెనే భగవంతునికై తనను తాను అర్పించుకోవడం వల్ల కలిగిన శరీ వేరైనా భక్తుడైన ఆత్మ తాను, భగవంతుడు పరమాత్మ ఒకటేనని అన్నమాచారు నాయికగా ఊహించుకొని చిత్రించడం మధురమనోజ్ఞమైన మధురభక్తికి అత్య మకుటాయమానమైనదని విదితమవుతుంది. ఇవి అన్నమాచార్యుని మధుర

లోని వివిధ రీతులు. ఇలాగా ఎన్ని ఉదాహరణలైనా ఇవ్వవచ్చు. కానీ అన్నమాచార్యుని శృంగార సంకీర్తనలన్నీ ఇందు కుదాహరణలే అనే విషయం మరవకూడదు.

**సూచికలు :**

1. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ : సాహిత్యోపన్యాసములు - 3 క్షేత్రయ్యపద సాహిత్యము. పు. 12, 13.
2. V. Raghavan : The Great Integrators : The Saint Singers of India P. 19
3. Sri Aurobindo : The foundations of Indian culture P. 361
4. పైదే
5. ధనకుధరం వరదాచార్యులు : ఆళ్వారులు-దివ్యప్రబంధములు పు. 13, 14
6. పై 2 సూచికలోనిదే.
7. పై 3 సూచికలోనిదే. పు. 362
8. పై 2 సూచికలోనిదే పు. 25
9. తిమ్మావజ్ఝల కోదండరామయ్య : పదములు - శృంగారము; భారతి : సెప్టెంబర్ 1952 పు. 282
10. తాళ్ళపాక చిన తిరుమలాచార్యుడు : సంకీర్తన లక్షణము ప. 56.
11. డా॥ వేటూరి ఆనందమూర్తి : తాళ్ళపాక కవుల పదకవితలు - భాషా ప్రయోగ విశేషాలు - ద్వి.భా.పు. 102
12. పై.దే. పు. 104
13. మధుసూదన సరస్వతి : భక్తిరసాయనము - ప్రథమోల్లాసము 31-34
14. పైదే 2-72
15. పైదే. 2-78
16. గౌరిపెద్ది రామసుబ్బశర్మ : పీఠిక - అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు సం. 26. పు. 20-22.
17. సాహితీవాల్లభ్యము : (ముళ్ళపూడి తిమ్మరాజుగారి అభినందన సంపుటి) పు. 453, 457

18. సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి : కావ్యాలంకార సంగ్రహము
పు. 306, 307,

19. సముద్రాల రాఘవాచార్య : రాసలీల - గోపికలు : ఆంధ్రపత్రి
విక్రమ సంవత్సరాది సంచిక (1940-41) పు.

20. పైదే

21. Dr. Bhagavat Kumar Goswami, Ch. Shastri II, Emoti
life in comprehensive Devotion Suddha Bhakticult
Ancient India-Pp 382-388

22. భారతి - (అక్టోబరు 1954) పు. 236

23. పై 1వ సూచికలోనిదే పు. 17

24. పై 17వ సూచికలోనిదే పు. 432

25-26 పై 16వ సూచికలోనిదే పు. 15-21

27. రాధా : రసోపైనః : భారతి (మార్చి 1975) పు. 25.

28. పై 16వ సూచికలోనిదే. పు. 21, 22

29. గీతగోవిందము - శ్లో॥ 3

30. పై 16వ సూచికలోనిదే. పు. 23-26

31. పై.దే. పు. 27, 28

32. అన్నమాచార్య శృంగార సంకీర్తనలు : సం.29, అథస్సూచిక పు.

# 3.0 ఆధ్యాత్మికత, భక్తి, నీతి, వైరాగ్యాలు

ఇతఃపూర్వం అన్నమాచార్యుల శృంగారరీతులు, మధురభక్తిస్ఫూర్తి మన హృదయాలకు హత్తుకొన్నాయి. ఇంక అన్నమాచార్యుల ఆధ్యాత్మిక చింతనా వైవిధ్యమూ, భక్తిప్రపత్తి, నీత్యుపదేశరీతి, వైరాగ్య నిరూపణమూ ఈ ప్రకరణంలో తెలుసుకొందాము.

హైందవ మతంలో ద్వైతాద్వైత విశిష్టాద్వైతాలు ముఖ్యమైనవి. వీటికాచార్యులు మధ్వ, శంకర, రామానుజులు. సంక్షిప్తంగా ఈ మతాల లక్ష్యాలు : జీవాత్మ పరమాత్మలు ఎల్లప్పుడూ వేర్వేరని ద్వైతమత సిద్ధాంతం. జీవాత్మపరమాత్మలకు దశాభేదమేగాని వస్తుతః రెండూ ఒక్కటే అన్నది అద్వైతమత సిద్ధాంతం. జీవాత్మ పరమాత్మలు ఒక్కటే అయినప్పటికీ శరీరశరీరి భావంతో వాటి సంబంధం కూడి ఉంటుంది. శరీరి ప్రధానమూ, శాశ్వతమూను; శరీరమప్రధానమూ, అశాశ్వతమూను. కనుకనే శరీరం శరీరిని ఆశ్రయించి ఉంటుందని విశిష్టాద్వైత మత సిద్ధాంతం. ఇది శ్రీరామానుజ సిద్ధాంతం. దీన్నే మనసా, వాచా, కర్మణా - త్రికరణశుద్ధిగా - విశ్వసించి, తదుచితరీతిని అన్నమాచార్యులు శాశ్వతుడైన భగవంతునికై తన జీవితాన్నే కైంకర్యంచేసి తరించాడు. దాన్ని భగవద్భక్తిలో, రక్తిలో, ఆధ్యాత్మిక చింతనలో, నీతి వైరాగ్య ప్రబోధంలో తన సంకీర్తనలన్నిటా నిరూపించి నిత్యుడయ్యాడు అన్నమాచార్యులు.

## 3. 1 ఆధ్యాత్మికత :

గురుభక్తి పురస్సరంగా, భగవద్భక్తిని జ్ఞానమనే యజ్ఞంతోపోల్చి వైరాగ్య భావపూరితంగా అత్యంత మనోహరంగా, ఆలంకారిక శైలీవిన్యాసంతో ఆలపించాడు అన్నమాచార్యుడు-

"జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము
నానార్థములు నిన్నేనడపె మాగురుడు ॥పల్లవి॥

అలరి దేహమనేటి యాగశాలలోన
బలుపై యజ్ఞానపు పశువుబంధించి
కలసి వైరాగ్యపుకత్తులఁ గోసికోసి
వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుడు ॥జ్ఞాన॥

మొక్కుచు వైష్ణవులనే మునిసభ గూడబెట్టి
చొక్కుచు శ్రీపాదతీర్థ సోమపానము వించి
చక్కఁగా సంకీర్తన సామగానము చేసి
యిక్కువతో యజ్ఞము సేయించెఁబో మాగురుఁడు ॥జ్ఞాన॥

తదీయ్య గురుప్రసాదపు పురోడాశమిచ్చి
కొదదీర ద్వయమను కుండలంబులు వెట్టి
యెదలో శ్రీవేంకటేశు నిటు ప్రత్యక్షము చేసె
యిదివో స్వరూపదీక్ష యిచ్చెను మాగురుడు ॥జ్ఞాన॥
(అధ్యా. సం. 1

అందుకే ఈ సిద్ధాంతాన్ని వివరించా డీ సంకీర్తనల్లో-

"దేహము దానస్థిరమట దేహి చిరంతనుఁడౌనట
దేహపు మోహపు సేఁతలు తీరుట లెన్నడొకో"
(అధ్యా. సం. 1

"ఓహో దేందేం వొగి బ్రహ్మమిదియని
సాహసమున శ్రుతిచాటెడిని ॥పల్లవి॥

పరమును నపరముఁ బ్రకృతియు ననఁగా
వెరవు దెలియుటే వివేకము
పరము దేవుఁడును; అపరము జీవుఁడు,
తిరమైన ప్రకృతియె దేహము ॥ఓహో॥

జ్ఞానము జ్ఞేయము జ్ఞానగమ్యమును
పూని తెలియుటే యోగము
జ్ఞానము దేహాత్మ, జ్ఞేయము పరమాత్మ,
జ్ఞానగమ్యమే సాధించు మనసు ॥ఓహో॥

క్షరము నక్షరమును సాక్షి పురుషుఁడని
పరవిఁ దెలియుటే సాత్త్వికము

క్షరము ప్రపంచ, మక్షరము కూటస్థుఁడు,
సిరి పురుషోత్తముఁడే శ్రీ వేంకటేశుఁడు ॥ఓహో॥"

(అధ్యా. సం. 1-396)

దీన్ని మరింతగా సుస్పష్టం చేశాడు అన్నమాచార్యులు-

"దేహినిత్యుఁడు దేహము లనిత్యాలు
యీహల నా మనసా యిది మరువకుమీ ॥పల్లవి॥

గుదిఁ బాతచీరమాని కొత్త చీరఁగట్టినట్టు
ముదిమేను మాని దేహమొగిఁ గొత్తమేను మోచు
ఆదనఁ జంపఁగలేవు ఆయుధము లితని
గదిసి యగ్నియు నీరు గాలిఁ జంపఁగ లేవు ॥దేహి॥

ఈతఁడు నరకు వడఁ డీతఁడగ్నిఁ గాలఁడు
యీతఁడు నీటమునుగఁ డీతఁడు గాలిఁబోఁడు
చేతనుఁడై సర్వగతుండౌ చెలియించ దేమిటను
యీతల ననాది యీ తఁడిరవు గదలఁడు ॥దేహి॥"

(అధ్యా. సం. 7-185)

ఇది భగవద్గీతలోని శ్రీకృష్ణుని వాక్యాల్ని యథాతథంగా నిరూపిస్తుంది: "వాసాంసి జీర్ణాని............నానుశోచితు మర్హసి" (2.22-24)

అందుకే ఆభగవంతుని భజించడం. ఆ విధానాన్ని అన్నమాచార్యుడు అన్ని సంకీర్తనల్లోను ఆడిపాడి తరించాడు. ఉదాహరణకు ;

"పాడేము నేము పరమాత్మ నిన్నును
వేడుక ముప్పదిరెండువేళల రాగాలను ॥పల్లవి॥

తనువే వొళపు తలయే దండెకాయ
ఘనమైన వుర్పులు రెండుకట్టిన తాళ్ళు
మనసే నీ బద్దితాడు మరి గుణాలే జీవాళి
మొనసి పుట్టుగే మూలమైన కరడి ॥పాడేము॥"

(అధ్యా. సం. 9-178)

"నిత్యపూజ లివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి ॥పల్లవి॥

తనువే గుడియట తలయే శిఖరమట
పెనుహృదయమే హరిపీఠమటా
కనుగొన చూపులె ఘనదీపములట
తనలోపలి యంతర్యామికిని ॥నిత్య॥"

(అధ్యా. సం. 6-

"గుఱ్ఱాలఁగట్టని తేరు కొంక కెందైనాఁ బారీ
విఱ్ఱవీఁగుచుఁ దీసీని వేడుకతో జీవుఁడు ॥పల్లవి॥

సరిపియుఁదే రెండు జంట బండికండ్లు
సరవితోఁ బాదాలు బాఁపు నొగలు
గరిమఁ జూపులు రెండు గట్టిన పగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుఁడు"

(అధ్యా. సం. 6-1

శరీరాన్ని వీణగా, గుడిగా, రథంగా ఊహించి తదుచితరీతిని భగవంతుని ప
మాన్వితమూ, శాశ్వతమూ అయిన గుణాన్ని ఆడిపాడుకొన్నాడు అనేకవి
అన్నమాచార్యులు.

అన్నమాచార్యుల ఆధ్యాత్మిక ప్రతిపత్తికి ఎన్నైనా ఉదాహరణలివ్వవ
మచ్చుకు ఒకటి రెండు సంకీర్తనల్ని సమాలోచిస్తే ఈ విషయం స్పష్టమవుతు

"పోయఁగాలం బడవికిఁగాయు పెన్నెల కరటిని
శ్రీయుతుఁ దలఁచుఁడీ నరులు మాయఁబడి చెడక ॥పల్లవి॥

చిత్తము చేకూరుచుకొని చిత్తైకాగ్రతను
చిత్తజగురునిఁ దలఁచుఁడీ చిత్తజుఁ జొరనీక ॥పోయ॥

బూరుగు మాకునఁ జెందిన కీరము చందమున
ఆరయ నిష్ఫలమగు మరియన్యులఁ జేరినను ॥పోయ॥

కూరిమి మా తిరువేంకటగిరి గురు శ్రీపాదములు
చేరినవారికి భవములు చెందవెపుడు నటుగాన ॥కోయ॥

(అధ్యా. సం. 1-194)

ఇలాగా అన్నమాచార్యులు తన జీవితమంతా ఆధ్యాత్మికచింతనతో భగవంతుడైన శ్రీ వేంకటేశ్వరునికే మీదు కట్టిన మహాభక్తాగ్రేసరుడు.

## 3.2 భక్తి :

అన్నమాచార్యుల ఆధ్యాత్మ సంకీర్తనల్లో భక్తి మనకు దృగ్గోచరమై మనో నయనాలకు అందివచ్చి, అనంతానందాన్ని అందించగలుగుతూండడం స్పష్ట మవుతుంది.

'భక్తి' అన్నది 'భజ్' ధాతువు నుంచి పుట్టింది; అంటే భజించడమన్న మాట. భగవద్భజనమని అర్థం. శంకరాచార్యులవారు

"అంకోలం నిజ బీజ సంతతి రయస్కాంతోపలం సూచికా
సాధ్వీనైజ విభుం లతా క్షితిరుహం సింధుస్సరిద్వల్లభమ్
ప్రాప్నోతీహయ తథా పశుపతేః పాదారవింద ద్వయమ్
చేతోవృత్తి రుపేత్యతిష్ఠతి సదాభక్తి రుచ్యతే॥"

(శివానందలహరి - శ్లో॥ 51)

అనేశ్లోకంలోసహజంగా మనస్సుపరమేశ్వరునిపాదారవిందాలకడకు పోవడమే'భక్తి' అంటాడు. ఇది చాలా సహజంగా, సముచితంగా ఉంది. నారద మహర్షి భక్తి సూత్రాలలో "సాతస్మిన్ పరమ ప్రేమరూపా (సూ-2)-ఆ భక్తి పరమేశ్వరుని పరమ ప్రేమ రూపంగా ఉందని చెప్పబడింది. అంటే ఈశ్వరుని యెడలగలఉత్తను మైన ప్రేమయే భక్తి. దీని విశిష్టతను తెలుపడానికే ఆ మహర్షి "భక్తి రేవగరీయసీ భక్తిరేవ గరీయసీ" (సూ-81) అని స్పష్టీకరించాడు. "'భజనం అంతః కరణస్య భగవదాకారతా రూపం భక్తిః అని కానీ, 'భజ్యతే సేవ్యతే భగవదాకార మంతః కరణం క్రియతే అనయా ఇతి భక్తిః అని కానీ, 'భజ్యతే ఆస్వాద్యతే భగవాన్ నాయకత్వేన అనయా ఇతి భక్తిః' అని కానీ భక్తికి వ్యుత్పత్తి చెప్పుకొనవచ్చును. ఈ విషయమునే 'దృష్టాను శ్రావిక విషయ తృష్ణస్యవశీకార సంజ్ఞా వైరాగ్యమ్',

'తత్పరం పురుషఖ్యాతేః గుణ వైతృష్ణ్యం'[1] అనుపాతంజల యోగ సూత్రము లును వివరించుచున్నవి"[2] ఇట్లే శాండిల్య భక్తి సూత్రాలలోను "రసా పరాను రక్తి రీశ్వరే" (సూ-2) అంటే భగవంతుని యెడల పరమప్రీతి (గాఢానురాగం) భక్తి అని చెప్పబడింది. పరమ పూజ్యమైన ప్రీతియే భక్తి—భగవంతుని యెడగల ఆ పరమ పూజ్య భావమే భక్తి. ఇది తొమ్మిది విధాలు.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్॥

(భాగవతం-సప్తమస్కంధం)

భగవంతుని పవిత్ర చరిత్ర, గుణ మహిమాదుల్ని వినడం శ్రవణం; తరువాత కీర్తించడం; నామరూప స్వరూపాల్ని స్మరించడం; పాదాల్ని సేవించడం; అర్చించడం: నమస్కరించడం: సేవించడం: సామ్యగుణాల్ని పొంది సఖ్య మొనరించడం: చివరకి ఆత్మను భగవంతుని యందు చేర్చడం. ఈ తొమ్మిది విధాలైన భక్తి ఒకదానికంటె మరొకటి గొప్పదై చివరికి ఆత్మ నివేదనంతో పరిపూర్తి చెందుతుంది.

అన్నమాచార్యులు శృంగార, అధ్యాత్మ సంకీర్తనలు రచించాడు. శృంగార సంకీర్తనల్లో వివిధ శృంగార రీతులను పరిశీలించాము. భక్తితత్వ నిరూపణార్థమే అధ్యాత్మ సంకీర్తనలు రచితమయ్యాయి. అందులో నీతి వైరాగ్యాలు సైతం స్పష్ట మవుతాయి. సంకీర్తన లక్షణంలో—

"దేహాత్మేశ వివేకో
త్సాహంబును లోకవేద ధర్మాధర్మా
ద్యూహాపోహంబులు గల
యాహరి సంకీర్తనంబు లధ్యాత్మంబుల్"

(సంకీర్తన లక్షణం-ప.61)

—అని అధ్యాత్మ సంకీర్తనల్ని లక్షణాలు వివరించబడ్డాయి. దేహం, ఆత్మ, పరమాత్మలకు గల సంబంధాన్ని, లోక, వేద, ధర్మాదుల వివేచనాదుల సంబంధాన్ని వివరించే హరి సంకీర్తనలే అధ్యాత్మ సంకీర్తనలు. పైగా కలియుగంలో హరి నామ సంకీర్తనమే మోక్ష సాధనమన్న విషయం స్పష్టం.

"ధ్యాయన్ కృతే, యజన్ యజ్ఞై స్త్రేతాయామ్
ద్వాపరేఽ ర్చయన్ యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్"
(విష్ణుపురాణం-6-2-17)

దీన్ననుసరించి చిన్నన్న అన్నమాచార్య చరిత్రలో నరసింగరాయలకు అన్నమాచార్యులు బోధించినట్లున్న తీరు గమనించదగ్గది.

"మురవైరి కృత యుగమున సర్వజనులు
నిరత నిజధ్యాన నిష్ఠచే మెచ్చు;
క్రతువుల త్రేతాయుగమున; నర్చనల
బ్రతిలేని యట్టి ద్వాపరమున నలరు:
నామూడు యుగముల ధ్యానాది విధుల
నేమేమి నరులకు నిచ్చు నన్నియును
జలజోదరుడు నిజ సంకీర్తనమున
గలియుగంబున నిచ్చు గావున, నీవు
ప్రతిలేని వేంకటపతి మీద భక్తి
..................................
.................... వదలక మను"

(అన్నమాచార్య జీవిత చరిత్ర-41)

మని ఉపదేశించాడు సంకీర్తన విశిష్టతను వివరిస్తూ. అందుకే అన్నమాచార్యుడు నామ సంకీర్తనాన్ని కలియుగంలో పంచమ వేదమని, పదాలలో అనేక రీతుల సంకీర్తించాడు.

"కలియుగంబునకు గలదిదియే
వెలసిన పంచమ వేదమె కలిగె ॥పల్లవి॥

పరమగు వేదము బహుళము చదివియు
హరి నెరిగిన వారరుదనుచు
తిరువాయిమొడియై దివ్య మంత్రమై
వెలసిన పంచమ వేదమె కలిగె ॥కలి॥

బింకపు మనుజులు పెక్కులు చదివియు
సంకెదీర దెచ్చట నసుచు
సంకీర్తనమే సకల లోకముల
వేంకటేశ్వరుని వేదమె కలిగె ॥కలి॥

(అధ్యా. సం. 11, 2-60)

ఇలా విశ్వసించిన అన్నమాచార్యుడు ఈ నామ సంకీర్తన తన వేలపదాలలో సంకీర్తన చేసి చేసి తరించాడు. అందులోని మొదటి నవవిధభక్తితత్వాన్ని ఎలా ప్రస్ఫుటీకరించాడో పరిశీలిస్తే అన్నమాచార్యుల భక్తి తత్వం స్పష్టమవుతుంది.

అధ్యాత్మ పదాలు 'అగ్రామ్యారమ్య విష్ణు చరితోదారములై' ఉండాలని సంకీర్తన లక్షణంలో నిర్వచనమే ఉంది.

"వైరాగ్య వృద్ధికర గం
భీర పదశ్రేణి పొసగ నెసపుచు నగ్రా
మ్యారమ్య విష్ణు చరితో
దారములై యున్నఁ జాలు ధరణీన్వోతయున్"

(సంకీర్తన లక్షణం-ప. 60)

తదుచితరీతిని అధ్యాత్మ సంకీర్తనలు అన్నమాచార్యుడు రచించాడు. భాష లక్షణ బద్ధమై గ్రామ్యోక్తుల విరహితంగా ఉంటుంది. భక్తి ప్రధానమనీ, పైని పేర్కొన్న నవ విధ భక్తుల్ని ఒకే పదంలో అన్నమాచార్యుడు పేర్కొవడం గమనించగలం.

"నిత్య సుఖానంద మిదె నీ దాస్యము
సత్యము లేని సుఖాలు చాలఁ జాలునయ్య ॥పల్లవి॥

కన్నుఁ జూపుల సుఖము నీ పక్కని రూపె
యెన్నఁగ వీనుల సుఖమిదె నీపేరు
పన్ని నాలుక సుఖము ప్రసాదము నీ తులసి
వున్న సుఖములు తెరువొడఁ బడమయ్యా ॥నిత్య॥

తనువు తోడి సుఖము తగు నీ కైంకర్యము
మనసులో సుఖము నీ మంచి ధ్యానము

పనివి నీ యూర్పు సుఖము పాదపద్మము వాసన
యెనయని పెర సుఖమేమి సేసేనయ్యా ॥నిత్య॥

పుట్టుగుకెల్ల సుఖము పొల్లులేని నీ భక్తి
తొట్టి కోళ్ళ సుఖము పాతుర లాడుట
జట్టి శ్రీవేంకటేశ మాచనవోలి చెన్నుతపై
వొట్టుకొని మమ్మేలితివోహో మేలయ్యా ॥నిత్య॥

(అధ్యా. సం. 10-78)

ఇలా వివరించిన నవ విధ భక్తి రీతుల్ని అనేకపదాలలో అన్నమాచార్యులు రచించాడు. వాటిని క్రమంగా పరిశీలిద్దాం.

**శ్రవణం :**

"ఎన్నడుఁ జెడని యీవు లిచ్చేని మాధవుఁడు
పన్నిన యాసలితనిపై పై నిలుపవో ॥పల్లవి॥

కొన నాలుకా హరి గుణములే నుడుగవో
మనసా అతని దివ్య మహిమెంచవో
తనువా శ్రీపతి తీర్థ దాహమే కోరవో
యెనలేని అడియాన శేఁటికి నీకిఁకను ॥ఎన్నడు॥

వీనులాలా ఏపొద్దు విష్ణుకథలే వినరో
ఆనిన చేతు లితని కంది మొక్కరో
కానుక చూపులాల కమలాక్షు జూడరో
యీ నేటి పాపాలబారి నేల పడేవి (రి) కను ॥ఎన్నడు॥

(అధ్యా. సం, 10-14)

"వినరో భాగ్యము విష్ణుకథ
వెనుబల మిదివో విష్ణుకథ (అధ్యా. సం.3-355)

**కీర్తనం :**

"చాలదా బ్రహ్మమిది సంకీర్తనం మీకు
జాలెల్ల నడగించు సంకీర్తనం ॥పల్లవి॥

(అధ్యా. సం. 1-343)

పాదసేవనం :

"శ్రీమన్నారాయణ శ్రీమన్నారాయణ
శ్రీమన్నారాయణ శ్రీ పాదమే శరణు ॥పల్లవి॥
కమలాసతీ ముఖకమల కమలహిత
కమలప్రియ కమలేక్షణా
కమలాసహిత గరుడగమన శ్రీ
కమలనాభ నీ పదకమలమే శరణు ॥శ్రీమ॥
(అధ్యా.సం. 1·

"విడువ విడువనింక విష్ణుడు నీ పాదములు
కడగి సంసారవార్ధి కడుముంచు కొనిన" (అధ్యా. సం. 10·

అర్చనం :

"ఎన్ని చందములనైన నుతింతు
కన్నుల నిన్నే కనుగొంటి గాన ॥పల్లవి॥
గోవిందా యని కొలిచిన నిన్నే
శ్రీ వల్లభుడని చింతింతును
భూవిభుడవు యిదీ పునరుక్తనకు మీ
దైవ మొకడవే ధరణికి గాన ॥ఎన్ని॥
(అధ్యా. సం. 3-4

వందనం :

"ఉన్న సుద్దులేల మాకు వూర విచారములెల్ల
వెన్నునికి మొక్కుటే వేవేలు మాకు" (అధ్యా. సం. 10-2

స్మరణం :

"ఎందుకుఁ బనిగొందము యేమి సేతు మివియెల్లా
చెందిన మాకిఁక బుద్ధి చెప్పవే నారాయణా ॥పల్లవి॥
హరి నామమొకటనే అణఁగెఁ భావములు
వొరపియున్ని నామము లూరకున్నవి

సిరులిచ్చేఁ గల పెల్లా శ్రీపతి నామమొక్కటే
పెదనామము లెల్లా పెట్టెలలో నున్నివి ॥ఎందుకు॥

**దాస్యం :**

"పనిగొను వారల భాగ్యమిది
వెనక ముందరికి వివేక మొకటే ॥పల్లవి॥

..............................

అర్మిలి దుఃఖము నతి సుఖములకు గురి
కర్మ వొకటే కలది
వేమార్మి శ్రీ వేంకట గురు దైవముఁగను
ధర్మమున కతని ధ్యానమే కలది ॥పని॥

(అధ్యా. సం. 10-7)

**సఖ్యం :**

"బలువగు దన రూపము చూపెన్
కలదింతయు దన ఘనతెఱిఁగించెన్ ॥పల్లవి॥

పాండవ రక్షణ పరుడై నరునకు
నండనే తెలిపె మహామహిమ
దండివిడచి తనదయతో నర్జును
దుండగ మగటిమి నొడ బడ బలికె ॥బలు॥

మగుడఁగ కులధర్మములు బుణ్యములు
తెగి పార్థున కుపదేశించెన్
నగుచు నతనితో నానాగతులను
నిగమము నియమము నిజ మెఱిగించెన్ ॥బలు॥

వెరవుమిగుల నా విజయుని మనుమని
పరీక్షిత్తుఁ దగఁ బ్రతికించెన్
తిరు వేంకటగిరి దేవుడు దానై
గరిమల భారతకథ గలిగించెన్ ॥బలు॥

(అధ్యా. సం. 1-295)

ఆత్మనివేదనం :

అన్నమాచార్యుల భక్తిప్రపత్తి, శరణాగతి ప్రధానాంశాలన్నది ఆధ్యాత్మ సంకీర్తనలన్నింటా వ్యక్తమవుతుంది. అతని ఆధ్యాత్మ కీర్తన ఆత్మనివేదనానికి నిదర్శనాలు.

"ఇంతటః గావఁగదే యిందిరానాయక నన్ను
పంతానఁ గాకాసురునిఁ బాలించినట్లు

దించని పంచభూతాల దేహము మోచితిఁగాన
నించిన యజ్ఞానమున నిన్ను నెరఁగ
పంచేంద్రియములచేఁ బట్టు వడ్డవాఁడఁగాన
యెంచరాని పాపములే యిన్నియుఁ జేసితిని ॥ఇంత॥

మిన్నువంటి జఠరాగ్ని మింగి వున్నవాఁడఁగాన
కన్నవెల్లా వేఁడివేఁడి కిష్టపడితి
పన్నిన సంసారపుభ్రమఁ బడ్డవాఁడఁగాన
అన్నిటా దేవతలకు సరిగాఁపవైతి ॥ఇంత॥

ఆతుమలో నీ వుండే భాగ్యము గలవాఁడఁగాన
చైతన్యమున నీకు శరణంటిని
నీతితో శ్రీవేంకటేశ నీ పాలివాఁడఁగాన
బాతితో సర్వము నీ కొప్పనము సేసితివి ॥ఇంత॥"

(అధ్యా. సం. 9-

ఇలాగా అన్నమాచార్యుల భక్తితత్త్వాన్ని నవవిధ రీతుల అనేకోదాహరణ దర్శింపవీలున్నది.

పన్నిద్దరు ఆళ్వారుల భక్తితత్త్వాన్ని పునాదిగా శ్రీ మద్రామానుజులు : ద్వైత మతాన్ని నిరూపించడం వల్ల అందులో ప్రధానంగా శరణాగతి, ప్రపత్తి, దాసు, గురువు-ఆచార్యుడు మొదలైన అంశాలు ప్రముఖంగా పరిగణించబడత ఇవన్నీ అన్నమాచార్యుల అధ్యాత్మపదాల్లో మనకు విదితమవుతాయి.

**ఆత్మపరమాత్మలు :**

"కొసరనేల నా గుణములివి
రసికత నీ విన్నిటా రక్షించుకొనుమా ॥పల్లవి॥

నేరమి నాది నేరుపునీవే
దూరు నాది బంధుడవు నీవు
కోరుదు నేను కొమ్మని యిత్తువు
కారుణ్యాత్మక గతి నీవు సుమా ॥కొసర॥

నేను యాచకుడ నీవే దాతవు
దీనుడ నే బరదేవుడవు
జ్ఞానరహితుడను సర్వజ్ఞనిధివి
శ్రీనిధి యిక నను జేరి కావుమా ॥కొసర॥

అరయ నే జీవుడ నంతర్యామివి
యిరవుగ దాసుడ నేలికవు
చిరజీవిని నే శ్రీ వేంకటపతివి
వరదుడ నను జేపదలకుమా ॥కొసర॥"

(అధ్యా. సం. 10-176)

**శరణాగతి :**

"అరసి నన్ను గాచినాతనికి శరణు
పరము నిహమునేలే పతికిని శరణు ॥పల్లవి॥

వేదములు దెచ్చినట్టి విభునికి శరణు
ఆదిమూల మంచు వచ్చినతనికి శరణు
యేదెసా దానై యున్న యీతనికి శరణు
శ్రీదేవి మగడైన శ్రీపతికి శరణు ॥అరసి॥

(అధ్యా. సం. 9-85)

**ప్రపత్తి :**

"అన్నిటా నీ వంతర్యామివి అవుట ధర్మమే అయినాను
యెన్నగ నీ వొక్కడవే గతియని యెంచికొలుచుటే ప్రసన్నసంగతి ॥పల్లవి॥

యేకాంతంబున నుండినపతిని యెనసిగమించుటే సతిధర్మంబు
లోకమురచ్చలో నుండిన పతిలోఁగొని పైకొని(న)రానట్లు
యీ కొలఁదులనే సర్వదేవతల యిన్ని రూపులై నీ వున్నప్పుడు
కైకొని నిను బహుముఖములఁ గొలుచుటగాదు పతివ్రతధర్మంబు"
(అధ్యా. సం. 1-386)

## గురువు - ఆచార్యుడు

"కటకట నేమూ కర్తలము గాము
ఘటన శ్రీపతినీవే కానఁ గదవయ్యా" (అధ్యా. సం. 10-136)

"కైకొన్నకొలఁది కర్మము
వాకుచ్చి తనతోనె వగవఁగ నేలా" (అధ్యా. సం. 10-220)

## హరిదాసు :

"ఉమ్మడి కర్మములాల వుండఁజోటు మాకులేదు
యిమ్ముల నెందైనాఁ బోరో యివిలేని చోటికి"(అధ్యా. సం.10-132)

## దాసానుదాసః :

"బంటుకు బంటవుదురా పాపముగాక నీ
బంటుకు బంట్లమై బదికేమునేము" (అధ్యా. సం. 10-225)

## హరి ఒక్కడే దిక్కు :

"భావములోనా బాహ్యమునందును
గోవింద గోవింద యని కొలువవో మనసా"
(అధ్యా. సం. 9-272)

## సర్వం విష్ణుమయం :

"చేరి యశోదకు శిశు వితఁడు
ధారుణి బ్రహ్మకుఁ దండ్రియు నితఁడు" (అధ్యా. సం. 3-485)
"సర్వం విష్ణుమయం బనుభావము సత్యం సత్యం బన్నిటను
సర్వేశ్వరుఁడే పొందెటి వస్తువు శరణాగతియే వుపాయము"
(అధ్యా. సం. 10-30)

ఇలాగా విశిష్టాద్వైతం ఎన్నో విధాలుగా సమున్నతమై శ్రీ వైష్ణవులచే సమాదరించబడుతుంది. వీటికన్నిటికీ అన్నమాచార్యుల పదాలు ఉదాహరణలన్న విషయం పై ఉదాహరణలవల్ల స్పష్టం.

ఇంకా పైని పేర్కొన్నట్లు భక్తి ప్రపత్తులే వైష్ణవమతానికి పట్టుకొమ్మలు: అయినా పై పంచవిధ భక్తిత్వాలు ముఖ్యమన్న విషయం మనం మరవరాదు. శాంతం, దాస్యం, సఖ్యం, వాత్సల్యం, మధురం అనే పంచభావాలు అత్యంతావశ్యకమైనవి. ఇవి అన్నమాచార్య సంకీర్తనల్లో కోకొల్లలుగా ఉన్నాయి. ఇవి భావాలని కొందరు,[3] రతి అని మరికొందరు,[4] ఆసక్తి అని ఇంక కొందరు,[5] భక్తి అని తదితరులు[6] పేర్కొన్నా రసస్ఫూర్తిని పొందాయి. వాటిని లాక్షణికులు రసాలుగానే నిరూపించారు. ఇతఃపూర్వమే దాస్యం, సఖ్యం, భక్తిని గూర్చి తెలుసుకొన్నాము. శాంత, వాత్సల్య, మధుర రసాలు ఎలా అయ్యాయో ఉదాహరణ పూర్వకంగా తెలుసుకొందాము.

**శాంతం :**

శాంతం రసమన్న విషయం విజ్ఞులకు విదితమే. "పరాభక్తియొక్క ప్రప్రథమ రూపమే శాంతభక్తి అంటారు. భగవంతుని ఆత్మగా గ్రహించి సర్వదా అభిన్నుడై, సమదర్శుడైన, అనన్య భావమున ప్రేమించుచు అద్వైతానంద నిమగ్నుడైన బ్రహ్మజ్ఞానినే శాంత భక్తుడంటారు."[7] ఇందుకు చక్కటి ఉదాహరణ:

"నిత్యాత్ముఁడై యుండి నిత్యుఁడై వెలుఁగొందు
సత్యాత్ముడై యుండి సత్యమై తానుండు
ప్రత్యక్షమై యుండీ బ్రహ్మమై యుండు సం
స్తుత్యుఁడీ తిరువేంకటాద్రి విభుఁడు ॥పల్లవి॥

....................................

యే వేల్పు పాదయుగ మిలయు నాకాశంబు
యే వేల్పు పాదకేశాంతం బనంతంబు

యే వేల్పు నిశ్వాస మీ మహామారుతము
యే వేల్పు నిజదాసు లీషణ్యులు
యే వేల్పు సర్వేశుఁ డేవేల్పు పరమేశుఁ
డే వేల్పు భువనైక హితమనో భావకుఁడు
యే వేల్పు కడు సూక్ష్మ మే వేల్పు కడు ఘనము
ఆ వేల్పు తిరువేంకటాద్రి విభుఁడు ॥నిత్యా॥

(అధ్యా. సం. 1-7

వాత్సల్యం :

"మొత్తకురే యమ్మలాల ముద్దులాడు వీఁడే
ముత్తెము వలె నున్నాఁడు ముద్దులాడు" (శృం. సం. 4

"కానరటె పెంచరటె కటకటా బిడ్డలను.
నేను మీ వలెనే కంటి నెయ్యమైన బిడ్డని ॥పల్లవి॥

బాయటఁ బారవేసిన పాలుపెన్నలును
చేయి పెట్టకుందురా చిన్ని బిడ్డలు
మీ యిండ్లు జతనాలు మీరు సేసుకొనక
పాయక దూరేరేలే ప్రతిలేని బిడ్డని ॥కాన॥

మూసినకాఁగుల నేయి ముంగిటి పెరుగులు
ఆస పడకుందురా ఆడే బిడ్డలు
వోసరించి మోసపోక వుండలేక మీరు
పేసేరింతేసి దూరు చెప్పరాని బిడ్డని ॥కాన॥

చొక్కమైన కొప్పెరల జున్నులును
చిక్కిన విడుతురా చిన్ని బిడ్డలు
మిక్కిలి పూజలు సేసి మెచ్చించఁ దగదా
యెక్కువైన తిరువేంకటేశుమైన బిడ్డని ॥కాన॥"[8]

ఇలాగా అన్నమాచార్యుల పదాల్లోని భక్తి ఆనేక రీతుల మనం దర్శించగలవ
అతని భక్తి తత్వావిష్కరణం.

## 3.3 నీతి :

అన్నమాచార్యులు తన సంకీర్తనలన్నిటా భక్తి ప్రపత్తుల్ని ఆధ్యాత్మికతతో ప్రధానంగా ప్రతిపాదించినా, సందర్భోచితంగా నీత్యుపదేశం చేయడంలో ఎంతో ప్రాముఖ్యం వహించినట్లు విదితమవుతుంది. ఆతని పదరచనలో, భాషలో, భావంలో ప్రముఖంగా ప్రజాకవి. కనుకనే ప్రజాశ్రేయస్సు నుద్దేశించి నీతి ప్రతిపాదక సంకీర్తనలు ఆడిపాడినట్లు తెలుస్తుంది.

మనుజుడు ద్వంద్వాతీతుడై ఉండాలన్న దీ పదంలో వ్యక్తీకరించాడు అన్నమాచార్యులు; భగవంతుడే ప్రధానుడని భావం.

"ఎండగాని నీడగాని యేమైనఁగాని
కొండలరాయఁడే మాకులదైవము" (అధ్యా. సం. 1-214)

నీత్యుపదేశానికి పరాకాష్ఠ ఈ సంకీర్తన: నరుడెంత చదివినా, ఎంతవిన్నా, పాప పంకిలంలో పడిపోక సచ్ఛీల సంపన్నుడైతే ఉన్నతుడవుతాడంటాడు అన్నమాచార్యులు :

"ఎంత చదివిన నేమి వినిన తన
చింతయేలమాను సిరులేల కలుగు ॥పల్లవి॥

ఇతర దూషణములు యెడసినఁగాక
అతికాముకుఁడుగాని యప్పుడుగాక
మతిచంచలము గొంతమానినఁగాక
గతియేల కలుగు దుర్గతులేల మాను ॥ఎంత॥

పరధనముల యాస పాసినఁగాక
అరిది నిందలు లేనియప్పుడు గాక
విరసవర్తనము విడిచినఁగాక
పరమేల కలుగు నాపదలేల మాను ॥ఎంత॥

వేంకటపతి నాత్మ వెదకినఁగాక
కింక మనసునఁ దొలఁగినగాక

బొంకుమాట లెడసి పోయినఁ గాక
శంక యాల మాను జయమేల గలుగు ॥ఎంత॥
(అధ్యా. సం. 1-62)

కులం ప్రధానంగాదు గుణం ముఖ్యమని వేమన లాగానే మిక్కిలి చక్క వివరించాడు అన్నమాచార్యులు :

"ఎక్కువ కులజుఁడైన హీనకులజుఁడైన
నిక్కమెరిగిన మహానిత్యుఁడే ఘనుఁడు ॥పల్లవి॥

వేదములు చదివియును విముఖుడై హరిభక్తి
యాదరించని సోమయాజికంటె
యేదియులేని కులహీనుడైనను విష్ణు-
పాదములు సేవించు భక్తుడే ఘనుఁడు ॥ఎక్కువ॥

పరమమగు వేదాంత పఠన దొరకియు సదా
హరిభక్తిలేని సన్యాసి కంటె
సరవిమాలిన యంత్య జాతికులజుఁడైన -
నరసి విష్ణుల వెదకు నాతఁడే ఘనుఁడు ॥ఎక్కువ॥

వినియుఁజదివియును శ్రీ విభుని దాసుఁడుగాక
తనువు వేఁపుచునుండు తపసికంటె
యెనలేని శ్రీవేంకటేశు ప్రసాదాన్న -
మనుభవించిన యాతఁడప్పుడే ఘనుఁడు ॥ఎక్కువ॥
(అధ్యా. సం. 1-318

"ఏకులజుఁడేమి ఎవ్వడైననేమి
ఆకడ నాతఁడె హరినెరిగిన వాఁడు" (అధ్యా. సం. 1-292)

వీటన్నిటా శ్రీకృష్ణదేవరాయల ఆముక్తమాల్యదలోని మాలదాసరి గుర్తుకు వస్తాడు.

పరులను కొలుచుట కంటే, ఇతరులను యాచించుట కంటే హైన్యమూ దైన్యమూ లేదంటాడు అన్నమాచార్యులు.

"చీచీ నరులదేఁటి జీవనము
కాచక శ్రీహరి నీవే కరుణింతుగాక ॥పల్లవి॥

అడవిలో మృగజాతియైనఁ గావచ్చుఁ గాక
వడి నితరులఁ గొలువఁగ వచ్చునా
పుడివోని పక్షియై పుండయైనావచ్చుఁగాక
విడువ కెవ్వరినైనా వేడ వచ్చునా ॥చీచీ॥

(అధ్యా. సం. 1-387)

పిపీలికాది బ్రహ్మాండ పర్యంతమూ సర్వమూ బ్రహ్మమయమని వివరించాడు అన్నమాచార్యులు. తద్వారా సర్వసమానత్వాన్ని స్పష్టం చేస్తున్నాడు; భగవంతుని లో హెచ్చు తక్కువలు లేవు; ఉంటే, అవి మనం కల్పించుకొన్నవిమాత్రమే.

"తందనాన అహి తందనాన పురె
తందనాన భళా తందనాన ॥పల్లవి॥

బ్రహ్మ మొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మ మొకటే పరబ్రహ్మ మొకటె ॥తంద॥

కందువగు హీనాధికము లిందులేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ
ఇందులో జంతు కులమంతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తంద॥

నిండార రాజు నిద్రించు నిద్రయు నొకటే
అండనే బంటు నిద్రదియు నొకటే
మెండైన బ్రాహ్మణుఁడు మెట్టు భూమియొకటే
చండాలుఁడుండేటి సరి భూమి యొకటే ॥తంద॥

(అధ్యా. సం. 2-38[illegible])

కనుకనే అజ్ఞానంలో మునిగి, ఇతరుల కార్యమంతా తమదేనని భావించే వారిని హెచ్చరిస్తున్నాడు అన్నమాచార్యులు. బహుశః ఇది వ్యక్తిగతమైన భవమనిపిస్తుంది. సోమరిపోతులు కావద్దంటాడు ఆ మహనీయుడు.

"వెఱ్ఱులాల మీకు వేడుక గలితేను
అఱ్ఱువంచి తడుకల్లంగ రాదా ॥పల్లవి॥

ముడిచి వేసిన పువ్వు ముడువ యోగ్యము గాదు
కుడిచి వేసిన పుల్లె కుడువఁగాఁ గాదు
బడినొకరు చెప్పినఁ బ్రతి చెప్పఁబోతేను
అడతి శ్రీహరి కదీ అరుహము గాదు ॥వెఱ్ఱు॥

..............................

నేతి బీరకాయ నేయి అందులేదు
రాతినీరునికి బీరము ఇంచుకా లేదు
ఘాత బూరుగుపండు కడుపులోన దూది
యేతుల నుడుగులు యెక్కునా హరికి ॥వెఱ్ఱు॥

..............................

యెన్నఁగ శ్రీవేంకటేశుఁడాళ్ళ పాక
అన్నమాచార్యులు అకిల దిక్కులు మెచ్చ
నున్నతితోఁ బాడి రొకఁడెవ్వడో తాను
సన్న నొరసునట సమ్మతా హరికి ॥వెఱ్ఱు॥

(అధ్యా. సం. 2-494)

ఇలాగా నీత్యుపదేశం చేయడమేగాదు. ఆత్మ పరిశీలన అన్నమాచార్యులలో బహువిశిష్టంగా విదితమవుతుంది. ఇది కేవలం ఆయన ఆత్మ పరిశీలనమే గాదు. అందరికీ ఇది వారి వారి ఆత్మ పరిశీలనమే.

"ఇట్టి నా వెఱ్ఱితనము లేమని చెప్పుకొందును
నెట్టన నిందుకు నగి నీవే దయఁజూడవే ॥పల్లవి॥

(అధ్యా.సం. 2-304)

ఇంకా ఆత్మ పరిశీలన చేసుకోవడంలో పరాంకోటి అయిన సంకీర్తన అన్నమాచార్యుని జ్ఞానధన్యుని గావించినది :

"చదివితిఁ దొల్లి కొంత చదివేనింకాఁ గొంత
యెదిరి నన్నెఱఁగను యెంతైన నయ్యో ॥పల్లవి॥

వొరుల దూషింతుఁగాని వొకమారైన నా
దురిత కర్మములను దూషించను
పరుల నవ్వుదుఁ గాని పలుయోనికూపముల
నరకపు నా మేను నవ్వుకోను ॥చదీ॥

లోకులఁ గోపింతుఁ గాని లోని కామాదులనెటి
కాకరి శత్రువుల మీఁదఁ గడుఁ గోపించ
ఆకడ బుద్ధులు చెప్పే అన్యుల బోధింతుఁగాని
తేకువ నాలోని హరిఁ దెలుసుకోలేను ॥చదీ॥

యితరుల దుర్గుణము లెంచి, యెంచి రోతుగాని
మతిలో నాయాపలు మానలేను
గతిగా శ్రీవేంకటేశుఁగని బ్రతికిఁగాని
తతి నిన్నాళ్ళ దాఁకా దలపోయలేను ॥చదివి॥

(అధ్యా. సం. 10-74)

ఇలాగా ఆత్మపరిశీలనతో సముచిత రీతిని నీత్యుపదేశం గావించిన ఉత్తమ దేశికుడు అన్నమాచార్యులు.

## 3.4 వైరాగ్యం :

ఆధ్యాత్మిక చింతనాపరుడై, చక్కటి నీత్యుపదేశం గావించిన అన్నమాచార్యులు అత్యంత సముచితరీతిని వైరాగ్య నిరూపణగావించడం గమనించదగ్గ అంశం.

తనచుట్టూఉండి, తననంటి ఉన్న సమస్తమూ తనకుపకరించేదిగాదనీ, వయసు, వయసుతోపాటు కాలమూ గతించిపోతున్నాయంటూ మిక్కిలి వగజెంది, దిగులుపడిన రీతి నీ పదంలో అభివ్యక్తీకరించాడు-

"అయ్యో పోయఁ బ్రాయముఁ గాలము
ముయ్యంచు మనసుననే మోహమతినైతి ॥పల్లవి॥

చుట్టంబులా తనకు సుతులుఁ గాంతలుఁజెలులు
వట్టి యాసలఁ బెట్టు వారేకాక

నెట్టుకొని వీరు గడు నిజమనుచు హరినాత్మఁ
బెట్టనేరక వృథా పిరివీకులైతి ||అయ్యో||

తగుబంధులా తనకుఁదల్లులునుఁ దండ్రులును
వగలఁ బెట్టుచుఁ దిరుగువారేకాక
మిగుల వీరలపొందు మేలనుచు హరినాత్మఁ
దగిలించలేక చింతాపరుఁడనైతి ||అయ్యో||

అంత హితులా తనకు నన్నలునుఁ దమ్ములును
వంతువాసికి బెనఁగువారేకాక
అంతరాత్ముఁడు శ్రీవేంకటాద్రీశుఁ గొలువ కిటు
సంతకూటముల యలజడికి లోనైతి ||అయ్యో||

(అధ్యా. సం. 1-179)

ఇందులో లోకన్యాయాన్ని, తీరుతెన్నుల్ని వ్యక్తంచేసి భగవద్భక్తిపరుడై విరాగి కావడమే ముఖ్యమంటాడు. ఇలాగే సమస్త ప్రజానీకానికి తానెరిగిన వైరాగ్యాన్ని నిరూపిస్తున్నాడు; వైరాగ్య మార్గాన్ని చూపిస్తున్నాడు-

"కొండో నుయ్యో కుమతులాల
తండుముండు తట్టుముట్టు తాఁకైనఁగనుఁడీ ||పల్లవి||

(అధ్యా. సం. 1-160)

బ్రదుకాలన్న మమకారమెంతో బ్రతుకులోని కడగండ్లని గాంచినాక ఆ బ్రదుకుపై నెంత రోత గలదో విస్పష్టం చేశాడు అన్నమాచార్యులు :

"ఎనుపోతుతో నెద్దు నేరుగట్టిన యట్లు
యెనసి ముందర సాగదేఁటి బ్రదుకు ||పల్లవి||

కదలేని యాసచేఁ కరఁగి కరఁగి చిత్త-
మెడమ వంకకు వచ్చె నేఁటి బ్రదుకు
పొదపైన సమతతోఁ బొదలఁ బొదల మూస-
మిడుమపాట్లఁ బడెనేఁటి బ్రదుకు ||ఎను||

తెగదెంపులేని భ్రాంతికి(జిక్కి యాచార-
మెగసి గొందులు దూరె నే(టి బ్రదుకు
వగ(గొన్న మోహతాపము వేరుగ విజ్ఞాన-
మిగురువెట్టక మానె నే(టి బ్రదుకు ॥ఎను॥

భావింప రో(త లో(బడి పొరలెడి సౌఖ్య-
మేవగింప(డు జీవు(డేటి బ్రదుకు
శ్రీవేంకటేశుపై చిత్త మొక్కటెకాని
యేవంక సుఖము లే దే(టిబ్రదుకు ॥ఎను॥

(అధ్యా. సం. 1-156)

"ఏదితుద దీనికేది మొదలు
పాదుకొను హరిమాయ( బరగు జీవునికి ॥పల్లవి॥

(అధ్యా. సం. 1-102)

"ఏమి గలదిందు నెంతగాలంబైన
పామరపుభోగ మాపద వంటిదభయ ॥పల్లవి॥"

(అధ్యా. సం. 1-112)

అంతశ్శత్రువులైన అరిషడ్వర్గాలు మనపై అధికారం వహించి వశపరచుకొంటాయి. వాటిని జయించడానికి మార్గం భగవన్నామస్మరణమూ, శరణమూను. తద్వారా భగవంతుడు మనల్ని కాపాడి వాటిపై అధికారాన్ని కల్పిస్తాడని అలంకారిక రీతిలో మధురమంజులంగా వివరించాడు అన్నమాచార్యులు.

"కాయమనే పూరికి( గంతలు తొమ్మిదియాడు
పాయక తిరిగాడేరు పాపపు తలారులు ॥పల్లవి॥

కాము(డనియెడిరాజు గద్దె మీ(ద నుండ(గాను
దీముగోపపు ప్రధాని దిక్కులేలీని
కోమలపు జ్ఞానమెల్లా( గొల్ల(బోయ నాడనాడ
గామిడులై రింద్రియపు(గా(పు లెల్లా నిదివో ॥కాయ॥

చిత్తమనే దళవాయి చింతలనే పౌఁజు వెట్టి
యిత్తల విషయములు యెన్నికిచ్చిరి
తుత్తుమురై కోరికెల దొంగెము దేఁగఁగఁ జొచ్చె
జొత్తుల వెరగుపడి చూచీఁ బుట్టుగులు ॥కాయ॥

బలు సంసారమనేటి భండారము ఘనమాయ
కలదీగి జవ్వనపు కై జీతము
యిలలో శ్రీవేంకటేశుఁడింతలో జీవుఁడనేటి
బలువుని రాజుఁజేసి పాలించె నన్నును ॥కాయ॥

(అధ్యా. సం. 1-488)

సాంసారికబంధం ఓక్కిలి చెడ్డదనీ, అబంధవిముక్తి కలిగించుమనీ కోరు కొంటాడు అన్నమాచార్యులు. ఎంతో ఇందులో వైరాగ్యముంది.

"పాయపు మదముల బంధమా మము
జీయని యిఁకఁ గృపసేయఁ గదో ॥పల్లవి॥

ధనధాన్యములై తనులంపటమై
పనిగొంటివి నను బంధమా
దినదినంబు నను తీదీపులఁ బెను
గనివైతివి యిఁక గావగదో ॥పాయ॥

సతులై సుతులై చలమై కులమై
పతివైతివి వోబంధమా
రతిఁ బెరరేఁపుల రంతుల యేపుల
గతిమాలితి విక గావగదో ॥పాయ॥

పంతైపాడై బలుసంపదలై
బంటుగ నేలితి బంధమా
కంటిమిదివో వేంకటగిరిపై మా
వెంటరాక తెగి నిడువగదో ॥పాయ॥"

(అధ్యా. సం. 1-238)

భవబంధాలను తెంచుకొని ముక్తికాంతాబంధంలోకి వెళ్ళాలన్న విషయాన్ని వ్యవసాయంతో పోల్చి మనోజ్ఞంగా వైరాగ్యభావాన్ని వివరించాడు అన్నమాచార్యులు

"పంటల భాగ్యులు వీరా బహువ్యవసాయులు
అంటిముట్టి యిట్ల గాపాడుదురు ఘనులు ॥పల్లవి॥

పొత్తుల పాపమనేటి పోడు నఱికివేసి
చిత్తమనియెడు చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనే మంచి వానపదనున
విత్తుదురు హరిభక్తి వివేకులు ॥పంటల॥

కామ క్రోధాదులనే కలుపు దవ్వివేసి
వేమరు వైరాగ్యమనే వెలుగు వెట్టి
దోమటి నాచార విహుల యెరువులువేసి
వోముచున్నారు జ్ఞానపు బైరుద్యోగజనులు ॥పంటల॥

యెందు చూచిన శ్రీ వేంకటేశుడున్నాడనియెడి
అందిన చేని పంట లనుభవించి
నందడించి తమవంటి శరణాగతుల దాము
గొందిని ముకుకొందురు గురుకృప జనులు ॥పంటల॥

(అధ్యా. సం. 9-70)

మానవ జీవితమే ఒక నాటకమని అత్యంత సహజరీతిని వివరించాడు అన్నమాచార్యులు.

"ఇన్నియుఁ జదువనేల యింతా వెదకనేల
కన్ను దెరిచుటొకటి కను మూయుటొకటి" ॥పల్లవి॥

(అధ్యా. సం. 10-64)

నానాటి బదుకు నాటకము
కానక కన్నది కైవల్యము ॥పల్లవి॥

పుట్టుటయు నిజము పోవుటయు నిజము
నట్ట నడిమి పని నాటకము

యెట్టనెదుటఁ గల దీ ప్రపంచమును
కట్టఁగడపటిది కైవల్యము ॥నానాటి॥

కుడిచే దన్నము కోక చుట్టెడిది
నడుమంత్రపు పని నాటకము
వొడిఁ గట్టుకొనిన వుభయ కర్మములు
గడి దాఁటినపుడె కైవల్యము ॥నానాటి॥

తెగదు పాపమును తీరదు పుణ్యము
నగి నగి కాలము నాటకము
యెగువనె శ్రీవేంకటేశ్వరుఁ డేలిక
గగనము మీఁదిది కైవల్యము ॥నానాటి॥

(అధ్యా. సం. 9-287)

అందుకే భవబంధవిముక్తికి మూలం సర్వథా, సర్వదా హరినామ స్మరణమే దిక్కని సిద్ధాంతీకరించాడు అన్నమాచార్యులు :

"ఆఁకటి వేళల నలపైన వేళలను
తేఁకువ హరినామమే దిక్కు మఱిలేదు ॥పల్లవి॥

కొఱమాలి ఉన్నవేళ కులము చెడినవేళ
చెఱవడి వొరులచేఁ జిక్కినవేళ
వొఱపైన హరినామ మొక్కటే గతిగాక
మఱచి తప్పినసైన మఱిలేదు తెరఁగు ॥ఆకటి॥

ఆపద వచ్చిన వేళ యారడి బడినవేళ
పాపపు వేళల భయపడిన వేళ
వోపినంత హరినామ మొక్కటే గతిగాక
మాపు దాకా బొరలిన మరిలేదు తెఱగు ॥ఆకటి॥

(అధ్యా. స. 1-158)

ఈ విధంగా వైరాగ్య నిరూపణం తన సంకీర్తనల్లో పలుకుబడులుగా పదేపదే చెప్పి జీవన్ముక్తులు కావడానికి మార్గోపదేశం చేశాడు మానవులకు అన్నమాచార్యులు.

ఇంతేగాక సంసారంపై ఎంత విరక్తుడో ఈ సంకీర్తనలో వ్యక్తీకరించాడు ఆచార్యులు :

"సడిఁబెట్టెఁగటకటా సంసారము చూడు
జడధి లోపలి యీత సంసారము ॥పల్లవి॥

జమునోరిలో బ్రదుకు సంసారము చూడ
చమురు దీసిన దివ్వె సంసారము
సమయించు జెనుదెవులు సంసారము చూడ
సమరంబులో నునికి సంసారము ॥సడి॥

సందిగట్టిన తాను సంసారము చూడ
సందికంతలతోన సంసారము
చందురుని జీవనము సంసారము చూడ
చంద మేవలె నుండు సంసారము ॥సడి॥

చలువలోపలికి వేఁడి సంసారము చూడ
జలపూతబంగారు సంసారము
యిలలోన దిరువేంకటేశ నీ దాసులకు
చలువలకు గడు జలువ సంసారము ॥సడి॥

(అధ్యా. సం. 1-199)

ఈ విధంగా అన్నమాచార్యునిలో ప్రవృత్తి భోగాలపై ఎంత ఆసక్తి ఉందేవో నివృత్తి భోగాలపై సైతం అంతకంటే అధికమని స్పష్టమవుతుంది. అంతే ఎంతగా భగవత్పరమైన శృంగారాది విషయాలను వర్ణించి తరించాడో ఐహిక సుఖ విముఖత్వాన్ని సైతం అంతకంటే ఎక్కువగానే ఆధ్యాత్మికత, భక్తి, నీతి, వైరాగ్య నిరూపణ మూలంగా అన్నమాచార్యులు అభివ్యక్తీకరించారు. ఈ ప్రవృత్తి, నివృత్తిభోగాలను గూర్చి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వివరించిన తీరు గమనించదగ్గది. "భోగములు ప్రవృత్తి భోగములని, నివృత్తి భోగములని రెండు విధములుగా విభజింపవచ్చును. ఎందుకనగా ప్రవృత్తి మార్గమునందుండి ప్రాపంచికములగు గృహాశయ్యాది భోగముల ననుభవించుట యందెంత యానందము గలదో యంతే - మఱియు నంతకన్న నెక్కువయే - నివృత్తి మార్గమునకుఁ జేరిన

భక్తి, త్యాగము, వైరాగ్యము, శాంతి - మొదలగువాని ననుభవించు నప్పుడును గలదు. ఆనందమనునది మనోధర్మముగాని వస్తుధర్మముగాదు. ఏ కారణము చేతఁగాని దేనియందు మనస్సు దృఢముగా లగ్నమగునో దానిననుభవించునప్పుడు మనకు నిరతిశయానందము గలుగును. అట్టి యానందమును సాధింపఁ బ్రయత్నించు టయే రసికత్వమునకు లక్షణము"[3] పై వింగడింపులో గల రహస్యం అన్నమా చార్యులకు వర్తిస్తుంది. ఆయన సన్యాసిగాదు; పెద్ద సంసారి. సంసారి ఆయ ఉండి సంసారంపై రోయడమంటే అన్నమాచార్యుల శృంగార, ఆధ్యాత్మ సంకీర్త నలలోని విశిష్టత విదితమవుతుంది. అందులో ప్రవృత్తి భోగాలపై నెంతటి ప్రత్యయమో అంతకంటే ఎక్కువగా నివృత్తి భోగాలపై ఆసక్తి గల పరమ యోగీశ్వరుడు. ఇందుకు తన గురించే వ్యక్తీకరించినా సంకుసాల నృసింహకవి పద్యం అన్నమాచార్యులకు సైతం సమంగా సమన్వయిస్తుంది. అయితే శృంగార పరంగా గాదు కాని వైరాగ్యపరంగా సంవదిస్తుంది.

"యతివిటుఁడు గాక బోవు టెట్లస్మదీయ
కావ్య శృంగార వర్ణనా కర్ణనమున
విటుఁడు యతిగాక పోరాదు వెస మదీయ
కావ్య వైరాగ్య వర్ణనాకర్ణనమున"

(కవి కర్ణరసాయనము అవ-పు. 2

నృసింహకవి కేవలం ఇతర సంబంధి విషయాలనే చెప్పాడని భావించినా, అన్నమా చార్యులు మాత్రం ప్రతిపదంలోను పైవిషయాలను త్రికరణశుద్ధిగా నిరూపించుకొన్నా డని విశ్వసించడమే సముచితం.

సూచికలు :

1. పాతంజల యోగ సూత్రములు - 1-15, 16
2. గౌరిపెద్ది రామసుబ్బశర్మ : పీఠిక : అన్నమాచార్యుడు - శృంగార సంకీర్తనలు - సం. 26. పు.
3. సముద్రాల రాఘవాచార్య : రాసలీల : గోపికలు - ఆంధ్రపత్రిక (విక్ర సంవత్సరాది సంచిక - 1940-41) పు. 129

4. Dr. Bhagavat Kumar Goswhmi, Shastri : Bhakti Cult in Ancient India - P. 390
5. డా॥ వేటూరి ఆనందమూర్తి : తాళ్ళపాక కవుల పదకవితలు - భాషా ప్రయోగ విశేషాలు. ద్వి.భా.పు. 171-174
6. ఆరుద్ర : అన్నమయ్య : సమగ్రాంధ్ర సాహిత్యం సం. IV. పు. 163-169
7. పై. దే. పు. 164
8. అన్నమాచార్య సంకీర్తనలు - ఉత్సవగాయకోప యోగార్థముధృతములు- ప. 112.
9. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ : రాయలనాటి రసికత-సారస్వతాలోకము-పు.3.

# 4.0 కవితా కామనీయకం

అన్నమాచార్యుల వేలసంఖ్యలోని సంకీర్తనలు - వేటికవే కావ్యాలు - గీతి కావ్యాలు; వీటికి ఏకసూత్రతలేదు. పైగా అధ్యాత్మ శృంగార సంకీర్తనలని ఇవి రెండు విధాలన్నది పూర్వోక్తం. లాక్షణికోక్తుల ప్రకారం ఉదాహరణలన్నిటికీ ఊలేకపోవచ్చుగాక. కానీ స్వయం సంపూర్ణాకృతిలో కవితాకామనీయకంతో ఎంతో మనోరంజకంగా, సహృదయ హృదయావర్జకంగా ఈపదాలన్నీ ఉన్నాయన డంలో సందేహం లేదు. భావుకత, చమత్కార వైభవం, వ్యంగ్యవైచిత్ర్యాలు, వర్ణనావైదగ్ధ్యం, ఆలంకారిక శైలీవిన్యాసం - ఈ లక్షణాలన్నిటిని - కవికుండ వలసిన లక్షణాలన్నింటిని పదకర్త అయిన అన్నమాచార్యులలో చూడగలం. విశ్వనాథుని 'వాక్యం రసాత్మకం కావ్య'మ్మనే నిర్వచనానికీ, జగన్నాథపండిత రాయల 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్య'మ్మనే సిద్ధాంతానికీ సమంగా సరిపోయే సంకీర్తనలు అన్నమాచార్యులవి. అందుకే అన్నమాచార్యులు ఆంధ్రపదకవికుల గురువంటే సాహసం కాదు. సహజం!

## 4.1 భావుకత :

అన్నమాచార్యుల భావుకత, ఊహాశాలిత తన్మూలంగా ప్రతిభ స్పష్టమవు తాయి. తదుచిత భాషాప్రయోగం ఆయనలోని విశిష్టతకు నిదర్శనం. కొన్ని ఉదాహరణలు.

ఏ కావ్యకవికీ తీసిపోని రీతిలో పదకర్త అన్నమాచార్యుని భావుకత, ఊహా శాలితతో కూడిన ప్రతిభాసంపద మనోజ్ఞమై ఒప్పుతూంది పదంలో :

"ఏమొకో చిగురుటధరమున యెడనెడఁ గస్తురి నిండెను
భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా ॥పల్లవి॥

కలికి చకోరాక్షికిఁ గడకన్నులు కెంపై తోఁచిన
చెలువంబిప్పుడిదేమో చింతింపరె చెలులు
నలువునఁ బ్రాణేశ్వరుపై నాఁటిన యాకొనచూపులు
నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురుగాదుగదా ॥ఏమొకో॥

పడఁతికి చనుఁగవ మెరుగులు పైపై బయ్యెద వెలుపల
కడు మించిన విధమేమో కనుగొనరే చెలులు

ఉడుగని వేడుకతో ప్రియుడొత్తిన నఖ శశిరేఖలు
వెడలఁగ వేసవికాలపు వెన్నెలకాదు గదా ॥ఏమొకొ॥

ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు
గద్దరి తిరువేంకటపతి కామిని వదనాంబుజమున
అద్దిన సురతపుఁ జెమటల అందము గాదుగదా ॥ఏమొకొ॥

(12-82)

ఇందులో భావుకత ననుసరించిన భావమూ, భావాన్ని అనుసరించిన భాషా ఒకటిని మించి మరొకటి పోటీపడుతున్నట్లు తెలుస్తుంది. అది అన్నమాచార్య ప్రతిభాసంపదకు చక్కటి నిదర్శనం. కస్తూరితో నిండిన నాయిక లేత పెదవి తన ప్రియుడికి రాసిన పత్రికలాగా ఉందని భావించడంలో ఆ ఊహాశాలిత, భావుకత-తద్వారా అన్నమాచార్యుల ప్రతిభ స్పష్టం. ఇలాగే తక్కిన చరణాల్లోను గమనించవచ్చు.

విరహిత అయిన శృంగార నాయికలోని ప్రత్యంశమూ నాయక పూజా సమన్ని, పూజాసుమమని అన్నమాచార్యులు భావిస్తున్నాడు-

"దొరకెఁగా పూజ కందువ పూజనీ-
విరహపు తనుతావి విరవాది పూజ ॥పల్లవి॥

కలికి నీ కనుచూపు కలువరేకుల పూజ
లలన నీనగవు మొల్లల పూజ
తలపోత చింత చిత్తపు గమలపు పూజ
చలివేడి వూర్పు నీ సంపంగి పూజ ॥దొరకె॥

కన్నులు జెక్కున జేయి కరపల్లవపు పూజ
తనుపులకలు జాజి ననల పూజ
తనరు నీ వలువు దొంతర పూవుల పూజ
మొనయు జెమట మల్లె మొగ్గల పూజ ॥దొరకె॥

చెనకు నీ గోళ్లే చిఱుగేదగుల పూజ
గునియుగుబ్బలు పూవుగుత్తుల పూజ
ఘనతమై గూడి వేంకటపతి, మోముసోకె
కన నీదు మోవి మంకెన పూవు పూజ ॥దొరకె॥" (12-95)

అన్నమాచార్యుల భావుకతకు పరాకాష్ఠ ఈ సంకీర్తన. ఆయన ప్రతిభా సంపద ఏపద్య కవికీ తీసిపోదని ఇది నిరూపిస్తుంది.

"అతివ జవ్వనము రాయలకు బెట్టిన (పెట్టని) కోట
పతిమదన సుఖరాజ్య భారంబు నిలుప ॥పల్లవి॥

కాంతకనుచూపు మేఘంబులోపలి మెఱుగు
కాంతుని మనంబు చీకటి వాపను
ఇంతిచక్కని వదన మిందుబింబము విభుని-
వంత కనుకోఱు కలువల జొక్కజేయు ॥అతివ॥

అలివేణి ధమ్మిల్ల మంధకారపు భూమి
కలికి రమణునకు నేకతమొసగను
పొలతికి బాహువులు పూవు దీగెల కొనలు
పొలసి ప్రాణేశు వలపుల లతల బెనచ ॥అతివ॥

పంకజానన రూపు బంగారులో నిగ్గు
వేంకటేశ్వరు సిరులు పెదచల్లగా
చింకచూపుల చెలియచేత మదనునిచేత
ఱంకా నతనినె మోహించఁజేయఁగను ॥అతివ॥" (12-112)

ఇందులో ఒక్కొక్క అంశమూ కార్యకారణ సంబంధంతో ఒప్పుతున్నాయి. ప్రియుని మదనసుఖరాజ్యాన్ని నిలుపడానికి నాయిక యౌవనమే ఒక పెట్టని కోట. ప్రియుని మనస్సులోని చీకటిని పోగొట్టడానికి నాయిక కంటిచూపే మేఘంలోని మెరుపట. తక్కినవన్నీ ఇలాగే.

కొండలు, గుట్టల్ని కాంతాపరంగా ప్రయోగించి అత్యంత మనోజ్ఞ పదరచన చేయడం, అన్నమాచార్యుల ప్రతిభకు నిదర్శనం :

"సొంపుల నీ వదనపు సోమశిలకనుమ
యింపులెల్ల జేకొనగ నిల్లు నీపతికి ॥పల్ల వి॥

కలికి నీ పిఱుదనే గద్దె రాతి కనుమ
మొలనూళ్ళ లతలనే ముంచుకొన్నది
కలయ బోకముడినే కట్లు వడ్డది
అలరు విలుతు దాడికడ్డము నీ పతికి ॥సొంపు॥

ఇదివో నీ కెమ్మోవి మెట్టుశిలకనుమ
కదిసి లేఁజిగురులఁ గప్పుకొన్నది
వదలకింతకుఁ దలవాకిలైనది
మదనుని బారికి మాఁటువో నీపతికి ॥సొంపు॥

కాంతనీ చిత్తమే వొంగలసాని కనుమ
యింతటి వేంకటపతికిరవైనది
పంతపు నీ గుబ్బలే గుబ్బలికొండకనుమ
మంతనాల కనుమాయ మగువ నీపతికి ॥సొంపు॥" (12-15)

పన్నెండు రాశులను కాంతాపరంగా చెప్పి అన్నమాచార్యులెంతగానో తన జ్యోతిశ్శాస్త్ర విజ్ఞానాన్ని తెలుపుతూ ప్రతిభను ప్రకటించాడు.

"ఇన్ని రాసులయునికి యింతి చెలువపురాశి
కన్నె నీ రాశికూటమి గలిగిన రాశి ॥పల్ల వి॥

కలికి బొమవిండ్లుగల కాంతకును ధనురాశి
మెలయు మీనాక్షికిని మీనరాశి
కులుకు కుచకుంభముల కొమ్మకును కుంభరాశి
చెలఁగు హరిమధ్యకును సింహరాశి ॥ఇన్ని॥

చిన్ని మకరాంకపుఁ బయ్యెదచేడెకు మకరరాశి
కన్నె పాయపు సతికి కన్నెరాశి
వన్నెమై పైఁడితులఁదూఁగు వనితకుఁ దులారాశి
తిన్ననివాఁడి గోళ్ళసతికి వృశ్చికరాశి ॥ఇన్ని॥

ఆముకొను నొరవుల మెరయు నతివకు వృషభరాశి
గామిడిగుట్టు మాటలసతి కర్కాటకరాశి
కోమలపు చిగురుమోవి కోమలికి మేషరాశి
ప్రేమవేంకటపతిఁ గలసె ప్రియమిథునరాశి ॥ఇన్ని॥" (12-14

శృంగారాన్ని వ్యవసాయపరంగా ఊహించడంలో అన్నమాచార్యుల ప్రతి నైపుణ్యానికి చక్కటి ఉదాహరణ :

"కొలిచి కిందెలఁ దోసుకొనుఁగాక యీ-
మలయుఁ గోరికలనెడి మాడలే పండె ॥పల్లవి॥

పొలఁతి సిగ్గులపోడు వొడిచి చిత్తపుటడవి
తొలుచూపుఁ బదనునవె దున్నఁగాను
తలపోఁత విత్తఁగా తను చెమటవానలనె
బలుపైన తమకమను బంగారువండె ॥కొలిచి॥

ఇచ్చకపుఁ జిరునగవు లింటిలోపలి తోఁట
మచ్చుఁ జేఁకల్లె పలుమరుఁ దవ్వఁగా
ఎచ్చుకుందుల నొలపు లేతపుజలము వారి
నచ్చుఁగాఁకల పైఁడినక్కులే పండె ॥కొలిచి॥

తగిలి వేంకట విభుని తనివోని కౌఁగిటను
జగడంపుఁ గూర్మి సరసము చల్లగా
నిగనిగని పలుకుఁదేనియలు వేమఱుఁబారి
నిగుడు విరహాగ్ని మాణికములే పండె ॥కొలిచి॥" (12-192

ఇలాగే నవరత్నాలు (12-208), కన్యా సౌందర్యం (12-259), పూజావిధాన (12-301) ఎంతో మనోజ్ఞంగా చిత్రించి, తనివితీర పలురీతుల తన ప్రతిభావ్య త్వాన్ని అన్నమాచార్యులు ప్రకటించుకొన్నాడు.

వివాహవిధిని ప్రతిభాపాటవమొప్ప భావించిన తీరు అనన్య సామాన్యం.

"లక్ష్మీకల్యాణము లలితోంబాడిమిదె నేము
లక్ష్మీనారాయణులే లలనయు నీవును ॥పల్లవి॥

చూపులు చూపులు మీకు సూసకము బాసికము
పూపచన్ను గుబ్బలివి పూజకుండలు
తీపులమోవి తేనెలు తీరనిమధుపర్కము
దాపుగఁ బెండ్లియాడరయ్య తగుందగు మీకును ॥లక్ష్మి॥

మాటలు మీకిద్దఱికి మంత్రములు
మేటి తలంబ్రాలు మీలోమించు నవ్వులు
గాటమైన పులకలు కప్పుర వసంతాలు
నీటునం బెండ్లాడరయ్య నెరవేర మీకును ॥లక్ష్మి॥

కౌగిలి కౌగిలి మీకు కందువపెండ్లి చవికె
పాగిన కోరికలె పావకొరళ్లు
ఆఁగిన శ్రీ వేంకటేశ అలవేలుమంగనీవు
వింగక పెండ్లాడరయ్య వేడుకాయ మాకును ॥లక్ష్మి॥ (3-105)

కాంతాయౌవన సౌందర్యాన్ని గూర్చి అన్నమాచార్యులు భావించిన తీరు ఆయన ప్రతిభకు ఎదురులేని నిదర్శనం.

"చక్కని మానిని నీసరి యెవ్వరె
యెక్కువైన నీ భావమెంచి చూడవసమా ॥పల్లవి॥

కోమలి నీకుచముల కొండలకొనల పొంత
వోముచు మించి నిలిచెనొక సింహము
కాముఁడు జఘనమనే కట్టుబండిమీఁదఁ బెట్టి
దీమముతో వేటలాడిఁదేని చూడ వసమా ॥చక్క॥

పదఁతిలేఁ జిగురుల పాదపుటడవిలోన
నడవుల యేనుగలు నటియించఁగా
తొడలరటి కంబాలతోఁగట్టి దీమములగా
బడి బడి వేటలాడ భావించ వసమా ॥చక్క॥

అంగనముఖమనేటి అంబుజాకరము పొంత
ముంగిటఁ జూపుల లేళ్ళు మోహరించఁగా

కఁ (కం)గని శ్రీవేంకటేశు కౌఁగిటి భావనఁగట్టి
చెంగటనే వేటలాడీఁ జిత్తగించ వసమా ॥చక్క॥" (30-195)

శృంగారపరంగా తన ప్రతిభాపాటవాన్ని పలువిధాల ప్రకటించిన అన్నమాచార్యులు ఆధ్యాత్మికంగా సైతం అదే రీతిగా ప్రకటించి ఉండడం గమనించదగ్గ అంశం. భగవద్భక్తితో జీవుడేవిధంగా ధర్మార్థ కామమోక్షాల్ని పొందగలడో చక్కగా భావించాడు అన్నమాచార్యులు :

"కాంతల మానమనేటి కరవటాలకు దిగె
మంతనాన జీవుఁడనే మంచిమరకాఁడు ॥పల్లవి॥

అరిది సంసారమనే యంబుధిలోనఁ దిరిగి
పురుగతి దేహపుటోడ మీఁద
నరిఁ బాపపుణ్యముల సరకులు నించుకొని
దరిచేరెజీవుఁడనే తల మరకాఁడు ॥కాంత॥

కడలేని నిట్టూర్పు గాలి విసరఁగాను
జడియుఁ గోరికలనె చాపలెత్తి
అడి బరవుగ మాయ అందునిండా నించుకొని
యెడ తాఁకె జీవుఁడనే యీమరకాఁడు ॥కాంత॥

అలర శ్రీవేంకటేశుఁడనియేటి మాలిమి
నలుదిక్కులకు నోడ నడపఁగాను
ములిగె ధర్మార్థకామ మోక్ష ధనము గడించి
పలుమాఱు జీవుఁడనే బలుమరకాఁడు ॥కాంత॥" (3-388)

ఈవిధంగా భావనలో, తద్వ్యక్తీకరణకుపరించే భాషలో తద్వారా తన ప్రతిభా పాటవ ప్రకటనలో అన్నమాచార్యులు అనన్యసామాన్యమైన పదకవిగా, సంకీర్తనాచార్యుడుగా మన ఎదుట ప్రత్యక్షమవుతున్నాడు.

## 4.1.1 చమత్కారం :

ఇదే రీతిని చమత్కారయుతంగా పదరచన చేయడంలోను కవిగా తన సామర్థ్యాన్ని ప్రకటించుకొన్నాడు అన్నమాచార్యులు.

కన్యావయావలను ఉపమిస్తూ మిక్కిలి చమత్కరించాడు అన్నమాచార్యులు:

"దైవకృతమెవ్వరికిఁ దప్పింపరాదనుచు
భావించి జనులాడుపలుకు నిజమాయ ॥పల్లవి॥

కందునకుఁ బెడఁబాసె చందురుఁడింతి ముఖ-
చందురుఁడైన నది అంపను గలిగె
కందువగు చెలినొసలి కస్తూరి తిలకమను-
కందు ముఖచంద్రునకుఁగడు నందమాయ ॥దైవ॥

జలజములు శశిచేత నలికి యీకాంతకుచ-
జలజంబులైన నది సరసనే కలిగె
లలితమగు ప్రాణవల్లభుని సురతాంకమున
విలువనేయగరాని విదియ చందురులు ॥దైవ॥

తీగె బహుజలజములకుఁ దెపలి కామినిమేనుఁ-
దీగె యయ్యిన నదియుఁదిరుగ మరికలిగె
ఈ గతులఁ దిరువేంకటేశ్వరుని సమసురత-
యోగంబు వలన ఘర్మోదకశ్రీలు ॥దైవ॥ (12-134)

నాయిక వాపోయిన తీరుల్లో చమత్కారాన్ని సాధించాడు అన్నమాచార్యుఁ
ఎంతో మనోరంజకంగా, సహృదయానందకరంగా-

"ఉండఁబాసీనడవిలో నొకతెనేను
ఎండలు నీడలు గాసి నేమి సేతురా ॥పల్లవి॥

చిన్ని నానడుము చూచి సింహము దగ్గరెనంటా
ఉన్నతపుఁ గుచముల కొరపెఁగరి
మున్నిటి వొందులు పైరమునుజేసె మృగపతి
యిన్నిటికి నగ్గమైతి నేమిసేతురా ॥ఉండ॥

నిండు నానడపుచూచి నెమలి దగ్గరవచ్చె
జిందుపేసి నారుసూచి పాముదు పాము

రెండు జూచి పగయు గూరిమి దోచెనింతలోనే
యిండె పట్టై నిన్నిటికి నేమి సేతురా ॥దండ॥

కోరి నా పలుకువిని కోవిల దగ్గరవచ్చె
చేరి నా మోవికిదె చిలుకనేఁడు
గారవాన నిన్నియు వేంకటగిరి విభుఁడా
యేరా యిట్టె చేకొంటి నేమిసేతురా ॥ఉంత॥" (12-173)

ఒకటికొకటి పరస్పర విరుద్ధాలైన వాటిని నాయిక అవయవాలపరంగా చెప్పి చమత్కరించాడు కవి :

"ఒకటికొకటిగూడ దోయమ్మ నీయందే
సకలము నెటువలె సంతసేసితివే ॥పల్లవి॥

తానకు నీ కుచాలు దంతికుంభాలఁ బోలితే
యీ నడుము సింహమునేల పోలెనే
ఆనివట్టి నీ కన్ను లంబుజాలఁ బోలితేను
ఆననము చందురుని నదియేల పోలెనే ॥ఒకటి॥

అతివ నీచేతులు బిసాంగములఁ బోలితేను
యితవై వడపు హంసనేల పోలెనే
చతురత నాసికము సంపెంగఁ బోలితేను
తతి నీకురులు తుమ్మెదలనేల పోలెనే ॥ఒకటి॥

నేవళపు నీయారు, నీలాహి బోలితేను
యీవల మేను మెరుపునేల పోలెనే
శ్రీ వేంకటేశు మోవి చిన్నికెంపులంటించి
ఆవేళ దంతాలు వజ్రాలై యెట్టుపోలెనే ॥ఒకటి॥" (30-20)

ఆయాపదజాలాన్ని ప్రయోగించి వాటికున్న అర్థంలో సార్థకంగా చమత్కరిస్తున్నాడు కవి.

"ఈకెకు నీకుఁదగు నీడు జోడులు
వాకుచ్చి మిమ్ముఁ బొగడవశమా యొరులకు ॥పల్లవి॥

జట్టిగొన్న నీ దేవులు చంద్రముఖి గనుక
అట్టె నిన్ను రామచంద్రుడనఁదగును
చుట్టమై కృష్ణ వర్ణపు చూపుల యాపెగనుక
చుట్టుకొని నిన్ను కృష్ణుడవనఁదగును ॥ఈకె॥

చందమైన వామలోచన యాపె యాఁగనక
అందరు నిన్ను వామనుఁడనఁదగును
చెంది యాకె యప్పటికిని సింహమధ్యగనక
అందినిన్ను నరసింహుఁడని పిల్వఁదగును ॥ఈకె॥

చెలువమైన యాపె శ్రీదేవి యగుఁగనక
అల శ్రీవత్సుఁడవని యాడఁదగును
అలమేల్మంగ యహిరోమావళి గలదిగన
యిలశేషాద్రి శ్రీవేంకటేశుఁడనదగును ॥ఈకె॥ (30-552)

ఇలాగా చమత్కారపూరితమైన సంకీర్తలెన్నైనా ఉదాహరించవచ్చు. ఇవి మచ్చుకుమాత్రమే.

## 4.1.2 వ్యంగ్యం :

వ్యంగ్యం సైతం అన్నమాచార్యుని సంకీర్తనల్లో చూడగలం. ఒక ఉదాహరణ :

"ఏటికి సత్యాలు సేసేవెందాఁకా నీవు
గాటముగనింకాఁ దారుకాణించవలెనా ॥పల్లవి॥

చెలియిచ్చిన పువ్వుల చెండునీచేతనున్నదీ
మలసి నీచేఁతకదీ మచ్చముగాదా
కొలఁదీ మీరఁగ తొల్లె గొల్లెతల మగఁడవు
యెలమి నీ యెడ్డతనా లెంచి చూపవలెనా ॥ఏఁటి॥

రమణి చేముద్దుటుంగరము నీవేలనున్నదీ
కొమరై నీపొందు కదీ గురుతుకాదా

తమితోడ నీవుతొల్లి ధర్మరాజు మఱదివి
గములై నీ నిజాలకు కడగురుతున్నదా ॥ఏఁటి॥

అంగనకంటసరి నేఁడద్దై పెడనున్నది
సంగతిగా నీకదె లాంచనము గాదా
చెంగట నన్నేలితివి శ్రీవేంకటేశ్వర
అంగపు నీరీతులకు నొంగానుజన్నవా ॥ఏఁటి॥" (25-15)

ఇందులో తొల్లె గొల్లెతలమగఁడవు', 'తొల్లి ధర్మరాజు మఱదివి' అనడంలో ఈ వ్యంగ్యం స్పష్టమవుతుంది.

నాయిక నాయక సాయూజ్యమందిందనీ, తన్మూలంగా నాయికను నాయకుడనే భ్రమతో మొక్కినట్లు చెలులంటున్నారు - అంటే నాయకునిపై నాయికకు గల విరహమే అంతపనిచేసిందన్న దిందలి వ్యంగ్యం.

"విరహ మొక్కిందమాయ విన్నేయవయ్యా
నిరతి నాకెఁజూచి నీవంటా మొక్కితిమి ॥పల్లవి॥

చెక్కిటిచెయ్యే చెలికి శేషపరియంకమాయ
జిక్కిన చన్నులు శంఖచక్రములాయ
వుక్కు చెమటే జలధివునికి పేసుక నిన్నుఁ
జిక్కని సతి దలఁచి సాయూజ్యమందె ॥విరహ॥

చలువ కస్తూరి పూఁత సరినీలవర్ణమాయ
మెలుఁత నిన్వెర గనిమిషదృష్టాయె
తొలుత చిగురు పాన్పు తులసి పూజాయ విన్ను
జలజాక్షి తలపోసి సాయూజ్యమందె ॥విరహ॥

సిరులఁగట్టిన తాళి శ్రీధరభావమాయ
వరుస వలపు భక్తవత్సలమాయ
యిరవై శ్రీ వేంకటేశ యింకలో నీవుగూడఁగా
పరుసవిన్నంటి వాకె సాయూజ్యమందె ॥విరహ॥" (26-191)

ఇలాగా అన్నమాచార్యుల సంకీర్తనలు కేవలం భగవంతుని పరమై, శృంగారమూ, భక్త్యాదులేగాక కవితాగుణపూరితమై ఉండడం అన్నమాచార్యుని ఉత్తమ కవిగా చేయగలిగాయి. కవికుండవలసిన భావుకత, ఊహాశాలిత, ప్రతిభ, చమత్కార, వ్యంగ్యపూరితమై అన్నమాచార్య పదాలు అత్యంతమనోహరమూ, సహృదయరంజకమూ అయి ఒప్పుతున్నాయి.

## 4.2 అపురూప భావాలు, ప్రయోగాలు :

పదకవితకు పద్యకవితతో సమానమైన పట్టంగట్టి ఉత్తమ వాగ్గేయకారుడుగా ప్రసిద్ధికెక్కాడు అన్నమాచార్యులు. అన్నమాచార్యుల పదాలలోని అపురూప భావాల్ని. అపురూప ప్రయోగాల్ని సోపపత్తికంగా పరిశీలించడం ద్వారా ఆయన లోని వింత అయిన భావాలు, ప్రయోగాలు మనకు విదితమవుతాయి. తన్మూలాన అన్నమాచార్యుల ప్రతిభా పాండిత్యాల ఔన్నత్యం అవగతమై ఆయన ప్రత్యేకత ప్రస్ఫుటమవుతుంది. అపురూపమైన ప్రయోగాల్ని ప్రయోగించడమూ అన్నమాచార్యులకు మాత్రమే అబ్బిన విశిష్ట విద్య.

### 4.2.1 'అపురూపం' శబ్దార్థం :

'అపురూపం' అనే పదానికి సూర్యరాయాంధ్ర నిఘంటువు అపూర్వమనీ, వింతఅయినదనీ అర్థాలిస్తుంది. అలాగే శబ్దరత్నాకరం అపూర్వమనే అర్థాన్నిచ్చి దానికి లక్ష్యంగా, పింగళిసూరన కళాపూర్ణోదయంలోని పద్యం ఉదాహరించింది.

"వీణియమున్టుటల్ మిగులవింతలు పెంపుడు( జిల్కబోదతో
రాణ దలిర్ప(బల్కుట కరంబపురూపమపూర్వ మెంతయున్
ప్రాణ సఖీ రహస్యముల ప్రాతియు గ్రీడలు కానివాని, యా
యేణ విలోలలోచనకు హెచ్చిన మన్మథ చేష్టలయ్యెడన్"
(కళా - 6-217)

ఇది మధురలాలస మదనావస్థా సందర్భంలోని పద్యం.

ఇక్కడ కవి 'అపురూపమపూర్వ'మని పునరుక్తి ప్రయోగం చేయడం మధురలాలస మదనావస్థ ద్విగుణీకృతమైన తీరును తెలుపడానికేనన్న విషయం స్పష్టమవుతుంది.

ఇందులో వింత అనీ, అపూర్వమనీ మనం రెండర్థాలు సైతం గ్రహించనూ వచ్చు. ఇలాగే సూర్య రాయాంధ్ర నిఘంటువులో పైపద్యంతోపాటు తెనాలి రామకృష్ణుని పాండురంగమహాత్మ్యంలోని పద్యం ఉదాహరించబడింది.

"ముత్తియముల్ ప్రవాళదళముల్ గననాకృతిఁ గూడినట్టుపై
క్రొత్తఁగనౌర వీని యపురూపపు రూపిదియంచు విస్మయో
దాత్త మనస్కులై సకల తైర్థికులుంగొనియాడ..........."

.................................................................."

(పాండు - 5-285)

ఇందులోను అపూర్వమూ, వింత అనే రెండర్థాలు స్పష్టమవుతున్నాయి. ఇంతేగాదు. అపురూపం అనే పదప్రయోగం పై అర్థాలు వచ్చేట్టు అన్నమాచార్యుడు ప్రయోగించాడు-

"అపురూపమైన మోహముదాఁచి యిటువంటి
కపటపు నటనలు గడియించనేలే ॥పల్లవి॥

కిన్నెర కాయలబోలు కిక్కిరిసినట్టి
చన్నులపై నునుఁగొంగు జారఁగా
కిన్నెరమీటుచు మంచి సన్నపునడపుతో

కన్నులు దేలఁగ మేను కదలించేవేళే ॥అపు॥" (12-128)

ఇలాగా అపురూప శబ్దానికి అపూర్వమూ, వింత అనే అర్థాలు తెలుసుకొన్నాక, అన్నమాచార్యులు సంకీర్తల్లోని భావాలు, ప్రయోగాలు ఎంతవింతగా, ఎంత అపూర్వంగా ఉన్నాయో తెలుసుకొంటే అన్నమాచార్యుల ప్రతిభా పాండిత్యాల పై దగ్ధ్యం స్పష్టమవుతుంది.

### 4.2.2 అపురూప భావాలు, ప్రయోగాలు :

అన్నమాచార్యుల సంకీర్తనల్లో అపురూపాలు అయిన భావాలు, ప్రయోగాలు కలిసిమెలిసి ఉంటాయి. అవి ఆతని భావనా వైదగ్ధ్యానికి, పాండిత్య ప్రకర్షకు నిదర్శనాలు. ఒక చక్కటి ఉదాహరణ :

"వలపారగించవమ్మ వనిత నీ
యలుక చిత్తమున కాకలి సేసినది ॥పల్లవి॥

అడియాసలనె పక్వమైన సోయగపు
వెడయలుకల మంచి వేడివేడి రుచులు
ఎడసేసి తాలిమి నెడయించి పైపైనె
పొడమిన తమకంపు బోనము పెట్టినది ॥వల॥

ఆమంచి మధురంపు అధరామృతముల
కేయూరు దావులు చల్లు వెన్నెల బయటను
కోమలపుదరి తీపు కోరిక కుమ్మరించి
భామకు ప్రాణానుపు పళ్లెము పెట్టినది ॥వల॥

కన్నులు కాంక్షలనెడి కళకళము దీరె
సన్నపు నవ్వులనెడి చనవగ్గలించెను
అన్నవపు మరపు నీకంతవింత కలిగెనే
దన్నియును దిరువేంకటేశుని మన్ననలు ॥వల॥" (12-25)

చెలికత్తె నాయికను నాయకుడైన శ్రీవేంకటేశ్వరునితో శృంగారానుభూతిని పొందుమని ఉద్బోధిస్తూంది పదంలో. ఇందులోని భావనాశక్తి (Imaginative power) అనన్య సామాన్యమేగాదు, అనుపమానం: అందుకే ఇది అపురూపమని పేర్కొ-వడం. ఆ భావనా పటిమకు తగిన రీతిలో ప్రయోగాలు సైతం అపురూపంగా తమంతతామే వచ్చి పదంలో కుదిరిపోవడం గమనించగలం. "వలపారగించవమ్మ, నీ వలపు చిత్తమున కాకలిసేసినది, మంచి వేడివేడి రుచులు, తమకంబు బోనము పెట్టినది, ప్రాణానుపు పళ్లెము పెట్టినది." అనేవి అపురూప ప్రయోగాలు. "వలపారగించడం, వలపుచిత్తానికి ఆకలిసేయడం, వేడివేడి రుచులు, తమకము బోనము పెట్టడం, ప్రాణానుపు పళ్లెము పెట్టడం' అనే ప్రయోగాలు అన్నమాచార్యుల భావనాపైశిష్ట్యానికి, తదుచిత ప్రయోగ నైపుణ్యానికి చక్కటి ఉదాహరణలు. ఇలాంటి అపురూపభావాలు, ప్రయోగాలు అన్నమాచార్యుల సాహిత్యమందంతటా గోచరిస్తాయి.

### 4.2.3 అపురూప భావాలు :

మచ్చుకు కొన్ని అన్నమాచార్యుల అపురూపభావాలు పరిశీలిస్తే అం భావనాశక్తి విదితమవుతుంది.

"ఎక్కువ నామేని జవ్వాదిందరు దెలిసేరంటా
మిక్కిలి నీమేనితావి మెరయించేవు
చక్కని వేంకటగిరి స్వామి నన్ను గూడితివి
గక్కన నాచూపు నీకు గావటి పెట్టింతునా" (12-81)

నాయిక నాయకునితో అంటున్న మాటలు. 'గక్కన నా చూపులు నీకుంగా పెట్టింతునా ?" అని నాయిక అంటుంది. 'తన చూపుల్నే నాయకునికి కావ పెట్టింతునా ?' అని ప్రశ్నిస్తుంది. ఇలాంటి భావం ఇతర కవులలో ఎక్క మనకు కనిపించదు. ఇదీ అన్నమాచార్యుల అపురూప భావానికి మరో మ తునక. ఇంకా మరికొన్ని: 'కన్నుల మొక్కుకునే. [12-83]. కుదురుగ నా గుబ్బలు [12-86], చిరునవ్వు నిప్పులు [12-90] నిట్టూర్పు ఎండలు [12- మొగమునకెగరెడి మొనవాడి గుబ్బలు [12-261], ఉప్పతిల్లు జెమట నోలలా గానె మేను/నిప్పువలె నున్న దిట్టి నెయ్యమెందుగలదా ? [12-328], చలి చూపుల జాణవట [12-349], చూడకచూచిన చూపుల చొక్కుడి చందమ [12-349], వాడికుచములు [12-358], ముంగిటి సిగ్గులు పెద్ద మోపాయంగ [3-556], కలికి అదివో కన్నుగిరిపిని పుండుగాగ జిత్తమెల్ల బొక్కజేపి [3-29], రతిమివ్వమారగించి [3-547], వలపెల్లా చల్లారబెట్ట వళమౌా [3-146], నీరు వలెం గరంగిదె నిండు మోహము [3-178], పాములై ప వలపులు నీపై భామరో వడ్డికి వారిజాక్షి (22-108], చేటదేసి వచ్చిదేనే సిగ్గ నీపై జల్లె [22-455], మొలక వెన్నెలలు మోసులెత్తె నేటికే [22-456], కొ వంటి పంతపాన [22-184], కంచపుమోవిచ్చి కూడె [22-407], పువ్వువ కోరికతో పొద్దు గడపరాదా ? [22-439], కారపు వలపు చల్లిగానీవే యి [22-449], పూవువంటిది వయసు బోగించవలెగాక [22-461], నిప్పువం విరహము నీకేలే [22-461], కొండవంటి కోపము నీకేలే [22-461], ప్రియుం లేనిమాట పెదవికి సంగరము, కారణము లేని నవ్వు కనుచూపులకొలది [26-12 మానువలె నిగిరించె మాటలకే మేను [26-185], తుమ్మెదవంటి బొమ్మలు తో

ముడినెట్టకువే [26-255], పొగరు తనకుచగిరులు పొడవాయ [26-275], మోపునుగా మాటలన్ని మూటగట్టివేసీని, కన్నుచూపు మెరుగల గంపగమ్మీ నన్ను నిట్టె [26-276], చిగురుల మాటల చిల్లులపోయెను, కారపుజూపుల కొలువలాయను [26-279], కంచువంటిది వలపు, గాలివంటిది వయసు [26-418], పన్నీరు వంటి మోహము; చిగురువంటి ప్రసూన [26-517], కన్నులగాసుకుండితి కదిసి నే మాటలకు [26-557], వానలుగానందరికి వరములొసగుచు [26-558], కన్నులనే మొక్కగా కాదని తోసేనా ]26-587], మోపులుగా జవ్వనము మూటగట్టు కొన్నదాన [24-392], వలపుల దిష్టిదాకి వాడి ఉన్నది ప్రేమోము [24-503], పొదలుఁ జన్నులనెంత పూచియది మేలే [24-555], చెక్కులిపె చెమరించె చిత్త మెల్లాఁ జిగురించె [25-239], చెలియ చూచిన చూపు చీకటిలో వెన్నెల [25-244], పడతిమేనిచాయ బంగారులోని నిగ్గు [25-244], జలజాక్షి కోరికలు చనుగవ గానులాయ, [25-301], వేడుకకు వెలలేదు, వెన్నెలకెంగిలి లేదు [2 -7], తొయ్యలి మోమే దొంతిబోనము [27-13], పొంచిలి కెమ్మోవినే బువ్వపు విందు వెట్టితి [27-40], వలపు వలువదీసి [27-104], జంటలయారతులాయ చల్లు జూపులు [28-247], దొంతినెట్టి వలపేల తూచుపెత్తేరే [28-406], చింతకాయ కజ్జాయాలు చెప్పరాని వలపులు [28-488], వలపులు వేడి వేడి [28-489], కారుకమ్మినవంటలు కాంతలవలపులు [28-492], సిగ్గులు మూటగట్టి [29-48], మాటలఁ దేనెలు గారీ మలసితే సిగ్గుదేరి! తేటలై కనుచూపులఁ దెల్లవారీ [29-424], మాయల నీ నవ్వులివి మచ్చుమేపుల వంటివి. రొక్కపు నీ మాటలు రొంపిలోని కంటాలు [29-477], వెలలేని వలపుల వేటకాడవు నీవైతే [29-517] ఎదురుచూచిన చూపు దొంతులై [30-42], తీగనవ్వు నవ్వేవు [30-171], పున్నమ వెన్నెల పొట్లపూచి కుప్పసేతురా [30 351], పువ్వువలె నీకుఁగానే పూనుక వచ్చితిదాను [30-509], వలపు చద్దిగట్టుకవచ్చితిని [30-592], అన్నిటా రతి సంటకాలందు కొంటివి [30-592], నానవెట్టి ముసిముసి నవ్వులు నవ్వినావె [31-17], గద్దించి నేరుపులెల్లా గాదెబోయవచ్చునా [31-138], వయసు మొగిలు వంటిది వట్టిజాగేల [31-252], చక్కని నవ్వులసానరాయినే [31-363], ఇద్దరి మోహరసము లేరులై పారజొచ్చె [31-377[, శిరసువంచి నవ్వులసిగ్గు కానుకలిచ్చి సరసతలను చేయిచాచగ రాగా [31-288], ఇంతలో విచారము లిట్టుండెను. పంతాలు దున్నకముందే పంటపండెను [31-328], పాలమీది మీగడ పాయము

లోని మదము [32-332], సతులకు, జలము జవ్వనపు బొలము [31-385], ప్రియములు రాసిపోసి బేరమాడినదివో [31-448], సానదిద్దేవు చూపులు సమ్మరతు లెట్టివో [31-469],

"జలజాక్షితో నీవు సరసములాడగాను
చెలరేగి చెక్కులెల్ల జెమరించెను
మొలక చన్నులు నీవు ముట్టితే గనక ఇక
వలపెల్ల జడివట్టి వానలై కురియవా ?" [31-477]

ఇలాగా ఎన్నైనా ఉదాహరించవచ్చు.

### 4.2.4 అపురూప ప్రయోగాలు :

ఇతఃపూర్వమే అపురూప భావాలతోపాటు అపురూప ప్రయోగాలు సైతం కొంతవరకు చవి చూశాము. వాటికి సంబంధించిన అంశాలు మరికొంత తెలుసు కొందాం. తద్వారా అన్నమాచార్యుల అపురూప పదప్రయోగ వైలక్షణ్యం విశదం కాగలదు.

ఇంతకు ముందుగానీ, ఆ వెనుకగానీ ఇతర కవులెవ్వరూ అన్నమాచార్యుల లాగా ప్రయోగాలు చేయలేదనడంలో అత్యుక్తి లేదు. అందుకే అవి అపురూప ప్రయోగాలయ్యాయి. కొన్ని ఉదాహరణలు :

'లేతమాయలు, పూతసిగ్గులు, యీత వలపు [12-83], కొప్పెర గుబ్బల గాఢ్లైత [12-92], వచ్చిచూపులు [12-101], మోహపుటాకటికి [12-321], కన్నుల మెచ్చుచు [12 349], వాడికుచములు [12-358], చల్లకు నవ్వు [3-215], వలపు చల్లి ని [3-46], కడునవ్వుల వాములు [22-146], తీగలు సాగెను తీరని వలపులు [22-266], పేరెను పైపై ప్రియముల వలపు [22-266], పువ్వు వంటి చెలి [26-30.], వెన్నెల సెలవితోడ [26-284], కుప్పళించే వలపు [26-342], వెన్నెల వలపు [26-383], కంచపు మోవియిచ్చి కన్నులనే నవ్వి నవ్వి [26-414], వెగ్గళించి మోవితేనె విందు పెట్టరాదా [26-542], కన్నుల నీవు మొక్కగా తావని తో పేనా [26-58.], మగువ కన్నుల మొక్కె మనసునదీవింతు [24-378], నానబెట్టి సెలవుల నవ్వు నీ ముందరపోసీ [2v-462], పలువని సిగ్గుతోడ [25-39], వలపులు దాచుకొని వద్దికిచ్చేవా ? [25-72], చెలియ

చూచిన చూపు చీకటిలో వెన్నెల [25-244]. పడతిమేనిచాయ బంగారములోని నిగ్గు [25-244], వలపుల పంటలు, తమకపు కొటారులు, వదన సామ్రాజ్యము [25-246], వెన్నెల నవ్వు నవ్వి వేడిసిగ్గురేచితి [25-397], పూవువంటి మతిదాన [27-62], వలపు వలువదీసి [27-115], దొంతివెట్టిన నవ్వులెల్లా [27-185], మేడిపంటిబోనమిది [27-192], నామోవివొత్తు [27-273], ములువాడి చన్నులు మోము కెగుర [28-212], జంటల యారతులాయ చల్లుజూపులు [28-247], వలపులు పేడి పేడి [28-489], కారుకమ్మిన పంటలు కాంతలవలపులు [28-492] కొంతవంటి మగవాడు [28-496], తీగసాగిన మోహామే [29-498], వెలలేని వలపుల వేటకాడవు [29-536], దొంతి పులకలు [29-556], ఎదురు చూచిన చూపులు దొంతులై [30-42], కుచాలుదలెత్తి చూచీ [30-132], వాముల పూరుపులకు [30-188], కానుక పెట్టెను చనుగవనీకును [31-146]",

ఇలాంటి అపురూప ప్రయోగాలు అన్నమాచార్యుల సాహిత్యమందంతటా అడుగడుగునా ప్రత్యక్షమై ఆనంద నిష్యందులై సహృదయ హృదయాలను రంజింపజేస్తాయి.

ఇలాగా అపురూపభావాలు, తత్ప్రయోగాలు గల పదాలు అన్నమాచార్యుల సంకీర్తనల్లో కోకొల్లలు. వాటిని చూచే సూక్ష్మేక్షిక, అనుభవించి ఆనందించే సహృదయత ఉండాలేగాని అనంతంగా అలాంటి ప్రయోగాలు కుప్పలు కుప్పలుగా మన ఎదుటకు వచ్చి నిలుస్తాయి. అలా రెండూ - అపురూప భావాలు, ప్రయోగాలు సమ్మిళితమై ఆయాపదాలలో విశదమై అన్నమాచార్యుల ప్రతిభాపాండిత్య ప్రకర్షల్ని స్పష్టీకరించి, ఆయన విశిష్టతను వివరిస్తాయి. మచ్చుకో ఉదాహరణ :

"అతని కొక్కతెవ్వె నీ వాలు నైతివా
సతులందరును నీసాటివారే కారా ॥పల్ల వి॥

గాదెఁ బోసుకొనే వేమే గంపముంచి వలపులు
పోదిసేసి రమణుని పొంతనీవుండి
పాదుసేసి విత్తేవేమే పదనుతో నీ సిగ్గులు
అదిగొని చన్నులు పయ్యదఁ గప్పికప్పి ॥అతని॥

నెదజల్లేవేమే వెన్నెలవంటి నవ్వులు
కొదదీర నీతని కొలువునను
తుదఁ బచరించేవేమే తొంగి తొంగినీ చూపులు
చెదరిన నీ కొప్పు చేతఁ బెట్టుకొంటాను ॥అతని॥
వాడిఁగట్టు కొనేవేమే వుబ్బరి సంతోసాలు
కడఁగి శ్రీ వేంకటేశు కౌఁగిటఁగూడి
నడుమ నీవది యేమే నన్ను నీతండిపుడేలె
అడరియలమేల్మంగనాతనీ వెలఁగవానీ ? ॥అతని॥" (29-37)

ఈ పదంలో నాయికతో తదితర నాయికలు అంటున్నమాటలు. నాయకుడు దక్షిణ నాయకుడు. అందుకే అనేక నాయికలు. ఇక్కడ పదంలోని భావాలు, ఆ భావాల్ని వ్యక్తీకరించిన తీరు అపురూపమూ, అద్భుతమూ అనంతానందదాయక మూను. అపురూపమైన భావాలు : 'గాదెఁబోసుకొనేవేమె గంపముంచి వలపులు, పాదుచేసి విత్తేవేమే పదనుతో నీ సిగ్గులు, వెదచల్లేవేమే వెన్నెలవంటి నీ సిగ్గులు, తుదఁ బచరించేవేమే తొంగి తొంగి నీ చూపులు, వాడిగట్టుకొనేవేమే వుబ్బరి నీ సంతోసాలు'; అందుకు తగిన రీతిలో ప్రయోగించడంలో అనల్ప శిల్పకళానైపుణ్యం స్పష్టమవుతుంది. తద్వారా అన్నమాచార్యులు పదకవితాపితామహుడుగానేగాక, మహాసాహిత్య శిల్పిగా మనకు ప్రత్యక్షమవుతాడు.

## 4.3 వర్ణనావైదగ్ధ్యం :

కావ్యంలో వర్ణనలు, అందునా ప్రబంధంలో అష్టాదశ వర్ణనలుండేనే కవి ప్రతిభకు, కావ్యత్వానికి గీటురాళ్ళు. పైగా 'వర్ణనా నిపుణః కవిః' అన్న లాక్షణి కోక్తి ఉండనే ఉన్నది. అదే రీతిని పదకవితా పితామహుడైన అన్నమాచార్యుల పదాల్లో సైతం ఈ వర్ణనా నైపుణ్య వైశిష్ట్య నిరూపణార్థమైన పట్టులెన్నో కనిపి స్తాయి. అవి పలురకాలు; కవి ప్రతిభాపాండిత్యాలకునికషోపలాలు. అలాంటి ఉదాహరణలు ఎన్నైనా చూడవచ్చు.

### 4.3.1 వర్ణనలు :

అన్నమాచార్యుల వర్ణనా నైపుణ్యానికి, పాండిత్య ప్రకర్షకూ, ప్రతిభా పాటవానికి, ఊహాశాలితకు చక్కటి నిదర్శనమీపదం : నాయకుని విరహార్తికి సాక్ష్యం.

"సతి చక్కదనమెంతో సరసుని మోహమెంతో
చతురిక లిందరును సరిఁజూడరమ్మా ॥పల్లవి॥

కాంతకన్నులు వ్రాసి కళలు వ్రాయఁగరాక
చింతతోఁ దలవంచెఁ జెలివిభుడు
పంతపు నడుము వ్రాసి బయలు వ్రాయగరాక
కొంత తడవున్నరనె గోమలిప్రాణేశుడు ॥సతి॥

కలికికుచాలు వ్రాసి కఠినము వ్రాయలేక
తలపోయ దొడగె బంతపు విభుడు
నలినాక్షి మోము వ్రాసి నవ్వులు వ్రాయగరాక
నిలువున బెరగందె నెలత రమణుడు ॥సతి॥

వనిత కాగిట దన్ను వ్రాసి రతివ్రాయలేక
తను వెల్ల మఱచెను తమకమున
వెనకముందర వ్రాసి పేడుక వ్రాయగరాక
చినుకు జెమటవ్రాసె శ్రీవేంకటేశుడు ॥సతి॥" (29-590)

ఇందులో నాయిక 'కుచాలు' చిత్రించి వాటి కాఠిన్యాన్ని, ముఖాన్ని చిత్రించి నవ్వు నీ చిత్రించలేకపోయాడని వర్ణించిన తీరు అమోఘం; అపురూపం.

ప్రబంధ నాయికా వర్ణనలో కచకుచాదుల విరివిగా వర్ణించడం పరిపాటే! కానీ అన్నమాచార్యులు అలాంటి వర్ణన తన పదాల్లో చేసినా ఎంతో ఔచితీసహంగా చేసి తన ప్రత్యేకతను విశిష్టతను నిలుపుకొన్నాడు :. కొన్ని ఉదాహరణలు.

"క్షీరాబ్ధి కన్యకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు (యకును) నీరాజనం ॥పల్లవి॥

జలజాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥క్షీరా॥

చరణ కిసలయములకు సకియరంభోరులకు
నిరతమగు ముత్తేల నీరాజనం

అరిది జఘనంబునకు నతివ నిజ (నత) నాభికిని
నిరత నానావర్ణ నీరాజనం ॥క్షీరా॥

పగటు శ్రీ వేంకటేశు పట్టపు రాణియై
నెగడు సతి కళలకును నీరాజనం
జగతి నలమేల్మంగ చక్కఁదనములకెల్ల
నిగుడు నిజశోభనపు నీరాజనం ॥క్షీరా॥" (26-295)

ఇందులో శ్రీ మహాలక్ష్మి వర్ణన మనోహరం : అనితర సాధ్యం.

నాయికా సౌందర్యానికి అలంకారాలనూ చక్కగా సముచిత రీతిని క్రమంగా వివరిస్తున్నాడు అన్నమాచార్యులు ఔచిత్య సహితంగా :

"చింతాపరంపరలు చిత్తంబునకుఁదొడవు
ఇంతి సౌభాగ్యంబులిన్నిటికిఁ దొడవు ॥పల్లవి॥

కలికి నెమ్మోమునకుఁ గబరీ భరముతొడవు
తళుకుఁజూపులు చక్కఁదనమునకుఁ దొడవు
ఎలమి చెక్కుల మించులిరువంకలకుఁ దొడవు
మొలకనగవులు నొబగు మురిపెముల తొడవు ॥చింతా॥

కరమూల రుచులు బంగారంబునకుఁ దొడవు
గురిగాని కౌఁదీగె గుబ్బలకుఁ దొడవు
సిరిదొలకు జఘనంబు చిన్నినడపుల దొడవు
నిరతంపుఁ బాదములు నిలువునకుఁ దొడవు ॥చింతా॥

శ్రీ వేంకటేశుకృప చెలియకెప్పుడుఁ దొడవు
భావ సంగతులకును బరవశమె తొడవు
ఈ వెలఁది నునుఁ బలుకులించు విలుతుని తొడవు
లావణ్యములకు నీలలన దాఁ దొడవు ॥చింతా॥" (12-131)

ఈ పదం అంత్యప్రాసానుప్రాణితమై ఎంతో మనోహరంగా భావం, భావానికి తగిన భాషా, తదుచితమైన ప్రతిభాసమున్మేషమైన రచనా వైదగ్ధ్యం వర్ణనా నైపుణ్యం అన్నమాచార్యులకే దక్కిన మహాఘనత.

ఇలాంటిదే మరో ఉదాహరణ :

కన్నవారెవ్వరు నేఁడు కాంతజవ్వనమిది
పన్నిన విభుఁడ నీభాగ్య మాయఁగాక ॥పల్లవి॥

పట్టబసయేది పడఁతి నడుము నేఁడు
బిట్టబిసులవు అందుభావనే కాదా
అట్టిట్టనఁగనేది అంగన తురుము నేఁడు
పుట్టు మేఘమిట మింటిపొడనేగాదా ॥కన్న॥

మెంచఁగ జోటేది యింతికనుచూపులివి
కంచుమిచ్చులట చెప్పకథలేకాదా
పొంచి దాఁచఁ జోటేది పొలతి కుచములివి
పెంచెపుజక్కవలట బెదరేపే కావా ॥కన్న॥

తలపోఁత యేది కాంతకు శ్రీ వేంకటపతి
వలపట మతిపరవశమే కాదా
తలఁగ జోటేది తడబడే రతులలో
పలుకుఁ బంతములెల్ల పదరుసే కాదా ॥కన్న॥" (30-143)

ఇలాగా ఎన్నైనా ఉదాహరించవచ్చు.

ఇలాగే నాయికా రూప-సౌందర్య-భావాలను సముచితంగా వర్ణించగలడు అన్నమాచార్యులు :

"వలపేడఁ గలిగెనే వామలోచనకు దీని
వలపించినటువంటి వాడింకనెవ్వఁడో ॥పల్లవి॥

సిరులు గల మోమెల్ల ఓరునవ్వుఁగనుదోయి
విరిపైన వురమెల్ల పేఁకమైన గుబ్బలు
తరుణికి పెనకెల్లఁ దురుము పిఱుదులును మంచి-
విరతంబునడపెల్ల నిండుమురిపెములు ॥వల॥

జలజాక్షి నిలుపెల్ల చక్కదనముల పోగు
కలికి తనమెల్లఁ గన్నులపండువు

కలకంఠి వయసెల్ల గడు(గోమలము దీని-
పలు(కుచేనియలెల్ల పంచదార కుప్పలు ॥వల॥

చెలువైన మోమెల్ల చిలుక వోట్లు దీని-
కలదేహ మింతయును గస్తూరి వాసనలు
అలరించె( దిరువేంకటాధీశ్వరు(డు దీని-
తలపెల్ల విభునిలో దా(గున్న కరువు ॥వల॥" (12-365)

విరహసంతప్త అయిన నాయికాభావాన్ని అన్నమాచార్యులు అత్యంత మనోహరంగా, సహృదయరంజకంగా వర్ణించాడు.

"ఎవ్వరుగలరమ్మ యిక నాకు
నెవ్వగలలో( జిత్తము నెలకొన్నదిపుడు ॥పల్లవి॥

మనసుకోరిక దీని మానిపెదనంటినా
వొనగూడి మనసు నావొద్దలేదు
పెన(గి తమకము వాపెదనంటినా మేన
అనయము పెరపు దానై యున్నదిపుడు ॥ఎవ్వరు॥

చింత తాలిముల ముంచెదనంటినా మేన
సంతాపములు సేయ( జలపట్టెను
అంతరంగము నాదీ యంటినా నెలవున
సంతతము నాత(డే జట్టిగొనెనిపుడు ॥ఎవ్వరు॥

సింగారపు మేను నా చేతికి లోనంటివా
అంగవించి పరవశమై యున్నది
యింగితమెరిగి వేంకటేశుడు నాకంటినా
కంగినన్ను( గారించి కలసెనిపుడు ॥ఎవ్వరు॥" (12-287)

విరహతప్త అయిన నాయికపరంగా అనేక రీతుల అభేదాధ్యవసాయిగా వివిధ రీతుల వర్ణించి తరించాడు అన్నమాచార్యులు.

వియోగినికి యోగికిని అభేదాధ్యవసాయి వర్ణన (1217): శృంగారానికి యోగానికి అభేదంగా వర్ణన (12-223)

ఇదే రీతి "యాగం" అభేదంగా నాయకపరంగా పైతం వర్ణించాడు అన్నమాచార్యులు.

"వెలయు నీ కల్యాణ వేదిగా మతినుండి
కలికి జవ్వనపు యాగము సేసెనతఁడు ॥పల్లవి॥

మలయు నీనాభి హోమపు గుండమునను
నెలనొన్న విరహాగ్ని నింపాఁబోసి
పొలయు నీ నిట్టూరుపుల విసరుచును
వొలుకుఁ జెమటల నాహుతి వోసెనతడు ॥వెలయు॥

కదిసి నీనెన్నడిమి గగనమునందు
పొదలిన యారనే పొగ నిండఁగా
మదిరాక్షి నీ మంచి మానపు బశువు
నదనెరిఁగి వేలిచెనతివ నీకతడు ॥వెలయు॥

కొటుక కన్నుల నిన్నుగడునలయించి
బూటకముల చిటిపొటి సిగ్గుల
గాఁటపు గరుణ వేంకటగిరి విభుఁడు
కోటి హోమము పేసె గూడినిన్నతడు ॥వెలయు॥

నాయికా విరహానికీ తపస్సుకు అభేదాద్యవసాయి వర్ణన :

"తగిలినమను లేయాతని గందురంటా
మగువ యెవ్వరితోడ మాటాడదిపుడు ॥పల్లవి॥

అతుల నిరాహారులాతనికిఁ బ్రియులంటా
అతివ నిన్నటినుండి యారగించను
తతినదపుల నుండి తపసు లేయతనికి
హితులంటా వనములో నెడయ దీ తరుణి ॥తగిలి॥

తలకొన్న యతనిపై తలపే పరమంటా
చెలియ చెక్కిటనున్న చెయి దియ్యదు

వలనైన యాతఁడు దేవతల కొడయఁడంటా
కలికి రేయిఁబగలు కనుమయ్యదిప్పుడు ॥తగిలి॥

అడరిజలములోన నతఁడుండునంటా
వడియు జెమట దుడువదు మేనను
కడు మంచియతడు వేంకటగిరి విభుడంటా
పడతి యాతనినె గుబ్బలనొత్తీనిపుడు ॥తగిలి॥ (12-6)

ఇలాగే శృంగారమూ - పూజ అభేదాద్వ్యవసాయిగా వర్ణితం :

"చెలి పలుగోకులే నీ సింగారము
అలరె నీ కిన్నియును అవధారు నేఁడు ॥పల్లవి॥

అంగన నిన్ను గూడగనటు నీపై వడిసేటి-
అంగపు జెమట నీకునభిషేకము
వుంగిటి గొప్పు విరులు వుపరిసురత వేళ
సంగతి రాలేటి చల్లుపేదపూజ ॥చెలి॥

నించిన కాగిటిలోన నెలత నిట్టూర్పుగాలి
అంచులు మోవ విసరే చూల వట్టాలు
అంచెల మర్మము సోఁకనాడుకొనే మాటలు
కాంచనపు గిన్నెలతో కప్పురబాగాలు ॥చెలి॥

వనిత విడెము తోడ వంచిన మోవితేనె
ననుపైన నీకు మహా నైవేద్యము
మొనసి శ్రీ వేంకటేశ యిన్నియుఁ గలిగె నీకు
మొనగోరి మాచేతి మొక్కు లిందవయ్యా ॥చెలి॥" (25-531)

ఇలాంటిదే మనోహరమూ, సహృదయ నిష్యందమూ అయిన మరో వర్ణన :

"ప్రతిలేని పూజ దలపఁగ గోటి మణుగులై
అతివ పరవశము బ్రహ్మానందమాయ ॥పల్లవి॥
మాని నీమణి మనసు నుంచియాసనమాయ-
నానంద బాష్పజల మర్ఘ్యాదులాయ-

మీనాక్షి కనుదోయి మించుదీపము లాయ-
నానన సుధారసంబభిషేకమాయ ॥ప్రతి॥

మగువ చిరునవ్వులే మంచి క్రొవ్విరులాయ
తగుమేని తావి చందనములందుటాయ
నిగనిగని తనుకాంతి నీరాజనంబాయ
జగడంపుటలుకలుపచారంబులాయ ॥ప్రతి॥

ననుపైన పొందులే నైవేద్య తతులాయ
తనివోని వేడుకలు తాంబూలమాయ
వనిత తిరువేంకటేశ్వరుని కౌఁగిటఁ జేయు-
వినయ వివరంబులరవిరి మొక్కులాయ ॥ప్రతి॥" (12-301)

**ఇంకో పదంలో** మానసపూజ - ఆత్మపరమాత్మునికై - చేసే రీతి అత్యంత మనోజ్ఞంగా వర్ణితం :

"భోగము నేను నీకు, భోగివి నీవు
శ్రీ గురుఁడ విన్నిటాను చిత్తగించు నన్నును ॥పల్లవి॥

చక్కని జన్మపు సంసార వృక్షమునకు
పక్కన (వ) ఫలము నీవు భావించఁగా
మక్కువఁ గర్మమనేటి మత్తగజమునకును
యెక్కిన మావటీఁడవు యెంచఁగ నీవు ॥భోగ॥

నెట్టన దేహమనేటి నిర్మల రాజ్యమునకు
పట్టమేలుచుండిన భూపతివి నీవే
దిట్టమైన చిత్తమనే తేజిగుఱ్ఱమునకు
వొట్టుక రేవంతుఁడవు వుపమింపనీవు ॥భోగ॥

సంతతమైన భక్తి చంద్రోదయమునకు
రంతులఁ జెలగు సముద్రమవు నీవు
చెంతల శ్రీవేంకటేశ జీవుఁడనే మేడలోన
అంతర్యామివి నీవు అంకెలఁ జూచినను ॥భోగ॥" (2-274)

నాయికా నాయకులేకమైపోవడమే పరమయోగమని అన్నమాచార్యులు ఎంతో ఔచిత్యంతో అభివర్ణించి తరించాడు. తానే నాయిక అయి భగవదైక్యం చెంది అదే పరమయోగమని మనసార భావించిన తీరు విదితమవుతుంది. ఆత్మపరమాత్మ లొక్కటే అనే అంశాన్ని వివరిస్తున్నాడు అన్నమాచార్యులు.

"ఇదియే పరమయోగ మిద్దరికి విభుఁడా
అదన ననిచిన ద్రిష్టాంతమాయ నిపుడు ॥పల్లవి॥

వెలి మనమిద్దరము వేరై వుండుముగాని
తలఁపు లోపలను యిద్దర మొకటే
వొలిసి యుద్ధములోన నొకటూసే రెంటై
తెలిసినట్లనే పో ద్రిష్టాంతమిపుడు ॥ఇదియే॥

పేరు లిద్దరికి నిట్టె భేదమై తోఁచెఁగాని
తారుకాణ గుణము లిద్దరి కొకటే
కోరిన మాటొకటే కొండశిలలో రెండవు
తేరిచూడవిది యేడో ద్రిష్టాంతమిపుడు ॥ఇదియే॥

శ్రీ వేంకటేశ నీనాచేఁతలే వేరుగాని
కేవలమిద్దరికి కాఁగిలి వొకటే
పూవుగుత్తి వొకటే పూఁవలు వేరైనట్లు
తేవయిన్నిటికి నిదె ద్రిష్టాంతమిపుడు ॥ఇదియే॥" (30-206)

ఇదిలో ఉండగా నాయికకు నాయకునిపైగల ప్రేమకును, వ్యవసాయానికీ అభేదాద్వ్యవసాయిగా వర్ణించి తనకు గల సమస్త విషయాల అనుభవపూర్వకమైన నిశిత పరిశీలనా దృష్టిని స్పష్టంచేశాడు అన్నమాచార్యులు :

"ఏమి చేసేవిచ్చటను ఇంతి నిన్నుఁ బిలిచీని
ప్రేమములు కణజాల బెట్టుకొందువు రావయ్యా ॥పల్లవి॥

చెలియ చెమటలను చిత్తడివాన గురిసె
బలుపుగా వలపుల పంటలు పండీ

కలిమి మీరి చన్నులు కనకపురాసులాయ
కొంచికోరుగొందువు కొటారుకు రావయ్యా ।।ఏమి।।

వుడివోని తమనిపుటూర్పులనే తూరుపెత్తె
కడలేని ప్రియాసలగాదెలఁబోసె
యెడయని పయ్యెదనే ఇల్లారుగాఁ బెట్టె
కడలేని రతుల కంగాణింతువు రావయ్యా ।।ఏమి।।

హొలప సిగ్గుల పాలపొంగలిగాఁ బెట్టె
వెలయఁగాఁగిలి నీకు విడిదిసేసె
అలమేలు మంగ పతివైన శ్రీ వేంకటేశ్వర
కలిసితి విట్టె వచ్చి కాణాచాయ రావయ్యా ।।ఏమి।।" (28-320)

ప్రబంధాలలో అష్టాదశవర్ణనల్లో ఋతువర్ణన ప్రాముఖ్యం వహిస్తుంది. కవి వర్ణనా నైపుణ్యానికి చక్కటి నిదర్శనమవుతుంది. ఆముక్తమాల్యదలో శ్రీకృష్ణదేవరాయల ప్రతిభా పాండిత్యాలకీ ఋతువర్ణనమే నికషోపలమన్న అంశం విద్వల్లోకమెరిగినదే. కాళిదాస ఋతుసంహారం మొదలుకొని తెలుగు ఋతువుల వరకు అనేక రచనలు వెలిగాయి. వాటన్నిటా కవి ప్రతిభా, ప్రకృతి పరిశీలనాదక్షతా విస్పష్టమవుతున్నాయి. అలాగే పదకవితా పితామహుడైన అన్నమాచార్యులు తన పదాల్లో సందర్భోచితంగా ఒకే పదంలో షడృతువర్ణన ఔచిత్యశోభితంగా చేయడం ఆయన ప్రతిభా, ప్రకృతి పరిశీలనా దక్షతా, మానవ మనః ప్రవృత్తి నిరూపణా మొదలైన అంశాలు ఎన్నో విదితమవుతాయి. ఆయన వర్ణనా నైపుణ్యంలో కవితాకామనీయకం అవిదిత వేద్యంతరమవుతుంది.

విరహవ్యథాభరిత మనస్క అయినా నాయికాపరంగా ఋతువర్ణన చేయడం ఆయన కవితా ప్రతీకకు పతాక :

"చెలులాల యీ మేలు చెలువుఁడే చూచుఁగాని
యెలిమి తోడుత మొక్కి యెరిగించరే ॥పల్లవి॥
వనిత జవ్వనపు వసంతకాలములోనే
వెనుకొని విరహపువేసవి మించె
ననిచెఁ బెంజెమట వానకాలము నంతలోనె
వినయముతో బతికి విన్నవించరే ॥చెలు॥

కాంత పులకల శరత్కాలమునదె తోఁచె
చింతల మంచులతో హేమంతము ముంచె
చెంతఁ గోర్కులెన్ని లెత్తి శిశిరవేళ యేతెంచె
యింతకు నీకెవిభుని నీడకుఁ తోడితేరె ॥చెలి॥

చెలియకుఁ గొప్పవీడె చీఁకటి కాలము నందె
నెలకొనె సిగ్గుల వెన్నెల కాలము
అలమె శ్రీవేంకటేశుఁడంతలోనె తానె వచ్చి
పిలిచి సారెకు నిద్దె ప్రేమరేఁచరే ॥చెలి॥" (22-42

ఇందులో ఆరు ఋతువులతోపాటు కొప్పు, సిగ్గులతో చీకటి వెలుగులు పైః వర్ణితం కావడం విశేషం.

ఇలాగే మరోపదంలో ఆరుఋతువులు మనోరంజకంగా వర్ణితంః

"కాలమల్లారునుఁ గలిగెనీ కునిదె
బాలకి యందే పైపై నీకు ॥కాల॥

సతి కొప్పవిరులు జలజల రాలిన
లతల వసంతకాలము నీకు
కతఁగా దనపై కాఁకలు చూపిన
అతివేసవి కాలమప్పుడే నీకు ॥కాల॥

కాఁగిటి చెమటల కడునినుఁదడపిన
కాఁగల తొలకరి కాలమది
వీఁగని చూపుల వెన్నెల చల్లిన
రాఁగినమతికి శరత్కాలంబు ॥కాల॥

లంచపుఁ బులకల లలన స్వరతుల
కంచపు హేమంత కాలమది
యెంచగ శ్రీ వేంకటేశ వలపు సతి
వంచ శిశిరకాలపై భవ మాయ ॥కాల॥" (26-88)

అన్నమాచార్యుల కల్పనానైపుణ్యానికి, భావుకతకు, ప్రతిభకు, ప్రకృతి పరిశీలనా దక్షతకు అవ్యలత మనోహరో దహరణలు గమనించ దగ్గవి: విరహ వ్యధా భరితఅయిన నాయిక పరంగా మనోహరంగా ఋతువర్ణనలు విశదమవుతాయి.

"విన్నవించితిమి నీకు వేడుకవేళ
కన్నెను నీవు దయ గాచేటివేళ ॥పల్లవి

మచ్చికలు దయివారె మనసెల్ల జైవారె
వచ్చె జవ్వనానకు వసంతవేళ
చొచ్చి నిన్నుఁబాసి తాపసూర్యుఁడెండగాయఁగా
విచ్చన విడిగా దోచె వేసఁగి వేళ ॥విన్న॥

సిగ్గులు మొలవఁజొచ్చె చెమటలేరులు హెచ్చె
తగ్గు లేకమించె భానకాలపు వేళ
వెగ్గళించి నెలవుఁ వెన్నెలలు చూపట్టె (ట్టె)
వొగ్గి శరత్కాలము వాదిగె నీవేళ ॥విన్న॥

తత్తరపు చలి బొంచె తలపోతమంచు మించె
యెత్తి యలమేల్మంగకు హేమంత వేళ
ఇత్తితో శ్రీవేంకటేశ పైకొని కూడితి విట్టె
చిత్తజు కాఁకలు దేరె సిసి (శిశి)ర వేళ ॥విన్న॥" (27-133)

ఇలాంటిదే మరో చక్కటి పదం :

"ఆతని దోడితెచ్చినందాఁకా
హిత బుద్ధుల చెలియేమరకు మీ ॥పల్లవి॥

వెలది విరహముల వేసవికాలమిది
చెలిమి మోవి చిగురెండనీకు మీ
కలికి నిట్టూర్పుల గాలిహాటి మదె
తేలిప్పలపుప్పదను తియ్యనీకుమీ ॥ఆతని॥

వనిత పెంజెమట వానకాల మదె
మొనపులకననలు ముంచనీకుమీ
మనవుల సిగ్గుల మంచుగాలమదె
ఘనకుచగిరులనుఁ గప్పనీకు మీ ॥అతని॥

వెనఁగాంత నవ్వు వెన్నెల కాలము
ననిఁ గొప్పు చీఁకటి జారనీకు మీ
పనగా శ్రీవేంకటపతి విచ్చేసి కూడె
వసంతకాల మిదె వదలనీకు మీ ॥అతని॥" (27-43

ఇలాగా ఈఋతువర్ణనా పై దగ్ధ్యం అన్నమాచార్యుల వర్ణనా నైపుణ
నిదర్శనమవుతుంది.

నాయికా విరహంతో కాలసూచనతో ఋతువర్ణన చేయడం అన్నమాచా
ప్రతిభా పాండిత్యాలకు, జీవితానుభవానికి నిదర్శనం :

"మేలే చెలియా మేలుగాల మిది
తాలిమి లేదిదె తతిపో నాకు ॥పల్లవి॥

వెన్నెలగాసీ వెలఁది నేఁడిపుడు
పున్నమ చంద్రుఁడు పొడచెనచే
కన్నె కోవిలలకలకల మయ్యీ
వన్నె వసంతము వచ్చెనచే ॥మేలే॥

కడఁగి చక్రవాకంబులు మూఁగీ
పుడమిఁ బొద్దువుడు పొడచెనచే
ముడివడి చకోరములు కడుఁబొలసీ
ఆడరి సందెవేళాయ నచే ॥మేలే॥

చినుకులు రాలీ చిత్తజానెండల
కనుఁగొన వానల కాలమచే
మొనసితి శ్రీ వేంకటేశుఁడనే నిటు
ఘనిత సిరతికి ఘరుసిది యట్లవే ॥మేలే॥" (26-2

నాయికానాయికల కలయిక వర్షాసమయంలోని ఇంద్రధనువులను మించినట్లు అత్యంతాహ్లాదకరంగా అన్నమాచార్యులు వర్ణించి తరించాడు :

"వలపు తొలకరించె వనితపైనిదె నేఁడు
చెలువుఁడ వింతట విచ్చేయవయ్యా ॥పల్లవి॥

పదఁతి విరహవేళ పానుపైఁదెగి రా లే-
వడిముత్యపుసరులే వడగండ్లు
చిడుముడి మేని మీఁదచిప్పి లేటి చెమటలు
జడివాన గురిసీ విచారించవయ్యా ॥వల॥

నిరతిఁ దురుము మొయిలు నిలువెల్లా ముంచుకొనె
గరిమ నిట్టూర్పు పెనుగాలివంకను
నిరతపుఁ బులకల నీరు బుగ్గలవి మించె
సిరులఁ గన్నీటిసోన చినుకల వంకను ॥వల॥

యిద్దరికాఁగిటిలంకె యింద్రధనువులు మించె
వొద్దనే మాచెలిఁ గూడి వుండీవంకను
నిద్దపు శ్రీవేంకటేశ నిండెఁ జిత్తపు మడుగు
కొద్దిగా మోహరసాలు కురిసిన వంకను ॥వల॥" (26-101)

ఇలాంటిదే మరో చక్కటి ఉదాహరణ :

"ఆకాశపాకాశమాయెఁ గోమలినడుము
పై కుంభపతి పొందువడిగాఁదెలుపు కొలకు ॥పల్లవి॥

................ .. ........................

ఎలమి బొమ్మల జంకెలింద్రధనువులు వొడిచె
మొలచెఁ గన్నుల గావిమొయిలు ఘనమై
కొలఁది కగ్గలపుఁ గుంకుమ చెమట నెత్తురులు
పొలఁతిపైఁ గురియుటకుఁ బోటివలెనాయె ॥ఆకా॥" (4-100)

నాయికాచేష్టలలో నవరత్నాలను అభివర్ణించి అన్నమాచార్యులు తన ప్రతిభా

పాండిత్యాల్ని ఎంతగానో అభివ్యక్తీకరించాడు; సహృదయ మనోరంజకం తన ఔన్నత్యాన్ని నిలబెట్టుకొన్నాడు :

"ఎటువంటి నిలాసిని యెంతజాణ యీ చెలువ
తటుకన నీకు దక్కె దైవారఁ జూడవయ్యా ॥పల్లవి॥

మగువ మాటాడితేను మాణికాలు నిండుకొనీ
పగడాలు పెదవులఁ బచ్చిదేరిని
మగిడి చూచితేను మంచినీలాలుప్పతిలీ
తగు నీకు నీ పెదిక్కు తప్పకచూడవయ్యా ॥ఎటు॥

పరఁతి జవ్వనమున బచ్చలు గమ్ముకొనీని
నడచితే పైడూర్యా లెదలీ గోళ్ళ
తొడిఁబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు
వొడికమైనది యీపె వొరపు చూడవయ్యా ॥ఎటు॥

కొమ్మ ప్రియాల తేనెలఁ గురిసీఁ బుష్యరాగాలు
కుమ్మరించీఁ జెనకుల గోమేధికాలు
ముమ్మరపుఁ జెమటల ముత్తెపుసరాలు నిండీ
నెమ్మది శ్రీ వేంకటేశ నీదేవిఁ జూడవయ్యా ॥ఎటు॥" (29-

ఇలాగా నాయికాపరంగా ఎన్నో వర్ణనలు చేసి తన వర్ణనా పైదగ్ధ్యం నిరూపించుకొన్నాడు అన్నమాచార్యులు.

లక్ష్మీదేవి వర్ణనలో కార్యకారణ సంబంధాన్ని ఎంతో మనోహరం సహజంగా ఊహించాడు అన్నమాచార్యులు :

"పరమాత్ముఁడైన హరి పట్టపురాణివి నీవు
ధరమమ్ము విచారించఁదగు నీకునమ్మా ॥పల్లవి॥

కమలజు గన్నతల్లి కాముని గన్నతల్లి
అమరులఁ గన్నతల్లి ఆదిమలక్ష్మి
విమలపు (బడా) నీ పతికి విన్నపము సేసి మమ్ము
నైమ్మకి యేలితి దయనీకే తగునమ్మా ॥పర॥

కామధేను తోఁబుట్టుగ కల్పకముతోఁబుట్టుగ
దోమటి చల్లని చంద్రుడుతోఁబుట్టుగ
నీ మగని పంపునను నిజసిరు లిచ్చితివి
నేమపు వితరణము నీకే తగునమ్మా ॥పర॥

పాల జలధి కన్యవు పదాసనివి నీవు
పాలఁబండే శ్రీ వేంకటపతిదేవివి
యేలిన యితనిబంట్ల కిహపరా లిచ్చిమా-
పాలఁ గలిగితివి సంబంధము మేలమ్మా ॥వర॥" (26-36)

ఔచితీసహంగా ఇన్నిరకాల వర్ణనలు చేసి తన వైదగ్ధ్యాన్ని నిరూపించుకొన్న అన్నమాచార్యులు రామాయణ కథనంతటిని ఎంతో సరసంగా, మనోజ్ఞంగా వర్ణించిన తీరు సహృదయ హృదయాల్ని ఆకట్టుకొంటుంది.

"కౌసల్యానందన రామకమలాప్తకుల రామ
భాసురవరద జయ పూర్ణరామ ॥పల్లవి॥

మునుప దశరథరాముఁడపై తమ్ములు నీవు
జనించి తాటకఁ జంపి జన్నము గాచి
పెనుకొని హరువిల్లు విరిచి సీతఁ బెండ్లాడి
అనుమతి పరశురామునిచేఁ గైకొంటివి ॥కౌస॥

సువ్వనాతి శిక్షించి సొరిది ఋషుల గాచి
అప్పుడే ఖరదూషణాదుల గొట్టి
చొప్పుతో మాయామృగము సోదించి హరియించి
కప్పిహనుమంతు బంటుగానేలుకొంటివి ॥కౌస॥

సొలసి వాలినడఁచి సుగ్రీవుఁ గూడుక
జలధి బంధించి లంకసాధించి
వెలయ రావణుగెల్చి విభీషణుని మన్నించి
చెలఁగితివయోధ్యలో శ్రీవేంకటేశుఁడా ॥కౌస॥" (2-275)

లంకలోని సీతను కనుగొనివచ్చి శ్రీరామునికి హనుమంతుడు సీతా విషయాన్ని వివరించిన తీరును అన్నమాచార్యులు వర్ణించిన విధం అత్యంత మనోహరం :

"ఇదె శిరసు మాణిక్య మిచ్చి పంపెనీకు నాకె
అదనెరిఁగి తెచ్చితి నవధరించవయ్యా ॥పల్లవి॥

రామ నినుఁబాసి నీరామనేఁ జూడఁగ నా-
రామమున నినుఁ బాడె రామ రామ యనుచు
ఆమెలుత సీతయని యపుడు నేఁ దెలిసి
నీముద్ర వుంగరమునేనిచ్చితిని ॥ఇదె॥

కమలాప్తకులుఁడ నీకమలాక్ష నీపాద-
కమలములు దలపోసి కమలారి దూరె
నెమకి యాలేమ నేనీదేవి యని తెలిసి
అమరంగ నీసేమమటు విన్నవించితి ॥ఇదె॥

దశరథాత్మజ నీవు దశశిరునిఁ జంపియా
దశనున్న చెలిఁగావు దశదిశలుఁబొగడ
రసికుఁడ శ్రీవేంకట రఘు వీరుఁడ నీవు
శశి ముఖిఁ జేకొంటివి చక్కనాయఁబనులు ॥ఇదె॥" (2

ఇలాగే శ్రీకృష్ణుని జీవితమంతటిని సరళంగా, సరసంగా, సహృద
కంగా అన్నమాచార్యులు వర్ణించిన తీరు అనన్య సామాన్యం :

"ఆతఁడెవ్వాఁడు చూపరే అమ్మలాల
ఏతుల నాదేటి క్రిష్ణుఁడీతఁడే కాఁడుగదా ॥పల్లవి॥

కందువ దేవకి బిడ్డఁగనె నట నడురేయి
అందియశోదకుఁ గొడుకై నాఁడట
నందడించి పూతకిచంటి పాలుఁదాగెనట
మందల ఆవులఁగాచి మలసెనట ॥ఆత॥

మంచిబండి దన్నెనట మద్దులు విరిచెనట
ఇంచుకంత వేలఁ గొండయెత్తి నాఁడట
మంచాలపై గొల్లెతలమానాలు చేకొనెనట
మించులఁ బిల్లఁగోలివట్టి మెరసెనట ॥ఆత॥

కాళింగుని మెట్టెనట కంసుఁబొరిగొనెనట
పాలించి సురలఁ జేపట్టెనట
యీలీల వేంకటాద్రి నిరపైనదేఁవుడట
యేలెనట పదారు వేలింతుల నిందరిని ॥అత॥" (27-385)

విశ్వాత్మకుడైన బాలకృష్ణునికెలాంటి నొప్పి లేకుండా సేవలు చేయవలసిందని వాత్సల్యపూరిత అయిన యశోదమాతగా అన్నమాచార్యుల మాటల వర్ణన మనోజ్ఞం; అనన్య సామాన్యం; అనితరసాధ్యం.

"ఉగ్గు పెట్టరే వోయమ్మా చె-
య్యొగ్గీనిదె శిశువోయమ్మా ॥పల్లవి॥

కడుపులోని లోకమ్ములు గదలీ-
నొడలూఁచకురే వోయమ్మా
తొడికెడి సరుగునఁ దొలఁగఁ దీయరే
వుడికెడి పాలివి వోయమ్మా ॥ఉగ్గు॥

చప్పలు పట్టుక సన్నపు బాలుని-
నుప్పర మెత్తకురో యమ్మా
అప్పుడె సకలము నదిమీ నోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా ॥ఉగ్గు॥

తొయ్యలు లిటు చేతుల నలఁగించక
వుయ్యల నిడరే వోయమ్మా
కొయ్యమాటలను కొండల తిమ్మని
నొయ్యన తిట్టకు రోరమ్మా ॥ఉగ్గు॥" (12-97)

ఇలాగా అత్యంత మనోహరంగా అనేకాంశాలను వర్ణించి తరించినవాడు అన్నమాచార్యులు.

## 4.3.2 శబ్ద, భావ చిత్రాలు ;

వర్ణనా నైపుణ్యంలో మరో తీరు శబ్ద చిత్రాలు, భావ చిత్రాలు. శబ్దప్రయోగాలతో చిత్రం గీచినరీతిని మన మనస్సున హత్తుకొనేలా చేయగల నైపుణ్యం అన్నమాచార్యులకుంది. కొన్ని ఉదాహరణలు పరిశీలిస్తే స్పష్టమవుతుంది.

మీకు మీకు నమరును మిక్కిలి వేడుక లెల్లా
కైకొని నేమెల్లా జూడ గంటిమి గదే ॥పల్లవి॥

సింగారరాయడు గదే చిత్తజు గురుడు గదే
అంగవించి నిన్ను బెండ్లాడిన వాడు
బంగారు పతిమవు పాలవెల్లి కూతురవు
అంగన నీవు దేవుల వైతివి గదే ॥మీకు॥

కాంచనపు దట్టి వాడు కౌస్తుభపు మణివాడు
మంచితనమున నీకు మగడుగదే
మించు సిరుల దానవు మేటి తమ్మిపై దానవు
యెంచగ నతని వురమెక్కితివి గదవే ॥మీకు॥

చేతులు నాల్గిటి వాడు శ్రీ వేంకటేశ్వరుడు
ఆతుమగా నిన్నునేలి అలరెఁ గదే
యీతల శ్రీ కాంతవు యన్నిటా నేరుపరివి
యీతని కెప్పుడు నీపు యిరవైతివి గదే ॥మీకు॥"(30-395)

ఇందులో 'సింగార రాయడు, చిత్తజు గురుడు, బంగారు పతిమవు, పాలవెల్లి కూతురవు, కాంచనపు దట్టివాడు, కౌస్తుభపు మణివాడు, మించు సిరుల దానవు, మేటి తమ్మిపై ధానవు, చేతులు నాల్గిటివాడు' ఈ పదాలన్నిటా శబ్ద భావ చిత్రాలు విదిత మవుతాయి; అవిదిత వేద్యాంతర మవుతాయి. ఇలాగే మరో పదం మనోజ్ఞంగా వర్ణితం:

"ఎంత వనికోకాని యెఱుగ నేను
చెంతనే తెలుసుకో నేఁజెప్పితి నీ సుద్దులు ॥పల్లవి॥

వదలే జారు దురుము వైపుగా ముడుచు కొంటా
కదలుఁ గన్నుల చూపు కాఁడి పారఁగా
మదమువలెనే పెంజెమటలు చెక్కులఁగార
వెదకీ నెవ్వతో నిన్ను వీదుల వీదులను ॥ఎంత॥

అవఁచి చన్నులపైఁ బయ్యెద బిగిఇంచుకొంటా
కడలేని నిట్టూర్పులు కడుమఁగాను

తడఁబడఁ బెదవుల తమ్మఁ జెంట్లు రాలఁగా
అడిగి నీ వున్నచోటు అంగనల నెల్లాను ॥ఎంత॥

వుక్కుమీరి కరముల వాడిమీఁద బెట్టుకొని
మిక్కిలి నీ కాపెపొందు మీఁదెత్తఁగా
ఇక్కడ శ్రీ వేంకటేశ యిటు నన్ను గూడేవు
చొక్కుచు నీ మేడ దిక్కే చూచీ దానదివో ॥ఎంత॥" (30-487)

ఈ పదం లోని మొదటి, రెండో చరణాల్లోని ప్రతి పాదమూ ఒక భావ చిత్రంగా భాసిస్తుంది. మళ్లీ ఒక్కొక్క చరణమూ మరొక్కొక్క భావ చిత్రంగా భాసిస్తుంది. ఇది ఇందలి విశేషం.

మరోపదంలో భావచిత్రాలు అత్యంతానందదాయకంగా ఉన్నాయి.

"కోరికలు కొనసాగె గోవిందరాజ
మేరమీర ఇట్లానే మెరసితివా ॥పల్లవి॥

బాలుఁడవై రేపల్లెలోఁ బాలుదాగేవేళ
యీలీలనే పవళించి యిరవైతివా
గోలవై తొట్టెలలోన గొల్లెత లూఁచి పాడఁగా
ఆలకించి విని పాట లవధరించితివా ॥కోరి॥

కొంచక మధురలోనఁ గుబ్జయింట నీలాగుల
మంచాలపైఁ బవళించి మరిగితివా
చంచుల ద్వారకలోన సత్యభామ తొడమీఁద
ముంచి యీరీతి నొరఁగి ముచ్చటలాడితివా ॥కోరి॥

పదియారువేలింతుల పాలిండ్లు తలగడలై
పొదల నిటువలెనే భోగించితివా
యెదుట శ్రీవేంకటేశ ఇట్టె తిరుపతిలోన
నిదిరిఁచక శ్రీభూమి నీళలఁ గూడితివా ॥కోరి॥" (31-285)

ఇందు ప్రతిచరణంలో రెండురెండు పాదాలు కలిసి ఒక్కొక్క మనోజ్ఞ భావచిత్రమవుతుంది. రసజ్ఞ హృదయంగమమై ఒప్పుతూంది.

ఇలాగ అనేకరకాలైన ఉదాహరణలెన్నైనా ఇవ్వవచ్చు, ఈ శబ్ద భావ చిత్రాలకు.

ఈ పరిశీలనవల్ల అన్నమాచార్యులు పదరచనలోని వైవిధ్య సహితమైన వర్ణనా నైపుణ్యంతో, కన్నులకు కట్టినట్లుండి హృదయానికి హత్తుకోగల శబ్ద భావచిత్రాలతోపాటు వర్ణనా వైదగ్ధ్యాన్ని ప్రకటించి కవులకు కవి అయ్యాడని విదితమవుతుంది. (వివరాలకు : డా॥ గుమ్మా సాంబశివరావు: అన్నమాచార్య సంకీర్తనలలోని వర్ణనలు - పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసం - 1990)

## 4.4 అలంకారాలు :

కావ్యకన్యకు అలంకారాలు అందచందాల్ని చేకూర్చి ఆనందకందమవుతా యన్న అంశం అందరికీ తెలిసిందే. ఈ అలంకారాలు కేవలం పద్యకావ్యాల్లో మాత్రమేకాక పదాల్లోను సహృదయుల హృదయాల్ని అలరించి ఆనంద నిష్యందు లవుతాయి. ప్రబంధం ఆలంకారిక శైలీ విన్యాసవిభూషితమయినప్పుడే దానికో ప్రత్యేకతా, విశిష్టతాను అన్నమాచార్యుల సంకీర్తనలు దేనికదే ఒక్కొక్క గీతి కావ్యమన్న అంశం పూర్వోక్తం. తన పదాల్లో వివిధవిధాలైన అలంకారాలు ప్రయోగించి మనోహరం గావించాడు అన్నమాచార్యులు. తద్విరహితంగా ఆనందా పాది కాదనడంలో సందేహం లేదు. ఈ అలంకారాలు శబ్దాలంకారాలు, అర్థాలం కారలని రెండురీతులు. వీటిని అన్నమాచార్యులు ప్రయోగించి తన పదకవితా రీతిని మనోజ్ఞమొనరించిన తీరును గమనించడమే ఈ ప్రయత్న ఫలం.

### 4.4.1 శబ్దాలంకారాలు :

అంత్యప్రాసలు అన్నమాచార్యులు చాలావరకు తన పదాలన్నిటా ఏదోరీతిని ప్రయోగించాడు. బహుశః సంగీతానికి అవి ఉపకరించి ఉంటాయనడంలో ఏ విధమైన సందేహమూ ఉండనక్కరలేదు. అంత్యప్రాస పదమంతటా పల్లవి మొదలుకొని చివరివరకు పాటించడం ఎంతో మనోహరత్వాన్ని చేకూర్చింది.

"ఎంతచుట్టమో నీకునిదివో ఆపె
సంతసపు వలపుల జడిసీ నాపె ॥పల్లవి॥

తేనెగారే పెదవుల తేటమాటలాడీ నాపె
నాన(బెట్టి సెలవుల నవ్వీనాపె
సాన( బెట్టిన చూపులు జరిపించీ నీపైనాపె
మోనముతో బొమ్మలను మొక్కీనాపె ॥ఎంత॥

నిండు(జెక్కుటద్దముల నీడలు చూపీనాపె
గండు( దుమ్మిద కొప్పుతో(గదిమీ నాపె
కొండలవంటి చన్నులకొనలు దాకించీ నాపె
మెండు(జిగురుచేతుల మెచ్చు మెచ్చీ నాపె ॥ఎంత॥

ఆయపు మెఱు(గు మేన ఆసలురేచీ నాపె
పాయపు సిగ్గులచేత భ్రమించీ నాపె
మోయరాని పిరుదుల మురిపెము చూపీనాపె
యీ యెడ శ్రీవేంకటేశ యెనసె నిన్నాపె ॥ఎంత॥" (31-426)

అంత్యప్రాసతో రీతులు అనేకం పాటించినట్లు తెలుస్తుంది. ప్రతిచరణంలో మొదటి మూడు పాదాలు సమంగాను, నాల్గోపాదం ఒక విధంగాను ఉండడం గమనించవచ్చు.

"పనిగల యప్పుడే పంతములెల్లా నాడేది
జెన(గవచ్చితే నట్టె విగిసేది
వెనక(జూచిన వేళే చేరి బాసలడిగేది
వొనర( దుచ్చపు వారివో జలింతేకా ॥నీతల॥

నగవచ్చినప్పుడే నంటుకొన(దిట్టేది
మొగము చూచినంతనే మురి( చేదీ
తగిలి వెనుకొంటేనే తరితీపు సేసేదీ
జగతి( జిత్తిణి నారి సాజ మింతేకా ॥నీతల॥" (31-373

పల్లవిలోను, మూడు చరణాల్లోను వేర్వేరుగా అంత్యప్రాస పాటించడ జరిగింది.

"ఇంకానేల చలము యేమిసేయ(గలము
అంకెకు వచ్చెను అధరామృత ఫలము

కలికి వనాలనీడఁగదు నీకెదురుచూడ
కులుకు నవ్వులతోడఁ గొప్పపీడ
చెలులెల్లాఁ జూచేరు జిగిఁ గొనులసియాడ
బలిమి జేకొనవయ్యా బత్తితోగూడ ॥ఇంకా॥

సతి నీపాదాలు మెట్ట చన్నుల నీవు ముట్ట
తతి నిన్నూ నిదె దిట్టతనాల దిట్ట
అతివలు సొలసేరు అంగాలఁ జెమటదొట్ట
సతతము మెచ్చవయ్యా జాణలు చేపట్ట ॥ఇంకా॥

జలజాక్షి నీపక్క సరసముల వే చొక్క
తలపోసీఁ దనచక్కదనాలు నిక్క
లాలి శ్రీ వేంకటేశ నీలలన నీకు మొక్క
కలకాలమేలు మిక్కడ రతికెక్క ॥ఇంకా॥" (31-162)

అంత్యప్రాస మూడుచరణాల్లో 1-2, 2-4 పాదాల్లో అనుసరించడం జరిగింది. అంత్యప్రాస ప్రయోగంలో ఇదొక రీతి.

"జీటికి మాటికి నీవు సిగ్గులు వదేవుగాని
నాటుకొన బతితోను నగరాదా
కూటమిగోరి సంగడి గూచుండ లోగేవుగాని
వోటలేక కుచముల నొరయ రాదా ॥నీకెం॥

చనవులా మనవులా సాదించవచ్చేవుగాని
మనసిచ్చి యాతనితో మాటాడరాదా
తనియక మోవి చూచి దప్పులు దేరేవుగాని
వినయాన దమలము వేఁడుకోరాదా ॥నీకెం॥

అలపులా సొలపులా ఆసలు ముట్టేవుగాని
పిలిచి శ్రీవేంకటేశుఁ బెంగ్లాడరాదా
బలిమి నన్నిటా నొడఁబరచు కొంటివిగాని
మలసి రతుల నిట్టె మన్నించుకోరాదా ॥నీకెం॥" (31-180)

పైని పేర్కొన్న అంత్యప్రాసరీతి మాత్రమేగాక ప్రతిచరణం ఆరంభంలో ధ్వన్యనుకరణ శబ్దాలు చీటికిమాటికి, చనవులా మానవులా, అలపులా సొలపులా" అనే పదాల్ని ప్రయోగించి ఈ సంకీర్తనకెంతో సొగసు నాపాదించాడు అన్నమాచార్యులు.

యమకానికో ఉదాహరణ :

"మానరా నవ్వు మానరా వద్దు మానరా
మాతో మానరా యేల మానరా! నీవు
మానకుంటే నిన్ను నిందరు వినఁగా
మాటలఁ దిట్టక మానరా ॥పల్లవి॥" (25-403)

అంత్యప్రాసలు వివిధరీతుల ప్రయోగించిన అన్నమాచార్యులు ద్వి, త్రి, చతుష్పాదులు సైతం తన పదాల్లో ప్రయోగించి తనకు భాషపైగల అధికారాన్ని ప్రకటించుకొన్నాడు.

**ద్విప్రాస :**

"కన్నుల జూచినయాస కాగిటికి బెనగించు
సన్నలు సేసినయాస పంగడిఁ బెట్టు
చన్నులు సోఁకిన యాస సమరతి కొనగూర్చు" (24-92)

**చతుష్ప్రాస :**

"నవ్వులు నిజములాయ నారుకొనెఁ బంతములు"
ఇవ్వల నాజవ్వనము యీడు జోడాయ

**షష్ఠప్రాస :**

పల్లవిలో, చరణంలో స్పష్టం.

"మెచ్చెనొకరాగంబు మీఁద మీఁదకడు-
నిచ్చెనొకరాగంబు యింతులకు నెల్ల ॥పల్లవి॥
చేసెనొకరాగంబు చెలియెదుట గన్నులనె
మూసెనొకరాగంబు ముదితమతినె
పూసెనొక రాగంబు పొలఁతి పులకలమేన
వ్రాసెనొక రాగంబు వనిత నినుఁబాసి ॥మెచ్చె॥" (12-363)

ఇలాగా శబ్దాలంకార ప్రయోగంలో అన్నమాచార్యులు తన విశిష్టతను పద్య కవులకంటే అధికంగానే నిలబెట్టుకొన్నాడు.

### 4.4.2 అర్థాలంకారాలు :

శబ్దాలంకారాల్లో శబ్దంపై అధికారాన్ని తెలిపి, కవిత పాండిత్య ప్రకర్షకు నిదర్శనమవుతూండగా, అర్థాలంకారాలు, కావ్య సౌందర్యానికి హేతువులై కవి ప్రతిభకు చక్కటి ఉదాహరణలు కాగలుగుతాయి. ఇతః పూర్వం అన్నమాచార్యుల శబ్దాలంకార ప్రయోగవైచిత్రిని గమనించాము. ప్రస్తుతం ఆయన అర్థాలంకార ప్రయోగ నైశిత్యం, వైశిష్ట్యం తెలుసు కొంచాము.

**ఉపమ :**

"వాఁడే వాఁడే అల్లరివాఁ డదివో
నాఁడు నాఁడు యమునా నదిలో ॥పల్లవి॥

కాంతలు వలయపు కంకణ రవముల-
సంతంత ( గోలాట మాడ ( గను
చెంతల నడమను శ్రీరమణుఁడమరె
సంతతపుఁ జుక్కలలో చంద్రునివలెను ॥వాడే॥

మగువలు ముఖ పద్మములు దిరిగిరా-
నగపడి కోలాట మాడ ( గను
నిగిడీ నడుమ నదె నీల వర్ణుఁ డు
పగటుతో ( గమల బంధుని వలెను ॥వాడే॥" (25-343)

శ్రీకృష్ణుడు గోపికల మధ్య చుక్కల్లో చంద్రుడిలా, పద్మాలమధ్య సూర్యుడిలా మనోహరంగా ప్రకాశిస్తున్నాడని వర్ణితం.

**రూపకం :**

"మచ్చికతో నేల వచ్చె మదన సామ్రాజ్యలక్ష్మి
పచ్చి సింగారాల చేత బండారాలు నిండెను ॥పల్లవి॥

కామకె తురుమునను గొప్పమేఘ ముదయించి
చెమట వాన గురిసెఁ జెక్కుల వెంట
అమర ( బులకలపైరు లంతటాను ( జెలువొంది
ప్రమదాల వలపుల పంట లివె పండెను ॥మచ్చి॥

మించుల చూపుల తీగె మెఱఁగు లిట్టె పెరిచి
అంచెఁ గోరికల జళ్లపె పట్టెను
సంచితపు కుచముల జవ్వన రాసులు మించె
పొంచి నవ్వుల యామని పోదిగొనె నిదిగో ॥మచ్చి॥" (25-281)

చక్కటి ఔపమ్యంతో రూపకాలంకారం మనోజ్ఞం

**సందేహం :**

అల్లదె జవ్వని హారి యురమున నదె
మెల్లనె యిటు వుపమించరే మీరు ॥పల్లవి॥

ముత్తెపుఁ జిప్పలో ముంచిన కలువలో
వొత్తిలి కనుఁగవ లౌక మాటాడరే
గుత్తపుఁ గుండలో కొండలో కుచములో
హత్తి యేర్పడఁగ ననరే మీరు ॥అల్ల॥

తామెర తూండ్లో తతియగు తీగెలో
భామ చేతు లేర్పరచరే యిపుడు
దోమటి సింహమో తొడఁగిన బయలో
ఆమాటాడరే అందులో నొకటి ॥అల్ల॥

నీలపు మణులో నిండిన మేఘమో
బాలకి తురుముక పలుకునఁ జెప్పరే
యీ లీల శ్రీ వేంకటేశ్వరుఁ గూడెను
మేలిమి మెఱుఁగో మెలుఁతో యనరే ॥అల్ల॥" (25-375)

ఇందులో సందేహంతో ప్రశ్నించి సమాధానముకై వేచి ఉండిన వర్ణన ఉంది.

**అతిశయోక్తి :**

"ఎటువంటి విలాసిని యెంత జాణ యీ చెలువ
తటుకన నీకు దక్కె దైవారఁ జూడవయ్య ॥పల్లవి॥

మగువ మాటాడితేను మాణికాలు నిండుకొనీ
పగడాలు పెదవులఁ బచ్చిదేరీని

మగడి చూచితేను మంచి నీలా లుప్పతిలీ
తగు నీకు నీపెదిక్కు తప్పక చూడవయ్యా ॥ఎటు॥

పడఁతి జవ్వనమునఁ బచ్చలు కమ్ముకొనీన
నడచితే వైడూర్యాలు పెడలీ గోళ్ల
తొడిఁబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు
వొడికమైనది యీపె వొరపు చూడవయ్యా ॥ఎటు॥

కొమ్మ ప్రియాల తేనెల ఁ గురిసీ ఁ బుష్య రాగాలు
కుమ్మరించీఁ జెనకుల గోమేధి కాలు
ముమ్మరపుఁ జెమటల ముత్తెపు సరాలు నిండీ
నెమ్మది శ్రీ వేంకటేశ నీచేవి జూడవయ్యా ॥ఎటు॥"(29-30)

రకరకాల మణులతో నాయికావయవాల వర్ణన మనోహరము.

**అర్థాంతరన్యాసం :**

తన మేలెచూమఁ గాక తరుణుల యెడలను
యెనలేని మగవాని నేమనగ వచ్చును ॥పల్లవి॥

మంత నాన నాకె నీవు మాటలాడే చోటికి
వింతది రా సిగ్గుగాదా విచారించితే
చెంత నీ విదెరఁగక చెలి నిందుకు బిల్చేవు
యెంతైనా మగవాని కెక్కడిది తగవు ॥తన॥

గారవాన నాకె నీవు కాగిలించ కుండఁ గాను
మారు సతితో ఁ(తొం)గిచూడ గోరము గాదా
ఆరీతి వాకిట నుంటే ఆపెఁ దెమ్మనేవు వీడె-
మారజపు మగవాఁడు ఆడికెకు లోగునా ॥తన॥

శ్రీ వేంకటేశుఁడ ఆకె చెయి పట్టి పెండ్లాడఁగా
సేవ సేయ నాకతెకు సెగ్గెము గాదా
యీ వల నన్నేలితివి యీపె నాపెఁ గూడితివి,
కావరపు మగవాని కత లిప్పె కావా ॥తన॥" (22-39)

**లోకోక్తి :**

"ఆ తఁ డదె మీరదె అప్పగించితిమి మేము
మీతలఁ పు దాన నేను మీకేలే చింత ॥పల్లవి॥

నన్ను నేల అడిగేరే నాఁటి నేఁటి సుద్దులు
అన్నియును నడుగరే ఆతనిని
పన్నిన వారి ద్దనికి పైపై మీరే కారా
వెన్నచేతఁ బట్టుకొని నేఁడ నేరే నెయ్యి ॥ఆత॥

యేలకొడఁ బర చేసే యింకలోనే నన్నును
చాలు నోడ బరచనే చాలు నాతని
పోలిమితో నింతేసి బుద్ధి మీరెరఁ గనిదా
కాలము చేతఁ బట్టుకొని దాటనేలే వాకిలి ॥ఆత॥

ఆనలేల పెట్టేరే ఆతనితోఁ గూడుమని
పేనియాన లతనికే పెట్టరాదా
ఆనుక శ్రీవేంకటేశుఁ డాతఁడే నన్నుఁ గూడె
తేనెలు వంటి చెలులు తీపులు మీకేలే ॥ఆత॥" (22-337)

ఇందు లోకోక్తులతో పదరచనచేసి అన్నమాచార్యులు తన లోకజ్ఞతను వివరించాడు.

**స్వభావోక్తి :**

"ఎట్టు నిద్దరించెనో యీ రేతిరెల్లాను
పట్టి చుట్టుక వయ్యెద పడఁ దీసీ క్రిష్ణుడూ ॥పల్లవి॥

కడు వేఁ కువనే లేచి కన్నులు పులుము కొంటా
కడు పక్కలించి సూఁక లయ్యానని
కుడు కొ (సొ) కచేఁ బట్టి నా కొంగొకచేతఁ బట్టి
అడిగీ నన్నము కృష్ణుఁ డప్పుడే చూడరే ॥ఎట్టు॥

పెరుగు దరువ్వనన్నుఁ దిరిగి రాఁ జుట్టి చుట్టి
కురుచ మాటల ముద్దు గునియుచును
తిరిగి కవ్వపు గోల దిక్కగాఁ గిలించి పట్టి
తరికెన్న పెట్టుమనీ తగునే యీ కృష్ణుడు ।ఎట్టు।

తనకు బెట్టినది యా తలి పడుచుల కిచ్చి
కినిసి పుచ్చిలి యార గించీఁ దాను
అనయము శ్రీ వేంకటాద్రి కృష్ణుఁ డు నేఁడు
తనిసి తన మెంగిలి తగ నాకు నిచ్చెనే ॥ఎట్టు॥ " (22-420)

బాలకృష్ణుని చేష్టలను అతి సహజంగా చిత్రించడం జరిగింది.

ఇలాంటిదే మరో చక్కటి ఉదాహరణ స్వభావోక్తికి :

"పసులు గాచేటి కోల పసుపు జేల
పొసఁగ నీ కింత యేల బుద్దుల గోల ॥పల్లవి॥

కట్టిన పక్కుపు బుత్తి కచ్చ కాయల తిత్తి
చుట్టిన పించపుఁ బాగ చుంగుల సోగ
ఇట్టి సింగారము సేయ నింత నీకు బ్రియమాయ
వెట్టి నీ చేఁతల మాయ విట్టల రాయ ॥పసుల॥

పేయల బిలుచు కూఁత పిల్ల గోవి బలుమోత
సేయ రాని గొల్లెతల సిగ్గుల చేత
ఆయెడల దలపోత యమున లోపలి యీఁత
వేయఁరాని మోహలాయ విట్టలరాయ ॥పసుల॥

కొంకులేని పొలయాట కూరిములలో తేట
అంకెల బాలులతో డి యాట పాట
పొంకపు తత్తురు కొమ్ము పొలుపైన నీసొమ్ము
వేంకట నగము చాయ విట్టల రాయ ॥పసుల॥" (12-96)

ఇందులో మరో విశేషం సైతం గమనించగలం. పల్లవిలోను, ప్రతిచరణంలోను ప్రతి పాదంలో యతి గలచోట విరిగి సగం సగం పాదాలలో అంత్యప్రాస నియతంగా పాటించి ఉండడం వల్ల అన్నమాచార్యులీ పదానికి ఎంతో సొగసును చేకూర్చారు. ఇది అత్యంతాహ్లాదకరాంశం.

## క్రమాలంకారం :

"ఏమి బాతి వేఁడెదె నీకు మము
గ్రామించు సిరులింతే కదవయ్యా ॥పల్లవి॥

వెనక ముందర వెలయఁగ ముందర-
వెనక లింతే విభవాలు
వనితల పిఱుఁదులు వాఁడి కుచములు కొప్పు
కనుఁగొన భ్రమలింతె కదవయ్యా ॥ఏమి॥

వెలుఁగు చీఁకటి విరసాలు విభవాలు
కలిమి లేములే కదవయ్యా
పలువన్నె మాటలు పసని తేటలు నివి
కలవెంత కలలింతె కదవయ్యా ॥ఏమి॥" (12-358)

**నిందాస్తుతి :**

"అక్కటా రావణు బ్రహ్మహత్య నీకు నేడది
పుక్కిట పురాణ లింగ పూజ నీకు నేడదీ ॥పల్లవి॥

గురుహత్య బ్రహ్మహత్యఁ గూడి ద్రోణాచార్యువంక
హరి నీ కృప నర్జును కవి లేవాయ
యెరవుగాఁ గల్లలాడి యేచిన ధర్మరాజు నకు
పరగ నీయనుమతిఁ బాపము లేదాయను ॥అక్కటా॥

అదివో రుద్రుని బ్రహ్మహత్య వాయఁగాసి యిచ్చి
పొదలిన నీ వతని బూజింతువా
అదనఁ బార్వతిదేవి కాతఁడే నీ మంత్రమిచ్చె
వదరు మాటల మాయా వచనా లేమిటికి ॥అక్కటా॥

తగిలిన నీనామమే తారక బ్రహ్మమై
జగము వారి పాపాలు సంతతము ( బాపఁగాను
మిగుల శ్రీ వేంకటేశ మీకు నేడ పాతకాలు
నగుఁబాటు లింతే కాక నానా దేశముల ॥అక్కటా॥"(9-204)

ఇలాగా శబ్దార్థాలంకారాలు తన పదాలన్నిటా సందర్భోచితంగా ప్రయోగించి కవితకెంతో మనోజ్ఞత్వాన్ని ఆపాదించి పద్యకవుల కేమాత్రమూ తీసిపోనిరీతిలో అత్యున్నత పదకవితా పితామహుడుగా ప్రసిద్ధి కెక్కాడు అన్నమాచార్యులు.

## 4.5 జానపద ధోరణులు :

అన్నమాచార్య సంకీర్తనల్లో జానపద ధోరణులు వ్యక్తం కావడంలో ఆశ్చర్యం లేదు. జానపద సాహిత్యం ఏ సాహిత్యానికైనా అనాది; పునాది తెలుగులో సైతం జానపదకవిత్వం అతి ప్రాచీనమే. కానీ దాన్ని అభిమానించి, ప్రోత్సహించి, భద్రపరచిన వారులేకపోవడంవల్ల ఆనాటి జానపదరీతులేమిటో తెలియవు. ఈ నడుమనే జానపద విజ్ఞాన జిజ్ఞాసువులూ, పరిశోధకులు పోయి నది పోగా మిగిలిన జానపద సంబంధి సమస్తమూ సేకరించి భద్రపరచనారంభించారు. పాల్కురికి సోమనాథుడు, నన్నెచోడుడు పేర్కొన్న ఆచూకీలనుబట్టి అనాదినుంచి జానపదగేయరీతులుండేవని తెలుస్తుంది. జానపదకవితారీతుల్ని నిబద్ధంచేసిన అన్నమాచార్యుల పదాల్లో ఎన్నో జానపదధోరణులు కన్పించడం సహజమైన అంశం. అలాంటి అన్నమాచార్యులపదాల్లోని జానపదరీతుల్ని క్రమంగా తెలుసుకొందాము.

### అవధానం :

అవధానం అంటే ఎచ్చరిక, జాగ్రత అని అర్థం. అవధానం కలవాడు అవధాని. దేవతలను హెచ్చరించడం ఈపద లక్ష్యం. క్రమంగా ఇది రాజుల దాకా వెళ్ళింది. రాజును, ప్రభువును హెచ్చరించడం. ఇది ఎచ్చరిక (హెచ్చరిక) లాంటి పదం : ఇంకా ఇది మేల్కొలుపు లాంటిది అనవచ్చు.

శ్రీ వేంకటేశ్వరుని భక్తులు అవధానమని ఎచ్చరిస్తున్నారీ పదంలో :

"దేవర చిత్తం దివ్య నిధి
దేవనిర్మిత నిధీ యవధానం ॥పల్లవి॥

అచ్చరలు నాట్యంబాడెదమని వు-
న్నతి మెఱయుచు నున్నారదివో
ప్రతినలతో రంభయు మేనకయును
ధృతి కరుణాంబుపై దీయవధానం ॥దేవర॥

గాన విద్య తమకంబున వినుమని
కానుకలిచె సురకాంతలవి
కానుపించుకో గంధర్వ సతులను
ధీనుత వంశసుధీ యవధానం ॥దేవర॥

పరియంకంబునఁ బవళించెదవో
సిరుల విభవములఁ జెలఁగెదవో
తిరువేంకటగిరిదేవ యన్నిటా
తిరమందితి విటు ధీ యవధానం ॥దేవర॥" (శృం.సం. 12-19)

ఎచ్చరిక :

పైని పేర్కొన్న అవధానంలాంటి పదం. అదే రీతిలో ఎచ్చరించడం ఈ పదంలో ముఖ్యాంశం.

"శరణు శరణు సురేంద్ర సన్నుత - శరణు శ్రీసతి వల్లభా
శరణు రాక్షసగర్వ సంహార - శరణువేంకట నాయకా ॥పల్లవి॥

కమలధరుఁడును కమలమిత్రుఁడు - కమలశత్రుడు పుత్రుడు
క్రమముతో మీకొలువు కిప్పుడు - కాచినా రెచ్చరికయా ॥శర॥

అనిమిషేంద్రులు మునులు దిక్పతు-లమర కిన్నర సిద్ధులు
ఘనతతో రంభాదికాంతలు - కాచినా రెచ్చరికయా ॥శర॥

ఎన్నఁగల ప్రహ్లాద ముఖ్యులు - నిన్నుఁగొలువగ వచ్చిరీ
విన్నపము వినవయ్య తిరుపతి - వేంకటాచల నాయకా ॥శర॥
(అన్నమాచార్య చరిత్ర-పీఠిక : పు. 67)

అల్లోనేరేళ్లు :

ఈ పదాలు రాత్రి సమయంలో వెన్నెట్లో పిల్లలు ఆనందోత్సాహాలతో పాడుకొనే పాటలు. ప్రధానంగా వేసవి రాత్రులలోను, పండగ పబ్బాల సమయం లోను పాడుకొంటారు. 'అల్లోనేరేళ్లు' పదం పునరుక్తమవుతుంది.

"నెయ్యములల్లో నేరేళ్ళో
వొయ్యన వూరెడి వువ్విళ్ళో ॥పల్లవి॥

పలచని చెమటల బాహుమూలముల-
చెలమలలోనా జెలువములే
ధళధళమను ముత్యపుఁ జెఱఁగు సురటి
దులిపేటి నీళ్ళ తుంపిళ్ళో ॥నెయ్య

తొట తొటఁ గన్నుల వొరిగేటి నీళ్ళు
చిటిపొటి యలుకల చిరునగవే
వటఫలంబు నీవన్నెల మోవికి
గుటకలలో నా గుక్కిళ్ళు ॥నెయ్య॥

గరగరికల వేంకటపతి కౌఁగిట
పరిమళములలో బచ్చనలు
మరునువింటి కమ్మనియంప విరుల-
గురితాఁకులినుప గుగ్గిళ్ళో ॥నెయ్య॥" (శృం.సం. 12-179

ఇలాంటి 'అల్లో నేరేడల్లా' అనేపదం నా సేకరణలోని జానపద గేయాల్లో ఒకటుంది.

"అల్లో నేరెడల్లా అల్లోనేరెడె కింద నల్లన్ని చెలిమి ॥అల్లో॥
నల్లన్ని చెలికాడ పెద్ది (చద్ది) తినారాదరది అల్లో॥"
(జానపద గేయాలు - పు. 139)

**ఆరతులు :**

వాస్తవానికిది 'ఆరతి' అన్నదే సరైన పదం కాగా హారతి అనడం వ్యవహారంలో వింటున్నాము. భగవంతునికిచ్చే ఆరతి ప్రసిద్ధమే. ఇక్కడ శ్రీ వేంకటేశ్వరునకిచ్చే ఆరతులు ఈ పదంలో చూడగలము.

"అంగన లీరే యారతులు
అంగజగురునకు నారతులు ॥పల్లవి॥

శ్రీదేవితోడుతఁ జెలగుచున్న యా-
ఆదిమ పురుషుని కారతులు
మేదినీ రమణి మేలములాడేటి-
ఆదిత్య తేజున కారతులూ ॥అంగన॥

సురలకు నమృతము సొరిది నొసంగిన-
హరికిదివో పసిఁ డారతులూ
తరమిదీ దుష్టుల దనుజుల నడఁచిన
అరిభయంకరున కారతులూ ॥అంగన॥

నిచ్చలుఁగల్యాణ నిధిపై యేఁగేటి-
అచ్యుతునకు నివె యారతులా
చొచ్చి శ్రీ వేంకటేశుఁడు నలమేల్మంగ
యచ్చుగ నిలిచిరి యారతులా ॥అంగన॥" (శృం.సం. 25-346)

**ఉగ్గు పెట్టడం :**

ఇది చిన్న పిల్లలకు ఉగ్గుపెట్టే సమయంలో కృష్ణుడుగా, రాముడుగా భావించి తల్లి ఉగ్గుబెట్టే తీరు. ఇందులో బాలకృష్ణునకు ఉగ్గుపెట్టడం గమనించ వచ్చు.

"ఉగ్గుపెట్టరే వోయమ్మా చె-
య్యొగ్గీనిదె శిశువోయమ్మా ॥పల్లవి॥

కడుపులోని లోకమ్ములు గదలీ-
నొడలూఁచకురే వోయమ్మా
తొడికెడి పరుగనఁ బొలగ దీయరే
వుడికెడి పాలివి వోయమ్మా ॥ఉగ్గు॥

చిప్పలు వట్టుక సన్నపు బాలుని-
నుప్పరమెత్తకు రోయమ్మా
అప్పుడె సకలము నదిమీ నోరనె
వొప్పదు తియ్యరె వోయమ్మా ॥ఉగ్గు॥

తొయ్యలులిటు చేతుల నలఁగించక
వుయ్యల నిడరే వోయమ్మా
కొయ్య మాటలను కొండల తిమ్మని-
నొయ్యన తిట్టకు రోరమ్మా ॥ఉగ్గు॥" (శృం.సం. 12-97)

**ఉయ్యాల :**

భగవంతుని ఊయలలో ఉంచి చేసే సేవాసమయంలో పాడే పాట. ఇది క్రమంగా పిల్లలను నిద్రపుచ్చే సమయంలో పాడే పాటగా రూపుదిద్దుకొంది. శ్రీ వేంకటేశ్వరుని 'ఊంజల్ సేవ' ప్రసిద్ధమే కదా! ఈ పదంలో శ్రీ వేంకటేశ్వరుని 'బాలయవ్వనలు' ఊపే తీరు వివితమవుతుంది.

"ఉయ్యాలా బాలునూఁచెదరు కడు-
నొయ్య నొయ్య నొయ్యనుచు ॥పల్లవి॥

బాలయవ్వనలు పసిఁడి వుయ్యాల
బాలునివద్దఁ బాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ యెల్ల
లాలి లాలి లాలి లాలనుచు ॥ఉయ్యా॥

తమ్మిరేకుఁగనుఁదమ్ముల నవ్వుల
వమ్మఁజూపులఁ బాడేరు
కొమ్మలు మట్టెల గునుకుల నడపుల
ధిమ్మి ధిమ్మి ధిమ్మనుచు ॥ఉయ్యా॥

చల్లఁజూపుల జవరాండ్లు రే-
పల్లె బాలునిఁ బాడేరు
బిల్లిదు వేంకటపతిఁ జేరి యందెలు
ఘల్లు ఘల్లు ఘల్లనుచు ॥ఉయ్యా॥ (శృం.సం. 12-246)

ఇందులో 'లాలి' సైతం ఉండడం విశేషం. మరో ఉయ్యాల పదం :

"అలర జంచలమైన ఆత్మలందుండ నీ
యలవాటు సేసె నీ ఉయ్యాల
పలుమారు నుచ్ఛ్వాస పవనమందుండ నీ
భావంబు దెలిపె నీ ఉయ్యాల" (అధ్యా. సం. 11-320)

**ఏలలు :**

ఏలలు శృంగారాత్మకమై ఉంటాయి. యాలపాటలనీ, యాలపదాలనీ ప్రసిద్ధి. తెలుగు సాహిత్యంలో ఏలపదాలు విరివిగా ఉన్నాయి. యక్షగానాల్లోను ఏలలున్నాయి. "సూర్యచంద్ర వహ్నినడుమ శౌర్యమానే చిలుకగంటి, సూర్యదీప్తి గాయుచుండగా, ఏగంటిలింగా! "ఇది యాగంటివారి ప్రసిద్ధ ఏల. శ్రీ వేంకటేశ్వరునిపై బాలిగొన్న నాయిక విరహాన్ని తెలిపే ఏల అన్నమాచార్యుని శృంగార పరినిష్ఠిత విషయాన్ని వివరిస్తుంది క్రింది ఏలలో. ఇది చాలా పెద్ద ఏల.

"మేడలెక్కి నిన్ను(జూచి కూడేననే యాసతోడ
వాడుదేరి వున్సరందురా వేంకటేశ
యూడనుంటివిందా(కానురా ॥
పిక్కటిల్లు చన్నులపై చొక్కపు నీ వుంగరము
గక్కన నేనద్దుకొందురా వేంకటేశ
లక్కలవలె ముద్రలంటెరా ॥
దప్పిగొంటివని నీకు( గప్పురముపారమిచ్చి
ముప్పిరి నీ విరహానను వేంకటేశ
నిప్పనుచు భ్రమసితిరా ॥
నిండ(బూచిన మానిపై గండు(గోవిల గూయ(గా
నిండిన నీ చెలు(గంటాను వేంకటేశ
అందకు నిన్ను రమ్మంటిరా॥" (శృం. సం. 13-723)

కూగూగు :

పిల్లలను ఆడించే సమయంలో పెద్దలు, లేదా పిల్లలు ఆడుకొనే సందర్భంలో పిల్లలే పాడేపాట కూగూగు. ఇది దాగుడుమూతలు, దోబూచులు వంటి పదం. బాలకృష్ణుని ఆటలను వర్ణించేదీ కూగూగు పదం.

"గుఱు తెల్ల(గిన దొంగ కూగూగు వీ(డె
గుడిలోన దా(గీని కూగూగు ॥పల్లవి॥

నెల(తల దో(చీని నీళ్ళాడ(గానె
కొలనిదరిని దొంగ కూగూగు
బలుపైన పుట్ల పాలారగించీని
కొల(దీ మీ(టీన దొంగ కూగూగు ॥గుఱు॥

చల్లలమ్మంగ చసుకట్టు చౌడికీని
గొల్లెతలను దొంగ కూగూగు
యిల్లిలు దప్పక యిందరి పాలిండ్లు
కొల్లలాడిన దొంగ కూగూగు ॥గుఱు॥

తావుకొన్న దొంగఁ దగిలి పట్టండిదె
గోవులలో దొంగ కూగూగు
శ్రీ వేంకటగిరి చెలువుండో యేమో
కోవిదుడు దొంగ కూగూగు ॥గుఱు॥" (శృం.సం. 4-56)

**కోలాటం :**

కోలాటం ప్రసిద్ధమే. అనేక రకాలైన కోలాటం కోపులున్నాయి. కోలాటం పాటలు అన్నమాచార్యునిలో అనేకమున్నాయి. అందులో ఇది ఒకటి.

గోవింద నందనందన గోపాలకృష్ణ నీ
భావము మాకుంజిక్కె గోపాలకృష్ణ ॥పల్లవి॥

కొంగువట్టినదేమోయి గోపాలకృష్ణ మా-
వంగెన కోవ్వుదువా గోపాలకృష్ణ
దొంగతనాల నవ్వేవు గోపాలకృష్ణ
బంగారు కాశితోడి గోపాలకృష్ణ ॥గోవింద॥

కొమ్మల చీరలంటిన గోపాలకృష్ణ
వమ్మి నిన్నుం దిట్టేము గోపాలకృష్ణ
కుమ్మరించేవేల సిగ్గు గోపాలకృష్ణ
బమ్మెర పోతిందుల గోపాలకృష్ణ ॥గోవింద॥ (శృం.సం. 3-174)

ఇలాగే మరొకపదం - కోలాటం ఉంది ఇందులో-

"వాఁడే వాఁడే అల్ల రివాఁడదివో
నాఁడు నాఁడు యమునా నదిలో ॥పల్లవి॥

కాంతలు వలయపు కంకణ రవముల
నంతనంతఁ గోలాటమాడఁగను
చెంతల నడుమను శ్రీరమణుఁడమరె
సంతతపుఁ జుక్కలలో చంద్రునివలెను ॥వాదే॥
(శృం. సం. 25-343)

**గొబ్బిళ్ళు :**

ఈ గొబ్బి పాటలు సంక్రాంతి సందర్భంలో స్త్రీలందరూ వయోభేదం

లేకుండా ఆడుతూపాడే పాటలు - తెలంగాణాలోని బొడ్డెమ్మ బతుకమ్మలాంటి పదాలు. పేడతో గొబ్బినిచేసి పూలతో అలంకరించి చుట్టూ తిరుగుతూ ఈ గొబ్బి పాటలు పాడతారు. కృష్ణుని లీలను వర్ణించే దీ పదం.

"కొలనిదోపరికి గొబ్బిళ్ళో యదు-
కులస్వామికిని గొబ్బిళ్ళో ॥పల్లవి॥

కొండ గొడుగుగా గోవుల(గాచిన
కొండుక శిశువుకు గొబ్బిళ్లో
దుండగంపు దైత్యులకెల్లను తల-
గుండు గండనికి గొబ్బిళ్ళో ॥కొలని॥

పాపవిధుల శిశుపాలుని తిట్ల
కోపగానికిని గొబ్బిళ్లో
యేపున(గంసుని ఁడుమల( బెట్టిన
గోపబాలునికి గొబ్బిళ్లో ॥కొలని॥

దండివైరులను తరిమిన దనుజుల-
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండి( బైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్లో ॥కొలని॥" (శృం.సం. 12-98)

**చందమామ పదం :**

వెన్నెల్లో ఆడపిల్లలు ఆడుకొంటూ ఉత్సాహంగా పాడుకొనే పాటలు చందమామ పదాలు. అన్నమయ్య చందమామ పద మీ కిందిది.

చందమామరావో జాబిల్లిరావో మంచి
కుందనపు పైడి కోరపెన్నబాలుదేవో ॥పల్లవి॥

నగుమోము చక్కని యయ్యకు నలువ(బుట్టించిన తండ్రికి
నిగమములందుండే యప్పకు మా నీలవర్ణునికి
జగమెల్ల నేలిన స్వామికి జక్కని యిందిర మగనికి
ముగురికి మొదలైన ఘనునికి మాముద్దుల మురారిబాలునికి ॥చంద॥

(అన్నమాచార్య సంకీర్తనములు ఉత్సవగానోపయోగార్థముద్ధృతములు -144

చాంగుబళా :

'చాంగుభళా' అనేది కోలాటపు వరుసల్లో ఒకటిగా భావించారు ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు. కానీ ఎచ్చరిక, పరాకు వంటిదని పేర్కొన్నారు. బాగు బాగు, భేషభేష వంటిదని భావించవచ్చు. చాంగుభళా మరల మరల వస్తుంది. అలమేల్మంగా వైభవాన్ని చిత్రించే చాంగుభళా పదమిది.

"చక్కని తల్లికి చాంగుబళా తన-
చక్కెర మోవికి చాంగుబళా ॥పల్లవి॥

కులికేటి మురిపెపు గుమరింపు దన
సళుపు జూవులకు చాంగుబళా
పలుకుల సొలపుల బతితో గసరెడి
చలముల యలుకకు చాంగుబళా ॥చక్కని॥

కిన్నెరతోఁ బతికెలన నిలుచు దన-
చన్ను మెఱుగులకు చాంగుబళా
ఉన్నతి బతిపై నొరిగి నిలుచు దన
సన్నపు నడిమికి చాంగుబళా ॥చక్కని॥

జందెపు ముత్యపు సరుల హారముల
చందన గంధికి చాంగుబళా
విందయి వేంకటవిభు బెనచిన తన
పందదండలకు చాంగుబళా ॥చక్కని॥" (శృం.సం. 12-107)

జాజర :

నాచన సోమనాథుని వసంతవిలాసంలోనిదని ప్రసిద్ధిపొందిన "వీణాగానము వెన్నెల తేట రాణ మీరగా రమణుల పాట, ప్రాణమైన పిన బ్రాహ్మణు పీట, జాణలు మెత్తురు జాజరపాట" అనేది పండితులకు పరిచయమే. శ్రీనాథాదులలోను ఈ జాజర కనిపిస్తుంది. వసంతోత్సవ సమయాల్లో వెన్నెల రాత్రులలో స్త్రీలు, శృంగార ప్రియులు పాడేపాటలు జాజరపాటలు. వీటిలో శృంగారంతోపాటు హాస్యమూ ఉంటుంది. ఒకానొక నాయిక శ్రీవేంకటేశ్వరుని వలపుతో పాడిన జాజర ఇది :

"చాలు చాలు నీ జాజర నన్ను
జాలి బరచె నీ జాజర ॥పల్లవి॥

వలపువేదనల వాడేను యీ
తలనొప్పులచే దలకేను
పులకల మేనితో బొరలేను కడు
జలిగొని చల్లకు జాజర ॥చాలు॥

ఒల్లని నినుగని వుడికేను నీ
చిల్లర చేతల జిమిడేను
కల్ల గంద వొడి గాగేను పై
జల్లకు చల్లకు జాజర ॥చాలు॥

తివిరి వేంకటాధిప నేను నీ
కవుఁగిటి కబ్బితి గడు నేను
తవరవ చెమట గరగి నేడు యిదె
చవులాయను నీ జాజర ॥చాలు॥" (శృం.సం. 12-332)

**జోల :**

అందరు తల్లులు తమ పిల్లలను నిద్రపుచ్చుతూ, రాముడనో, కృష్ణుడనో భావించి పాడుతారు జోలపాటలు. ప్రసిద్ధమైన 'అన్నమాచార్యు'ని జోల ఇది. వివరాలకు చూడుడు నా 'పదసాహిత్య పరిమళం' అనే గ్రంథం.

"జోవచ్యు తానంద జోజో ముకుంద
రావె పరమానంద రామగోవింద ॥జోవ॥

నందునింటను జేరి నయము మీఱంగ
చంద్రవదనలు నీకు సేవచేయంగ
నందము వారిండ్ల నాడుచుండంగ
మందలకు దొంగ మాముద్దురంగ ॥జోవ॥

పాలవారాశిలో పవళించినావు
బాలుగా మునుల కభయమిచ్చినావు

మేలుగా వసుదేవు కుదయించినావు
బాలుడై యుండి గోపాలుడైనావు ॥జోవ॥

అట్టు గట్టిన మీఁగడట్టె తిన్నాడే
పట్టె కోడలు మూతిపై రాసినాడే
అట్టె తినెనని యత్తయడుగ విన్నాడే
గట్టిగానిదె దొంగకొట్టుమన్నాడే ॥జోవ॥"

(అన్నమాచార్య చరిత్ర పీఠిక-పు. 61)

ఇదే పల్లవితో జానపదగేయమూ ఉంది. నా సేకరణలోని జోలపాట చాలా ప్రసిద్ధమే - వివరాలకు నా 'జానపదగేయాలు', 'పదసాహిత్యపరిమళం' గ్రంథాలు చూడవచ్చు.

"జో అచ్చుతానందా జోజో ముకుందా
లాలి పరమానంద రామగోవిందా లాలీ'
తొలుత బ్రహ్మాండంబు తొట్టి గావించీ
నాలుగూ వేదములు గొలుసులమరించీ ॥జోజో॥

(జానపద గేయాలు)

**లాలిపాట :**

ఇది జోలపాటలాంటిదే.

"లాలనుచు నూ చేరు లలన లిరుగడల
బాలగండ వరగోపాల నినుఁ జాల ॥పల్లవి॥

ఉదుటు గుబ్బల సరములుయ్యాల లూఁగ
పదరి కంకణ రవము బహుగతుల మ్రోఁగ
వొదిగె చెంపల కొప్పు లొక్కింతవీఁగ

ముదురు చెమటల నళికములు తొప్పదోఁగ ॥లాలి॥"

(అన్నమాచార్య చరిత్ర పీఠిక – పు 63, 64)

వివరాలకు నా రచనలు 'జానపనగేయాలు; 'పదసాహిత్య పరిమళం' చూడవచ్చు.

**శోభనం :**

పెళ్లి సమయంలో పాడేపాట. భగవంతుని పెండ్లిసందర్భంలోనూ పాడడం పరిపాటే.

"శోభనమే శోభనమే
వైభవముల పావనమూర్తికి ॥పల్లవి॥

అరుదుగ మును నరకాసురుడు
సిరులతోఁ జెరలుదెచ్చిన సతుల
పరువపు వయసుల (లవ) బదారువేలను
నొరిదిఁ బెండ్లాడిన సుముఖునికి ॥శోభ॥ (శృం.సం. 12-18)

ఇలాగే సోబాన పాట గూడా ఉంది :

"పిలువక వచ్చితిమి పేరంటాండ్లము
నొలసి నొలపి మీపైన సోబాన పాడేము॥" (శృం.సం. 24-53)

"పాడరే సోబనాలు పడఁతులాల
వేడుకలిద్దరికి వెలసెఁ జూడరే" (శృం. సం. 24-436)

**సువ్విపాట :**

సువ్విపాట దంపుళ్ల సమయంలో పాడతారు. స్త్రీలు రోటిలో ధాన్యం మొదలైనవి వేసి దంచేప్పుడు పాడేపాట సువ్విపాట. ఇది దంపుళ్ళ పాట కూడా. పెళ్ళిళ్ళలో కొట్నాలు దంచేప్పుడు పాడతారు.

"సువ్వి సువ్వి సువ్వని
సుదతులు దంచెదరోలాల ॥పల్లవి॥

వనితల మనసులు కుందెన చేసిటు
వలపులు తగనించో లాల
కనుసన్నలనెడు రోఁకండ్లను
కన్నెలు దంచెదరోలాల ॥సువ్వి॥

బంగారు చెరఁగుల పట్టు పుట్టముల
కొంగులు దూలఁగ నోలాల
అంగనలందరు నతివేడుకతో
సంగడి దంచెదరోలాల ॥సువ్వి॥

కురులు దూలఁగ మంచి గుబ్బ చన్నులపై
సరులు దూలాడఁగ నోలాల
అరవిరి బాగుల నతివలు ముద్దులు
గురియుచు దంచెదరోలాల ॥సువ్వి॥

ఘల్లు ఘల్లుమని (ను) కంకణ రవములు (ల)
వల్లవపాణులకో (నో) లాల
అల్లన నడుములు అసియాడుచు సతు
లొల్లనె దంచెద రోలాల

కప్పుర గందులు కమ్మని పువ్వుల
చప్పరములలో నోలాల
తెప్పలుగా రతిఁదేలుచుఁగోనే
టప్పనిఁ బాడెద రోలాల ॥సువ్వి॥" (శృం.సం. 11-353)

ఆదేవరుసలో నడిచే మరో పదం

"వేంకటాద్రి విభునిఁబాసి విరహిణైన రమణిఁజూచి
రంకెలు వేయనేఁటికమ్మ రాజసమునను వల్ల వి॥

విసపుకోర సోఁకినపుడె వేఁడిలేని చందమామ
మిసిమిగలుగు వేఁడి చూపుమింట మలయునే
నొసలికంటి కాఁకనణఁగి నొగిలినడెడె తొడుగలేక
కుసుమ శరము మదనుఁడతివకొరకు దాఁచెనే ॥వేంక॥"

(శృం. సం. 315)

నా సేకరణలోని జానపదగేయాల్లో ఒక సువ్విపాట ఉంది.

"సువ్వి కస్తూరిరంగ సువ్విరామాభిరామ సువ్విలాలీ ॥సువ్వి॥

తుమ్మిమాను తూటపొడిసి తూముడొడ్లు వాయిపోసి
సువ్విపాడి దంచిరమ్మ సాదెలిద్దరూ సువ్వీలాలీ ॥సువ్వి॥

సువ్వీకస్తూరి రంగ సువ్విరామాభిరామ సువ్వీలాలీ ॥సువ్వి॥"
(జానపద గేయాలు-పు.25)

కపిల (మోట) పాటల వరుసల్లో సైతం అన్నమాచార్యుల సంకీర్తనల్లో ఉన్నాయి. ఉదాహరణ :

"భావమెరుగని వడుచావోసే
వోవే వోవే వోసే వడుచా ॥పల్లవి॥

మొరఁగు మరఁగు వింతకరఁగుదేనెల-
పరచు మాటల వడుచా
చురుకు మెరుపు వాలుఁజూపుల కన్నుల
కెరలఁ బొడిచి గిలిగించేవే వడుచా ॥భావ॥ (శృం.సం.12-269)

కపిల పాటల బాణీను సంకీర్తనల్లో కూర్చడం అన్నమాచార్యుల ఘనత.

**తందనాన :**

ఈ తందాన పాటలు ప్రజలు సామూహికంగా పాడుకొనే పాటలు. ఏకతార లాంటి వాద్యం వాయిస్తూ పాడుకొంటారు. తందాన, తందనాన, తందాన తాన అనే పదాలు పునరుక్తమవుతాయి. చాలా ప్రసిద్ధమైన అన్నమాచార్య తందానపాట సర్వసమానత్వాన్ని ప్రబోధిస్తుంది.

తందనాన ఆహి తంధనాన పురె
తందనాన భళా తందనాన ॥పల్లవి॥

బ్రహ్మమొకటె పరబ్రహ్మ మొకటె పర
బ్రహ్మమొకటే పరబ్రహ్మమొకటే ॥తంద॥

కందువగు హీనాధికములిందు లేవు
అందరికి శ్రీహరే అంతరాత్మ

ఇందులో జంతుకుల మింతా నొకటే
అందరికి శ్రీహరే అంతరాత్మ ॥తంద॥

నిండారరాజు నిద్రించు నిద్రయునొకటే
అండనే బంటు నిద్ర అదియు నొకటే
మెండైన బ్రాహ్మణుడు మెట్టు భూమియొకటే
చండాలుడుండేటి సరిభూమి యొకటే ॥తంద॥"

(అధ్యా. సం. 2-3

ఇది తత్వంలాగా ఉంది. తాత్వికాంశాలు సైతం ఇందులో ఉ అంటే తత్వపు బాణిలో రచన సాగడమేగాక తత్సంబంధమైన విషయ మిందుంది. ఇంతేగాక ఈనాటి బుర్రకథల అంశం సైతం ఉంది. బుర్ర తందాన పాటలనడమూ కద్దు. అయితే ఆ బుర్రకథలు సుదీర్ఘంగా కథనా కొనసాగుతాయి. ఈ అంశం మనకందరికీ తెలిసిందే.

**దోబూచి :**

ఇది-దాగుడుమూతలు, కూగూగులు మొదలైన వాటిలాంటిది. ఆడుకొంటూ పాడేపాట. బాలకృష్ణ లీలల వివరణ యీ పదంలో చూడ

"బండి విరిచి పిన్న పాపలతోనాడి
దుండగీడు వచ్చె దోబూచి ॥పల్ల వి॥

పెరుగు వెన్నలు ప్రియమున వే-
మరు మ్రుచ్చిలించు మాయకాడు
పెరవున్న (పున) తనవిధము దాచుకొని
చోరదొంగ వచ్చె దోబూచి ॥బండి॥

వడుచు గుబ్బెత పరపుపై పోక-
ముడిగొంగు నిద్రముంపునను
పడియుండా వద్ద బవళించినట్టి-
తొడుకు దొంగ వచ్చె దోబూచి ॥బండి॥

గొల్ల పల్లెలో యిల్లిల్లూ చొచ్చి
కొల్ల వాడిన కోడెకాఁడు
యెల్ల యినా వేంకటేశుఁడు ఇదె
తొల్లి పె చొంగ వచ్చె దోబూచి ॥బండి॥" (శృం. సం. 12-227)

**మంగళం :**

కార్యాంతంలో శుభాన్ని కోరుతూ పాడేపాట మంగళం - దేవతలకోసం పాడే మంగళం.

"మంగళము గోవిందునకు జయమంగళము గరుడధ్వజునకును
మంగళము సర్వాత్మునకు ధర్మస్వరూపునకూ జయజయ ॥పల్లవి॥

ఆదికిని నాద్యైన దేవున కచ్యుతున కంభోజనాభున-
కాదికూర్మంబైన జగదాధారమూర్తికిని
వేదరక్షకునకును సంతత వేదమార్గవిహారునకు బలి-
భేదికిని సామాదిగాన ప్రియవిహారునకు ॥మంగ॥
(అధ్యా. సం. 1-46)

**మేలుకొలుపు :**

మేలుకొలుపు దేవతోద్దిష్టం. కానీ క్రమంగా తల్లులు తమ పిల్లలను మేలుకొల్పడానికీ, వందిమాగధులు, రాజులను మేల్కొలుపడానికి వీటిని ప్రయోగిస్తూ వచ్చారు. సుప్రభాతం ప్రసిద్ధమే కదా! ఇది అన్నమాచార్యుని మేలుకొలుపు.

"హరికృష్ణ మేలుకొను ఆదిపురుషా
తరవాత నామోము తప్పకిటు చూడు ॥పల్లవి॥

మేలుకొను నాయన్న మెల్లనే నీతోడి
బాలులదె పిలిచేరు బడినాడను
చాలునిఁక నిద్దురలు చద్దికూళ్ల ప్రొద్దు
వేళాయ నాతండ్రి వేగలేవే ॥హరి॥ (అధ్యా.సం. 9-254)

నా సేకరణలోని జానపదగేయాల్లో ఇలాంటి మేలుకొలుపు ఉంది.

"గోవింద అని నిన్ను గోపికలందరూ
గొల్లవారందరూ కొలుసుతున్నారు॥ మేలుకో కృష్ణ మేలుకో॥
నారాయణాయని నమ్మి నీ భక్తులు ,, ,, ,,
మోదాము చెందుతున్నారు ,, ,, ,,
శరణన్న వారీని రక్షగా బిరుదునీకుంది॥ ,, ,, ,,
వాసావ వందిత వైకుంఠవాసుఁడా
చల్లని చూవులూ తెల్లని నామమూ
చల్లనీ నాసామి ॥మేలుకో కృష్ణా మేలుకో॥
(జానపదగేయాలు-పు-123)

## నివాళి :

ఇది నీరాజనమూ రెండూ ఆరతి వంటివే. కానీ నివాళి మాత్రం దిగదుడుపు సందర్భంలోనే ఉండేదనీ, క్రమంగా ఇదిగూడా ఆరతివంటిదైందని అంటారు.

"నిచ్చ నిచ్చ జేకొనునివాళి
యిచ్చఁ జేరెవరమోబుశేశ నివాళి ॥పల్లవి॥
సొలపుల వాలుక చూపుల నెత్తేరు
నెలఁతలు నీకిదె నివాళి
వలయపు కంకణ రవంబుల నెత్తేరు
నిలువుఁ బయ్యదల నివాళి ॥నిచ్చ॥" (శృం.సం. 28-129)

## నీరాజనం :

ఆరతిలాంటిదే. దైవపూజలో చివరి దీ నీరాజనం.

"క్షీరాబ్ధి కన్యకకు శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయమునకు (యకును) నీరాజనం

జలాక్షి మోమునకు జక్కవ కుచంబులకు
నెలకొన్న కప్పురపు నీరాజనం
అలివేణి తురుమునకు హస్తకమలంబులకు
నిలువు మాణిక్యముల నీరాజనం ॥క్షీరాబ్ధి॥ (శృం.సం. 26-295)

**వరస పాటలు; బావమరదళ్లు :**

గృహాల్లోను, దగ్గర సంబంధీకుల్లో ముఖ్యంగా మేనమామ బావలతో అత్తాకోడళ్ల మధ్యసాగే వే వరసపాటలు ;

"ఏలే యేలే మరఁదలా చాలుఁజాలు చాలును
చాలు నీతోడి సరసంబు బావ "॥పల్లవి॥

గాఁడపు గుబ్బలు గదలఁగ గులికేవు
మాటలఁ దేటల మరఁదల
చీటికి మాటికిఁ జెనకేవే వట్టి-
బూటకాలు మాని పోవేబావ ॥ఏమే॥" (శృం.సం. 12-163)

**వదిన మరది :**

"వొగ్గి నామాట వినవే వో వదినె
శిగ్గిరి మరందివని చెవులు సోకవురా ॥పల్లవి॥

వొద్దకి వత్తు నటవేవో వదినె - వోరి
పొద్దుపోని మరందివి పొసంగుదురా
గద్దించకువే సందెకాడ వదినె
ముద్దుల మరందిలింత మ్రొక్కఁడమేటికిరా ॥వొగ్గి॥"
(శృం. సం. 3-144)

**వాకోవాక్యం :**

దీన్నే సంభాషణాత్మకమనీ, సంబుద్ధి అనీ, సంబోధనమనీ అంటా పై వరుస పాటలూ ఈ వాకోవాక్యంలోనే చేరుతాయి, అవి సంభాషణాత్మకం ఉంటాయి గనుక.

అత్తాకోడళ్ళు :

రావే కోడల రట్టడి కోడల
పోవే పోవే అత్తయ్యా పొందులు నీతోఁజాలును ॥పల్లవి॥

రంకెలు వేయుచు రాజులెదుట నీవు
కొంకు గొసరు లేని కోడల
పంకజముఖి నీవు పలుదొడ్డవారిండ్ల
అంకెలఁ దిరిగేవు అత్తయ్యా ॥రావే॥ (శృం. సం. 12-313)

శ్వేతకృష్ణులు :

"పయటం దించే వే గొల్ల పడుచా నీపె
బయలు లిందించేవు లోపలనే కన్నులను ॥పల్లవి॥

పాలువోయవుగ గొల్ల పడుచ - యీ-
పాలకుండలివి లోలోవలనున్నవి
పాలుమాలే వేల గొల్ల పడుచ మా
పాలునీకు నేలయ్యా పాలవారి వాఁడవు ॥పయట॥"
(శృం. సం. 3-265)

ఇలాంటివనేకమున్నాయి. ఇంకా నాయికానాయకులు, నాయికా, చెలులు మరింకెందరో సంభాషించే పదాలు అనేకం ఉన్నాయి.

పొడుపుకథ :

పొడుపుకథనే మారుకథ, ఒడ్డుకథ అని కూడా అంటారు. ఇదీ జానపద విజ్ఞానంలో ఒక అంశం. అయితే ఇది పాటలా ఉండదు. అయినా అన్నమాచార్యులు ఈ పొడుపుకథల్ని సైతం తన సంకీర్తనల్లో పొందుపరచి జానపద ధోరణిని పరిరక్షించాడని విస్పష్టమవుతుంది. అలాంటి పదాలనేకం ఉన్నాయి. ఉదాహరణకి ఒకటి :

"అంతసిగ్గువడకువే అతివ నీవు
పంతమునఁ దెలియవే పాయమెల్ల గడువు ॥పల్లవి॥

గొందినొక్క సింహమట కొండలుమోచినదట
ఇందుముఖుల నడుమె ఇరవట
కందువ యీ పొడుపుడుగతయిది నీవునాకు
అందముగ నానతీపే అరునెల్ల గడువు ॥అంత॥

మొగినొక్క తామరలో మోవిపండు వండెనట
జిగిదేనె వావాతఁ జిందెనట
మగువ యీయారచి మతినీవు దెలియవే
తొగరు నీ పలుకుల తుదదాఁకా గడువు ॥అంత॥

కంతుని గురుతు రెండుగంబముల మేడట
దొంతివలపుల సిరి దొలఁకునట
ఇంతి నేను శ్రీ వేంకటేశుఁడ యీ కత
మంతనాన నిన్నుఁగూడి మరపించే గడువు ॥అంత॥

(శృం. సం. 30-4)

ఇలాగా అన్నమాచార్యులు. శృంగార, అధ్యాత్మ సంకీర్తనలలో జానపద ధోరణుల్ని సందర్భోచితంగా ప్రదర్శించి ప్రజాకవి అయ్యాడని చెప్పక చెప్తుంది. అతని భాషసైతం ప్రజాభాష. ఆయన మహాకవి.

## 4.6 హాస్యం :

అన్నమాచార్యుల అధ్యాత్మ శృంగార సంకీర్తనలలో అధిక భాగం శృంగార సంకీర్తనలే. ఈ శృంగార సంకీర్తనల్లో పలుపోకడలు పోయినట్లు స్పష్టం. అలాగే శృంగారం ప్రధానంగా, లేదా శృంగారాభాస ప్రముఖంగా హాస్యం వ్యంజింపచేయడం సైతం మనం ఆయన శృంగార సంకీర్తనల్లో చూడగలం. నాయకుడే అనుకొని ఇద్దరు నాయికలు గవ మునకు ఇందులో వర్ణించి 'ఇష్పీ' అంటూనే ఒక నాయిక నాయకునితో విన్నవించి హాస్యాన్ని కల్పిస్తుంది.

"యిద్దరమాడవారమే యిశ్శిరోత
వొద్దిక మాలోనేమే నొత్తి నవ్వితిమిరా ॥పల్లవి॥

పవ్వళించి నీవునేనుం బానుపైనుండగాను
యెవ్వతో నీవంటా నన్ను నిటు లేపెరా
రవ్వగా నీపె నన్ను రతికింబిలిచెనంటా
నెవ్వగంగౌఁగిలించితి నిదుర కన్నులను ॥యిద్దరు॥

కదిపి నీవును నేను కౌగిలించుకుండగానె
సుదతి నీవంటా నన్ను చోటడిగెరా
మదన పరవశాన మటి నీవంటానాపె
వదనమున మోము వడినే నిడెరా ॥యిద్దర॥

ముచ్చట నీవును నేను ముసుంగు పెట్టుకుండగా
మచ్చికె నీవంటా నాతో మాటచెప్పెరా
యిచ్చకుండ శ్రీవేంకటేశుండ నీవంటానాపె
వచ్చి నన్నుంగూడంగా నడుమ నీవుంటివి ॥యిద్దర॥" (128)

ఇలాగే నాయికా నాయకుల శృంగారంలో కలిగిన మార్పును అన్నమాచార్యులు అతిరమ్యంగా వర్ణించి శృంగార రసస్ఫూర్తితో హాస్యాన్ని జోడించి అందించాడు అత్యంతమైన చాకచక్యంతో.

"మగరూపు నాఁడురూపు మారుచుకొని రిద్దరు
సొగి నెద్దము చూవరే చూచుకొనే రిద్దరు దామే ॥పల్లవి॥

కలికి కస్తూరి బొట్టు కాంతుని నొసల నంచె
నిలువు నామము పైపై నెలఁతకంచె
అలివేణి కొప్పు జారి ఆతనికొప్పుపై వాలె
అలరె నీతని (న్వి) సిక ఆతని పాపటపైని ॥మగ॥

కుంకుమ గుబ్బల పూఁత గురుతు విభునికంచె
అంకెఁటతి రొమ్ము బొచ్చు ఆకెకంటెను
కంకణాల గాజులచేయి ఘనుని సందిటఁ జిక్కె
అంకపు సాములచేయి ఆకెసందిటఁ జిక్కెను ॥మగ॥

మట్టెల పాదములవె మగిడె నాతని మీఁద
నిట్ట పెద్దపాదాలు నిలిచెనందు
యట్టె శ్రీవేంకటేశుఁ డింతిఁగూడి పానుపుపై
పట్టపగలిందరిని భ్రమయించిరిదివో ॥మగ॥" (శృం.సం. 3-513)

ఇలాగే వ్యంగ్యం, హాస్యం అర్థాంతరన్యాసాలంకారంలో పొందుపరచి, లోక సహజ విషయాలు తెలుపుతూ శృంగారాత్మకంగా రచించిన తీరు అనన్య సామాన్యం: అన్నమాచార్యునికే సాధ్యం :

"నగుఁబాటు లివిగొన్ని నడచేవుగాక యీ-
అగడుఁజేఁతలు సేసి అడిక కెక్కుదురా ॥పల్లవి॥

మగువనే కట్టుకొంటే మంగళసూత్రముగాను
మెగసక్కెల గొల్లెత లేమందురో
జగములో నెవ్వరైనా సతులకుఁ బురుషులు
తగఁగట్టుదురు గాక తాముగట్టుకొందురా ॥నగు॥

ఆకె పుట్టినిల్లే నీకు నాకరము పేసుకొంటి-
వీకడఁ బోఁ (బొం) దైన సతులేమందురో
యేకమై తమ సతుల యిల్లు నించుకొంటగాక
యేకడా ఘనులైన నారిల్లిటము లుందురా ॥నగు॥

అలమేలుమంగవల్ల నన్ని సిరులూ నందితి-
విల నీ కూటపు సతు లేమందురో
కలవి శ్రీవేంకటేశ కాంతల కిత్తురుగాక
అలరి సతుల సొమ్ము కానపడఁ జూతురా ॥నగు॥"
(శృం. సం. 26 - 188)

ఒక నాయిక మరో నాయిక చేష్టల్ని హేళనచేసి తద్వారా హాస్యోత్పత్తికి కారణమైనట్లు అన్నమాచార్యులు మనోరంజకంగా సంకీర్తన రచించి తరించాడు-

"ఎన్ని చందాలదానవే ఇంతిరో నీవు
ఇన్నేసి నేరుచుకొంటి విందరిలో నీవు ॥పల్లవి॥

నిక్కించేవు నీవురము నేడు నీపతి యెదుట
పిక్కటిల్లి చన్నులిట్టె పెరిగినవే
పక్కన నెమట పూవు బంతినే అందుకొనేవు
చిక్కని నీసింగారము చిందీనవే ॥ఎన్ని॥

పొడవుగ నేడలేని బోలు గొప్పు పెట్టితివి
నిడుపులు సాగినవే నీ నెరులు
మడుగుజీర మడిచిమడిచి కట్టుకొంటివి
తొడి(బడ) బిరుదిది దొడ్డాయనటనే ॥ఎన్ని॥

వెరగువడి యీతని వేమారు జూచేవు
వెరసి నీ కన్నులింకా బెద్ద వౌనవే
పరగనలమేల్మంగపతి శ్రీవేంకటేశుడు
సరిగి నన్నేలె నీకూ మగడయ్యా నటవే ॥ఎన్ని॥
(శృం. సం. 24-292)

ఇలాగే ఇంకా ఎన్నైనా ఉదాహరణలీవచ్చును. చక్కటి హాస్యస్ఫోరకమైన రచనా వైవిధ్యాన్ని సైతం తన సంకీర్తనల్లో సాధించి అన్నమాచార్యులు కావ్యకర్తలకంటే ప్రౌఢకవిలా ప్రత్యక్షమవుతున్నాడు.

## 4.7 శైలి :

పద్య రచనాశైలికి, పదరచనాశైలికి ఎంతో తేడా ఉంది. ముఖ్యంగా పద్యరచన గణయతిప్రాసాదులతో కవిత్వ ప్రౌఢిమతో ఒప్పారుతూంటుంది. పదంలో కవితా పటిమకంటే, భాషా ప్రౌఢిమకంటే సారళ్యం, లాలిత్యం మొదలైన లక్షణాలతో సంగీతప్రాధాన్యం అధికం. అలాంటి రచనా వైవిధ్యంతో చక్కటి శైలి అన్నమాచార్యుల సంకీర్తనల్లో చూడవచ్చు. అంతేగాక పదకవిత్వంలోని నాత్రి ప్రౌఢిమ, కామనీయకం, మనోహరత్వం మొదలైన లక్షణాలను, యతి ప్రాసాదులలో దేశీరీతిలో మాత్రాబద్ధమై ఒప్పారుతూండడం అన్నమాచార్యుల సంకీర్తనల్లో మనం గమనించగలం. ఇతఃపూర్వమే అన్నమాచార్యుల కవితా కామనీయకంలో, భావుకత, చమత్కారం, వర్ణనా వైదగ్ధ్యం, ఆలంకారిక శైలీ

విన్యాసం మొదలైన వాటిని మనం చవిచూశాము. ఇంకా మరికొన్ని అంశాల్ని ప్రస్తుతం పరిశీలిద్దాం.

"ఇది (అన్నమాచార్యునిది) పదవాఙ్మయమైనను శైలియంతయు ప్రాబంధికముగసాగినది. పదములు, సమాసఘటన, వర్ణనలు ఇవి యన్నియు ప్రబంధముల ధోరణిలోనివే. ఉదాహరణము.

సామంతం :

చల్లనై కాయఁగదో చందమామా నీ-
వెల్ల (ల్లి)గాఁ దిరువేంకటేశునెదుర
మొల్లమిగ నమృతంపు వెల్లిగొల్పుచు లోక-
మెల్ల నినుఁగొని యాడఁగాను ॥చల్ల ని॥ (12-229)

ఈ పాటలోని పద్ధతిని గమనించితిమేని శైలిపై చెప్పిన విధముగ నున్నదనుటలో సందేహము లేదు. అక్కడక్కడ గ్రామ్యజనోక్తులవలె శుద్ధాంధ్ర వ్యావహారికములు గల శైలియు కలదు. విరివిగా నున్నది పైజెప్పిన శైలియే. అన్వయముగూడ పైనుదాహరించిన పాటను చూచితిమేని ప్రబంధ ఫక్కిలోనే కన్పడుచుండును. యతిప్రాస ఘటనమంతయు, తిక్కనవలెనే భూతబలివేసినట్లుగ ఛాందసులను చూచుకొండని హెచ్చరించినట్లు కనబడును. అక్కడక్కడ యతిప్రాసస్థలములందు జల్లు పదములు కానవచ్చుటకీ దూకుడే కారణము గావచ్చు విలంబమునోర్వని భావతీవ్రత, దాని నల్లి వేయుటలో గల వేగము ఈతనియోర్పును సన్నగిల్ల చేసియుండును.

"ఈతని రచన తిక్కనరచనవలె దేశిమాండలిక పదబాహుళ్యము. వాక్య నిర్మాణముగూడ మనము వ్యవహరించునపుడు మాటలాడునట్టిదిగా అక్కడక్కడ దోచుచుండును. ఈ పద్ధతి తిక్కనయందు అడుగడుగున గన్పట్టుచుండును. (గౌరిపెద్ది రామసుబ్బశర్మ : అన్నమాచార్య శృంగారసంకీర్తనలు : సం. 12 - పీఠిక - పు. 26, 27)

"సంస్కృతాంధ్ర కవులవలె ఏ రామాయణాది గ్రంథకథలనో ఉపాఖ్యానములనో ఆధారముగాచేసికొని వీరిపదవాఙ్మయము నడువలేదు. వీరి కవిత్వమునకు

మూలవస్తువు శ్రీవేంకటేశ్వరుని మూలమూర్తియే. భాషాభావములు చూచిన ఎఱ్ఱన హరివంశమూ, కొన్ని మాండలికములందు సోముని ఉత్తర హరివంశమూ, తిక్కన గారి దేశిపదసంపద కానవచ్చును. కాని ఇది వీరిది అని తేల్చి చెప్పుటకు తగిన యాధారములు లేవు........ వీరి పాటలు ముక్తకములవలె దేనికదే సంపూర్ణము, ఉత్తరత్రాన్వయము లేదు. ఎప్పుడేమైనా చెప్పవచ్చు. అది ఆయన స్వేచ్ఛకు సంబంధించినది. శబ్దాలంకారములందు పోతన పోలిక కన్పడుచుండును. ఇద్దరూ ఇంచుమించు సమకాలికులు. ఒక మండలమువారు. కొంత పూర్వమువాడైనా సోముడూ అంతే." (పైదే. పు. 44) అని వివరించిన గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి మాటలలో సత్యముంది.

అయితే వారే పేర్కొన్నట్లు ఇదొక కథకాదు. ఆయా సందర్భాలలో తోచినట్లు వేంకటేశునిపై భక్తి ప్రపత్తిని, శృంగార సురుచిరత్వాన్ని తన సంకీర్తనల్లో అందించాడు అన్నమాచార్యులు. రామాయణ, భారత, భాగవత, హరివంశాదులలోని కథలు సైతం అక్కడక్కడా పదాల్లో చోటుచేసుకున్నాయి. పైగా ఈ పదాలు కేవలం పఠించి ఆనందించడానికి మాత్రమే పరిమితం కాలేదు. ఇవి ఆడిపాడి ఆనందించడానికి ఉద్దేశించి రచితమయ్యాయి. ఆ విధంగా అన్నమాచార్యుడు ఆయావేళల తోచినరీతిలో పదరచనచేసి ఆడిపాడి అనంతానందంతో భక్తిపారవశ్యాన్ని ప్రకటించాడు. అందువల్లే గౌరిపెద్దివారు ఈపదాల్లో భావ తీవ్రత, దూకుడు కనిపిస్తున్నాయి అనడంలోని భావమిదే. వ్యవధిలేని భావవ్యక్తీకరణమే దీనికి కారణం. అయితే మాత్రాచ్ఛందస్సులలో యతిప్రాసలతో సంగీతానికి రాగతాళాలతో-ఒదిగిపోవడం అత్యంత ప్రముఖమైన అంశం. అదే అన్నమాచార్యుల గొప్పదనం.

### 4.7.1 శైలీరీతులు :

మామూలు మాటలున్నట్టే ఉంటాయి. కానీ ఎంతో అర్థగాంభీర్యమూ ఉంటుంది. ఒక ఉదాహరణ :

"శిన్నెక తేవే శెలువుని తా
పెన్నెలు సవిగొను పెన్నునితా ॥పల్లవి॥

మూటల్ మాటల్ మూరల్ బారల్
బాటల్ నడిపే బాసలు తా
వేటల్ వీపుల్ వేలుపు గడుపుల్
తేటలు మరగిన దేవుని తా ॥శిన్నెక॥

వాకుల్ చీకుల్ వాదుల్ పోదుల్
సోకపు తొల్లిటి సుద్దుల్ తా
పోకులు లోకుల్ పొగడఁగ మనిపెడి
కేకి గరులతల కిష్టుని తా ॥శిన్నెక॥

బగ్గుల్ నగ్గుల్ బావుల్ సొలె (ర) గా
దగ్గర పెరవగు తపసుల తా
సిగ్గుల్ వాపెడి శ్రీవేంకటపతి-
నగ్గపు సొమ్ముల యాతని తా ॥శిన్నెక॥"

మామూలు వాడుక పదాలున్నా కొన్ని మారుమూలమాటలున్నాయి. సౌలభ్యమే ఈ శైలిలోని లక్షణం. అలవోకగా ఈ పదరచన సాగింది. అన్నమాచార్యుని గొప్పదనమే అది: అది అతని శైలీవిన్యాసానికి చక్కటి నిదర్శనం. మాటలకోసం తడబడ్డట్టుగాని, పెతుక్కొన్నట్లుగాని ఎక్కడా లేదు. ఇందులో 'తా' తాళద్యోతకమని భావించారు గౌరిపెద్దివారు. అంతేగాక రాగానికి సంబంధించింది గూడా.

అన్నమాచార్యుల రచనలో కేవల సంస్కృత పదరచన సైతం ఉంది. ఇది అతనికి సంస్కృతభాషపైగల అధికారాభినివేశాల్ని వెల్లడిస్తుంది. ఒక ఉదాహరణ :

"అహో సురత విహారోయం
సహజ పరాజయ శంకానాస్తి ॥పల్లవి॥

యమునాకూలే సుమలతాగృహే
విమల సైకత వివిధస్థలే
రమ్యే రమణౌ శమతస్తయోః
ప్రమదస్య పరాత్పరం నాస్తి ॥అహో॥" (శృం.సం. 1:

ఇది జయదేవుని గీతగోవిందంలోని అష్టపదులను గుర్తుకు తెస్తుంది. ఇలాంటిదే మరొకటి :

"దంతచ్ఛదముద్రా మదనాస్త్ర ల-
తాంత శాంతికృతిరహో భవతి" (శృం.సం. 12-318)

ఇలాగే కేవలం జానుతెనుగులో రచించిన పదాలు అనేకం. ఒక్క ఉదాహరణ :

"తిట్టినఁ దిట్టినదే తప్పా
బెట్టమ్మా గుంపెన నీచేత ॥పల్లవి॥
వెనక మరలి నవ్వినదే తప్పా
వినవమ్మా నీ విభుఁడౌట
చెనకఁగ జంకించినదే తప్పా
అనవమ్మా నీవాతనిఁ గిసిసి ॥తిట్టిన॥
ఎదుట నిలిచి తురుమిడుటే తప్పా
వదలిన పయ్యెద వాలఁగను
అదన నలసి వుసురసుటే తప్పా
పుధుటుఁ దమకమున నుండఁగలేక ॥తిట్టిన॥
కేలనె యిటు మొక్కినదే తప్పా
కాలుదాఁకి వేంకటపతి
వోలి నేనతనిపై నొరగుటె తప్పా
మేలము లాడుచు మెరపుఁగనతఁడు ॥తిట్టిన॥"
(శృం.సం. 12-317)

ఇందులో విభుడు, వేంకటపతి అనే రెండు శబ్దాలు మాత్రమే సంస్కృత పదాలు. తక్కిన పదమంతా జాను తెనుగు.

ఇలాగే ఏ ఒకటో, రెండో తత్సమాలు తప్ప, తక్కినవన్నీ తద్భవరూపాల తోనే పదం నడిపి, ప్రజలభాషకు అతి సన్నిహితం చేశాడు అన్నమాచార్యులు.

"చక్కని వాఁడ వన్నిటా జాణవు నీవు
మక్కువ నీకుఁజేయుచే మాభాగ్యముగాదా పల్ల వి॥

వన్నెకెక్క నీకునేను వలవ వసమా
కన్నులనే చూచి చొక్కఁగలఁగాక
చన్నులనొత్తి కాఁగిలించఁగ నావసములా
సన్నలనే నీ మోవి చవిగొంటగాక ॥చక్కని॥

ఆయ మెరిఁగి పెనఁగ నప్పటి నా వసమా
కాయమంటి సంతోసించఁగలఁగాక
చేయిముట్టి నేనిన్నుఁ జెనకఁగ వసమా
చాయలకు నీతో సరసమాడుటగాక ॥చక్కని॥

పిలిచి నిన్ను రతులఁ గలయఁగ వసమా
చెలరేఁగి నీసేవచేయుట గాక
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
తలఁచ నిన్ను వసమా తగులుటగాక ॥చక్కని॥
(శృం. సం. 24 - 5)

తెలుగు, సంస్కృతమూ కలగలుపుగా ప్రయోగించి అన్నమాచార్యులు తన ఉభయ భాషా పాండిత్య ప్రకర్ష ను ప్రకటించుకొన్నాడు :

"తగుమునులు ఋషులు తపములు సేయఁగ
గగనము మోచియుఁ గర్మముదెగదా ॥పల్ల వి॥

ధరణీ ధరమందరధర నగధర
చిరకౌస్తుభధర శ్రీధరా
కరిఁగాచితి కాకముగాఁచితి నీ
కరుణకుఁ బాత్రముగల దిదియా ॥తగు॥

భవహర మురహర భక్తపాపహర
భువనభారహర పురహరా

కవిసిన వురుతను గద్దను మెచ్చితి
వివల నీ దయకు నివియా గురుతు ॥తగు॥

శ్రీవేంకటపతి శేషగరుడపతి
భూవనితాపతి భూతపతి
గోవులనేలితి కోతులనేలితి
పావనపుఁ గృపకుఁ బాత్రములివియా ॥తగు॥

(అధ్యా. సం. 3 - 315)

ఇలాంటిదే మరో ఉదాహరణ :

"ఎదురేది యింక మాకు యెందుచూచినను నీ
పదములివి రెండు సంపదలు సౌఖ్యములు పల్లవి॥

గోపికానాథ గోవర్ధనధరా
శ్రీ పుండరీకాక్ష జితమన్మథా
పాపహర సర్వేశ పరమపురుషాచ్యుతా
నీపాదములె మాకు నిధి నిధానములు ॥ఎదు॥

పురుషోత్తమా హరీభువన పరిపాలకా
కరిరాజవరద శ్రీకాంతాధిప
మురహరా సురవరా ముచుకుందరక్షకా
ధరణి నీ పాదములె తల్లియును దండ్రి ॥ఎదు॥

దేవకీనందనా దేవేంద్రవందితా
కైవల్య నిలయ సంకర్షణాఖ్య
శ్రీవేంకటేశ్వరా జీవాంతరాత్మకా
కావలె నీ పాదమువెగతి యిహముఁబరము ॥ఎదు॥

(అధ్యా. సం. 10-256)

ఈ పై పదాలు రెండింటిలోను పల్లవులు తెలుగే. మొదటిపదం చరణాలలో మొదటి రెండు పాదాలు సంస్కృతం, తక్కిన రెండు పాదాలు తెలుగు.

తరువాత పదంలో చరణాల్లో మూడు పాదాలు సంస్కృతమూ, తక్కిన ఒక్కొక్క పాదమూ తెలుగు. ఇలాగా రకరకాలుగా తన సంకీర్తన రచనావైఖరిని, ఉభయ భాషలపై తనకు గల అధికారాన్ని వ్యక్తంచేసి పాండితీ ప్రకర్షను ప్రదర్శించి, శైలీ విన్యాసాన్ని విశదీకరించాడు అన్నమాచార్యులు.

చక్కటి శైలీ విన్యాసానికి మనోహరమైన పదరచన అన్నమాచార్యుల సంకీర్తనలలో కోకొల్లలు. ఒక్క చక్కటి ఉదాహరణ :

"నెరజాణవు కడునేర్పరివి
మఱిగె నీకె నిన్ను మన్నించవయ్యా ॥పల్లవి॥

దొంతులు పెట్టీఁ దొయ్యలి వలపులు
పంతపు మాటలఁ బలుమారును
చింతల చిగురుల సిగ్గులనమ్మి
చెంతఁజేరి మచ్చికఁగొనవయ్యా ॥నెర॥

గంపలముంచీ కాంత కోరికలు
సొంపుల చూపులఁ జొక్కుచును
ముంపుల తేనెలు మోవినె కురిసీ
జంపులేక కడుఁ జవిగొనవయ్యా ॥నెర॥

వుయ్యాలలూఁగీ నుదుటుఁ దమకమున
నెయ్యపు పెరగుల నిక్కుచును
యియ్యెడ శ్రీవేంకటేశ యలమేల్మంగ
చెయ్యారఁగూడిని చేకొనవయ్యా ॥నెర॥" (శృం.సం. 28-393)

అత్యంత మనోజ్ఞమైన భావం, భావానికి తగిన భాషా, ఆభాష మూలంగా అభివ్యక్తీకరించే శైలీవిన్యాసం మనోజ్ఞమై అత్యంతానంద నిష్యంది అయి ఒప్పుతూంది.

శైలీవిన్యాసంతోనే సార్థకపదప్రయోగదక్షతని ప్రదర్శించి తన రచనా శిల్పాన్ని అభివ్యక్తీకరించాడు అన్నమాచార్యులు :

"ఈకెకు నీకుఁదగు నీడుజోడులు
వాకుచ్చి మెచ్చుఁ బొగడవసమా మొరులకు ॥పల్లవి॥

జట్టిగొన్న నీ వేవులు చంద్రముఖి గనుక
అట్టె నిన్ను రామచంద్రుఁడనఁదగును
చుట్టమై కృష్ణవర్ణపు చూపులయాపె గనుక
చుట్టుకొని నిన్ను కృష్ణుఁడనఁదగును ॥ఈకెకు॥

చందమైన వామలోచన యూపెయాఁగనక
అందరు నిన్ను వామనుఁడనఁ దగును
చెంది యాకె యప్పటిని సింహమధ్యఁగనక
అందినిన్ను నరసింహుఁడని పిల్వఁదగును ॥ఈకెకు॥

చెలువమైన యూపె శ్రీదేవి యగుఁగనక
అల శ్రీవత్సుఁడవని చూడఁదగును
అలమేల్మంగ యహి రోమావళి గలదిగన
యలశేషాద్రి శ్రీవేంకటేశుఁడనదగును ॥ఈకెకు॥"

(శృం సం. 30-552)

ఇలాగా అన్నమాచార్యుల పదరచనాశైలీ విన్యాసం వివిధరీతుల కొనసాగి నట్లు స్పష్టమవుతుంది.

## 4.7.1 పలుకుబళ్లు :

ఇలాగే శైలిలో ఒక భాగం పలుకుబళ్ళు, సామెతలు. ప్రజలభాష అన్నమాచార్యుల సంకీర్తన భాష. అందువల్లనే ఆయన భాషలో అనేక దేశీయమైన తెలుగు పలుకుబళ్ళు, సామెతలు కోకొల్లలుగా ఉంటాయి. కొన్నింటిని చవిచూద్దాం. పలుకుబళ్ళు పలురీతులుగా ఉండి ప్రజాసముదాయంతో ఆయనకు గల సన్నిహిత సంబంధాన్ని వ్యక్తీకరించి, ఆయన తెలుగుదనాన్ని స్పష్టీకరిస్తాయి.

అంగడిబెట్టు (3-108) ఇంటిలోని పోరు (12-199), ఒడిగట్టుకొన్నందుకు (25-160), కన్నులపండుగ (26-30 ), కనువెల్లా యెఱ్ఱనాయె (3-504), కన్నుచేసినాడు (3-66) కాయోపండో (12-341), కుక్కినట్టు (25-239),

కోతికి పెఱ్ఱెత్తినట్లు (2-369), గుండె రాయి చేసుకొని (28-496) పుక్కటి పురాణము (26-507), పూటకాపు (2-368) చీటికిమాటికి (27-84), తెగిన గాలి పడగనై (3-363), పంచబంగాళమై (10-21), మీసాల మీఁదటి తేనె (2-53), రాతిగుండె (12-9), రొమ్మునకుంపటి (3-181)- సంతలబెట్టితివి (25-271), సుబ్బన చూరలు (26-28), సూదిమొంటదారమై (3-139)-, ఇలాగా ఎన్నైనా ఉదాహరించవచ్చు. అన్నమాచార్యుల సాహిత్యమంతటా తెలుగు పలుకుబళ్లు అనేకమున్నాయి.

## 4.7.2 సామెతలు :

పలుకుబళ్ళలాగే సామెతలు సైతం అన్నమాచార్యుల లోకజ్ఞతకు ప్రజలతో తన సన్నిహిత సంబంధాన్ని స్పష్టం చేస్తాయి.

అమ్మెటి దొకటియు నసిమిలోని దొకటి (22-327), ఈమెడ మీసాల తేనె యీ వలపు (25-407), ఈరుదీయఁ బేనువచ్చునికనేలా (12-111), కాంతుని నీ మొలఁగుచ్చి కట్టుకొనఁగదవే (24-525), కానీలేవే తీగకు కాయ కడువేగై వుండునా (26-114), కుట్టి చూడ దోసపింద (3-204), గుండెరాయి చేసుకొను (28-496), గోరబొయ్యే దానికిఁగా గొడ్డలేటికి (24-124), (25-325), గోరు చుట్టపై రోకటిపోటాయగదమ్మా (12-238), జలజాక్షిమోవితేనె చందమామ గుటకలు (22-77), జవ్వనాన చంక గుదె శరణార్తిఁదనకేల (26-88), తాముం దెలియరు తగంజెప్పిన వినరు (2-142), నీటముంచు పాలముంచు నీచిత్తమిఁకను (9-224), నీరుకొలది తామర (28-250), నీరుబుగ్గవంటిది నిచ్చకొత్తలైనది (దేహము) (9-60), నూపుగింజ నానదిదె నోటిలో (27-19), పట్టినవెల్లా బంగారములు (30-45), పిలువని పేరటమై పిరిగొన వేడుక (24-276), పూచిన తంగేడువలె పొదళి మావలపు (22-511), పూవులవల్ల తుంగ తలకెక్కినట్లు (9-151), ముంజేతి కంకణమున కద్దమా (28-9), మూపులు మూడాయ నీ మొక్కిన మొక్కులకెల్ల (30-161), వయసు బ్రాయములు కావటి కుండలు వోమనసా (2-177), వింతలై యడవిఁగాసే వెన్నెలాయ బ్రదుకు (9-55), విత్తొకటి వెట్టితేను వేరొకటి మొలచునా (9-189), వెన్నపట్టుకొని నేయి వెదకనేల

(29-69), వెత్తిదెలిసి జగము వెసరోకలి జుట్టెను (9-54), శిరసుండ మోకాలి కేషయేటికి (25-441).

ఇలాగే నుడికారాలు, జాతీయాలు, లోకోక్తులు భాషా ప్రాముఖ్యాన్ని తెలిపే అంశాలు. ఇలాంటి ప్రయోగాలు తన పదసాహిత్యంలో సముచితరీతిని అన్నమాచార్యులు ప్రయోగించి, తెలుగుభాషా స్వభావాన్ని గుర్తించిన తీరు, తత్ప్రయోగ నైపుణ్యమూ విదితమవుతాయి. తద్వారా ఆయనకా భాషపైగల అధికారం స్పష్టమవుతుంది.

అన్నమాచార్యులది కేవలం పదకవిత మాత్రమే అయినా పద్యకవులకే మాత్రమూ తీసిపోని రీతిలో తనపద సాహిత్యమంతటా మనోజ్ఞమైన శైలీ విన్యాసంతో తన ప్రతిభాసాటవాన్ని ప్రకటించుకొన్నాడు. అంతేగాక జానపద గేయకృతుల మూలాన, భాషలోని నుడికారాలు, సామెతలవల్ల ప్రజలకెంతగా సన్నిహితుడై ప్రజాకవిగా వెలసినాడో విదితమవుతుంది.

# 5.0 భాషా వైలక్షణ్యం

అన్నమాచార్యుల సంకీర్తన భాషలో ఒక ప్రత్యేకత, ఒక విలక్షణత, ఒక విశిష్టత ప్రస్ఫుటమవుతాయి. తద్వారా పద్యకవులకు అబ్బని ఒకానొక అపూర్వ లక్షణం అన్నమాచార్యులలో స్పష్టమయి, ఆయన కవితా విశిష్టతను, వినూత్న భాషా ప్రయోగదక్షతను వివరించగలుగుతుంది. మనం ఇతఃపూర్వమే అన్నమాచార్యుల కవితా కామనీయకాన్ని తద్వారా భాషా రామణీయకాన్ని చవిచూశాం. ప్రస్తుతం ఆయన భాషా వైలక్షణ్యాన్ని పరిశీలిద్దాము.

పూర్వోక్తమైనట్లు అన్నమాచార్యులు సంస్కృతాంధ్రోభయభాషల్లో ఉద్దండుడై, పండితపామరులను సమంగా రంజింపజేసిన రీతి విదితమైంది. అంతేగాక ఆయన చాలావరకు సామాన్య ప్రజానీకం కోసమే పదరచనచేసి భక్తి, నీతి, వైరాగ్య ప్రబోధంచేసినట్లు తెలుసుకొన్నాము. కనుకనే ఆయన ఆనాడే వెలసిన ప్రజాకవి. ఇంకా విశాలదృక్పథంతో మనం ఆలోచిస్తే తెలుగులో వెలసిన వాగ్గేయకారులందరూ ప్రజాకవులంటే అబ్బురపడవలసిన పనిలేదు.

## 5.1 ప్రజల భాష :

అన్నమాచార్యుల సంకీర్తనల్లో ప్రజలందరికి అర్థమయ్యే రీతిలోనే పద కవితలల్లాడని చెప్పవలసి ఉంది. అర్థకాఠిన్యమూ, దూరాన్వయమూ, జల్లి పదాలు ఆయనపదాల్లో కనిపించవు. సరళసుందరమైన ఆయన భాషకు ఓ చక్కటి ఉదాహరణ :

"కాలమెల్లా మోసపోవు (ము) కానియ్యరా కల
కాలమెల్లా జరసేవు కానియ్యరా ॥పల్ల వి॥

ఎడపుల జవ్వనపు టింతి నొకతెఁ గూడి
కడలనే తిరిగేవు కానియ్యరా
మెడగట్టుకొకతెకు మేలువాఁడవై నీవు
కడవబొంకేవు నాతో కానియ్యరా ॥కాల॥

బంగారు మెఱుఁగు చాయపడఁతి నొకతెఁగూడి
కంగనాదేవు నాతో కానియ్యరా
అంగననొకతె వెనకమరదాఁచుకొని చొ
క్కఁంగఁజేసి ముద్దాడేవు కానియ్యరా ॥కాల॥

సంపద గలాపెఁగూడి సరసములాడుచు
కంపులే పూసేవు కానియ్యరా
వెంపరలాడుచు నీవెంట నొకతెరాఁగా
కనిపించక వేంకటేశ కానియ్యరా ॥కాల॥" (శృం.సం. 12-51)

ఇందులో నాయిక శ్రీ వేంకటేశ్వరుని దక్షిణ నాయకత్వాన్ని నిందిస్తూంది. ఇందు అన్నమాచార్యుడు ప్రయోగించిన భాష సర్వసామాన్యమైంది. ఎక్కడ అర్థంగాని పదాలుగాని, వ్యర్థపదాలుగాని, అనవసరమైన పదాలుగాని లేవు. సులభంగా అర్థంకావడం ఇందులోని ప్రత్యేకమైన లక్షణం. ఇది ప్రజల భాష.

## 5.2 భాషావిలక్షణత :

అన్నమాచార్యుని సంకీర్తనల్లోని భాష విలక్షణమైంది. ఆయన పదాలన్నిటా ఈ విలక్షణత ప్రత్యక్షమవుతుంది.

### 5.2.1 తరచు ప్రయోగించే పదాలు, పదబంధాలు :

సంబోధనలో 'అర' బదులు 'అల' అనే ప్రయోగమే తరచుగా అన్నమాచార్యుల సాహిత్యమంతటా కనిపిస్తుంది. అమ్మలాల (12-42), కాంతలాల (12-42), తమ్ములాల, అన్నలాల, తల్లులాల, కొమ్మలాల, అక్కలాల (12-99) తొయ్యలాల (22-172), తరుణులాల (22-273), పొలతులాల (22-273), నాతులాల, పడతులాల (22-38).

పదాలు, పదబంధాలు ;

అదివో, (12-14), ఇదివో (12-19,44), అల్లదివో (22-134), అదో (26-467), దేవులమ్మ (12-8), ఉద్దండాన (3-563), ఉద్దండీడవు (25-2), అగడీడవు (25-12) నాటకీడవు (25-474), వెంగీలు (22-1,4), యేకతానకు

(22-3), కమ్మటిదాన (22-40), తారుకానాలెల్ల (22-33), పూడిగెప్పువారము (22-37), వుందానను. (22-38) విందానను (విన్నదానను) (24-128), మోవి పండు (22-81), మోనము (22-149), మంచి జాణకాడవు (22-219), నిచ్చ నిచ్చ (22-440), ఆసోదాన (22-528), ఆసోదకాడవు (27-558), కట్టుపుణుగు (25-91), కుందణము (24-422) లచ్చెనలు (24-496), సేనాసేనా (2-48), ఆతుమ (2-242), అచ్చుత (2-242), బాయట (10-284).

## 5.3 క్రియా పదాలు :

గుంపించెనా (22-1), కాగిలించు (22-1,4,8), ఆముకొన్న (22-19), ఆడుతాను, చల్లుతాను (22-6), వచ్చితేను (22-14), దగ్గరితే (దగ్గరికి వస్తే) (25-502), మోహాము గత్తే [గలిగితే] [26-44] కూరిమిగలితే [26-93], [20-127], వినేరు, చూచేరు, నోమూరేరు, కూడేరు [25-32].

## 5.4 సంధి :

సలక్షణమైన సంధికార్యం అన్నమాచార్యుల సంకీర్తనలన్నిటా ఉంది. అయితే విలక్షణమైన సంధి కార్యాలు అక్కడక్కడా కనిపిస్తాయి.

## 5.4.1 క్త్వార్థ కేకారసంధి :

అనుమడచిచ్చేటి [22-263], కలసిమెలఁగుండగా [25-13], కూడుండేము [22-71], చెల్లుండగా [22-112], పవ్వళించుండగా [22-21]: అనవలెకొక మాట [25-2].

### 5.4.2 విచిత్రమైన సంధి :

ఆపెలిగితే < ఆపె+అలిగితే [22-274],

ఎవ్వతెకో < ఎవ్వతె + ఒకో [25-82],

### 5.43 త్రికసంధిని బోలిన సంధి :

ఒబ్బుద్ధి < ఓ+బుద్ధి < ఒక+బుద్ధి [25-529],

నియ్యాన < నీ+ యాన < నీ+ఆన [25-88], [30-165],

నియ్యిచ్చు < నీ+యిచ్చు < నీ+ఇచ్చు [25-497],
నియ్యాల < నీ+యాల < నీ+ఆల [28-267],

5.4.4 ను గాగమగానికి బదులు 'య' డాగమం :

చలము యెందాకా [25-19],
పరాకు నీ యేమి సేసేవు [22-509],
సుద్దులు యడగవలెనా [22-494],
మును యేము [2-390],

5.4.5 'య' డాగమమూ, సంధి కలుగలేదు :

వెలఇంచ వచ్చునా [25-320],
నీవంది ఇయ్యగాను [26-172],
నా ఇంపు సొంపులు [25-476]
పెను ఇంద్రియములు [10-12],
చూపబోఇతేను [25-3.10], ఉండవలసిన చోటలేదు.
కొమ్మఁ జెఇవట్టి తీసి [25-520], ఇదీ పైదానిలాగే.

5.4.6 'య' డాగమానికి బదులు 'వ' ఆగమం :

మరచి పూరకుండితే [24-189],
నిట్టి నీలిగి వుంటేను [26-394],

5.4.7 దీర్ఘంపై ద్రుతకార్యం :

నీవుఁ బుట్టమవుదువు [24-241],

5.4.8 వ్యావహారికంలో 'ట'గాగమం రావడం సహజం. కానీ 'య'డాగమం విరివిగా ఉంది.

వెదజల్లేటందుకు [27-32] సామాన్యమే. కానీ 'య' డాగమం ఉంది. పొందేయందుకు; కట్టేయందుకు; దక్కేయందుకు; పెట్టేయందుకు; నాకిచ్చే యందుకు, బతికించే యందుకు [27-32].

ఇలాగా సంధికార్యం వివిధరీతుల వింతగా అన్నమాచార్య సంకీర్తనల్లో జరిగింది. దీనిక్కారణం అన్నమాచార్య భాష ప్రజలభాష కావడమే.

5.5 సమాసాలు :

అన్నమాచార్యుల సంకీర్తనల్లో సులక్షణమైన సమాసాలు సామాన్యమే. అయితే పలురీతుల సమాసాలు విలక్షణంగానూ ఉన్నాయి. అలాంటి వాటిని పరిశీలిద్దాం.

5.5.1 తెలుగులో చక్కటి సమాసాలు :

చెందమ్మి పూవుదండలు [22-136], నిలువుఁగొలువెల్లా [26-328], పెక్కుపనులవాఁడవు [24-3], మొగమిచ్చు చెలులము [22-33], వాడుమోవి [24-12], సందడికొలువు [24-3].

5.5.2 వైరి సమాసాలు :

అన్నమాచార్యుల భాష సామాన్య ప్రజలభాష; అందుకే ఈవైరి సమాసాలు ఆయన సాహిత్యమంతటా ఉన్నాయి. అతివేడుక [25-298], అనేక పంతగాఁడవు [24-136]. పునఃజవ్వనము [26-262], తన నిజవాసము [22-366], నానాజాతి పండ్లు [25-91] నానాసొమ్ములు [3-125], ప్రాణ ప్రాణనేస్తమైనచోట [26-241 ప్రేమజవ్వన మదపు పెండ్లికొడుకవు [22-548], ఖారీతనము [3-197], సురత చిన్నెలు [24-243].

5.5,3 విలక్షణ సమాసాలు :

కంచపు మోవి (మోవికంచము) [26-414],
కూపనరకమున (నరకకూపమున) [2-3],
పండుమోవి తేనె (మోవిపండు తేనె) [26-79],
పడగవా తెర మెత్తి [వాతెరపడగ యెత్తి] [25-550],

5.5.4 వింత సమాసాలు :

ఇంతకంటే మరోరీతి వింత అయిన సమాసాలు అన్నమాచార్యుల సంకీర్తనల్లో ఉన్నాయి. వీటిలో సంబంధవాచకాన్ని పదబంధమధ్యంలో ఉంచడం విశేషం; అదేవింత; విలక్షణత.

తుమ్మిదల బెదరని గుంపులు [చెదరని తుమ్మెదల గుంపులు [24-239], దొంతుల నాయాసలకు [నాయాసల దొంతులకు] [25-447], మెచ్చితి నిన్నప్పటి మేలు మేలు [అప్పటి నిన్ను మెచ్చితి మేలు మేలు] [24-570], రెప్పల నీలోని చూపే [నీ రెప్పలలోనిచూపే] [25-373], విమలపు నీ పతికి [నీ విమలపుపతికి] [24-36].

5.6 విభక్తులు :

ప్రథమకు బదులు షష్ఠి :

కూరిమితో మీకు మీకె కొలిచేవారా (మీరుమీరే) [2-16], మనరాదు నీకింక పుణ్యంగానవలెను (నీవింక) [1-365],

ద్వితీయకు బదులు షష్ఠి :

ఇంతికి నీవు వలచుటిందరము నెఱుంగుదుము (ఇంతిని) (12-22),

ద్వితీయకు బదులు తృతీయ :

చేసుకోవయ్య పెండ్లి చెలితోను (చెలిని) [22-513],

తృతీయకు బదులు ద్వితీయ :

లంకె లాడుచే మేలు యీ

కింకరులలు నలంగెడి కంటెను (కింకరులచేత) [2-186]

ఇలాగే తక్కిన విభక్తులకు సైతం ఉదాహరణ లివ్వవచ్చును.

5.7 వింత ప్రయోగాలు :

అన్నమాచార్యుల సంకీర్తనల్లోని ధ్వనులలో, పదాల్లో, పదబంధాల్లో, క్రియల్లో, వాక్యాల్లో రకరకాలైన వింతలు గమనించగలము.

5.7.1 ధ్వనుల మార్పు :

5.7.1.1 'గ, క బదులు 'వ' :

అదివో (< అదిగో) [12-14], అల్లదివో (< అల్లదిగో) [22-134] ఇదివో (< ఇదిగో) [12-19,44],

5.7.1.2 'జ'కు బదులు 'చ/స' :

చింక చందురుఁడు (< జింక చందురుఁడు) [12-261],
చింక చూపులది (< జింక చూపులది) [24-166],
సింక సూపు నాపై సూపటిగా (< జింక) [12-32].

5.7.1.7 'ట'కు బదులు 'త' :

తక్కులు మాను (< టక్కులు మాను) [12-151],
తెంకి (< టెంకి) [26-27]: తక్కుం (< టక్కుం) [26-27],
తక్కరీడు (< టక్కరీడు) [25-204],
నగు తగాక (< నగుటగాక) [25-213],
దూరతగాక (< దూరుటగాక) [25-461],
జో డా తెరుగవా (< జోడా టెరుగవా) [25-523],

5.7.1.4 'డ'కు బదులు 'ర/ఱ' :

జరసేరా (< జడసేరా) [25-189],
జఱయుచు (< జడయుచు) [25-199]

5.7.1.5 'ణ' కు బదులు 'డ' :

సుగుడవన్నిటా (< సుగుణవన్నిటా) [22-506]

5.7.1.6 'ద' కు బదులు 'త'

తిట్టమై (< దిట్టమై) [9-64],

5.7.1.6 'న' కు బదులు 'ణ/ద' :

తట్టు పుణుగు (< తట్టు పునుగు) [1-198]
కుందణము (< కుందనము) [24-422]
అయిరాణి (< అయిరేని) [12-189],
యోగిణి (< యోగిని) [22-537],
చిరుకులు (< చినుకులు) [24-73],

5.7.1.7 హ్రస్వానికి బదులు దీర్ఘం :

తోఁగి చూచి (< తొంగిచూచి) [24-73],
పానిపట్టి (< పనిబట్టి) [25-365],
బాయట వేయగనేల (< బయటవేయగనేల) [26-252],

5.7.1.8 దీర్ఘం మీద పూర్ణానుస్వారం :

ఏంటి మాటలు (< ఏఁటిమాటలు) [3-223),
గాంటపు (< గాఁటపు) [3-223],
పైండి (< పైఁడి) [3-585],

5.7.1.9 అద్విరుక్తత :

నీ సుదుపెల్ల (< నీ సుద్దు వెల్ల) [3-514],
ముగుదెరిగిన (< ముగ్గుదెరిగిన) [25-507],
పూనిపటి (< పూనిపట్టి) [26-89],
పానిపటి (< పానివట్టి) [26-121],
మక్కువ చలితి (< మక్కువ చల్లితి) (25-90),

5.7.1.10 లేని ద్విరుక్తత :

అద్దలింపుచు (< అదలింపుచు) [12-242],
అద్దిగో (< అదిగో) [3-213],
అద్దరిపాటుండగాను (< అదరిపాటుండగాను) [26-176).

5.7.1.11 అక్షరలోపం :

ఉపారము (< ఉపాహారము) [22–517],
దాకొని (< దాగుకొని) [2J-32),
చిత్తరున (< చిత్తరువున) [25-330],
తనుపైఁజేయివేసి (< తనువుపైఁజేయివేసి) [26-75],
తిరుగుకంట (< తిరుగుట కంటె) [2-3],
మోహముగత్తే (< మోహము గలిగితే) [26-44],

5.7,2 వింతపదాలు :

ఘనురాలు (25-26), జాణడు (12-201), నావొల్లి (నావల్ల) [2-4], భ్రమత (భ్రమ) [22-277], సంగతాలు (స్నేహితులు) (సంగాతో - ఒరియా భాషలో) [24-119], భాగ్యమంతులు (భాగ్యవంతులు) [24-399], లేసుగా (లెస్సగా) [25-33].

5.7.3 వింత పదబంధాలు :

ఊడిగమాపె (దాసి, పనిమనిషి, పనికత్తె) [22-5], జంపుల సిగ్గులు (జంపు - పొడవు; సిగ్గుల యొక్క జంపులు [22-544], జంపునీ చనులు (24-190], సిగ్గరి పెండ్లి కొడుకు; సిగ్గరి పెండ్లి కూతురు [24-76], అంటురాయి (అయస్కాంతం) [24-20], వాలుకచూపులు (వాలుచూపులు) [22-478], పొరు గిరుగువారు [ఇరుగు పొరుగువారు] [24-373], పూతసిగ్గు [24-561], ఊత చెక్కు చేతులతో [24-561].

5.7.4 వింత క్రియాపదాలు :

ఆసలాసలు పుట్టించు (మిక్కిలి ఆశపుట్టించు) [24-50],
యాల దగ్గరేవు (ఎందుకు దగ్గరికి వస్తావు) [12-69],
అతడెవ్వరౌతా ? (అతడు నాగేమవుతాడు ?) [12-69],
గయ్యాళించు [గయ్యాళి పదంమీద 'ఇంచుక్కు'] [24-342],
సోకింపించు (సోకించి - ప్రేరణ రహితంగా) [25-205],
నవ్వింపించి [నవ్వించి-ప్రేరణ రహితంగా] [25-208],
ఈదింపించరాదా? (ఈదించరాదా?-ప్రేరణ రహితంగా) [25-205].

5.7.5 వింతవచనం :

ఏకవచనానికి బదులు బహువచనం :
మాకు నీవు లోగుదురా [లోగుదువా] [24-74],
బహువచనానికి బదులు ఏకవచనం :
నీకు బాళి కాచుకొన్నది [కాచుకొన్నవి] [24-86],

**5.7.6 వింతవాక్యాలు :**

అక్కరగలవు నీవ [అక్కరగలిగిన నీవు] [24-443],
చేసిన దోసము వాసు [చేసిన దోషమువాయు] [22-2],
సిగ్గువడకు వయ్య [సిగ్గుపడకుమయ్య] [22-2],
నిజమీయవయ్య [నిజం చెప్పవయ్య] [22-2],
పారనేల వేసేవు [ఏల పారేశేవు] [22-192],
దయగలవాతడు [ఆతడు దయగలవాడు] [22-217]'
ఆపె పైబత్తి గలవు [ఆపె పై బత్తి గలవాడవు] [22-423],
నీచక్రము అతిప్రతాపి [నీ చక్రము అతిప్రతాపముగలది] [24-246],
నీ పాదెములు గుద్దగరాదా [నీపాదములు పట్టగ][పిసుకగరాదా] [24-280],
పాయప్పుమదాన వన్నెపలుకరాదా [పలుకరించ రాదా] [25-5],
నీమనసేల కరగువురా [నీమనసేల కరగుదురా] [24-90].

**5.7.7 అన్యదేశ్యాలు :**

అరబ్బీ, ఉర్దూ, హిందీ, కన్నడం, తమిళం మొదలైన అన్యదేశ్యాలు సైతం అన్నమాచార్యుల సాహిత్యంలో ఉన్నాయి.

**5 7.7.1 ఆరబ్బీ, హిందీ, ఉర్దూ పదాలు :**

జగడాలు [128], జగడించె [12-36], దాపురే [12-147, 115], సెబాసందురటె [12-153], జాటలి [24-173], జాటు [24-230], కుశాయి [23-521], కబురుకే [2-123], పౌజులు [10-241], పచారించేవే [పచారు పై ఇంచుక్కు] [28-474], గలఫి [గలఫా] [29-2], దట్టీ [29-144], ఉలుపా [29-322], గజా [29-465], కోమున [27-205],

**5.7.7.2 కన్నడ పదాలు :**

బెళకకే పొద్దు [24-280], బెడకు [2-17ఓ], అప్పణి [య్యూజాలవలెగా] [22-227], అప్పణ [ఫికిచ్చెనో] [12-390]

**5.7.7.3 తమిళ పదాలు :**

ఉభయవరులు [2-229], తిరుమంత్రము [9-242], తిరువాయుడి [9-195], [సేనా] మొదలారి [పద్ద] [9-242], తిరుమణి [10-245], పల్లాండు పల్లాండు, పెరుమాళ్ల [10-132], తిరువేంగళప్పడు [22-365], విజ్ఞాపణి (వారు) [24-281], అళగిరి [25-457], చూడికుడుత నాచారు [29- 69],

ఇలాగా అనాడు ప్రచారంలో ఉన్న అన్యదేశ్యాలు అన్నమాచార్యుల సంకీర్తనల్లో చోటుచేసుకొన్నాయి. తద్వారా అనాటి భాషపై ఆయనకుగల అధికారం స్పష్టమవుతుంది.

అన్నమాచార్యుల భాషాపరిశీలన సమగ్రంగా చేయడం అంత సులభమైన పనికాదు. ఒక్కొక్క భాషాంశాన్ని గూర్చి ప్రత్యేకంగా పరిశోధించవలసి ఉంది. అందువల్ల కేవలం దిఙ్మాత్ర పరిశీలన మాత్రమే. అదృక్పథంలో పరిశోధించే భావి పరిశోధకులకుపకరిస్తే నా యీ ప్రయత్నం ఫలించినట్లే.

### 5.8 రాయలసీమ మాండలికాలు :

ఇంక అన్నమాచార్యుల సంకీర్తన సాహిత్యంలోని భాషలో వ్యక్తమయ్యే రాయలసీమ మాండలిక పదప్రయోగాన్ని గూర్చి ప్రత్యేకంగా పరిశీలించవలసి ఉంది. క్రమంగా పరిశీలిద్దాం. ఈ అధ్యయన సౌలభ్యం కోసం పదాల్ని, పదబంధాలు, క్రియలు, వాక్యాలు అని వర్గీకరించడం జరిగింది.

#### 5.8.1 పదాలు :

అద్దో : ['అదిగో' పదం 'అద్దో' అని ప్రయోగింపబడింది]

'కొద్దెరిగి నీవుండితే కోపగించునా యాపె
అద్దో నీవింతలోనె మా రలుగగ జెల్లునా' [22-269]

అప్పా : (తండ్రిని 'అప్ప' అనడం, గౌరవార్థంలో ప్రయోగించడం రాయలసీమ వాడుక)

'అప్పా నేఁ దొల్లి అజ్ఞానినైనది
తప్పా నేఁడు గావ తగదా నేడు' [2-11]

అసిమి : (దీన్నే 'అసిమి' అనిగూడా అంటారు. సౌడుగాటి సంచి నడుమ

తెరువడానికి వీలుంటుంది. అటుఇటు సరుకులు వేసి భుజంమీద వేసుకొని తీసుకొని వెళ్ళటానికి అనుకూలంగా ఉంటుంది)

'ఆమ్మేదొకటియు నసిమిలోనిదొకటి
యిమ్ముల నీయందే కంటిమిదివో దిష్టాంతము' (22-327),

ఇల్లటము : (ఇల్లరికం)

'చల్లని చూపుల సతికి వలచిపోయి
యిల్లటమున్నవాఁడీతఁడు' (12-296)

ఉపద్ర : (ఉపద్రవం)

'కతకారి నిన్నుంజూచి కడుంజలము లెక్కనను
పతిభక్తి సేయంగ ఉపద్రదరాదుగదవే' (3-10)

ఎగదిగ : (క్రిందికిపైకి, తత్తరపాటుతో చూడడం)

'మొగమును జూచేవు మోనానఁ దలవంచవు
ఎగదిగ వోతపై తే నేడఁ జొచ్చేదే' (22-271),

ఎగసక్కేలు : (ఎగతాళి)

'ఈడమాతో నింతయేల యెగసక్కేలు
వేడుకకాఁడవు నీవు వేసాలు మానరా' (26-246),

ఒడ్డారాలు : (ఒయ్యారాలు, ఏమొడ్డారాలు పడతావే అన్నది ప్రయోగం)

'యీాడ నిన్నలమేల్మంగ తోడఁ గూరుతుముగాక
వుడిగపువారికేల వొడ్డారాలు' (26-170)

ఒబ్బిడిగా : (నిశ్చింతగా, హాయిగా, ప్రత్యేకంగా - ఒబ్బిడిగా తినమరిగింది మందిలో కలిసుంటుందా ?)

'వొబ్బిడిగా నాయింటనే వుండితేనే చాలదా
గుబ్బల గర్వము నిన్నుఁ గూడిందిఁగాక' (24-278),

కణజాలు : (పాతరలు)

'అట్టై తలవంచ(గానే ఆసమాటలాడితివి
నెట్టుకొన్న కణజాల నిండెవలపు' (26-235)

'కణజాలు' పదప్రయోగం సారంగపాణి సైతం చేసి ఉండడం గమనించ దగ్గ అంశం.

'వడతిరో వూరూరా పైరుపచ్చలాయె
కడలేని ధాన్యాల కణజాలాయె' (సారంగపాణి పదములు-83)

కిమ్ములు : (కిమ్ములేన్నీ - రహస్యంగా)

'కిమ్ముల(దాననీ నెరిగీ నని వున్నదాన
యెమ్మెలి తరులవలె నెచ్చరించను' (22-220)

కుదువ : (తాకట్టు)

'వాడికె ఇంతికి కుదువుగా నన్నుండమనేవు
కూడివాని విడిపించుకొన వశమా' (3-631),

ఈ 'కుదువ' పదాన్ని వేమన ప్రయోగించాడు.

"అధన భుక్తి చేత మొదటి సొమ్ముకు హాని
కుదువ సొమ్ముకెన్న కొంతహాని
మొదటి పక్షమునను మూలకర్తకు హాని
విశ్వదాభిరామ వినురవేమ" (వేమన పద్యాలు-280),

*కూరాకు : (ఆకుకూర)

"చెల(గి కూరాకు(గా( జేసేవు నీ
తలమీదనుండే తరుణి(బో నేను (12-194),

గన : (కనుక, కానీ)

'సేసపెట్టిన చెలికి సేసిన వెల్లా సేత
ఆసబుచ్చిన నీవుగన ఆదరించితే' (25-256)

గబ్బు : (మాలిన్యం, కల్మషం, కంపు, పనికిమాలిన 'గబ్బునాయాల' అనే ప్రయోగం రాయలసీమలో అతిసామాన్యం).

'గక్కనఁ గాఁగలిగించఁగా గబ్బిది యనేనంటా
వొక్కపై నోవరిలో నున్నది చెలి' (26-373),

**గుటుగు :** (కామవాంఛ, మోహం)

"కొలనికి నీకు గోవిందుఁడా మము
గులుగు రేచకు వోయి గోవిందుఁడా" (24-3)

**జంపు :** (పొడవు)

"ఈ వేళ నిన్నితఁడే యిచ్చకము శాయనే
పూవుల వేటులాడ జంపుల సిగ్గేల" (12-544),

నిండా : (పూర్తిగా, ఎక్కువగా)

"నీకొలువు సేసితిమి నిండాఁదనిసితిమి
చేకొని నీవారమని చెప్పేమయ్యా" (22-194),

నిమ్మలాన : (నిశ్చింతగా)

"ఆదరించి శ్రీవేంకటాధిప నన్నేలితివి
నీదయతో నాపెమూచి నిమ్మలాన నుండెను" (22-45),

పట్నాలు : (పొట్లాలు)

"చెప్పనేల నీసుద్దులు చెల్లుబడై వుండఁగాను
తప్పిన పట్నాలు వారు గంధమిత్తురా" (24-374),

పై : (ఒళ్ళు)

"తన్నీరు వసంతాలు పై చీరలు చూపిచ్చే
చెన్నుమీర సాకిరేల చెప్పించేనే" (26-374),

బయకారాలు : (విలాసాలు, మోసాలు, బయకారి-విలాసవతి, మోసగత్తె)

"ఇచ్చట శ్రీవేంకటేశ యేలితివి నన్నునిట్టె
యిచ్చకపు బయకారా లెన్ని సేసేవిపుడు" [24-444]

విగ్గె : (విగ్గరగా, బిర్రగా, గట్టిగా - 'ఐ' ఉచ్చారణ)

"కందువతోఁ జన్నులంటి కడుబిగ్గెఁ గౌఁగిలించి
సందడి మర్మములంటి చల్లీ నూర్పులు" (24-489),

మంకు : (మూర్ఖత్వం)

"పెలుచైన వానికిఁ బ్రియములు చెప్పితేను
కలుచపడుఁగాక సంగతెరుగునా
తలచుకొనీఁదానే తరి నాకిచ్చిన బాస
మలసి పూరకుండితే మంకుదేరీ నతఁడు" (24-445),

ఈ ప్రయోగం వేమనలోనూ ఉంది.

"ఇంటిలోని ధనము ఇదినాది యనుచును
మంటిలోన దాచు మంకుజీవి
కొంచుబోఁడు వెంటగుల్ల కానురాదు
విశ్వదాభిరామ వినుర వేమ" (వేమన పద్యాలు 148),

మలిగండ్లు : (అలిగండ్లు మలిగండ్లు)

"ఊలుదింటా మలిగండ్లా ఉడిరాసిగానేరేము
తేలుచు శ్రీహరినీవే దిక్కౌటగాక" (10-61),

ఈ ప్రయోగం వేమనలోను ఉంది.
"అలయచేసి మంచి యడిగెండ్లు మలిగెండ్లు
తిరిపె మిడెడు కటిక దేబె లెల్ల
నెలమి మన్ను దినెడు నెర్రలౌదురుసుమీ
విశ్వదాభిరామ వినురవేమ" (వేమనపద్యాలు. 34)

మోపు : (అధికం, ఎక్కువ, కట్టెల మోపు - అయినా ఎక్కువనే ఇక్కడి అర్థం.)

"ఎగసెక్కెపు వలపెందాకా
మొగమాటములే మోపా నాకు" (22-400),

యేతువులు : (యాతువులెత్తి మాట్లాడాల్నా - అంటే హేతువులనే అర్థంలో ఈనాడు ప్రయోగం ఉంది.)

"మలసి యేతువులెత్తి మాటలాడవలెనా
వలచి నిన్నుఁబాయక వసమైనవానికి" (25-321),

సంతము : [సొంతము]
"చక్కని శ్రీవేంకటేశ సంతమయితివప్పుడే
వెక్కసాలు మానితేను వెంగెమాడనిన్నును" ]26-202],

సరకా : (సరాకా - సరదా - తమాషా)
"ఎచ్చరించెద ననిన యీ జగంబునఁగాను
సచ్చరిత్రుఁడ నీకు సరకా వోరి" [12-314],

సోలిగా : (వరుసగా)
"ఏలసిగ్గువడేవు యెదుటికి రాఁగదవే
సోలిగా నీసింగారాలు చూచుఁగాని యీతఁడు" [24-290]

5.8.2 పదబంధాలు :

ఉద్దు వుద్దులై : (జతలు జతలై)
"బుద్ధిలేని బుద్ధితోడ పొందుచేసుకొనినట్టి
యెద్దుబండికంటె సందినింగేము
నిద్దురతో తెలివంట నీటిలోని యండంట
వుద్దు వుద్దులై లేని వొద్దికనున్నాము" (2-74),
ఈ ప్రయోగం వేమనలోను ఉంది.
"కనక గ్రామమునకు కారణకర్త లి
ట్లుండ యగుచును భయులుండిరేని
గండ పక్షియుగళముండిన రీతిని
యుద్దిగూడి బ్రతుకుచుంద్రు వేమ" (వేమనపద్యాలు 67)

ఎగదిగ : (బెదురు బెదురుగా, బెరుకు బెరుకుగా)
"ఇత్తలనదియునుగాకే ఎగదిగనాతని జూచు
చిత్తజీ గుణముల చెక్కులు చెనకించేవేమే" (22-331),

కడ్డాయపు పొందులు : (కడ్డాయము-షరతు-Condition),

"ఇంత కడ్డాయపు బొందువేల మాకు
యెంతేసి వారలు నీకు నెదురుచూచేరో" (22-396)

గుజగుజలు : (గుసగుసలు)

"ఏటికి మీ గుజగుజ వెరుగరాదు
తేటపరచగరాదా దిద్దేము తగవు" (24-321),

నెల్లి చెట్లు : (ఉసిరిక చెట్లు 'నెల్లి' కన్నడపదం.
"పెల్లి చెట్టు మందుగాదు పెద్ద కొండలెక్కి తెచ్చే
నెల్లి చెట్టు చవిగాకనే మేలనీకు (25-435),

మంకోమరులో : (మూర్ఖత్వమో మరులో)

"మంకోమరులో మదమో ముదమో
జంకోలంకో జగడమో
శంకలేక ననుసరిగనం గూడితి
వేంకటగిరి గోవిందుడా" (3-77)

ముయికి ముయాయ : (సరికి సరిఅయ్యె, కానుకలిచ్చినవారికి సమంగా కానుకలివ్వడం ముయ్యికి ముయ్యి)

"ముయికి ముయాయె నివే ముచ్చటలిద్దరికిని
నయముల మాయెదకు నవ్వులేమినవ్వము" (3-203),
కన్నడ భాషలో పురందరదాసు ప్రయోగం ఉంది.
'ముయ్యగె ముయ్యాయితు'

శేనాశేనాలు : (శానాశానాలు - చాలా చాలా)

"చెంతల మొక్కేటివారు శేనాశేనాలుండగాను
దొంతిగాఁ బైనొరగేవు దొడ్డతనముగాదా" (22-240),

సూదోపాడో : (సిగ్గోలజ్జో సూడూపాడూలేనోడు)

"పాడుతాఁ బరాకైతేఁ బదాలలో ముద్రచూపి
గోడచూచినఁ జిత్తరు కూటములోఁ దొడచూడి

సూడోపాడో తనకు సొరిది సన్నింతసేయ
యీడానుండదు చూడనింటనే వున్నాడు" (26-220)

5.8.5 క్రియలు :

ఉండబట్టదా : (ఊరికే ఉండలేకనా)

"వుండబట్టదా తనకు సూడిగము సేయఁగాను
చండపెట్టి వ్రాతవ్రాసే చన్నులమీఁద" (25-228)

ఎకబోసి : (ఎగబోయు, చాడీలు చెప్పు)

"చాయలనే యెకబోసె సన్నలనింతసేసి
యేమెడకుఁ బోసీవు ఇంతకంటెనేమే" (25-368)

ఎగ్గెరగక : (అరమరికలేక, తప్పు లేక)

"సిగ్గరి పెండ్లికొడుకు చెలులముందరనెల్లా
యెగ్గెరఁగక మెరసీ నిదివో యనుచు" (24-73),

'ఎగ్గు' ప్రయోగం వేమనలోనూ ఉంది.

"వెల్లకుక్కల యెంగిలి విశదమాయె
పడుచు వేశ్యల యెంగిలి ప్రాప్తమాయె
చెడుగు యెంగిలి యెంతకు శ్రేష్ఠమాయె
యిష్టమగువారి యెంగిలి యెగ్గ వేమ"

(వేమన పద్యాలు. 449)

'ఎగ్గులేనోడు' అన్నట్లు రాయలసీమలోని ప్రయోగం. అయినా 'సిగ్గు' ఎగ్గు' అని అన్నిచోట్లా వుంది.

ఏకారేవు : (మిక్కిలి ఆశపడి, అందుకై యత్నించడం' 'యావ' కలిగి ఉండడం)

"చెలువై తేఁ జాలునట్టి చేరి యెంతవడిమైనా
మలసి మలసి నీవుమాటలాడేవు
కొలఁది మీరినట్టి కుచములు గంబ్బఁజాలు
యెలమి నూరకమైనా యేకారేవు" (25-34),

కేకరించీని : (కాంక్షించీని)

"వెలయ నీతో నేను వేడుకకు నవ్వగాను
నలనాక్షియెవ్వతో నన్నులు వేసీని
నిలిచి నీవునాతో నెయ్యములు చూపఁగాను
కెలన నుండి తాను కేకరించీని' (24-563),

కోకో : (తీసుకో)

"కోకవేల తీసితివి గోవిందుఁడా నీకుఁ
గోకో ఇదివో మొక్కెగోవిందుడా" (24-3)

కోవయ్య : (తీసుకోవయ్య)

"కొంచెపు వెన్నెలలివి కోవయ్యాకానికె
మంచిమొల్ల మొగుడల మాటునాఁ జాయనివి" (12-35),

దావతిపడి : (అదుర్దాపడి, దావంతంపడి)

"దేవదానవులు దీరతను
దావతిపడి వార్ధిఁ దరువఁగను
శ్రీ వనితామణిఁ జెలఁగి పెండ్లాడిన
శ్రీవేంకటగిరి శ్రీనిధికి' (13-18)

దొప్పవు : (తోసేవు, నెట్టేవు, నర్సాపుర జిల్లాల్లో మరో అర్థంలో ప్రయుక్తం)

"సిగ్గుతోసుందాననంటా శ్రీవేంకటేశ్వరుఁదెచ్చి
దగ్గరించి పై దొప్పవు తతిగానవే" (22-91),

పంగించు : (ఎత్తి పొడుచు)

"చేతులు చాఁచి చాఁచి చేరి నీతో వాదడచి
ఆ తలఁ బంగించితిగా అయ్యో నిన్ను
నీతిలేని మంకుదాన నీవు చెప్పిన పనులు
తో తోయ నీ పాదమునఁదోసితిఁగానేను" (22-120)

మల్లాడు : (తిరుగాడు)

"తగుమోహ సలిలంబు దాట మతిలేదుగన
మగుడంబడి భవనములో మల్లాడవలసె" (2-210),

వేసరికోవలదు : (యాసిరికోవద్దు, అసహ్యించుకోవద్దు)

"వేసరుకో వలదు విభుఁడెలయించితేను
ఆసరేచ యిచ్చకములాడుటగాని" (22-442),

సంచకారిచ్చితిని : (బయానా యిచ్చితిని, సంచకారమివ్వడం)

"దొరవునీవు నేను దోసిటిపాలదానను
సరిలక్షకు నామొక్కు సంచకారిచ్చితిని" (22-292),

సదరమైతినా : (పలచనైతినా, తేలికైతినా)

"కొంతకోక నల్లనైతే గొరువడము ననేవు(?)
అంతనేను సదరమైతినా నీకు
పంతగాడవట్టి యాకంబళి నీవు ధరియించి
అంతయింతనుండి యాల ఆవులగాచితివి" (12-112),

5.8.4 వాక్యాలు :

అకుమడచిచ్చెను (తమలపాకులు చిలుకలుకట్టి ఇచ్చెను)
"పొంచి తన తనువునం బులకలు నిండఁగాను

మంచముపై నీకు నాకు మడచిచ్చెను" [3-187]

ఎగదిగ పోతలైతే నేడచొచ్చేదే [26-271],
నీవుగన ఆదరించితే [25-256],
పూచుకునే మాటాడితి [22-544],

ఇది కేవలం అన్నమాచార్యుల సంకీర్తన సాహిత్యంలోని రాయలసీమ మాండలికాల ప్రయోగానికి సంబంధించిన దిఙ్మాత్ర ప్రదర్శన మాత్రమే. ఇంకా లోతుగా పరిశీలించి, సూక్ష్మాతిసూక్ష్మమైన అన్నమాచార్యుల భాషారీతుల్ని, ప్రత్యే

కించి అన్నమాచార్యుల రాయలసీమ మాండలిక పదప్రయోగ వైశిష్ట్యాన్ని గూర్చి పరిశోధించవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇది అన్నమాచార్య సంకీర్తనల్లోని భాషగూర్చిన విహంగావలోకనం.

## 5.9 కూరాకు పదవివరణకు సమాధానం :

అన్నమాచార్యుల భాషా వైలక్షణ్యంలో ఒకభాగంగా 'కూరాకు' పద చర్చ విరివిగా సాగింది. దానికి సమాధానం విపులంగా ఇవ్వడం అవసరం. అదే ప్రస్తుత ప్రయత్నం.

1983 ఏప్రిల్ భారతిలో పూజ్యులు శ్రీ 'తి' గారు "'కూరాకు పద వివరణ' ను గూర్చి లేఖరాశారు. 1982 డిశంబరు భారతిలోని నావ్యాసం 'అన్నమాచార్యుల సంకీర్తనలు-రాయలసీమ మాండలిక పదప్రయోగం' బాగుందని ప్రశంసిస్తూనే 'కూరాకు' ను గూర్చి వారు చర్చించారు. వారి ప్రశంసకు నాకృతజ్ఞతలు.

'తి' గారికి సమాధానంగా 1983 నవంబరు భారతిలో శ్రీకపిలవాయి లింగమూర్తిగారు 'కూరాకు' అన్నది "ఖురాక్" శబ్దభవం కాదని వివరించారు. అయితే నేనిచ్చిన అర్థమూ పొసగదని పేర్కొన్నారు. మళ్ళీ దానికి వివరణగా 'తి' గారు "కూరాకు' (మీ) మాంసం" అని 1984 సెప్టెంబరు భారతిలో పునఃపరిశీలించి 'కూరాకు' అంటే 'మాంస'మనే తీర్మానించి 'పండితులే నిర్ణయింతురుగాక' అని వదలివేశారు.

పై ఇద్దరు పండితులకు నాసమాధానమిది. 'తి'గారు 'కూరాకు'ను మిశ్రదుష్టసమాసమని పేర్కొని వివరించారు. పైపెచ్చు దీన్నిబట్టి 'కూరాకు' 'ఆకుకూర' కాదని తెలిసింది. "కూరాకు' కోసం మనం వేరే అంగట్లో వెదుకవలసి వస్తుంది." అని అన్వేషణ సూచించారు. అతఃపూర్వమే "కూరాకు' రాయలసీమ మాండలికమైతే 'ఆకుకూర' ఏప్రాంతపు మాండలికం? 'ఆకుకూర' కూడా మాండలికమా?" అని ప్రశ్నించారు. బాగుంది. ఇక్కడ మనం ఒక అంశం గుర్తుంచుకోవడం అవసరం. 'కూరాకు'ను రాయలసీమ మాండలికమని పేర్కొన్నానేగానీ, 'ఆకుకూర' మాండలికమనలేదు. అది దానికర్థమని తెలిపాను. కారణమేమంటే కోస్తా ఆంధ్రలో 'ఆకుకూర' అనేవాడుకేకానీ 'కూరాకు' అనే వ్యవహారం లేదు. ఇది స్వకపోలకల్పితం కాదు వాస్తవం.

మొదట్లోవారు 'కూర్గాకు'ను మిశ్ర దుష్ట సమాసమన్నారు. ఆ వెనుక "కూర్గాకు' అనే పదం రాయలసీమ పల్లెలలో 'మాంసము'నకు పర్యాయపదంగా వాడబడుతూ ఉంది" అని పేర్కొని, ఇది 'ఖురాక్' ఉర్దూ (అరబీ లేక పారసీక) పదంనుంచి వచ్చిందనీ, చివరికి 'కూరాకు' అంటే మాంసమనే అర్థంలో ప్రయోగించబడుతూ ఉందనీ వివరించారు.

కానీ వారు మొదట 'కూర్గాకు' అంటే మిశ్ర దుష్ట సమాసమనీ, కూర+ఆకు అని విడగొట్టి బోధపడదనీ పేర్కొని, ఆ వెనుక ఇది 'ఖురాక్' పద వికృత్య మవడం తమాషాగా ఉంది.

కోస్తా ఆంధ్రలో 'ఆకుకూర' అని దేన్నయితే అంటారో అదే అర్థంలో 'కూరాకు' అనడం రాయలసీమ పల్లెటూళ్ళలో ఈనాడూ మనం వింటాము. "పుచ్చిన కూరాకును దులిపినట్లు దులుపుతావే", "కూరాకును నలిపినట్లు నలుపుతావే" అనే మాటలు తెలుగు, కన్నడ ప్రాంతాల్లో అంటే అనంతపురం, కోలారు జిల్లాలలో ఈనాడూ మనకు వినిపించేవే. అంతేగాక నేను ప్రభుత్వోద్యోగరీత్యా తెలుగునాట పర్యటించి, నివసించడం మూలాన గ్రహించగలిగిన విషయం. వారు వ్యాఖ్యానించినట్లు ఎక్కడైనా 'కూరాకు' అంటే 'మాంసం' అనే వాడే వాళ్ళున్నారేమోగానీ, నేను విన్నంత, కన్నంత, నాకు తెలియవచ్చినంత 'మాంస' మనే అర్థంలోనూ, వ్యస్తంగా 'కూర' అని మాత్రమే-అదీ కొందరు మాత్రమే-వాడుతారు.

ఈ సందర్భంలో అన్నమాచార్యుల సంకీర్తన పూర్తి పాఠం గమనించగోరుతున్నాను.

"చెలఁగి కూర్గాకుఁగాఁజేసేవు నీ
తలమీఁదనుండే తరుణిఁబో నేను ॥పల్లవి॥

పిసుకకు పలుమారు వసురువేసినంత
వసివాడు కోర్చిన వనితఁగాను
పసరేఁచి నీ వింత పాలించు తొల్లిటి
సిసువయిన నీపెట్టుఁజెట్టబో నేను ॥చెలఁగి॥

చిదుముకు పలుమారు చెక్కునొచ్చీ నీవు
వదనము నొక్కేటి వనితఁగాను

ఎదురెదురనే భూమి నెందరు లేరు నీ
విదురవచ్చిన వారు వేనెవ్వతిని ॥చెలఁగి॥

కండించకు నన్నుఁ గౌఁగిట కాఁకల
అందునిందును గడు నలుముచును
ఇందిరాపతి వేంకటేశ సిరతుల
పొందు నాకిదె మఱపులకెల్ల నెలవు ॥చెలఁగి॥

(శృం. సం. 12-194)

ఈ పదంలో 'కూరాకుఁగాఁ జేసేవు' అనడంలో 'మాంసం' అన్న అర్థం గోచరించడం లేదు. పైపెచ్చు 'కూరాకులాగా నన్నెందుకు నలిపివేస్తావు?' అంటుంది నాయిక నాయకునితో. ఇది నా పై వివరణను స్పష్టీకరిస్తుంది. దీన్ని గూర్చిన వాదోపవాదాలకు తావేలేదు.

మరో విశేషమేమంటే 'తి' గారు 'కూరాకు' విడదీయరాని మిశ్ర దుష్ట సమాసమని పేర్కొని "కూర అంటే ఆకు. ఉదా॥ తోటకూర, దంటుకూర" అని వివరించారు. సరేబాగానే ఉంది. వారి మాటల్లోనే, మెంతికూర, పాలకూర, చుక్కకూర, బచ్చలికూర అనే ఆకు కూరలూ ఉన్నాయి. ఇంకా కాయగూరలు, ఆకుకూరలు అనడమూ ఉందిగదా? అలాగే కూరగాయలూ ఉన్నాయి. ఇంతకీ చెప్పవచ్చిందేమంటే 'కూరాకు' అన్నది 'ఆకుకూర' అనే అర్థంలోనే అన్నమాచార్యులు ప్రయోగించాడు; అతని హృదయావిష్కరణమే నా ముఖ్య లక్ష్యం; సత్యాన్వేషణమే నా పరిశోధనా ధ్యేయం. 15వ శతాబ్దంలో పదకవితాపితామహుడు ప్రయోగించినా ఈనాటికీ ఆపదం మా ఊళ్ళ జనం వాడుకలో ఉంది. ఈ విషయం చెప్పడానికి ఇంత వివరణ అవసరమైంది. 'కూరాకు' మాండలికమనే ఇంకా నేను సహేతుకంగానే విశ్వసిస్తున్నాను.

ఏ పదం ఏ భాషలోనుంచి వచ్చినా అది పరిమిత ప్రదేశంలో ప్రచురంగా ప్రయోగంలో ఉన్నప్పుడు, తక్కినచోట్ల అలా వాడనప్పుడు తప్పక మనం భాషాశాస్త్రానుసారం దాన్ని మాండలికమే అనడం సముచితం గదా?

# 6.0 సంగీతాభినయాలు

మహాభక్తిరక్తి సంపూరితుడైన అన్నమాచార్యుల సంకీర్తనల్లో అభి-
కరించిన సంగీతాభినయాల స్థూల పరిశీలన మవసరం. వాగ్గేయాలకి సమానాదర
కూర్చి అలవోకగా సంకీర్తనలల్లిన మహనీయుడు అన్నమాచార్యులు. ఆ స
త్మని, ఆ మహావాగ్గేయకారుని సంగీతాభినయాల్ని - పెద్దలు ఉట్టంకించిన వాటి
పరిశీలిద్దాము.

## 6.1 సంగీతం :

"గీతం వాద్యం తథానృత్యం సంగీతముచ్యతే" గీతవాద్య నృత్యా
కలిసినదే సంగీత మంటారు కొందరు. కానీ మరికొందరి ప్రకారం '
వాద్యోభయం యత్ర సంగీత మితికేచన"—" అంటే గీతవాద్యాల సమ్మేళ
సంగీతం. ధాతుమాతువుల సమ్మేళనం సంగీతం. ధాతువు సప్తస్వర సం
కాగా, గేయసంబంధి మాతువు. వాక్+గేయాలను నిర్మించగలవాడు వాగ్గేయకార
సంగీత సాహిత్యాలను సమంగా తెలిసిన మహాజ్ఞాని అన్నమాచార్యులు. ఆ
సాహిత్యప్రపంచం శ్రీ వేంకట వల్లభ శృంగారాధ్యాత్మ పరమైనది. సం
జ్ఞానం అనంతం: అసామాన్యం: అసదృశం. అందువల్లనే ముప్పైరెండు
సంకీర్తనలు రచించాడు. సంకీర్తన లక్షణం సంస్కృతంలో రచించిన సంగీతవే
ఆయన సంకీర్తనలలో దేశి సంగీత సంబంధి, జానపద సంగీతధోరణులు ఉన్నా
ఇంక ఆయన సంగీత జ్ఞానాన్ని కొంత వివరించవలసి ఉంది.

### 6.1.1 సంకీర్తనలలోని సంగీత ప్రశంస :

అన్నమాచార్యులు సంగీతాన్ని తన సంకీర్తనల్లో పొందుపరచి తన సం
జ్ఞానాన్ని ప్రదర్శించాడు.

"బత్తిగలవాడవు పడతి పాట వింటివి
చిత్తము రంజించి నీకు చెవి(బట్టెనా" (శృం. సం. 25-2

"..........................సంకీర్తన
లెడయక భాగవతు లెడయక పాడ(గా" (శృం. సం. 24-2

సంగీతం కిన్నెర వాయిస్తూ-వాద్య సహితంగా-గూడ ఉంది.

"గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా
పరగ నీమోము తప్పక చూడఁగా
.. ....................... ............
యెదురు మేడపై నెక్కి యెలుగెత్తి పాడిపాడి
పుదుటునఁ దామర పూవుల వేయఁగా" (శృం.సం. 25-161)

కిన్నెర, పిల్లనగోవి సహాయంతో పాడిన సంగీతం-

"ఎంత నేర్చెనే యీ మగువా
పంతమె నెరపీఁ బాయము మీఁదా ॥పల్లవి॥

చుక్కల పొడవగు సుదతి చన్నుఁగవ
జక్కవ లెగరుచు జరయఁగను
గక్కన కిన్నెర కాయ గూండ్లఁ
వొక్కిపట్టి తంత్రులు మీఁటీని ॥ఎంత॥

గుట్టున నుండక కొప్పు తుమ్మెదల
తెట్టెలు చెదరఁగఁ దెరవ యిదె
కట్టెడి గోళ్ళ కత్తుల బోలునఁ
బెట్టుచు శ్రుతులే బిగి ఇంచీని ॥ఎంత॥

యిత్తరి శ్రీవేంకటేశ్వరుఁ గూడఁగఁ
గుత్తిక లోపలి కోవిల లా
బిత్తరి యధరపుఁ బిల్లఁగోవిలో
నొత్తి నిలిపి తని వొందించీని ॥ఎంత॥

(శృం. సం. 30-63)

పదంలో పాట, రాగము రెండింటిని అన్నమాచార్యులు కూర్చిన తీరు అనన్య సామాన్యం; ఆయన సంగీత జ్ఞానానికి తుదిమెట్టు :

"రతి నీ పలుకులకు రామనడపులకు
గతిగూడఁ గడమ రాగము సేయు మీ ॥పల్లవి॥

పిల్లఁ గోవిరవములు బెరయించఁగా వదే
గొల్లెతల మట్టెలకుఁ గూడ సుతి
పల్లవపుఁ బదముల పాటలు వాడుచుఁ
గల్లగాదు కడమ రాగము సేయుమీ ॥రతి॥

ముంచు నీ సంకపు రవరవములకు గోపికలెల్ల
కుందణపు టందెలకుఁ గూడె సుతి
చిందుల రాగములు చిలికించి చిలికించి
కందువలఁ గడమ రాగము సేయుమీ ॥రతి॥

పెనఁగే నీ పూరుపులు పెరుగమ్మే కాంతల
కొనగోరి తాఁకులకుఁ గూడె సుతి
చెనకితి విందరిని శ్రీ వేంకటేశ్వర
కనుచొక్కు కడమ రాగము సేయుమీ ॥రతి॥

(శృం. సం. 30-114)

ఇలాగా తాను సంగీతాన్ని రాగగ్రసక్తిని తన పదాల్లో ప్రదర్శించారు అన్నమాచార్యులు.

## 6.1.2 అన్నమాచార్యుల రాగాలు :

అన్నమాచార్యులు ముప్పైరెండువేల పదాలు రచించినా మనకీనాడు లభించిన పదాలు పదిహేనువేల వరకు ఉన్నాయి. ఈపదాలకు రాగాలను సూచించిన మొదటి వాగ్గేయకారుడు అన్నమాచార్యులు. అంతకుముందే 'సింహగిరి వచనాలు' పేరుకి వచనాలైనా దైవస్తుతి పూర్వకమై పాడుకోడానికి ఉపకరించే వాటిని రచించిన కృష్ణమాచార్యులు రాగాల ప్రసక్తి చేయలేదు. అందుకే అన్నమాచార్యులు అనేకం రచించి పదకవితా పితామహుడు, సంకీర్తనాచార్యుడుగా ప్రసిద్ధికెక్కాడు. ఆయన ప్రయోగించిన రాగాలు : అమరసింధు, అందోళి, ఆబాలి, ఆరభి, ఆహిరి, ఆహిరి నాట, కన్నడగౌళ, కన్నడ బంగాళం, కాంబోది, కుంతలవరాళి, కురంజి, కేదార గౌళ, కొండమలహరి, కోకిలపంచమం, కౌశి, గంభీరనాట, గుండక్రియ, గుజ్జరి, గుమ్మకాంబోది, గౌళ, ఘంటారావం, జాళి, చాయ, చెంచుమలహరి, ఛాయానాట,

తెలుగుకాంబోది, తోడి, దన్నాసి, దేవక్రియ, దేవగాంధారి, దేసాక్షి, దేశి, దేసాళం, ద్రావిడభైరవి, ధన్యాసి, నట్టినారాయణి, నాగగాంధారి, నాగవరాళి, నాట, నాదరామక్రియ, నారణి, నారాయణి, నీలాంబరి, పడవంజరం, పాడి, ప్రతాపనాట, పిసాళం, ఫలమంజరి, పూరవి, పూర్వగౌళ, బాలహంస, బౌళి, బౌళిరామక్రియ, భంగాళం, భల్లాటి, భవుళి, భూపాలం, భైరవి, మంగళకౌశిక, మధ్యమావతి, మనోహరి, మలహరి, మాళవి, మాళవిగౌళ, మాళవశ్రీ, ముఖారి, ముఖారిపంతు, మేఘరంజని, మేచబౌళి, రామక్రియ, రామగౌళ, రీతిగౌళ, రేవగుప్తి, లలిత, వరాటి, వరాళి, వసంతం, వసంతవరాళి, వేళావళి, శంకరాభరణం, శుద్ధదేశి, శుద్ధవసంతం, శోకవరాళి, శ్రీ, సామంతం, సామరాగం, సామవరాళి, సాళంగం, సాళంగనాట, సావేరి, సింధురామక్రియ, సోమరాగం, సౌరాష్ట్రం, సౌరాష్ట్రి గుజ్జరి, హిందోళం, హిందోళ వసంతం. హిజ్జిజ్జి - ఇంకా కొన్ని పదాలు రాగ నిర్దేశ రహితంగా ఉన్నాయి.

ఇందులో కొన్ని రాగాలు అన్నమాచార్యులకు ఆదరపాత్రమైనవని తెలుస్తుంది. ఆనాడు ప్రసిద్ధి పొందినా, ఈనాడు వాటికి ప్రచారం లేకుండా పోయింది. కొన్ని ఈనాడూ బతికి బట్టగట్టాయి.

## 6.1.3 తాళప్రసక్తి :

అన్నమాచార్యులు తన పదాలకు వాడిన రాగాల పేర్లు మాత్రమే పేర్కొన్నాడుగాని తాళగతిని చెప్పలేదు. అతఃపూర్వమే పన్నెండో శతాబ్దిలో వెలసిన జయదేవుడు తన గీతగోవిందసంస్కృత అష్టపదులకు రాగతాళాల్ని పేర్కొన్నాడు. మరి అన్నమాచార్యులకి జయదేవుడు తెలియదనడానికి వీల్లేదు. జయదేవునితో సమానంగా సంస్కృత సంకీర్తన రచన చేసిన వాగ్గేయకారుడు అన్నమాచార్యులు. మరి రాగాల్ని పేర్కొన్న అన్నమాచార్యులు తాళగతి నిర్దేశం ఎందుకు చేయలేదన్న విషయానికి పలువురు పలు విధాలుగా సమాధానాలు చెబుతున్నారు.

"పద పదానికీ పైని పేర్కొన్న రాగనామం అన్నమాచార్య పదాలకు రాగప్రాధాన్యాన్ని సూచిస్తుంది. అంతేగాక.

"యతులుం బ్రాసములుం బవంబులును మాత్రాసీకముల్ సం
గతులుం గల్గి నిబంధనామ పదమాఖ్యార్థ సంయుక్త స
త్కృతిమై తాళ్ళ(కల) పాకయన్నయగురూక్తిన్ లోక విఖ్యాతమై
జిత మార్ద్వీక సితా సుధారస రుచిస్ఫీతంబునై చెన్నగున్"

(సంకీర్తన లక్షణం- పు.34)

అని చెలగే ఈ నిబంధ పదాలలోని నడక, తాళ నిర్ణయమూ బహుశః రసజ్ఞలోక సుపరిచితాలు. కాబట్టి కేవల రాగనామాన్ని అన్నమయ్య పేర్కొని ఉండవచ్చు. రాళ్ళపల్లి వారు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ 'నిబంధింపు రాగతాళము లలో ఎందును ఒకటి రెండు చోట్ల తప్ప-తాళమును పేర్కొని యుండలేదు. వట్టి రాగము పేరు మాత్రము సూచింపబడియున్నది. రాగ తాళములలో రాగముకంటే తాళమే ప్రబలతరమైనది. రాగమును మార్చినంత సులభముగా, ధారాళముగా పాట తాళమును మార్చలేము. పాటయందలి అక్షరములు ప్రాయశః తాళగతిని బట్టియే కూర్చబడియుండును.' (అన్నమయ్య పాటలు-X-పీఠిక) అని పేర్కొన్నారు. దీనిని బట్టి చూసినా అన్నమయ్య ధాతుభాగమునకు ప్రాముఖ్యం ఇవ్వ లేదనడం సమంజస మనిపించదు. వారే, అయితే అదే పీఠికలో మరోచోట 'మొత్తముమీద తాళ్ళపాక వారి రచనలు అర్థభావ ప్రధానములైనవి. త్యాగరాజ, దీక్షితుల వారివలె నాదరచనా ప్రధానములుకావు. కనుక గాయకులు ఆ దృష్టితో గాథించి పాడిరేని తప్పక నాకర్షింపగలరని చెప్పారు. ఈ వాదన కొంతవరకు సమంజసమేగాని, తరచిచూస్తే ధాతుమాతు సమన్వితంగా సాగిన అన్నమయ్య రచనలలో నాద రచనా ప్రాధాన్యానికి ఏ పాటి లోపమూలేదని చెప్పవచ్చు. వింత వింతనడకలతో సాగే రచనలలో అక్కడక్కడా మాత్ర లోపాలూ, అధిక మాత్ర నియతులతో ఆ వృత్తానికి ఎక్కువ తక్కువలుగా అక్షరాల్ని పేర్చి గాయకునకు 'గానవ్యవధి' కల్పిస్తూ, పాటలో సంగీతాన్ని ప్రతిష్ఠించిన స్రష్ట అన్నమయ్య.... కనుక నిబంధ పదాలలో గానరచనకు ప్రాధాన్యం ఉండదనే వాదన పూర్తిగా వాస్తవమైంది కాదని నా అభిప్రాయం' అని వివరించి డా॥ మంగళగిరి ప్రమీలాదేవి కొన్ని పదాల్లో రాగాల్నిబట్టి తాళాలను ఎలా నిర్ణయించుకోవచ్చునో ప్రదర్శించారు. (అన్నమాచార్య సంకీర్తనలలోని జానపదగేయ సంగీత ఛందో

రీతులు - పు. 580-585) (పిహెచ్.డి. థీసిస్-అముద్రితం) ఇలాగే కొన్ని పదాలకు గతి చూపించారు డా॥ వేటూరి ఆనందమూర్తిగారు. (తాళ్లపాక కవుల పదకవితలు - భాషాప్రయోగ విశేషములు-పు. 315-320).

అన్నమాచార్యులు తన పదాలకు రాగ నిర్దేశంచేసిన, తాళగతిని నిర్దేశించక పోవడానికి గల కారణాలు తెలుపుతూ ఇలాంటి అభిప్రాయమే ప్రకటించారు మంచాళ జగన్నాథరావుగారు. "తాళములందు ఇప్పుడు వాడుకలోగల చతురశ్రత్రిపుట (ఆది) చతురశ్ర రూపకం, ఖండజంపె (కురుజంపె), త్రిశ్రత్రిపుట (చాపు) తాళములు మాత్రమేగాక, ఇంకను మాత్రాచ్ఛందస్సులను ఆధారముగా చేసికొని ప్రస్తరింప బడిన తాళములేవో కొన్ని ఆనాడు వాడుక యందుండి యుండవలెను. వానిని ఓపికతో పరిశీలించి కనుగొనవలసియుండును...."

"అందరికంటె ప్రాచీనులైన జయదేవులు తన గీత గోవిందకావ్యమున మాత్రాచ్ఛందస్సులను ఎట్లు వాడిరనగా సంగీత పరిచయముగల వారికి అష్టపది చదువగనే ఇది ఈ తాళమునకు ఒదుగుచున్నదను విషయము స్పష్టముగా తెలియ పోవును. అట్లే తాళ్లపాక వారి రచనల యందును కొన్ని తాళములకు ఒదుగు రచనలు సుస్పష్టముగానే యున్నవి. 'ఈతడే-హరుడు-ఈతడే యజుడు। ఈతనికి యీ చేతలెంత ఘన మటుగాన।' ఇది త్రిశ్ర రూపకము లేక కురుజంపె. (వైదే. శుభాశంసనము-పు.19) ఇది మంచాళ వారి అభిప్రాయం. దివంగతులైన మంచాళవారు సంగీత విద్వాంసుల్లో శ్రేష్ఠులనడంలో సందేహంలేదు. కానీ వీరందరి అభిప్రాయాలు తమకు తెలిసినంతమట్టుకు మాత్రమే చెప్పగలిగారు. కానీ అన్నిటికీ తాళ నిర్ణయం చేయడం కష్టమనే తలంచడం అసంబద్ధంగాదు.

అన్నమాచార్యుల సంకీర్తనల్లో సంగీతం కంటె సాహిత్యానికే అధిక ప్రాధాన్యమని ప్రాజ్ఞ విద్వాంసులు వివరించిన అంశం. దీన్ని సంగీత సాహిత్యాల రెంటను అత్యంత ప్రముఖ విద్వాంసులైన రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు అంగీకరించారు. అంతేగాక అన్నమాచార్యులు రాగాలపేర్లు పేర్కొని, తాళాలను నిర్దేశించకపోవడానికి కారణం తెలియదనీ, అయినా కొన్నింటిని గ్రహించ వీలయినా అన్నమాచార్యులుద్దేశించిన తాళాలేమిటో తెలుసుకోవడం కష్టమని పైని పేర్కొన్న విషయంలో సత్యముంది. అలాగే రాళ్ళపల్లి వారితో ఏకీభవించిన బాలాంత్రపు

రజనీకాంతరావుగారు సైతం రాళ్ళపల్లివారిని సమర్థిస్తూ పేర్కొన్న అంశాన్ని మనం గమనించవలసి ఉంది.

"తాళాలపేర్లు రాగిరేకులలో లేనేలేవు. పాటల అక్షరప్రమాణమును, యతి ప్రాసలను పరిశీలించి అది, రూపకము, జంపె, అట్ట, మిశ్రచావు, త్రిపుట మొదలగు సుప్రసిద్ధ తాళాలన్నీ ప్రయుక్తములైనాయని శ్రీశర్మగారు వ్రాశారు. అంతేగాక 'భావము భాషారూపముగా మనస్సులో స్ఫురించిన వెంటనే తత్కాలమునకు స్ఫురణకు వచ్చిన ఏ సిద్ధమైన వర్ణ మెట్టునో గ్రహించి రచన సాగించినట్లే కాన వచ్చునే తప్ప, నూతననాద శరీర కల్పనకై (అనగా కొత్త సంగీతపు వరుసల కల్పనకై) ప్రత్యేకముగా వారు పరిశ్రమించినట్లు తోచదు' అనికూడా వ్రాశారు. అంటే ఆనాటికి పండిత జనాదరణం, సమాజగౌరవం లేని జక్కులవారి యక్షగాన ప్రదర్శనాలలోనో, ఇతర జానపదగీత నృత్య ప్రదర్శనాలలోనో కర్ణాకర్ణిగా వినిపించే దరువులను, పదాలను వరవడులగా పెట్టుకొని, వాటికి వాడుకలో ఉన్న, ఆ రాగతాళాలలోనే తాళ్ళపాక కవులు తమకు తోచిన సంకీర్తనములన్నీ పాడి ఉంటారని మనం శ్రీ శర్మగారి ఊహకు వ్యాఖ్యానము చేసుకోవచ్చును." (ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము పు. 139) అని రాళ్ళపల్లి వారిని సమర్థించి ఉండడం గమనించదగ్గ అంశం. ఏమైనా తాళనిర్దేశం అన్నమాచార్యులు చేయకపోవడానికి గల కారణాలూహ్యములే. ఇంకా సంగీత ప్రాజ్ఞుల పరిశోధనకు అవకాశమిచ్చే అంశమే.

మంచాళ జగన్నాథరావుగారు క్షేత్రయ్య, రామదాసులాంటి వాగ్గేయకారుల పదాలకు, కీర్తనలకు సంగీతం కూర్చిన విషయం మనకుతెలిసిందే. అలాగే అన్నమా చార్యుల సంకీర్తనలకు సైతం సంగీతం సమకూర్చారు. వాటిని మూడు సంపు టాలుగా తిరుమల తిరుపతి దేవస్థానంవారు ప్రకటించారు.

"మరో విషయం గూడా ఇక్కడ పేర్కొనడం అవసరం. తెలుగు గేయ కర్తలలో ఆద్యుడుగా అన్నమాచార్యులను గుర్తిస్తున్నాము. ఆకారణంగా ఆయన గేయాలు గేయపరిణామంలో ప్రాథమిక దశకు చెందుతాయి. అందుచేత వాటిని పాడేటప్పుడు 'అతీతం, అనాగతం' అనే తాళప్రక్రియలను ప్రయోగించడం 'అనాక్రా నిజం' అంటే చారిత్రక (పారిణామిక) పూర్వాపర్యాల విపర్యయదోషంగా పరిగ

జించాలి' అని 1952 మద్రాసులో జరిగిన ఒక సాహిత్యసభలో డా॥ శ్రీపాదగోపాల కృష్ణమూర్తిగారివంటి హేతువాదియైన సాహిత్య విమర్శకుడు ఉద్ఘాటించారు. అన్నమయ్యకు 15 శతాబ్దుల పూర్వమే భరతముని నాట్యశాస్త్రంలోనే గేయగానంలోని అతీత, అనాగత సమగ్రయోగాల లక్షణం ఉన్నదన్న సంగతి ఆసభలోనే ఆ విమర్శకుని దృష్టికి తేవడం జరిగింది." అని బాలాంత్రపు రజనీకాంతరావుగారి - అన్నమాచార్యుల రాగాల గూర్చిన - నిర్ణయం. అన్నమాచార్యుల పదకవిత - నాట్యానుకూలత - A Brochure-A.I.R-Vijayawada - 19, 20 సెప్టెంబర్ 1981)

## 6.2 అభినయం :

కేవలం పాడుకోడానికి మాత్రమే అన్నమాచార్యుల సంకీర్తనలు రచితం కాలేదు. ఆడుతూ - అంటే అభినయిస్తూ - పాడుకోవానికి ఉద్దిష్టమైనవనే విషయం గమనించదగ్గ అంశం. అందుకే ఈ సంకీర్తనలు ఆ పద్ధతిలోనే అన్నమాచార్యుల రచించాడు. ఆడిపాడి అంటే అభినయిస్తూ పాడి తన సంకీర్తన పుష్పాలతో శ్రీవేంకటేశ్వరుని సేవకై తనజీవితమే మీదుకట్టిన మహావాగ్గేయకార భక్తుడు అన్నమాచార్యులు.

## 6.2.1 అన్నమాచార్యుల సంకీర్తనల్లో అభినయ ప్రసక్తి :

తెలుగులో పదాభినయం క్షేత్రయ్యతోనే ప్రారంభమైందనీ, అది ఆనాడు సిద్ధేంద్రయోగి భామకలాపంలోనూ ఉండేదనీ తెలుస్తుంది. నారాయణతీర్థుల శ్రీకృష్ణ లీలా తరంగిణిలోని తరంగాల అభినయమూ ఉండేదనీ విజ్ఞుల అభిప్రాయం. కానీ సంకీర్తన లేక పదమనే నామకరణం అన్నమాచార్యుడే చేసి ఉండడం ఇక్కడ గమనించదగ్గ అంశం. పైగా అన్నమాచార్యుడు ఆడుతూ-అభినయిస్తూ-పాడేవారన్న విషయం మనమిక్కడ గుర్తుంచుకోవాలి. ఆయన సంకీర్తనల్లోనే ఈ అభినయాన్ని గూర్చిన ప్రసక్తిని గుర్తిస్తే ఈ అంశం మరింత స్పష్టమవుతుంది.

కాలమునాడే రాజనర్తకులు, దేవదాసీలు, రాజుల కొలువుల్లోను నాట్య ప్రయోగం ద్వారా ప్రదర్శించేవారు." (పైదే)

కాబట్టి పదాభినయం అనాడే ఉండేదని స్పష్టమవుతుంది. ఇంకా ఇలాంటివే మరో ఉదాహరణ మరో సంకీర్తనలో మనం చూడగలం.

"ఉపచరింపఁగ రాదా వువిద గడునలసె
నెపముగ వురుపెల్ల నెరపీ నీమీఁదను ॥పల్లవి॥

నలినాక్షి గరడిలో నంటునఁ గేళిసేసె
మలసి చెక్కులను చెమట గారఁగా
వలపందులోనె చల్లి వాసన గుబ్బలు మోఁపి
నలువంక నీకు నభినయము చూపీని ॥ఉప॥

తెర మఱుఁగున వచ్చి దేశి శుద్ధాంగములను
సరవి నాడి చూపులు సఱపుచును
తిరుపుగొని కమ్మటి తీగె చేతు లటువాఁచి
సరస సంగరంగ వైభవము మెరసీని ॥ఉప॥

పదములఁ జిందు జక్కిణి బహుతాళమానముల
నిదె నాట్యమున నిన్ను నింతి మెప్పించె
అదవ శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు
గదిసి చూడఁగా మతి గరగించీని ॥ఉప॥"

(శృం. సం. 30-555)

పై పదంలో 'నలినాక్షి' నాయిక 'గరడినంటునఁ గేళిసేసి' నాయకునకు 'నలువంక' 'అభినయము' చూపిందట. 'తెర మరుగున వచ్చి దేశిశుద్ధాంగములను సరవినాడి, చూపులు సఱపుచును' సరస సంగరంగ వైభవము మెరసిం'దట.

ఇక్కడ మొదటి చరణంలో అభినయం చూపిన రీతిని వివరించాడు. రెండో చరణంలో అంగిక, సాత్వికాభినయ వైశద్యాన్ని నాయిక అభినయించి చూపింది. పైగా తెరమరుగున వచ్చిందట నాయిక. వచ్చి 'దేశి శుద్ధాంగములను' అంటే దేశి పద్ధతిలో నృత్తంచేసి అభినయించి 'సంగరంగ వైభవం'తో మెరసిపోయిందట. ఇంతకంటే అభినయ విశేషమేముంది? ఎక్కడుంది?

నాల్గో చరణంలో 'పదములఁజిందు జక్కిణి బహుతాళమానములనిదె నాట్యమున నిన్నునింతి మెప్పించె" - పదాభినయంతో, చిందు, జక్కిణి (ఇదొక యక్షిణి రూపమే అయినా దేశిపద్ధతిలోని అభినయమేమో అనిపిస్తూంది), బహుతాళ గతులతో నాట్యమాడి నాయిక అలమేలుమంగ శ్రీ వేంకటేశ్వర నాయకుని మెప్పించిందని అన్నమాచార్యులు అత్యంత మనోహరంగా అభివర్ణించి ఆనాటి పదాభినయ రీతిని వివరించాడు.

ఇది అన్నమాచార్యుల సంగీతాభినయాల వివరణ. ఇంకా తజ్ఞులు పరిశీలించి వివరించవలసిన ఆవసరం ఎంతేని ఉంది.

# 7.0 అన్నమాచార్య సంకీర్తనలు - ఆనాటి స్థితిగతులు

అన్నమాచార్య సంకీర్తన సాహిత్యం అనంతం. ఇతఃపూర్వమే ప్రా ప్రసక్తంగా ఆయా సందర్భాలలో కొన్ని ఆనాడు నెలసినవి-పరిస్థితుల్ని పేర ఉం జరిగింది. డా॥ వేటూరి ఆనందమూర్తిగారు ఆనాడు నెలసిన మత, రా సాంఘికపరిస్థితులను తమ తాళ్ళపాక కవుల పదకవితలు-భాషా ప్రయోగవిశేష (పు. 481-550) లో వివరించారు. కానీ నాయీ ప్రస్తుత అధ్యయనం అన్న చార్య సంకీర్తన సాహిత్యానికి మాత్రమే పరిమితమైంది. కనుక అం ప్రతిబింబించిన రాజకీయ మత సాంఘిక స్థితిగతులను వివరించి సమగ్ర చేకూర్చడం సముచితమని భావిస్తున్నాను. ఆనాటి సాంఘిక స్థితిగతుల్ని వివర ప్రస్తావించి పరిపూర్ణతను చేకూర్చడం నా ప్రస్తుత ప్రయత్నం.

## 7.1 రాజకీయాలు :

అన్నమాచార్యులు రాజులు, రాజాస్థానాలు అంటే ఏమాత్రం ఆసక్తిలేనివా పైపెచ్చు రాజును ఎదిరించిన మహావాగ్గేయకార భక్తాగ్రేసరుడు. సాళ్వనరసింగ లను ధిక్కరించి, అతని దండనకు గురిఅయి, ఆ పరాత్పరుడు శ్రీవేంకటే దయతో విముక్తుడైన వాడన్న విషయం అన్నమాచార్య జీవితచరిత్రలో తెల కొన్నాము. అలాగే ఇతర రాజులను ఆశ్రయించలేదని మనకు విదితమే. ఇది మహాభక్తుని వ్యక్తిత్వానికి తగిన విధమేనని స్పష్టమవుతుంది.

(వివరాలకు చూడుడు : డా॥ వేటూరి ఆనందమూర్తి : తాళ్ళపాక క పదకవితలు-భాషాప్రయోగ విశేషములు-పు. 481-486).

## 7.2 మత పరిస్థితులు :

మతపరిస్థితులకు సంబంధించిన వివరాలు డా॥ ఆనందమూర్తిగారు వి రంగా చిత్రించియున్నారు. (చూడుడు: పైపే. పు. 501-506). ఈ గ్రంథంలో 2 ప్రకరణాల్లోను పరిశీలించవచ్చు. అన్నమాచార్యులు పరిపూర్ణంగా శ్రీరామానుజా

విశిష్టాద్వైత మతాన్ని స్వీకరించడమేగాదు ప్రచారంచేశాడు. ఆయన, అధ్యాత్మ శృంగార సంకీర్తనలన్నిటా ఇది అభివ్యక్తమవుతుంది. ఘనయతి, ఆదివన్‌శఠ గోపయతి, పన్నిద్దరాళ్వారులు అన్నమాచార్యులకు గురువులు; తదనుగుణంగా ఆలోచించి ఆచరించిన మహనీయుడు అన్నమాచార్యులు. వారి పుత్రపౌత్రులు సైతం ఆచరించి తరించినవారు.

## 7.3 సామాజిక స్థితిగతులు :

ఈ సామాజిక స్థితిగతుల్ని సైతం డా॥ ఆనందమూర్తి వివరించాడు. అయినా అన్నమాచార్యుల నాటి స్థితుల్ని ప్రత్యేకంగా పేర్కొని వర్ణించవలసిన అవసరముంది. ఆ ప్రయత్నంలో నా అధ్యయనంలో చూసిన, గ్రహించిన, అంశాల్ని నా ఎరుకలోని వాటిని చిత్రిస్తాను. తద్వారా ఆ కాలంనాటి సామాజికస్థితిని కొంతఅయిన-అన్నమాచార్యుల సంకీర్తనలలో వ్యక్తమైన దానిని వివరించినట్లవుతుంది.

### 7.3.1 పండుగలు, వినోదాలు :

అన్నమాచార్యులు ఉట్ల పండుగ (12-57,190: 24-29) బహుధావర్ణించాడు. శ్రీ వేంకటేశుని కొలువు (30-119), తెప్పతిరునాళ్ల, (4-6), కోడ తిరునాళ్ల (24-281), తెప్పోత్సవం (26-534), రథోత్సవం (26-558;9-26, 31,35,54,178,181,286), అత్యంత మనోహరంగా వర్ణించాడు. విమ్మనగ్రోవితో (4-5), వసంతాలాడడం (22-507; 26-49) చిత్రితం.

### 7.3.2 ఆటలు :

ఆనాటి ఆటలనేకం. కోలాటం (24-281), తోలుబొమ్మలు (31-253), వామనగుంటలు (27-45), నెత్తమాడడం (4-163, 27-45, 344), బొమ్మ పెండ్లి (26-45), సరిబేసులు (3-620, 24-369, 27-45), చదరంగం (3-139, 22-269, 24-91, 27-45, 28-194, 31-383) అల్లోనేరేళ్ల (22-547); దాలిముచ్చటలాడడం (24-187) మొదలైన ఆటలెన్నో ఉండేవని విదితమవుతుంది.

### 7.3.3 ఆభరణాలు :

ఆనాడు అనేకాభరణాలు ధరించేవారు. నాయిక నాయకునితో అంటున్న మాటలు. ఆయాభరణాల్ని పేర్కొంటుం దీ పదంలో :

"నిలు నిలు దగ్గరకు నీయాన నీకు
వలచితినని మావారెల్ల నగరా ॥పల్లవి॥

వద్దు వద్దు కొండలలో వారికి మాకింతేసి
పెద్ద పెద్ద ముత్యాల పేరులిన్నేసి
అద్దము చూచిదె మాకు నంతకంటె సిగ్గయ్యీని
గద్దరి మాటెంచువారుగని నన్ను నగరా ॥నిలు॥

చాలు చాలు బంగారు సరుపణులుంగరాలు
నీలపుగంటసరులు నీకే ఉండనీ
మూలనుండే వారుగాక ముత్యాలచెరగుల
చేలంగట్టు కొన్న నన్ను చెంచెతలు నగరా ॥నిలు॥"

(శృం. సం. 12-342)

ఇందులో ముత్యాలపేరులు, బంగారుసరుపణులు, ఉంగరాలు, నీలపుగంట సరాలు పేర్కొబడ్డాయి. 'ముత్యాలచెరగుల చేలం' గట్టుకొన్నదని చెప్పబడింది. "ఇట్టి ముద్దులాడిబాలుడేడవాడు" పదంలో బాలకృష్ణుని ఆభరణాలు-"చేమపూవు కడియాలు, ముంగై మురువులు, వుంగరాలు" చేయవర్ణితం (12-148). ఉంగరాలు బాహుధావర్ణితం (25-31, 158, 172; 26-382). ఇంతేగాక ప్రేమచిహ్నంగా ఉంగరం పెట్టడం ఉంది :

"అంగడి మావలపు నీకనువాయను
వుంగరము పెట్టకయ్య నొక్క మనసాయను"

(శృం. సం. 24-358).

కమ్మలు (25-286), హారములు (25-286), పెండెలు (25-167,242; 4-163), కుప్పసవరము (24-290, 26-3).

స్త్రీ వివిధాలంకరణలతో ఒప్పినతీరు: కేశాలంకరణ, కళపెళచేరధరించడం, పయ్యెదబోలుగా కప్పడం వర్ణితం :

"ఏల సిగ్గులు వడేవు యెదుటికి రాఁగదవే
సోలిగా నీసింగారాలు చూచుఁగాని యాతఁడు ॥పల్లవి॥

కొప్పుపెట్టుకొంటివిగా కుప్పెసవరము తోఁద
కప్పితివిగా పయ్యద కదు (దుఁ) బోలుగా
చిప్పిలఁ బూసితివిగా చెంపలునిండా జవ్వాది
యిప్పుడె గక్కనఁ బతినిఁక వలపించవే ॥ఏల॥

కట్టుకొంటివిగా చీరకళవెళ మనఁగాను
వొట్టుకొంటివిగా సొమ్ములొళ్ళ నిండాను
గట్టిగా నిడుకొంటివిగా కన్నులనుఁగాటుక
దట్టముగా నీతనికి తమిరేఁచఁ గదవే ॥ఏల॥

సేసితిగా విడ్డెలు చెంగావి మోపెల్లాఁగప్ప
వేసితివిగా మెడను విరిదండలు
వేసర కలమేల్మంగ విభుఁడు శ్రీవేంకటేశుఁ
డాసతో నన్నేలె నీవూ నంటసే యాతనిని ॥ఏల॥

(శృం. నం. 24-290)

బంగారు పావాలు, వల్లెవాటు పయ్యద (25-363) వర్ణితం.

"దాడింబ పువ్వులవన్నె తళుకులఁబయ్యెద కొంగు
వేడుకతో వల్లెవాటువేసి.................. ...." (శృం.నం. 4-42)

ఇలా ఎన్నో ఆభరణాలు వర్ణితం.

7.3.4 పెండ్లి :

ఏగురుపెండ్లి (3-546), 'ఇన్నాళ్ళె పెండ్లికి దేవుఁడేగీ వీధులను' (24-320) ఇది పెండ్లి ఊరేగింపు ;

వివాహ విధినంతటినీ ఈకిందిపదంలో వర్ణించాడు అన్నమాచార్యులు.

"ఈపెకు నితఁడు దగు నితనికీపె దగు
చూపులకు పండుగాయ శోభనము నేఁడు ॥పల్లవి॥

పిలువరె పెండ్లికూఁతుఁ బెండ్లిపీటమీఁదికి
చెలఁగి తానెదురు చూచీ దేవుఁడు
బలువుగా నిద్దరికి బాసికములు గట్టరె
కలిమెల్ల పెరసి సింగారించరే ॥ఈపె॥

ఆతలఁదెచ్చి పెట్టరె ఆ పెండ్లి కూఁతురును
యీతఁడ్డే జంట శోభన మిద్దరికిని
కాతరాన బువ్వానకు గక్కనఁ బెట్టరె మీరు
రేతిట నుండియు వేగిరించేరు వీరు ॥ఈపె॥

పానుపు పరచరె బలునాగవల్లి నేఁడు
పూని తెరవేయరె వొలతులాల
ఆనుక శ్రీవేంకటేశుఁడలమేలుమంగయును
లోననె భూకాంతయును లోలుపైరి తాము ॥ఈపె॥"

(శృం. సం 22-295)

ఇలాగే 22-589, 26-182, 30-107 పదాల్లోను చూడగలం
ఈ రీతిగా పెండ్లి విధానం వర్ణితం.

### 7.3.5 దోమతెర, మంచం :

ఆనాడు రకరకాల మంచాలు, దోమతెరలు ఉండేవి. దోమతెర మంచము (22-148), ఉయ్యాలమంచము (25-99), పట్టె మంచము (25-102), తూగు మంచము (25-568):

దోమతెర (25-432, 31-450), మించుల దోమతెర (26-72):

ఇలాగా ఎన్నోరకాలు మంచాలు, దోమతెరలు ఆనాడే కలవాళ్ళ-సంపన్నులు-ఉండేవారు.

### 7.3.6 ఆహార పదార్థాలు :

ఇడ్డెనలు, రాజాన్నాలు, వీటికి సాధనాలు పళ్ళేలు (9-10, 10-27, 88) వర్ణితాలు,

ఆనాడు చావకూడు (4-33) ఉండేదని తెలుస్తుంది. ఆవపచ్చడి (ఆవకాయ) ఆరోజుల్లో ఉండేదని విదితమవుతుంది.

"ఇట్టి విందు గంటివా నీపెక్కుడనైనా
అట్టె ఆకెపొత్తున నీవారగించవయ్యా ॥పల్లవి॥

కలికి కెమ్మోవితీపు కమ్మని తేనెలవిందు
చలువచూపులు నీకుఁ జక్కెరవిందు
సెలవి లేనవ్వులే చిలుపాలతోడి విందు
అలమేలుమంగ పేసీ నారగించవయ్యా ॥ఇట్టి॥

కాంత గోరిచెనకులు కారపుఁ గూరలవిందు
పంతపు మాటలే ఆవపచ్చడి విందు
వింతబొమ్మల జంకెనలే వేఁడి పడిదాల విందు
అంత పేసీ నీదేవి యారగించవయ్యా ॥ఇట్టి॥

అట్టడి సమరతి యాఖడి తరితీపువిందు
గట్టి సిగ్గు పెరుగు మీఁగడల విందు
గుట్టుతో మన్నించితివి కొమ్మను శ్రీవేంకటేశ
అట్టె నీతనివిదీర నారగించవయ్యా ॥ఇట్టి॥ (శృం.సం. 27-629)

శృంగార చేష్టలతో ఆయా విందులతో పోల్చి అత్యంత మనోజ్ఞంగా రచించాడు అన్నమాచార్యులు :

కారెపు వీడెము (కారా కిళ్ళీ) (26-146) గూడా వర్ణితం.

### 7.3.7 మరికొన్ని విశేషాలు :

రచ్చరావి క్రింద ఊరిలోని వాళ్లు కూడడం ఉంది (4-103); ఓడ వ్యాపారము (9-35, 99) ప్రస్తావించబడ్డది. చాట్నంగూడా వర్ణితం (9-49). తాటి యాకు వాయడం - అంటే ఈనాటి ప్రామిసరీ నోట్ వంటిదే-వర్ణితం (2-290).

ఆనాడు నాయిక నాయకునకు లేఖలు పావురాలద్వారా **పంపడం, చిలుక** ద్వారా విన్నపాలు పంపడం ఉండేది.

"విచ్చలవిడై మీరు వినోదింతురుగాక
హెచ్చెను తమకములు ఇఁకనేల జాగులు ॥పల్లవి॥

వేవేగ రమ్మనుచు వెలఁదిలేకలు వ్రాసి
పావురము మెడఁగట్టి పంపెనీక (కు)ను
నీ వది చదువుకొని నెమ్మిఁబతికమ్మవెట్టి
యీవేళనే అంపితివి ఇఁకనేల జాగులు ॥విచ్చ॥

కలికి నీరాకకుఁ గాచుక వుందాననని
చిలుకచే విన్నపాలు చెప్పి పంపెను
మలసి నీవవి విని మారుత్తరములు నేర్పి
యెలమితో నంపితివి ఇఁకనేల జాగులు ॥విచ్చ॥"

(శృం. సం. 28-386)

వెట్టి - ఆధ్యాత్మికంగానే - అన్నమాచార్యులు వర్ణించారు.

"చెప్పినంతపని నేఁజేయఁగలవాఁడనింతే
అప్పటి నపరాధమా ఆదరించవలదా ॥పల్లవి॥

నీ యాజ్ఞ దేహము నేమోచితి నింతే
యీయెడ విజ్ఞానమేల యియ్యవయ్యా
వేయి వేలై వేగుదాక వెట్టిసేసి అలసితి
వోయయ్య కొంతైన వూరడించవలదా ॥చెప్పి॥

నీవు సేపే కర్మము నేఁజేయువాఁడ నింతె
యీవల నానంద సుఖమియ్యవయ్యా
కోవ (వు) రమై వెంట వెంటఁ గొలిచిన బంట్లకు
తావులఁ గొంత వడైనా దప్పిదీర్ప వలదా ॥చెప్పి॥

మతిలో శ్రీవేంకటేశ మనికయినవాఁడ నింతే
తతి నా పాటుకు దయదలఁచ వయ్య
యితపై పనిసేసేటి యింటి పసురమునకు
వెతదీరఁ బాలార్చి పెట్టుపెట్టఁదగదా ॥చెప్పి॥"

(అధ్యా. సం. 10-207)

కూలి, జీతమూ వర్ణించాడు అన్నమాచార్యులు :

"మాయామోహము మానదిది
శ్రీ యచ్యుత నీచిత్తమే కలదీ ॥పల్లవి॥

యెంత వెలుఁగునకు నంతే చీఁకటి
యెంత సంపదకు నంతాపద
అంతటానౌషధ మపథ్యమును సరి
వింతే మిగిలెను సేసేటేకలదీ ॥మాయా॥

చేసిన కూలికి జీతమునకు సరి
పూసిన కర్మభోగము సరి
వాసులజన్మము వడిమరణము సరి
ఆసల మిగిలిన దలపే కలదీ ॥మాయా॥

మొలచిన దేహము ముదియుటకును సరి
తలఁచిన దైవము తనలోను
యిలలో శ్రీవేంకటేశ నీ కరుణ
గలిగిన మాకెల్ల ఘనతేగలదీ ॥మాయా॥" (అధ్యా.సం. 9-277)

ఆనాటి స్థితిగతుల్ని వర్ణించి లోకవృత్త పరిశీలనను అన్నమాచార్యులు అత్యంత సూక్ష్మంగా వర్ణించాడు :

"తానెంత బ్రదుకెంత దైవమా నీమాయయెంత
మానవుల లంపటాలు మరి చెప్పఁగలదా ॥పల్లవి॥

చెలఁగి నేలఁ బారేటి చీమసయితమును
కలసి పూరకే పారుఁగమ్మర నెంచో మరలు
తలమోఁచి కాఁపురము ధాన్యములు గూడబెట్టు
యిల సంసారము దనకిఁక నెంతగలదో ॥తానెంత॥

యేడో బాయిటఁ బారే యీఁగ సయితమును
వాడుదేర నడవుల వాలి వాలి
కూడపెట్టుఁ దేనెలు గొందులఁ బిల్లలఁబెట్టు
యేడకేడ సంసారమిఁకనెంతో గలదో ॥తానెంత॥

హెచ్చి గిజిగాండ్లు సయితమెంతో గూఁడుపెట్టు
తెచ్చి మిణుగురుఁ బురువు దీపము పెట్టు
తచ్చి శ్రీవేంకటేశ నీదాసులు చూచినగుదు
రిచ్చలఁదానీ సంసార మిఁకనెంతగలదో ॥తానెంత॥

(అధ్యా. సం. 9-179)

ఇది అన్నమాచార్యుల లోకవృత్త పరిశీలనకు చక్కటి నిదర్శనం. గిజిగాండ్లు గూడుపెట్టడం', అందులో 'మిణుగురుఁబురువు దీపము పెట్టడం' ఆయన లోక వృత్త పరిశీలనకు మకుటాయమానం. ఆధునికయుగంలో గుఱ్ఱం జాషువా 'గిజిగాడు' గూర్చి అత్యంత మనోహరంగా రచించి ఉండడం తెలుగువారందరికీ తెల్లమే.

కర్షక జీవనం వర్ణితం (4-122).
అట్లే బంతి కట్టడం వర్ణించడం గమనించదగ్గది.
"అంతటను సర్వనరకాది లోకాలు మెట్టితి
బంతిఁగట్టి మరిపెడి పసురమునై
చెంతల శ్రీవేంకటేశ చేరితి నీ వద్ద నేఁడు
వంతుకుఁ గామధేనువు వద్ది దూడవలెను" (అధ్యా. సం. 9-49)

"అంతటనె వచ్చికాచు నాపద్బంధుఁడు హరి
వంతుకు వాసికి నతనివాఁడనం జేఁజాలు ॥పల్లవి॥

బంతిఁగట్టి సురిపేటి పసురము లెడనెడఁ
బొంత నొక్కొక్క గవుకవుచ్చుకొన్నట్లు
చెంతల సంసారము సేయునరుఁ డందులోనె
కొంతగొంత హరినాత్మఁ గొలుచుటే చాలు ॥అంత॥"

(అధ్యా. సం. 10-201)

ఆనాడు సీటి గడియారం ఉన్నట్లు ఈ కింది అన్నమాచార్యుల పదంవల్ల వ్యక్తమవుతుంది. శృంగారపరంగా వర్ణితం.

"ఏల పొద్దులు గడిపే వింతికడకు రావయ్యా
నాలిసేయ నిఁక వద్దు నమ్మియాపె వున్నది ॥పల్లవి॥

చక్కని నతిమోమున చంద్రోదయంబాయ
వెక్కసపు నవ్వుల వెన్నెలగానె
చొక్కపు కొప్పు విరుల చుక్కలుగానుపించె
వక్కన పెంచితే పట్టపగలు రేయౌను ॥ఏల॥

సతి కుచగిరులనే జక్కవలు జోడుగూడె
తతి వికసించెఁ గన్నులఁ దామరలు
మితిలేని రత్నకాంతి మించె సూర్యోదయము
మతి నెంచుకొంన్నను మా పేరేపౌను ॥ఏల॥

కలికి మెయి చెమటల గడియారపు నీరెక్కె
తెలిసిగ్గులనే పెండ్లి తెర వేసెను
అలమె శ్రీవేంకటేశ అంతలో నీవురాఁగాను
నెలవై యిద్దె వుండితే నిచ్చకళ్యాణమవును ॥ఏల॥"

(శృం. సం. 24-179)

ఇందులో శృంగారం మహాప్రతిభావంతంగా వర్ణితం.

ఇలాగే మరో పదంలో గడియారం ప్రసక్తి ఉంది.

"పూని ఇందిర పాటలో నోలలాడు చున్నవాడు
బోనపుటింకులెదుటఁ బొడచూపరే
పానిపట్టి నెత్తమాడేవరాకై వున్నవాఁడు
పూని గడేరమువారు పొంచి యెచ్చరించరే" (శృం సం.30-186)

లంచమివ్వడం అనాడూ ఉందని తెలుస్తుంది :

"నిలువుటద్దములోన నీడనల్ల దివో కంటె
చలివాసెఁ దనకేలే నటకాఁడు కృష్ణుఁడు ॥పల్లవి॥

మెఱఁగనట్టి విచ్చేసి యిదె నామలఁగు మీఁద
నొఱగి వెనకవంక నున్నవాఁడు
మఱి చెలులు నవ్వితే మానుమని సన్నసేసీ
మఱఁగులింకా నేలే మాయకాఁడు కృష్ణుఁడు ॥నిలువు॥

మాటలాడక నావద్ద మంచము నాకోటిమీఁద
యేటపెట్టుకొని మమ్ము నెలయించీని
పాటించి లంచము లిచ్చీ పంజరము చిలుకకు
తూటరి యీవిద్దెలే దొమ్మికాడు కృష్ణుడు ॥నిలువు॥"
(శృం. సం. 22-338)

తన కాలంనాటి పరిస్థితుల్ని వేటినీ వదలక సందర్భోచితంగా కూర్చాడు అన్నమాచార్యులు.

చివరికి బూతులు, తిట్లు ఉన్నాయి. వీటి మూలాన ప్రజలకెంత సన్నిహితంగా అన్నమాచార్యులుండేవాడో తెలుస్తుంది.

"బూతుల నన్నుఁ దిట్టఁగఁ బులకించి వుంటినింతే" (శృం. సం. 26-214)

"బిగ్గనఁ దానేయింకఁ బచ్చితిట్టు తిట్టినాఁడు
యెగ్గులు సిగ్గులుఁ బాసెనే లేయింక" (26-264)
"వగలనేఁదిట్టితేను వాడుకేల వచ్చీనీ" (26-278)
"ఇయ్యకొనన నీవు ఇచ్చిన చనవులెల్లా

తియ్యని సిగ్గున నేనేతిట్టితిఁగాక" (26-287)

"బొమ్మల జరికించితివి బూతునఁ దిట్టితివి" (26-287)

"లంజకాఁడ వౌదువురా

లంజకాఁడవౌదువు లాగుతెల్ల (గానవచ్చె

ముంజేతఁ బెట్టిన సొమ్ముల కద్దమేలరా" (12-84)

ఈనాటసభ్యమైనా ఈ పదాలన్నింటినీ ప్రయోగించి ప్రజాకవి అయ్యాడు అన్నమాచార్యులు. అంటే బూతులు దిట్టడమే ప్రజాకవి లక్షణం కాదు. ప్రజలకు దగ్గరగా, సన్నిహితంగా అన్నమయ్య ఉండేవాడని భావం. పైగా శృంగార పదాల్లో ఈ పదాలు వాడవచ్చునన్న విషయం ఇక్కడ గుర్తుంచుకోవడం అవసరం.

### 7.3.8 స్త్రీ స్వభావ చిత్రణ :

మన భారతీయ సమాజంలో అనాది నుంచి స్త్రీకి ప్రాధాన్యం తక్కువ. అయితే గృహిణిగా ఆమెకెంతో ప్రాధాన్యమున్నమాట వాస్తవం. చాలావరకు పితృస్వామ్యం ప్రాముఖ్యం వహించడంవల్ల గృహిణి గృహానికే పరిమితంగా ఉండిపోయింది. దీనికంతటికీ కారణం పురుషాధిక్యం, లేకపోతే పురుషాహంకారం అనే విమర్శ ఉంది. కాని ఇంతకంటే ప్రధానంగా ఆర్థికమైన స్థితిగతులమీద ఇది ఆధారపడిందన్న విషయం మనం గుర్తుంచుకోవాలి. సామాన్యులైన పాటక జనం పనిపాటల్లో సమానంగా పాల్గొన్నా ఆర్థిక సంబంధమైన విషయాలలో గృహ యజమానిదే అధికారం. ఆర్థికమైన అంశాలపై స్త్రీకి అధికారావకాశం లేకుండా పోయింది. అందువల్లనే స్త్రీకి ప్రత్యేకంగా పురుషునితో సమానమైన ప్రతిపత్తి లేకుండా పోయిందనిపిస్తుంది. అది చేకూర్చిననాడు ఇలాంటి విపత్కర పరిస్థితులు తొలగిపోవచ్చు. పైపెచ్చు పురుషునికి ఒకనీతి స్త్రీకి మరోనీతి అని వ్యవహరించినట్లు తెలుస్తుంది. స్త్రీ పతివ్రతాశిరోమణిగా ప్రసిద్ధికెక్కవలసి ఉంది. పురుషుడుమాత్రం స్వేచ్ఛా విహారి. అందుకే బహుభార్యాత్వం, వేశ్యావృత్తి సమాజంలో ప్రబలిపోయాయి. కాగా ఇతర వస్తువులలాగే స్త్రీ పురుషునికి భోగ్య వస్తువైందని చెప్పక తప్పదు. ఈ దుస్థితి తొలగిపోవలసి ఉంది. ఎందరో

మహానుభావులు, సంఘసంస్కర్తలు ఈ విషయంలో పాటుపడుతున్నారు. అయితే ఆర్థిక స్తోమత స్త్రీకివస్తే, ఇస్తే ఎలాఉంటుందన్న విషయం గమనించవలసి ఉంది. కానీ పురుషాధిక్యానికి అలవాటుపడ్డ మనమావిధంగా ఆలోచించడమూ, తత్ఫలితాలు ఎలా ఉంటాయో అని భయశంకలతో తటపటాయించడమూ జరుగుతూంది. అన్నీ సమంగా ఎప్పుడు జరుగవు. అన్నీ అటుఇటూ కూడా ఉంటాయి. సమవగాహన పరస్పరం అవసరం. అనాడే ఈ ప్రయత్నాలు సత్ఫలితాలను ఇవ్వగలవని భావించవచ్చు. త్రికరణశుద్ధిగా ఇందుకై రెండువైపులా ప్రయత్నం జరగవలసి ఉంది. ఉన్నతికై ఉద్యమించవలసి ఉంది. దీనికి మన మనఃప్రవృత్తులలో మార్పు రావలసిన ఆవసరం ఎంతైనా ఉంది. సమాజంలోను దానికి తగిన వాతావరణంకూడా నెలకొనవలసి ఉంది. ఇది ఇలా ఉండగా అన్నమాచార్యుల నాటి సమాజంలో స్త్రీకి గల ప్రతిపత్తిని పరిశీలిద్దాం.

అన్నమాచార్యులు అధ్యాత్మ శృంగార సంకీర్తనలు రచించినా అందులో శృంగార సంకీర్తనలే అధికమూ, వాటికే అధిక ప్రాధాన్యమూను. ఆ సంకీర్తనల్లో మధురభక్తి ప్రవత్తితో తాను ఆత్మ-స్త్రీమూర్తిగా, పరమాత్మ - నాయకుడుగా భావించి తదుచితరీతిని ఆత్మపరమాత్మలో సమైక్యం చెందడానికై చేసిన యత్నం విశదమవుతుంది. అందులో నాయిక ఎన్నెన్ని రీతుల ఉండవచ్చునో తన ప్రతిభా నైపుణ్యాలతో భావించి, తద్భావనానుగుణంగా వర్ణించి తరించాడు. ఈ శృంగారం అలమేలుమంగా శ్రీవేంకటేశ్వరుల అలౌకిక శృంగారమే అయినా అన్నమాచార్యులు మానవుడే గనుక మానవ ప్రకృతిననుసరించి ఆయా నాయికల స్వరూప స్వభావాలు తానే ధరించి, భావించి అన్ని విధాలైన నాయికాత్వాన్ని తన సంకీర్తనల్లో నిరూపించుకొన్నాడు. ఇది ఈనాడు మనకు-నవనాగరికులకు-మారిన దేశకాలమాన పరిస్థితులలో-స్త్రీకి సైతం పురుషునితో సమాన ప్రతిపత్తి సమాజంలో ఉండాలని, కాంక్షించే మనకు-విపరీతంగా తోచవచ్చు: తోచడమేగాదు ఒకరకంగా అన్నమాచార్యులు స్త్రీకి అన్యాయం చేశాడని భావించే ప్రగతివాదులు, మేధావులు ఈనాడున్నారు. కానీ ఆనాటి పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకొని మనం ఈ విషయాన్ని సహృదయతతో అర్థం చేసుకోవాలి. అప్పుడు మనం అన్నమాచార్యుల్ని నిందించలేము. ఆనాటి సమాజస్థితిని, ఆ సమాజంలో స్త్రీకి గల గౌరవ ప్రతిపత్తుల్ని గుర్తించగలమని భావించడంలో దోషం లేదు.

మగువలకేగాని సిగ్గు మగవానికి సిగ్గేల అంటుంది ఓ నాయిక నాయకునితో. నాయకుడు తానుచేసిన దుర్నయానికి సిగ్గుపడుతున్నాడు. అప్పుడు నాయిక నాయకుని ఎగతాళి చేస్తూ ఉంది :

"మగవానికేడ సిగ్గు మగువలకింతేకాక
యెగసక్కెలాడేనంటా యేలనవ్వేవిపుడు ॥పల్లవి॥

మంతనాన నిద్దరము మాటలాడుకొన్నవెల్లా
యింతలోనే ఆపెనేఁడు యెట్టెరిగెను
చెంతల నీపెమ్మెలకు చెప్పితివేమోకాక
వింతగా నీ చెవులనే వినవచ్చీ సుద్దులు ॥మగ॥

చేరియింటిలో మనము చేసుకొన్న బాసలు
వారించి యాపెకు నేఁ డెవ్వరు చూపిరి
మేరమీరి మురిపెము మెరిసితివేమో కాక
ఆరీతి నీవే యడుగవచ్చీ యీ సుద్దులు ॥మగ॥

పానుపుపై నిద్దరము పైకొన్న కూటములెల్లా
తానకమై యే రీతిగాఁ దలఁచినది
కానీలే నీవే పెద్దరికము చూపేవేమోకాక
మేన శ్రీ వేంకటేశుఁడ మెచ్చవచ్చీ సుద్దులు ॥మగ॥"

(శృం. సం. 25-232)

నాయిక తన ఆట, పాట, చదువులతో నాయకుని అలరించవలసిన అవసర ముండేది. దీనివల్ల ఆనాటి స్త్రీలు – అందరూ కాకపోయినా - కొందరైనా ఆట పాటల్లో, చదువుసందెల్లో ప్రవీణులని తెలుస్తుంది. అయితే ఇది మురిసి మురిపించే వారికే పరిమితం. కానీ గృహిణులు సైతమిలాంటి నిపుణులుండేవారని గ్రహించగలం. ఇందుకు చక్కటి తార్కాణం అన్నమాచార్యుల సతీమణి తిమ్మక్క. ఉత్తమ విదుషీమణి అనే అంశం ఇక్కడ మనం స్మరించుకోవలసిన ఆగత్యమెంతైనా ఉంది.

"నా మోము చూచిచూచి నడుమ నేలకొంకేవు
ఆముకొని మెచ్చఁగానే నడ్డమాడేవా ॥పల్లవి॥

బత్తిగలవాఁడవు పడఁతి పాటవింటివి
చిత్తము రంజించి నీకు చెవిఁబట్టెనా
యిత్తల మే చెమరించె నెంతగరఁగెనో మతి
పొత్తుల వాకుచ్చి యాకెఁ బొగడఁగరాదా ॥నా మో॥

సరినిడుకొంటివి చదివించితి వాపెను
తిరమైన యాయర్థము తెలిసితివా
నిరతిఁ బులకలెల్లా నిండెను సంతోసమెంతో
అరుదైన వుడుగరలట్టె ఇయ్యరాదా ॥నా మో॥

శ్రీ వేంకటేశుఁడవు చెలిమాట చూచితివి
భావించి నీకుఁ గన్నుల పండుగాయనా
యీవల నన్నేలితివి ఇదెంత జాణతనమో ?
పేవసేసే మిద్దరము సేసచల్లరాదా ? ॥నా మో॥"

(శృం. సం. 25-233)

ఇక్కడ మనం మరో అంశం గుర్తుంచుకోవడం అవసరం. పరమ భాగవతుడుగా శ్రీ వేంకటేశ్వరునికి అన్నమాచార్యులు సేవకుడు. కనుకనే తాను నాయికాత్వం ఆరోపించుకొని తాను సేవకుణ్ణని నాయికచేత చెప్పిస్తున్నాడు; ఒకతె గాదు ఇక్కడ ఇద్దరు నాయికలు, సేవికలు.

ఆనాటి స్త్రీ ప్రవృత్తిని, స్త్రీ పురుషునకంటే తక్కువనీ, పురుషాధిక్యాన్ని అభివర్ణించాడు నాయిక తానే అయిన అన్నమాచార్యులు :

"దయఁజూడవయా తతిఁగొని మొక్కేము
ప్రియురాండ్లము నినుఁబెండ్లాడితిమి ॥పల్లవి॥

చలములు నీతో సాదించేమా
వలచిన వారము వనితలము

బలుములు నీతోఁ బచరించేమా
కొలిచినవారము గోలలము ॥దయ॥

పెనఁగుచు నీతో బిగిసేమా నీ
ననుపుల వారము నాతులము
పనివడి నేరమి పైవేసేమా
చనవరివారము సాదులము ॥దయ॥

యీవేళఁ గూడితి మెలయించేమా
దేవుళ్ళము నీ తెలవలము
శ్రీ వేంకటేశ్వర చెలఁగి నగేమా
బూవపువారము భోగులము ॥దయ॥" (శృం.సం. 25-8)

స్త్రీ అస్వతంత్ర; పురుషుడే అధికుడు. అతని కోసం స్త్రీపడే పాట్లు - ఆనాటివి - అన్నమాచార్యులు వర్ణించాడు;

"వాసికి బతుకు కెంతే వనితలఁజనవారు
పాసిన కూటికంటే పసైనా మేలు రా ॥పల్ల వి॥

.....................................

కాకునఁబడుట కంటే కడనుండే మేలురా

.....................................

తీపులలోనఁ జేదైతే తెగువలే మేలురా" (శృం.సం. 26-19)

"సిగ్గువాసి కూటికే చీరగట్టినవారము
యెగ్గులేక తనవలె నెదుట నుండేవా ॥పల్ల వి॥

.....................................

మొగుదలమైన మాకు మునిమి ముచ్చటలేదా
....................................."

(శృం. సం. 26-20)

"చిత్తగించు రమణుఁడ చేరి యెడ మాటలేల
చిత్తరుపతిమను నీచిత్తము నాభాగ్యము" (శృం.సం. 26-384)

"సొరెకు సానపెట్టకు సంగతిగాదు
మారుమాట నేనేర మర్మమింతేగాని ॥పల్లవి॥

చిత్తమెట్టున్నదో నీకు సిగ్గువడుందాన నేను
అత్తి నీవూ నాపెఁ గూడినది చూచితి
యిత్తల మగవాఁడవు యేమైనా అమరు నీకు
రుత్తనవ్వే వచ్చె నాకు రోసమేమీ లేదు ॥సొరె॥"

(శృం. సం. 26-510)

"ఏమైనా నను యెదురాడనేను
దీమసంబుతోఁ దెలిసితి నేను ॥పల్లవి॥

యెక్కుడు మాట నేనేమని యాడిన
పెక్కుసురాలని వినుగుదువు
మొక్కుచు నీ పాదములు చూచుక ఇటు
వొక్కట సూరకయుండెద నేను ॥ఏమై॥

పంతంబున నేఁ బైకొని నవ్విన
అంతరట్టడని యాడుదువు
చెంత నూడిగము సేసుక నీ కిట్టె
చింతదీర కదు చెలఁగెద నేను ॥ఏమై॥

అలమి విన్నురతి నలయించినను
బలిమితోడిదని పలుకుదువు
యెలమిని శ్రీవేంకటేశ్వర కూడితి
మెలఁగినట్లనే మెచ్చెద నేను ॥ఏమై॥" (శృం.సం. 26-513)

ఆనాడు స్త్రీకి గల హక్కును గూర్చిగాక అధికార్యాన్ని మాత్రం మనం గమనించవలసి ఉంది. అస్వతంత్ర అయినా గృహిణిగా స్త్రీకున్న స్థానం గొప్పది. బహుశా మనం ఈనాడు ఆలోచించే అశవాన్యత ఆనాడు లేదు; పురుషుల్లోనే తక్కువ. స్త్రీల గురించి చెప్పనవసరంలేదు. పురుషుడికే ఆర్థికమైన అధికారం. అందుచేతనే స్త్రీ అస్వతంత్రంగా ఉండిపోవలసి వచ్చింది. ఈనాడు - చదువు

సందెలు, ఉద్యోగాలు, ఆర్థికస్తోమత అంతో ఇంతో ఉన్నా స్త్రీలెందరు స్వతంత్రలు? కానీ ఆస్థితి సామాన్యజనంలో కొనసాగుతూనే ఉంది. ఇది ఇంకా మారవలసి ఉంది. అయితే సాహిత్యం సమాజానికి దర్పణం గనుక, ఆనాటి సమాజంలోని సమస్త విషయాలతోపాటు అన్నమాచార్యులు స్త్రీకి సమాజంలోగల స్థానాన్ని సందర్భోచితంగా వర్ణించాడు; అద్దంపట్టాడు. అన్నమాచార్యులు స్త్రీల విషయంలో అన్యాయం చేశాడనే విజ్ఞులు ఈ విషయాన్ని గమనించగలరు. గమనించి ఆనాటి సమాజస్థితిగతుల్ని అర్థంచేసుకోగలరని భావిస్తున్నాను.

ఇలాగా అన్నమాచార్యులు తన సంకీర్తనల్లో ఆనాటి సమాజంలోని మత, రాజకీయ, అంతకంటే సామాజిక స్థితిగతుల్ని ఎంతో చక్కగా, సముచితంగా, సందర్భోచితంగా చిత్రించి మహాకవిగా నిరూపించుకొన్నాడు.

ఇది అన్నమాచార్యుల సంకీర్తనల అధ్యయనంలో నాకు తోచిన, నేను గ్రహించిన విషయ వివరణ. ఇంతవరకు చెదురుమదురుగా ఉన్న అంశాలవనేకం ఇందులో నేను పొందుపరచడం జరిగింది. అన్నమాచార్యుల జీవిత విశేషాలు దీనికి ఆధారభూతం. ఆనాటి భక్తిప్రపంచమెలా ఉందో క్లుప్తంగా తెలిపి, పదం, వాగ్గేయకారుడు మొదలైన అంశాలతో పదకవితావిర్భావ వికాసాలను - తరువాతి ప్రకరణాలలోని విషయావగాహనకుపకరించేలా-సంక్షిప్తంగా అన్నమాచార్యుల శృంగారం, మధురభక్తి, ఆధ్యాత్మికత, భక్తి, నీతి, వైరాగ్యాలను, సోదాహరణంగా తెలిపి అన్నమాచార్యుల హృదయావిష్కరణ చేయడం ప్రధానాంశం. అన్నమాచార్యుల పదకవితలోని కమనీయతనీ, రామణీయకాన్నీ, భాషావిశిష్టతను విస్తృతంగా చర్చించి, పద్యకవులకేమాత్రం తీసిపోని ప్రతిభాపాటవాలను, పాండిత్యప్రకర్షను, సామాన్యజనసందోహానికెలా సన్నిహితుడో రాయలసీమ మాండలిక మాధుర్యమెలాంటిదో, దాన్నెలా ప్రయోగించాడో విపుల వివరణ చేయడం అన్నమాచార్యుని విశిష్టతను ప్రదర్శిస్తుంది. అన్నమాచార్యుల సంకీర్తనల్లోని సంగీత ప్రతిపత్తిని, అభినయావిష్కరణ రీతిని గుర్తించడం జరిగింది. చివరిగా అన్నమాచార్యుల కాలంనాటి సాంఘికాది పరిస్థితుల్ని అభివర్ణించి ఆనాటి సమాజంలో స్త్రీకున్న గౌరవ ప్రతిపత్తిని అంచనావేయడం ఈ నా అధ్యయనంలోని విశేషాల్లో విశేషం.

ఇలాగా అన్నమాచార్యుల సంకీర్తనల్లోని అనేక నూతనాంశాల ఆవిష్కరణ చేయడం నాయీ గ్రంథంలోని అధ్యయన ప్రత్యేకత అని వేరుగా చెప్పనవసరం లేదు.

# ఉపయుక్త గ్రంథాలు :


అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి : క్షేత్రయ్య పదసాహిత్యము 1963
సాహిత్యోపన్యాసములు - అం. ప్ర.సా. అ.

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు - సం. 1 1980
సం : గౌరిపెద్ది రామసుబ్బశర్మ

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు - సం. 2 1981
సం : గౌరిపెద్ది రామసుబ్బశర్మ.

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు - సం. 3 1986
సం : గౌరిపెద్ది రామసుబ్బశర్మ

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అన్నమాచార్య సంకీర్తనలు 1951
సం : ఉ. శ్రీనివాసాచార్యులు

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అన్నమాచార్యుల సంకీర్తనలు 1977
కూర్పు : కామిశెట్టి శ్రీనివాసులు సెట్టి

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అన్నమాచార్యుల సంకీర్తనలు 1982
ద్వి.ము : కూర్పు : కామిశెట్టి శ్రీనివాసులు సెట్టి

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అన్నమాచార్య సంకీర్తనలు 1982
ద్వి.ము : కూర్పు : కామిశెట్టి శ్రీనివాసులు సెట్టి

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు సం. 5 : 1950
సం : వేటూరి ప్రభాకరశాస్త్రి

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు సం. 6 : 1951
సం : ఉ. శ్రీనివాసాచార్యులు

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు సం. 7 : 1951
సం : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ఎ.వి. శ్రీనివాసాచార్యులు

అన్నమాచార్యులు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు. సం. 8 : 1952
సం. 9 : 1952; సం. 10 : 1952; సం. 11 : 1952
సం : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

అన్నమాచార్యులు, తాళ్ళపాక : శృంగార సంకీర్తనలు సం. 3.

అన్నమాచార్యులు, తాళ్ళపాక : శృంగార సంకీర్తనలు సం. 4 1947
సం : వేటూరి ప్రభాకరశాస్త్రి

అన్నమాచార్యులు, తాళ్ళపాక : శృంగార సంకీర్తనలు సం. 12 1976
సం : గౌరిపెద్ది రామసుబ్బశర్మ

అన్నమాచార్యులు, తాళ్ళపాక : శృంగార సంకీర్తనలు సం. 13 1960
సం : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సం. 20 1970

అన్నమాచార్యులు, తాళ్ళపాక : శృంగార సంకీర్తనలు సం. 18 1964
సం : పి.టి. జగన్నాథరావు

అన్నమాచార్యులు, తాళ్ళపాక : శృంగార సంకీర్తనలు సం. 22 1975
సం : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గౌరిపెద్ది రామసుబ్బాశర్మ

అన్నమాచార్యులు, తాళ్ళపాక : శృంగార సంకీర్తనలు సం. 24 : 1977;
సం. 25 : 1977; సం. 26 : 1979; సం. 27 : 1979;
సం. 28 : 1980; సం. 29 : 1980; సం. 30 : 1983;
సం. 31 : 1984.
సం : గౌరిపెద్ది రామసుబ్బాశర్మ

ఆనందమూర్తి, వేటూరి : తాళ్ళపాక కవులంకృతులు -
వివిధ సాహితీ ప్రక్రియలు 1974
,, : తాళ్ళపాక కవుల పదకవితలు భాషా ప్రయోగ
విశేషములు 1976
,, : వైష్ణవాంధ్ర వాఙ్మయము 1986
,, : క్షేత్రయ్య పదసాహిత్యం - 1974

గంగప్ప ఎస్. : క్షేత్రయ్య - 1976
,, : సారంగపాణి పదసాహిత్యం - 1980
,, : తెలుగులో పదకవిత : 1983
,, : తెలుగు వాగ్గేయకారులు : 1983
,, : అన్నమాచార్య, ప్రముఖవాగ్గేయకారులు - తులనాత్మక
అధ్యయనం : 1992
,, : పదకవితా పితామహుడు : 1986
,, : పదసాహిత్య పరిమళం 1994

చినతిరుమలాచార్యుడు, తాళ్ళపాక : అధ్యాత్మ సంకీర్తనలు సం. 16 : 1962
సం : ఎ.వి. శ్రీనివాసాచార్యులు

చినతిరువెంగళనాధుడు, తాళ్ళపాక : శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల జీవిత చరిత్రము.
పరిష్కర్త : వేటూరి ప్రభాకరశాస్త్రి
సం : గౌరిపెద్ది రామసుబ్బశర్మ
తృతీయ ముద్రణ - 1978

ప్రమీలాదేవి, మంగళగిరి : అన్నమాచార్య సంకీర్తనల్లోని జానపదగేయ సంగీత ఛందోరీతులు - (థీసిస్ - అముద్రితం)

రజనీకాంతరావు, బాలాంత్రపు, ఆంధ్రవాగ్గేయకార చరిత్రము 1975.

సంగమేశం, ముట్నూరి : అన్నమాచార్య సాహితీ కౌముది 1981

సాంబశివరావు, గుమ్మా : అన్నమాచార్య సంకీర్తనలలోని వర్ణనలు : 1990

సర్వోత్తమరావు, కె. : అన్నమయ్య - శ్రీపాదరాయలు 1982

,, ,, : అన్నమయ్య - శ్రీపాదరాయలు 1982
అన్నమయ్య - పురందరదాసు 1982

,, ,, : అన్నమయ్య - త్యాగయ్య — 1983.

సుబ్బరామ దీక్షితులు - సంగీత సంప్రదాయ ప్రదర్శిని 1973.

హరిహరప్రియ : కన్నడ తెలుగు సాహిత్య వినిమయ :

ఆంగ్లం :

Aurobindo :- The Foundations of Indian Culture

Dr. Bhagavat Kumar Goswami, Ch. Shastri II : Emotional Life in Comprehensive Devotion - Sudha Bhakticult in Ancient India :

Krishna Rao, M.V : Purandara and Haridesa Movement: 1966.

Raghavam, V : The Great Integrators : The Saint Singers os India :

Rama Krishna Rao ; Adapa : Annamacharya 1989

# ఆచార్య ఎస్. గంగప్ప సాహిత్యం
## విమర్శ/పరిశోధనాత్మక గ్రంథాలు

కోలాచలం శ్రీనివాసరావు : 1973 (ఆం.ప్ర. సంగీతనాటక అకాడమీ)

క్షేత్రయ్య పదసాహిత్యం : 1974 (ఆం.ప్ర. సాహిత్య అకాడమీ అవార్డు పొందిన గ్రంథం) : శశీ ప్రచురణలు.

తెలుగుదేశపు జానపద గీతాలు : 1976 (ఆం.ప్ర.సమాచార, పౌర సంబంధాలశాఖ)

కోలాచలం శ్రీనివాసరావు-నాటక సాహిత్య సమాలోచనము : 1977 (పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం) : శశీ ప్రచురణలు

ప్రసంగసాహితి (రేడియో ప్రసంగాలు) : 1978

సారంగపాణి పదసాహిత్యం : 1980 : శశీ ప్రచురణలు

సాహిత్యోపన్యాసములు : 17 : ఉన్నవ లక్ష్మీనారాయణ శతజయంతి ప్రసంగం : 1980 (ఆం.ప్ర. సాహిత్య అకాడమీ)

సాహిత్యసుధ : 1981 : శశీ ప్రచురణలు

తెలుగులో పదకవిత : 1983 (ఆం.ప్ర. సాహిత్య అకాడమీ అవార్డు పొందిన గ్రంథం) : శశీ ప్రచురణలు

తెలుగు వాగ్గేయకారులు : 1983 (యువభారతి ప్రచురణ)

జానపదగేయ రామాయణం ; 1983 : శశీ ప్రచురణలు

జాతికి ప్రతిబింబం - జానపదసాహిత్యం : 1984 : శశీ ప్రచురణలు.

జానపదగేయాలు (సేకరణ, లఘు వివరణ) : 1985 (జయంతి పబ్లిషర్స్, విజయవాడ)

తెలుగు నాటకం : 1985 : శశీ ప్రచురణలు

భాషా వ్యాసాలు : 1985 : శశీ ప్రచురణలు.

వేయి పడగలు : విశ్లేషణాత్మక విమర్శ : ప్ర.ము: 1987, ద్వి.ము. 1993. (విశ్వనాథ సాహిత్య పీఠం అవార్డు పొందిన గ్రంథం) : శశీ ప్రచురణలు.

వేమన భావన : 1987 (జయంతి పబ్లిషర్స్. విజయవాడ)

సిద్ధేంద్రయోగి : 1988 (తెలుగు విశ్వవిద్యాలయం)

పురందరదాసు : (తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ)

నాగార్జునుడు : " "

సాహిత్య సమాలోచన : 1991 (విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్)

ఎర్రన-రసపోషణ : 1991 : శశీ ప్రచురణలు

అన్నమాచార్య, ప్రముఖవాగ్గేయకారులు : తులనాత్మక అధ్యయనం : 1992 : శశీ ప్రచురణలు (1993 సం॥నికి తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం పొందిన గ్రంథం)

సాహిత్యానుశీలన : 1993 శశీ ప్రచురణలు

తిక్కనభారతం : శాంతిపర్వం - ద్వితీయాశ్వాసం వ్యాఖ్యానం : 1993 (తిరుమల తిరుపతి దేవస్థానములు)

పదసాహిత్య పరిమళం : 1994 : శశీ ప్రచురణలు

TELUGULO PADAKAVITHA : 1994 (English) (Encyclopaedia of Telugu Literature) : Institute of Asian Studies, Madras.

జాతీయ ప్రసంగసాహితి : మార్చి 1995 : శశీ ప్రచురణలు

అన్నమాచార్య సంకీర్తన సుధ : జూలై 1995 శశీ ప్రచురణలు

హిందీ సారంగపాణికా పదసాహిత్య : 1982 అనువాదకులు : డా॥ మంగళగిరి ప్రమీలాదేవి, డా॥ మురళీకృష్ణమ్మ.

పాఠ్యగ్రంథాలు :

కమర్షియల్ ప్రాక్టీసు, సెక్రెటేరియల్ కోర్సు : ప్రథమ, ద్వితీయ భాగాలు : 1977, 1978 (ఇంటర్మీడియేట్ పాఠ్యగ్రంథాలు) తెలుగు అకాడమీ ప్రచురణ.

8, 9, 10 తరగతుల ఉపవాచకాలు : 1982, 1983, 1984 (ప్రభుత్వ ప్రచురణలు)

రాజరాజప్రశస్తి : (చారిత్రిక నవల) : నాగార్జున విశ్వవిద్యాలయం బి.ఏ. డిగ్రీ శ్రీసత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లర్నింగ్ - బి.ఏ. డిగ్రీ; +2 CBSE - ఉపవాచకం : 1982–1984

ాపద వీరగాథా వాఙ్మయం : 1992 (ఆంధ్ర విశ్వవిద్యాలయం కరెస్పాండెన్స్ కోర్సస్).

ాత్మక సాహిత్యం : 1993 " " "

ాకథ : 1993 బి.ఏ. ఫైన్ ఆర్ట్స్ - పాఠ్యగ్రంథం - (తెలుగు విశ్వ విద్యాలయం)

ాపద వచన వాఙ్మయం : 1995 (ఆంధ్రవిశ్వవిద్యాలయం కరస్పాండెన్స్ కోర్సస్)

ఇంటర్మీడియేట్-తెలుగు-ప్రథమ సంవత్సరం : 1995 ప్రధానసంపాదకులు (తెలుగు అకాడమీ)

ుతలు :

ాగేయాలు : 1981 : శశీ ప్రచురణలు

ోదయం : 1981 : శశీ ప్రచురణలు

డు గులాబీలు (కుటుంబ నియంత్రణ గురించి): రేడియోలో ప్రసారితం.

ధలు :

ాన భయం : 1985 : శశీ ప్రచురణలు

వలలు :

హాసినీ హాసం (సాంఘికం) : 1967 (పార్థసారథి పబ్లిషర్స్, విజయవాడ)

ఐరాజ ప్రశస్తి (చారిత్రికం) : ప్ర.ము. 1982, ద్వి.ము 1984 (మారుతీ బుక్ డిపో)

త్యార్పణం (చారిత్రికం) : 1988 (టెక్నికల్ పబ్లిషర్స్)

ాటకం :

దకవితా పితామహుడు - 1986 శశీ ప్రచురణలు

ావ్యదీపావళి (సంగీత రూపకం): రేడియోలో ప్రసారితం.

ముద్రణకు సిద్ధం :

TRENDS IN TELUGU LITERATURE : Research Papers : (English) Presented to A.I.O.C. and other Conferences

భావచిత్రాలు (కవితలు)

విశ్వనాథ నాటక సాహిత్యం (విమర్శ)

పునర్యౌవనం (ఇతర నాటికలు)

కడగండ్ల కడలిలో బతుకు పడవ (నాటకం)

విజయం మనదే (నాటకం)

చిగురించిన మోడు (నాటకం)

గురుపూజ (ప్రయోజన విద్య)

జాషువా కవితాత్మ (విమర్శ)

జానపద ప్రదర్శన కళారూపాలు. (వ్యాసాలు)

సిద్ధమవుతున్న రచనలు :

కాటమరాజు విజయం (చారిత్రిక నవల)

అన్నమాచార్య సంస్కృత సంకీర్తనలు : జయదేవుని గీతగోవిందం - తులనాత్మక అధ్యయనం (U.G.C Minor Research Project).

అన్నమాచార్య ఔర్ ప్రముఖ్ వాగ్గేయకార్ : ఏక్ తులనాత్మక్ అధ్యయన్: హిందీ అనువాదం : డా॥ వి. లక్ష్మయ్య.

—o—

# ఆచార్య ఎస్. గంగప్ప, ఎం. ఏ., పిహెచ్.డి.

**జననం :** 8-11-1936 నల్లగొండ్రాయనిపల్లి, పెనుకొండ తా॥ అనంతపురంజిల్లా

**జననీజనకులు :** శ్రీమతి కృష్ణమ్మ, వేంకటప్ప

**విద్య :** ప్రాథమిక విద్య : 1946-49 ప్రాథమిక పాఠశాల, సోమందేపల్లి

ఉన్నత విద్య : 1949-55 బోర్డు ఉన్నతపాఠశాల, పెనుకొండ

ఇంటర్మీడియేట్ : 1955-57 ప్రభుత్వ కళాశాల, అనంతపురం

బి.ఏ. ఆనర్సు/ఎం.ఏ : ప్రథమశ్రేణి: 1957-60 ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు, వాల్తేరు.

పిహెచ్.డి. : 1972 కోలాచలం శ్రీనివాసరావు నాటకసాహిత్య సమాలోచనము.' శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

**ఉద్యోగం :** 1960-78 ఆంధ్రోపన్యాసకులు, శాఖాధ్యక్షులు : అనంతపురం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కర్నూలు సిల్వర్‌జూబిలీ ప్రభుత్వ కళాశాలల్లో

**నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో :**

1978-83 ఆంధ్రోపన్యాసకులు

1983-88, తెలుగు రీడర్

1988 నుంచి తెలుగు ప్రొఫెసర్

1989-91 అధ్యక్షులు , తెలుగు ప్రాచ్యభాషా విభాగం

1994-96 అధ్యక్షులు, ఎం.ఏ. పాఠ్యనిర్ణాయక సంఘం.

**ముద్రిత రచనలు :** 50 పైగా : ముద్రణలో మరికొన్ని: తెలుగు భాషా సాహిత్యాలు, పద, జానపద, నాటక సాహిత్యాల విమర్శక, పరిశోధనాత్మక, సృజనాత్మక రచనలు.

**వ్యాసాలు :** అనేక పత్రికల్లో వివిధ సాహిత్యాంశాలపై పలు వ్యాసాలు.

**పర్యవేక్షణ :** 17 పిహెచ్.డి. డిగ్రీలు, 16 ఎం.ఫిల్. డిగ్రీలు

**ప్రసంగాలు :** అనేక సాహిత్య సదస్సుల్లో, గోష్ఠుల్లో వక్తసమర్పణ, విజిటింగ్ ఫెలోగా కాకతీయ విశ్వవిద్యాలయంలో ప్రసంగాలు, జాతీయ అఖిల

పకుడు (U.G.C. National Lecturer)గా అలీగఢ్, బెనారస్
మద్రాసు, తెలుగు విశ్వవిద్యాలయాల్లో ప్రసంగాలు; ఆంధ్ర
తెలుగు, ఉస్మానియా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయాల్లో
పునశ్చరణ తరగతుల్లో ప్రసంగాలు; అనేక సాహిత్యాంశాల
రేడియో ప్రసంగాలు.

అవార్డులు : 1972-73 క్షేత్రయ్యపదసాహిత్యం - ఆం. ప్ర.సాహిత
అకాడమీ అవార్డు.
1980-81 తెలుగులో పదకవిత-ఆం.ప్ర. సాహిత్య అకామీఅవార్డు
1983-85 కేంద్ర ప్రభుత్వ సాంస్కృతిక వ్యవహారాలశా
సీనియర్ ఫెలోషిప్పు.

ACC. NO. 18304

1984 వేయిపడగలు- విశ్లేషణాత్మక విమర్శ:విశ్వనాథ సాహిత
పీఠం అవార్డు.
1989-91 యు.జి.సి. జాతీయ అధ్యాపకుడు అవార్డు.
1991-92 ఉత్తమ అధ్యాపకుడు, ఆం.ప్ర. స్టేట్ అవార్డు.
1991-92 ఉత్తమ పరిశోధన : తిక్కవరపు రామిరెడ్డి స్మార
ధర్మ నిధి అవార్డు-తెలుగు విశ్వవిద్యాలయం.

184.02945 GAN.

1993 'అన్నమాచార్య, ప్రముఖవాగ్గేయకారులు - తులనాత్మ
అధ్యయనం' గ్రంథానికి తెలుగు విశ్వవిద్యాలయం సాహి
పురస్కారం.

పదవులు : సభ్యులు, పాఠ్యనిర్ణాయక సంఘం; అలీగఢ్,బెనారస్, ఉస్మానియ
కాకతీయ, శ్రీకృష్ణదేవరాయ, నాగార్జున విశ్వవిద్యాలయాల
విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల.

ν-80-00

1993-96 అకడమిక్ సెనేట్ సభ్యులు; తెలుగు విశ్వవిద్యాలయ
1993-94 హైపవర్ కమిటీ సభ్యులు : తెలుగు విశ్వవిద్యాలయ
1994-96 అధ్యక్షులు, ఎం.ఏ. పాఠ్యనిర్ణాయక సంఘం, నాగార్జు
విశ్వవిద్యాలయం.
1994-96 అధ్యక్షులు : పాఠ్యనిర్ణాయక సంఘం; ఆం.ప్ర. బో
ఆఫ్ ఇంటర్మీడియేట్ ఎడ్యుకేషన్, హైదరాబాద్.

Profs. S. GANGAPPA

ANNAMACHARYA SANKIRTHANA SUDHA Rs. : 80-00

---

"మనిషి మెత్తన మనసు మెత్తన
మాట మెత్తన పాట మెత్తన
మా గంగప్ప బాట మెత్తన
మంచితనానికి మారు పేరన !

మెత్తని గుండెలోన సుతిమెత్తని మానసమున్నవాడు, అ
త్యుత్తమ సాహితీ గురుడు, దొడ్డ గుణాఢ్యుడు - అన్నమయ్య లో
కోత్తర భక్తిగాన పద కోశ సుధాంబుధిమున్గి తేలి, లో
కోత్తమ సద్విమర్శకృతి గూర్చిన గంగపనిచ్చ మెచ్చెదన్"

- శ్రీ అమూల్యశ్రీ

"పలుకు వెలదిసేవ బహు వర్షముల నుండి
అవిరళముగ సల్పు కవివరుండు,
పదకవిత్వమునకు భాష్యకారుండు, గం
గప్ప కవిని మెచ్చె కవిగజములు"

- శ్రీ యల్లమాటి ప్రభుదాసుకవి

"అన్నమాచార్య సంకీర్తనామృతమ్ము
వాఙ్మయక్షేత్రమున జాలువాఱఁజేసె
తెలుఁగు వాగ్గేయకారుల వెలుఁగు నిలుపు
ప్రాజ్ఞుఁడాచార్య గంగప్పఁ బ్రస్తుతింతు"

- శ్రీ కొల్లా శ్రీకృష్ణారావు

"కలమున్ బట్టిన నాటి నుండి సతమున్ గ్రంథాంతమర్మంబులన్
విలసత్కీర్తన సాహితీ మధురిమన్ విఖ్యాత గ్రంథాలలో
విలువల్గట్టిన వేత్తలై, ప్రతిభతో వెల్గొందు ఆచార్య వ
ర్యులు గంగప్ప మహానుభావుల కవే యోగ్యంపు పత్రమ్ములౌ."

- డా. గుమ్మా సాంబశివరావు